# ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

శుక్రవారం, సెప్టెంబరు 05, 2014

**FRIDAY, THE 05$^{TH}$ SEPTEMBER, 2014**

14వ శా.స. 2 వ సమావేశం, వాల్యూం-4 నంబరు-2

**14$^{TH}$ L.A. II – SESSION, VOL—4 NO.-2**

శక సంవత్సరం-1936, భాద్రపద -14

**14-Bhadrapada, 1936 – S.E.**

**శాసన సభ సచివాలయం**

**పబ్లిక్ గార్డెన్స్**

**హైదరాబాదు- 500 004.**

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS, NAMPALLY**
**HYDERABAD - 500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ
## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | ః | డా. కోడెల శివప్రసాదరావు |
| ఉప సభాపతి | ః | శ్రీ మండలి బుద్ధప్రసాద్ |
| కార్యదర్శి(ఇంచార్జ్) | ః | శ్రీ కె.సత్యనారాయణ రావు |
| ఉప కార్యదర్శులు | ః | శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు<br>శ్రీ ఎం. విజయరాజు |
| సహాయ కార్యదర్శులు | ః | శ్రీ పి.వి.సుబ్బారెడ్డి<br>శ్రీ కె.రాజకుమార్<br>శ్రీమతి ఆర్.వనితారాణి<br>శ్రీ పి.నరసింహ<br>శ్రీ బి.కమలాకర్<br>డా. వై.కామేశ్వరి<br>శ్రీ ఇ. సంజీవరావు<br>శ్రీ కె.వెంకటేశ్వరరావు<br>శ్రీ డి.జగన్‌మోహన్‌రావు<br>శ్రీ బి.ప్రభాకర్‌రావు |
| చీఫ్ రిపోర్టర్ | ః | శ్రీ శ్రీనివాస్ అల్లాడి |

----

# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

**(14వ శాసన సభ)**
(రెండవ సమావేశము : పదనాల్గవ రోజు )

**శుక్రవారం, సెప్టెంబరు 05, 2014**
సభ ఉ.గం.09.00.లకు ప్రారంభమైనది
(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

--------------

## విషయ సూచిక


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | సభ సమావేశం (ఉ.గం.9.00.) | ..... | 5 |
| 2. | నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు మరియు సమాధానాలు | ..... | 5–43 |
| 3. | స్వల్పవ్యవధి ప్రశ్నలు–సమాధానాలు | ..... | 44–49 |
| 4. | సభ సమక్షములో ఉంచిన పత్రములు | ..... | 50 |
| 5. | ఆర్థిక పద్దులు–సభకు సమర్పణ | ..... | 50&51 |
| 6. | సభ కార్యక్రమం | ..... | 51– 53 |
| 7. | ప్రభుత్వ బిల్లులు సభలో ప్రవేశం, చర్చ, మరియు సభ ఆమోదం | ..... | 53–74 |
| 8. | ప్రభుత్వ పద్దులపై చర్చ మరియు సభ ఆమోదం | ..... | 74–180 |
| 9. | సభ వాయిదా | ..... | 180 |

**ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ**

**14వ శాసన సభ, 2వ సమావేశము**

**శుక్ర వారం, 5వ తేది, సెప్టెంబర్,2014**

*** * ***

**(సభ ఉదయం 9.00 గంటలకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)**

నక్షత్రపు గుర్తు గల ప్రశ్నలు-సమాధానాలు

**MR.SPEAKER: Question Hour. Question No.10 Minister for Municipal Administration & Urban Development.**

**Q.No.10 (121)**
సర్వశ్రీ
**బొండా ఉమామహేశ్వర రావు, శ్రీ గద్దె రామ్మోహన్, ఎం.ఎల్.ఏ.లు**

అ) చెత్త డంపింగు యార్డు లేకపోవడం కారణంగా విజయవాడ నగరంలోని ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ) ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే చర్య ఏమిటి?

ఇ) అయితే, ఆ వివరాలేమిటి?

**పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ పి. నారాయణః**

అ) అవునండీ.

ఆ) 2000, ఘన వ్యర్థ పదార్థాల యాజమాన్యత, నిర్వహణ నియమావళి ప్రకారం చెత్త డంపింగు యార్డ్‌ను సమకూర్చడానికి చర్యను తీసుకోవడమవుతుంది.

ఇ) 3 ఎకరాల 96 సెంట్ల కోసం పాతపాడు గ్రామం వద్ద ఒక ప్రైవేటు పార్టీ క్వారీపిట్‌తో 2000, ఘన వ్యర్థ పదార్థాల యాజమాన్యత, నిర్వహణ నియమావళి ప్రకారంగా సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్ కోసం విజయవాడ మునిసిపలు కార్పోరేషన్ ఒక అవగాహన

ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. భూమి ఫిల్ కోసం సైంటిఫిక్ విధానంలో క్వారిఫిట్‌ను రూపొందించడమయింది. ఇటీవలి కాలం వరకు దానినే ఉపయోగించడమవుతున్నది. ప్రస్తుతం, జాకంపూడి వద్ద 1 ఎకరం 94 సెంట్లు, సింగ్ నగర్ వద్ద 10.00 ఎకరాల విస్తీర్ణంలో చెత్తను డంపింగ్ చేయడమవుతున్నది. డంపింగు యార్డును సమకూర్చడానికి, నున్న గ్రామం వద్ద 100 ఎకరాల 34 సెంట్ల భూమిని సేకరించాలని ప్రతిపాదించడమయింది. డిమాండుపై 12వ ఆర్థిక కమీషన్ గ్రాంటు నుండి రూ.9.015 కోట్ల మొత్తాన్ని విజయవాడలోని రెవెన్యూ డివిజినల్ అధికారికి డిపాజిటు చేయడమయింది. 100 ఎకరాల 34 సెంట్ల ప్రతిపాదిత భూమిలో 71 ఎకరాల 54 సెంట్లు అటవీ శాఖకు చెందినది. మిగిలిన 28 ఎకరాల 80 సెంట్లు ప్రైవేటు పార్టీకి చెందినది. ఈ విషయాలు ఆ విధంగా ఉండగా, కొంతమంది యజమానులు డబ్ల్యు.పి.నెం. 23743ను దాఖలు చేశారు. డబ్ల్యు.పి.ని పరిష్కరించేంత వరకు ఫిర్యాదుదారులను తొలగించరాదని గౌరవ హైకోర్టు మధ్యంతర ఉత్తరువులను జారీ చేసింది.

పై పర్యవసానాల కారణంగా, మునిసిపల్ కార్పోరేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఈ క్రింది స్థలాలను డంపింగు యార్డులుగా వినియోగించుకోవడానికి గుర్తించారు. ఈ ప్రతిపాదనలు వివిధ దశలలో ఉన్నాయి. అవేమంటేః

1. జి. కొండూరు మండలం, కడిమి పొత్తవరం గ్రామం వద్ద 7.00 ఎకరాలు.
2. ఆగిరిపల్లి మండలం, తోతపల్లి గ్రామం వద్ద 6 ఎకరాల 76 సెంట్లు.
3. కొండపల్లి వద్ద 20.00 ఎకరాలు.
4. ఆగిరిపల్లి మండలం, అడివినెక్కాలం గ్రామం వద్ద 330 ఎకరాలు.
5. పాతపాడు గ్రామం వద్ద 22 ఎకరాల 71 సెంట్ల ప్రైవేటు మెట్ట భూమి.
6. గన్నవరం మండలం, కొండపావులూరు వద్ద 30.00 ఎకరాలు.

శ్రీ బొండా ఉమామహేశ్వర రావు(విజయవాడ సెంట్రల్)ః అధ్యక్షా, గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల నా కాన్‌స్టిట్యుయన్సీలో చాలా సమస్యలు వచ్చాయి. విజయవాడలోని సింగ్‌నగర్‌లో ఈ చెత్తను వేయడం వల్ల అక్కడి ప్రజలు వాసనతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి గార్బేజ్ డంపింగ్ యార్డును తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మంత్రి గారు తమ సమాధానంలో చెప్పడం జరిగింది. అయితే దానిని యుద్ధ ప్రాతిపదిక మీద జరపాల్సిన అవసరముంది. గతంలో పాతపాడు, నున్న గ్రామాల దగ్గర ఏర్పాటు చేయడానికి గాను జిల్లా కలెక్టర్ దగ్గర తొమ్మిది కోట్ల రూపాయలు డిపాజిట్ చేయడం జరిగింది. అయితే అక్కడి ల్యాండ్ ధరలు పెరిగిపోవడం వల్ల ముందు ఒప్పుకున్న ధరకు ఆ ల్యాండ్ ఇవ్వలేమని

దాని యజమానులు చెప్పినందువల్ల ఆ ప్రపోజల్ ఆగిపోయింది. ఇప్పటికైనా మంత్రి గారు చెప్పిన విధంగా జాకంపూడి దగ్గర కాని, ఆగిరిపల్లి వద్ద గాని లేదా మంత్రి గారు పేర్కొన్న ఏ ఊరిలో అయినా సరే దానిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నది. విజయవాడలో చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయలేకపోయినందువల్ల ప్రజలకు అనేక ఇబ్బందులు వస్తున్నాయి. పైగా నిన్ననే ముఖ్యమంత్రి గారు కేపిటల్ సిటీ గురించి ప్రకటించిన తరువాత దానికి మరింత ఆవశ్యకత ఏర్పడనున్నది. అంతేగాకుండా ఇవ్వాళ పెరిగిపోయిన ఆధునిక టెక్నాలజీ నేపథ్యంలో కొత్తగా వచ్చిన జర్మన్ టెక్నాలజీ, జపాన్ టెక్నాలజీ లాంటి కంపెనీలు ఆధునిక వేస్ట్ మేనేజ్‌మెంట్ ద్వారా పవర్‌ప్లాంట్స్‌ను కూడా ఏర్పాటు చేసుకునే సౌలభ్యాలను దృష్టిలో పెట్టుకొని కేవలం స్థలం ఇస్తే చాలు జీరో పర్సెంట్ ఫైనాన్స్‌తో మొత్తం మేమే ఖర్చు పెట్టుకొని జీరో పొల్యూషన్‌తో వాటిని ఏర్పాటు చేస్తామన్న ప్రపోజల్స్‌తో అలాంటి కొన్ని కంపెనీలు ముందుకొచ్చినా సంబంధిత అధికారుల వద్ద, కమీషనర్ దగ్గర ఆ ప్రపోజల్స్ కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్కడే ఆగిపోయాయి. ఇది ఒక విజయవాడకే సంబంధించినది కాదు. అన్ని చోట్లా ఇలాంటి సమస్యలున్నాయి. విజయవాడ నగరంలో చెత్తను కూడా వేరేచోటికి తరలించలేని దుర్భర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మంత్రి గారు విజయవాడ నగరానికి సంబంధించిన డంపింగ్ యార్డుకు సంబంధించిన స్థల సేకరణ తక్షణమే జరిపి వేస్ట్‌మేనేజ్‌మెంట్ పవర్ ప్లాంట్లను త్వరలోనే ఏర్పాటు చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ గద్దె రామ మోహన్ రావు(విజయవాడం ఈస్ట్): అధ్యక్షా, ఇది రాష్ట్రమంతటా వున్న సమస్య. దీనిపై సరైన విధానంలో నిర్ణయం తీసుకోకపోతే పరోక్షంగా వ్యాధులకు కారణమై పబ్లిక్ హెల్త్ మీద ప్రభావం చూపిస్తుంది. ఈ రోజున జర్మన్ లేదా జపాన్ తదితర దేశాలకు సంబంధించిన అధునాతన టెక్నాలజీల ద్వారా వేస్ట్‌ను రీ-యుటిలైజ్ చేయడం ద్వారా తక్కువ వేస్ట్ వస్తుందని, పొల్యూషన్ కూడా వుండదని చాలా కంపెనీలు చెబుతున్నాయి. మేం మంత్రి గారికి చెప్పేదేమంటే ఆయా కంపెనీలను సంప్రదించి వారి కోఆర్డినేషన్‌తో వారికి కావలసిన స్థలాలను ఇవ్వడం ద్వారా వాళ్ల యొక్క పెట్టుబడులతోనే పవర్ ప్లాంట్ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పినారాయణ(మునిసిపల్ శాఖ మంత్రి): అధ్యక్షా, కచ్చితంగా వేస్ట్ మేనేజ్‌మెంట్ పవర్‌ప్లాంట్ల నిర్మాణం కొరకు వర్కౌట్ చేస్తున్నాము. వారు చెప్పినట్లు విజయవాడ నగరానికి ప్రస్తుతమున్న డంపింగ్ యార్డులు చాలా చిన్నవి కాబట్టి అవి సరిపోవడం లేదు. వీలైనంతవరకు వారడిగినట్లుగా డంపింగ్ యార్డులను తరలించడానికి చర్యలు తీసుకుంటాము. ఇప్పుడు మేం పర్స్యూ చేస్తున్న ఆరు స్థలాలలో మొదట డంపింగ్ యార్డులను ఏర్పాటు చేస్తాము. రెండోది వారు చెప్పినట్లుగా వేస్ట్ మేనేజ్‌మెంట్ పవర్ ప్లాంట్లను కూడా పర్స్యూ చేస్తాము.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి(నెల్లూరు రూరల్)ః అధ్యక్షా, డంపింగ్ యార్డుల సమస్య రాష్ట్రం మొత్తం మీద అనేక నగరాలలో, పట్టణాలలో వుండే సమస్య. ముఖ్యంగా నెల్లూరు నగరంలో అయితే పరిస్థితి అత్యంత దారుణంగా వుంది. పైగా అది మునిసిపల్ మంత్రి గారి సొంత కార్పోరేషన్. నెల్లూరు నగరంలోని డంపింగ్ యార్డును దొంతలి అనే గ్రామం దగ్గర పెట్టారు. ఆ గ్రామంలోని ప్రజల పరిస్థితి ఎలా వుందంటే అక్కడ మొత్తం ఈగలు ముసురుతుండడం వల్ల వాళ్లు భోజనం చెయ్యాలన్నా, స్నానం చెయ్యాలన్నా చెయ్యలేని పరిస్థితులున్నాయి. అంత దారుణమైన పరిస్థితులున్నాయి. అందువల్ల నేను చెప్పేదేమంటే జీరో పొల్యూషన్, జీరో పర్సెంట్ ఫైనాన్సియల్ బర్డెన్, ఈ రెండు కాకుండా స్థానిక సంస్థలకు మేమే డబ్బులిస్తాం, మేమే విద్యుత్ ఉత్పతి చేస్తాం మాకు ప్రభుత్వాలు ఇవ్వాల్సింది కేవలం స్థలం మాత్రమే అంటూ ఇటీవల అనేక సంస్థలు ముందుకొచ్చాయి. ఈ విషయం మీద మంత్రి గారు ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని, ముఖ్యంగా నెల్లూరు నగరం దొంతలి డంపింగ్ యార్డుపై ఒక ప్రకటన చేయాలని నేను మంత్రి గారిని కోరుతున్నాను. అట్లాగే ఈ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసినట్లయితే స్థానికసంస్థలకు డబ్బులు వస్తాయి. జీరో పర్సెంట్ ఫైనాన్సియల్ బర్డెన్ వుంటుంది, వేస్ట్ మేనేజ్‌మెంటు కూడా జరుగుతుంది కాబట్టి దీని మీద తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ పల్లా శ్రీనివాసరావు(గాజువాక)ః అధ్యక్షా నమస్కారం. మా గాజువాక మునిసిపాలిటీలోనూ, అలాగే విశాఖపట్నం మునిసిపల్ కార్పోరేషన్‌లోనూ డంపింగ్ యార్డుల సమస్య వుంది. ముఖ్యంగా మునిసిపల్ కార్పోరేషన్ల వారు ఏమి చేస్తున్నారంటే డంపింగ్ యార్డులను సౌత్ వెస్ట్ డైరెక్షన్‌లో సిటీకి పెట్టడం వల్ల గాలి ఎక్కువగా వీచి అది సిటీపైకి వస్తుంది. దానివల్ల స్మెల్ వస్తుంది. దానికోసం టెక్నికల్‌గా ఒక టీమ్‌ను వేసి స్మెల్ రాకుండా దాని డైరెక్షన్ మార్చి వేరే చోట పెట్టాల్సిన అవసరముంది. అదేవిధంగా డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేటప్పుడు వర్షం వచ్చినప్పుడు ఎక్కువ స్మెల్ వస్తుంది కాబట్టి 20 అడుగులతో ఒక గోడ కట్టినట్లయితే స్మెల్ బయటికి వెళ్లకుండా కవర్ చేయగలిగే విధంగా వుంటుంది. దానిపై ఫీజిబిలిటీ స్టడీ చేస్తే బాగుంటుందని నా ఉద్దేశం మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

...

శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు(కాకినాడ సిటీ)ః అధ్యక్షా, డంపింగ్ యార్డుల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉంది. ఈ రోజున ఒక్కో పట్టణానికి డంపింగ్ యార్డుకోసం కనీసం 25 నుంచి 30 ఎకరాల స్థలం కావాలి. ఈ రోజుల్లో అంత భూమి లభ్యత లేదు కాబట్టి సమస్యాత్మకంగా ఉంది. మా జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో ఆ విషయమై అధికారులకు, జిల్లా కలెక్టరుకు సూచనలు ఇవ్వడం జరిగింది. గతంలో కొన్ని కంపెనీలు స్థాపించడానికి వందల ఎకరాలు కాకుండా వెయ్యి నుంచి రెండు వేల ఎకరాల భూమి కూడా కేటాయించడం జరిగింది. వారు అందులో కేవలం 200, 300 ఎకరాలు మాత్రమే వినియోగించుకొని మిగిలిన 700 ఎకరాల భూమిని ఖాళీగా ఉండడంతో దానిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆలోచనలో ఉన్నారు. ఆ భూమి ప్రజల దగ్గర

నుంచి సేకరించిన భూమి కాబట్టి, డంపింగ్ యార్డులకు ప్రభుత్వ స్థలం అందుబాటులో లేదు కాబట్టి అలాంటి కంపెనీలకు ఇచ్చిన భూమిలో 25 నుంచి 50 ఎకరాలు తిరిగి తీసుకొన్నచో నాలుగైదు నియోజకవర్గాలకు ఒక డంపింగ్ యార్డు పెట్టడానికి వీలవుతుంది. ఆయా కంపెనీలు ఆ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోకుండా ప్రజలకు అవసరమైన విధంగా వారి నుంచి డంపింగ్ యార్డుకు అవసరమైన భూమిని 25 నుంచి 50 ఎకరాలు తీసుకొని సమస్యను పరిష్కరించేందుకు ఆలోచన చేయాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ వి.ప్రభాకర్ చౌదరి (అనంతపూర్ అర్బన్): అధ్యక్షా, గతంలో అనగా 25, 30 సంవత్సరాల క్రితం అనంతపురం పట్టణంలో డంపింగ్ యార్డుకు కేటాయించిన స్థలానికి చుట్టూ పట్టణం విస్తరించి చుట్టూ ఇళ్లు వచ్చాయి. ఆ డంపింగ్ యార్డు ప్రస్తుతం పందులకు నిలయంగా మారింది. జిల్లా కలెక్టరుతో మాట్లాడి పట్టణానికి దూరప్రాంతంలో ప్రభుత్వ భూమి చాలా ఉంది కాబట్టి అక్కడికి పట్టణంలోని డంపింగ్ యార్డును తరలించాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ పి.నారాయణ(మునిసిపల్ శాఖ మంత్రి): అధ్యక్షా, నెల్లూరు, గాజువాక, విజయవాడ, అనంతపురం శాసనసభ్యులు చెప్పినట్లుగా ఆయా పట్టణాల్లో డంపింగ్ యార్డులను తరలించేందుకు పరిశీలించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వేస్ట్ మేనేజ్‌మెంట్ పవర్ ప్లాంట్లు పెట్టడానికి కూడా పరిశీలించడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ 25.09.2000 తేదీన సైంటిఫిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి సూచనలు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు డంపింగ్ యార్డులు నిర్వహించడం జరుగుతుంది.

**MR.SPEAKER: Question No.212, Minister for Iriigation.**

ప్రశ్న నెం.**212 (122)**

**శ్రీ అశోక్‌రెడ్డి ముత్తుముల, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన సాగునీరు, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి, జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) గతంలో గిద్దలూరు నియోజకవర్గంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న చెరువుల సంఖ్య ఎంత?

ఆ) అయితే, మరమ్మతులను నిర్వహించడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

ఇ) ఆ వివరాలేమిటి?

**సాగునీరు, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు)**ః

అ) 81 చెరువులు.

ఆ) చెరువులకు మరమ్మతులు నిర్వహించడానికి ప్రకాశం జిల్లా కలెక్టరు రూ.332.2 లక్షల మొత్తంతో 81 పనులకు పురిపాలకకు మంజూరును ఇచ్చారు. మార్కాపురం స్పెషల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాంకేతిక మంజూరును ఇవ్వడమయింది. పనులను నామినేషన్ ప్రాతిపదికపై ఏజెన్సీలకు అప్పగించడమైనది.

ఇ) ప్రకాశం జిల్లా కలెక్టరు మంజూరు చేసిన 81 పనులలో రూ.281.20లక్షల వ్యయంతో 69 పనులు పూర్తయ్యాయి. నీటి వినియోగదారుల సంఘాలు పనుల నిర్వహణకు ముందుకు రానందున మిగిలిన 12 పనులను చేపట్టడం వీలుకాలేదు. 12.08.2014 తేదీ గలఆర్థిక శాఖ యు.ఓ.నోటు నం.1071-డి/93/ఇబిఎస్.X/2014 ప్రకారం, ఈ 12 పనులను రద్దు చేయడమయింది.

శ్రీ ముత్తుముల అశోక్‌రెడ్డి(గిద్దలూరు) ః అధ్యక్షా, మంత్రి గారు మా గిద్దలూరు నియోజకవర్గంలో దెబ్బతిన్న 81 చెరువులకు గాను 12 చెరువుల పనులను ఆయా నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు ముందుకు రాని కారణంగా పనులు చేపట్టడం లేదని చెప్పడం జరిగింది. ఈ పనులను నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు చేపట్టకపోవడానికి కారణమేమంటే నాలుగైదు లక్షల రూపాయలు మాత్రమే ఒక్కొక్క చెరువుకు మంజూరు చేసినందున ఆ నిధులు సరిపోని కారణంగా ముందుకు రాలేదు. ఆ 12 చెరువులలో గుర్రెడ్డికుంట, ఉమ్మిడివరం, తిమ్మరాజు ఓబులపల్లి కుంట, నల్లగడ్డ, అంబవరం, జె.పి.చెరువు తదితర పన్నెండు చెరువలు పెద్దఎత్తున గట్లు తెగిపోవడంతో ఆ చెరువులకు మంజూరు చేసిన అయిదు లక్షల రూపాయలు సరిపోని కారణంగా అక్కడ పనులు ప్రారంభించలేదు. ఆ చెరువుల మరమ్మత్తుకు అవసరమైన పూర్తి నిధులు మంజూరు చేసినచో నీరు నిల్వ ఉంటుంది. అక్టోబర్‌లో సంభవించే తుపానుల వల్ల మా ప్రాంతంలో వర్షాలు కురిసి చెరువులు నిండే పరిస్థితి ఉంటుంది కాబట్టి మా ప్రాంత రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆయా చెరువులకు సరిపడినంత నిధులు మంజూరు చేసి మరమ్మత్తులు చేయాలని కోరుతున్నాను.

మా ప్రాంతంలోని చెరువులలో పూడిక బాగా ఉంది. ఇంతకు ముందు రైతులు ఆ పూడిక చాలా సారమంతమైన మట్టి కాబట్టి వేసవి కాలంలో తమ పొలాలకు తరలించేవారు. కానీ ఇపుడు పూడిక మట్టిని తరలిస్తుంటే కూడా అధికారులు కేసులు పెడుతున్నారు. అన్ని చెరువులలో పూడిక తరలింపును కోరడంలేదు కానీ మండలంలోని ఒకటి రెండు చెరువులలో పూడిక మట్టిని రైతులు తమ పొలాలకు తరలించేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నాను. ముఖ్యంగా పన్నెండు చెరువుల మరమ్మతులకు వెంటనే సంబంధిత అధికారుల నుంచి అంచనాలు తెప్పించుకొని సరిపడినంత నిధులు మంజూరు చేయవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి(రాయచోటి): అధ్యక్షా, తెగిపోయిన చెరువులే కాకుండా గతంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో తవ్వించిన చెరువులు కూడా చాలా కాలంగా మరమ్మతులకు నోచుకోకుండా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలో చెరువులు చాలా ముఖ్యం. చెరువుకు చెరువుకు మధ్య ఉన్న ఛానళ్లు పూడుకుపోవడంతో ఎగువనున్న చెరువు నిండిన తరవాత మిగిలిన నీరు దిగువ ప్రాంతంలోని చెరువుకు వచ్చేది. కానీ ఆ ఛానళ్లు పూడుకుపోవడంతో లింక్ తెగిపోయినట్లయింది. కాబట్టి ఆ లింకులన్నింటిని పునరుద్ధరించి చెరువుకు దిగువనున్న చెరువులకు అనుసంధానించినట్లయితే బాగుంటుంది. అదే విధంగా చెరువుల మరమ్మతుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి రాష్ట్రంలోని చెరువులన్నింటిని ఆధునీకరించవలసిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు(మైలవరం): అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ అశోక్‌రెడ్డి గారు, శ్రీకాంత్ రెడ్డి గారు విలువైన సలహాలు, సూచనలు ఇచ్చినందుకు సంతోషం. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మీ ద్వారా కొన్ని వాస్తవాలు చెప్పాలి. నీటిపారుదల శాఖలో చెరువుల కింద వంద ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 35,376 కాగా వాటి కింద 8,01,454 ఎకరాలు ఆయకట్టు ఉంది. వంద ఎకరాల పైబడి ఆయకట్టు ఉన్న చెరువులు 6,361 కాగా, వాటి కింద 17,58,990 ఎకరాలు సాగవుతుంది మొత్తం సాగు 25,60,000 ఎకరాలు రాష్ట్రంలోని చెరువుల కింద సాగవుతుంది. గత దశాబ్దకాలంలో 25,60,000 ఎకరాల ఆయకట్టులో 2004-05లో 6,30,000 ఎకరాలు, 2005-06లో 9,23,000 ఎకరాలు, 2006-07లో 9,32,000 ఎకరాలు, 2007-08లో 9,03,000 ఎకరాలు, 2009-10లో 6,81,000 ఎకరాలు, 2010-11లో 9,97,000 ఎకరాలు, 2011-12లో 11,27,000 ఎకరాలు, 2012-13లో 13,43,000 ఎకరాలు, 2013-14లో 11,50,000 ఎకరాలు సాగైనది. అంటే గత దశాబ్దకాలంలో మొత్తం 25,60,000 ఎకరాలలో కేవలం 50శాతం మాత్రమే చెరువుల కింద సాగులోకి వచ్చిందంటే సాగు వివరాలు చాలా దయనీయంగా ఉన్నాయి. చెరువులలోని ఒండ్రు మట్టిని పేద రైతులు తమ పొలాలకు తరలిస్తుంటే కేసులు

పెట్టడంతోబాటు ట్రాక్టరుకు లక్ష రూపాయలు జరిమానా విధించడం ప్రస్తుతం జరుగుతున్నది. నీరు-మీరు కార్యక్రమం కింద గత దశాబ్ద కాలం క్రితం అప్పడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు గారు చెరువులలోని మట్టిని సేంద్రీయ ఎరువుగా భావించి పొలాలకు తోలుకొమనేవారు. గతంలో నీటి సంరక్షణ కోసం చెక్‌డ్యాములు నిర్మించడం, కాంటూర్లు తవ్వించడం చేశాం. ఇటీవల ముఖ్యమంత్రి గారు ఒక నిర్ణయం తీసుకున్నారు. నీటి సంరక్షణ మిషన్ కింద ఇరిగేషన్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, వ్యవసాయ, అటవీ, మున్సిపల్ పరిపాలన శాఖలలోని నిధులను జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చుపెట్టాలని నిర్ణయించారు. శాసనసభ్యులు, లేదా మంత్రులు చెప్పారని ఒక పాయింట్‌లో చెక్‌డ్యాములు కట్టడం, కాంటూరు ట్రెంచెస్ తవ్వడం కాకుండా శాస్త్రీయ విజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చుకొని అబ్‌స్ట్రాక్ట్ శాటిలైట్ సహకారంతో ప్రతి జిల్లాలో కొన్ని పాయింట్లను గుర్తించడం జరిగింది. ప్రధానంగా రాయలసీమలోని నాలుగు జిల్లాలు, ప్రకాశం, నెల్లూరుతోబాటు ఉత్తరాంధ్రలోని జిల్లాలతో సహా మొత్తం తొమ్మిది జిల్లాలలో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా ఒక్కొక్క జిల్లాలో 3,000 నుంచి 3,500 పాయింట్లను ఉపగ్రహాల సమాచారం ద్వారా గుర్తించాం.

...

ఈ సమాచారాన్ని ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు ద్వారా మైనర్ ఇరిగేషన్, రూరల్ డెవలప్‌మెంటు అధికారులందర్నీ సమన్వయం చేసి శాటిలైట్ ఇచ్చిన సమాచారం వాస్తవ రూపంగా ఆ చెక్‌డ్యాము ఎక్కడ కట్టుకోవాలి, చెరువుకి ఎక్కడ బిగించాలి, లింకు చెరువులను ఎక్కడ చేసుకోవాలి, కాస్‌కేడ్స్‌ని ఏ విధంగా కాపాడుకోవాలి, ఏ విధంగా ఇవన్నీ చేసుకోవాలని జల సంరక్షణ అనే కార్యక్రమాన్ని తీసుకున్నాం. రేపు సాయంత్రం కేబినెట్ సబ్ కమిటీలో ఆరుగురు మంత్రులం సమావేశమవుతున్నాం. విజయవాడలో సెప్టెంబరు మూడవ వారంలో ఒక వర్క్‌షాపు పెట్టి ఈ ఆరు శాఖలను సమన్వయం చేసి శాటిలైట్ విజ్ఞానం, పరిజ్ఞానంతో వచ్చిన మ్యాపింగ్‌ని రూరల్ మరియు ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు అధికారులు తీసుకు వచ్చిన సమాచారాన్ని సమన్వయం చేసుకుని రూ.5000 కోట్లు ఏ విధంగా ఎప్పుడు, ఎట్లా ఖర్చు పెట్టాలో ఒక ప్రణాళిక ప్రకారం ఈ సంవత్సరం ఏమి చేయగలం, వచ్చే సంవత్సరం ఏమి చేసుకోగలమో చర్చిస్తాం. గత దశాబ్ద కాలంలో 25 లక్షల ఎకరాల ఆయకట్టుని 50 శాతం కిందకు పడేశారు కాబట్టి మరలా ఆయకట్టుని పునరుద్ధరించుకోవాలి, చెరువులని కాపాడుకోవాలి. అట్లాగే చెట్లు నాటుకోవడం వలన పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. ఉష్ణోగ్రతలను తగ్గించుకోవచ్చు. గతంలో ఫారెస్టు డిపార్ట్‌మెంటు మొక్కలు నాటితే ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు వాళ్లు నీళ్లు పోసేవాళ్లు. పంచాయతీ డిపార్ట్‌మెంటుని, మునిసిపల్ డిపార్ట్‌మెంటుని ఆ చెట్టుని కాపాడమని చెప్పాము. ఏ శాఖకు ఆ శాఖ డబ్బులు ఖర్చు పెడుతూ దుబారా కాకుండా అన్ని శాఖల డబ్బులను సమన్వయం చేసి నీరు-చెట్టు అనే కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగింది. ఆ విధంగా పెద్ద యెత్తున కోట్లాది మొక్కలను నాటాలి, గ్రామీణ ప్రాంతంలో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, చెరువులను కాపాడుకోవాలి. చిన్న సన్నకారు రైతులను కాపాడాలి. అట్లాగే గౌరవ సభ్యులు చెప్పిన సమస్యలన్నీ తప్పకుండా పరిష్కరిస్తాం. శ్రీకాంత్ రెడ్డి గారు చెప్పిన విషయానికి

సంబంధించి మొత్తం సమాచారం తీసుకుంటాం. శాసన సభ్యులని, ప్రజా ప్రతినిధులని మూడో వారంలో విజయవాడలో జరిగే వర్క్‌షాపుకి రమ్మనమని మీద్వారా రిక్వెస్ట్ చేస్తున్నాను.

**ప్రశ్న నెం.48 (123) సర్వశ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కురుగొండల రామకృష్ణ, ఎం.ఎల్.ఏలు.,**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;**

అ) కోవూరు కో ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీలో గానుగాడటాన్ని నిలిపివేసారన్న విషయం, దీనిని మూసివేసే దౌర్భాగ్య స్థితిలో వుందన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా

ఆ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి ;

ఇ) సదరు ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు ఏవైనా బకాయిలను చెల్లించవలసివుందా ;

ఈ) సదరు ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు జీతాలు బకాయిలు పడిందన్న విషయం వాస్తవమేనా, అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

**<u>ఆర్థిక శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు)(గౌరవ ముఖ్యమంత్రి గారికి బదులుగా)</u>**

అ) అవునండీ.

ఆ) చెరకు సరఫరా మెరుగుపడిన మీదట, గానుగాడటాన్ని తిరిగి ప్రారంభించడమవుతుంది.

ఇ) అవునండీ. 2012-13 కాలానికి చెరకు ధర బకాయిలను చెల్లించేందుకు 31.07.2014 తేదీన కోవూరు సహకార షుగర్ ఫ్యాక్టరీకి రూ.6.04 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది.

ఈ) అవునండీ. ఫ్యాక్టరీ నిర్వహణను మెరుగుపరచి, దాని జీతాల చెల్లింపు బాధ్యతను నెరవేర్చాలని యాజమాన్యాన్ని ఆదేశించడమవుతుంది.

శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (కోవూరు): అధ్యక్షా, మీద్వారా గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. గత ఒకటిన్నర సంవత్సరం నుంచి రైతులకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించలేదు. గతంలో మా జిల్లాకు సంబంధించిన ఆర్థిక శాఖామాత్యులు కూడా అనేకసార్లు దానికి సంబంధించి వాగ్దానం చేసినప్పటికీ వాగ్దానం నెరవేర్చలేదు. కానీ ఈరోజు అడిగిన వెంటనే ఎన్నికల హామీని గుర్తు పెట్టుకుని గౌరవ ముఖ్యమంత్రి గారు రూ.6.04 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు గౌరవ ముఖ్యమంత్రి గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

అధ్యక్షా, సహకార వ్యవస్థ ఏర్పడినప్పటినుండి కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని ప్రారంభించడం జరిగింది. దాదాపు ఎన్నో ప్రతిష్టాత్మకమైన రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు అందుకున్న సంస్థ ఈ చక్కెర కర్మాగారం. అయితే దాదాపు 10, 12 సంవత్సరాల నుంచి ఈ ఫ్యాక్టరీ పరిస్థితి అయోమయంగా ఉంది. ఈరోజు గౌరవ మంత్రి గారు ఖచ్చితంగా చెరకు సరఫరా ప్రారంభయ్యే నాటికి దీనిని ప్రారంభిస్తామని చెప్పడం జరిగింది. ఆ ఫ్యాక్టరీలో ఉన్న మెషినరీ అంతా పాడైపోయి, బాయిలర్స్ పూర్తిగా అస్తవ్యస్తమైన పరిస్థితిని తమరిద్వారా మంత్రి గారికి తెలియచేస్తున్నాను. నేను శాసన సభ్యుడిగా గెలిచిన తరువాత అక్కడి రైతులు, కార్మికులు, యాజమాన్యంతో ఒక సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కార్మికుల వేతనాలకు సంబంధించి సుమారు రూ.7 కోట్లు, ఫ్యాక్టరీలో తిరిగి క్రషింగ్ జరగాలంటే రూ.3.50 కోట్లు రిలీజ్ చేయాల్సిన అవసరముంది. కాబట్టి తమరిద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేసేదేమంటే దయచేసి రెండు విడతలుగా నైనా సరే ఆ మొత్తాన్ని కేటాయించాలని కోరుతున్నాను.

డిశంబరు నెలలో క్రషింగ్ కార్యక్రమాలు ప్రారంభించాల్సి ఉన్నందున మెషినరీకి సంబంధించిన ఓవరాలింగ్ కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. అసిస్టెంట్ కేన్ కమీషనర్‌ని అక్కడ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించడం జరిగింది. ఆయనకు అనుభవం లేదు. దానిని ఓవరాలింగ్ చేసే పరిస్థితి లేదు కాబట్టి నేను ఇటీవలనే గౌరవ ముఖ్యమంత్రి గారికి కూడా మనవి చేయడం జరిగింది. గతంలో ఎం.డీ గా పనిచేసి రిటైర్ అయిన వీరభద్రరావు గారిని మూడు సంవత్సరాల పాటు అవకాశం కల్పించి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించాలి. ఎందుకంటే ఆ ఫ్యాక్టరీలో అణువణువూ ఆయనకి పూర్తిగా అవగాహన ఉంది. తిరిగి ఆ ఫ్యాక్టరీకి పూర్వ వైభవం రావాలంటే మంచి మేనేజింగ్ డైరెక్టర్‌ని నియమించాలి. గతంలో రైతులతో సమీక్ష నిర్వహించి ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. పది, పన్నెండు సంవత్సరాల నుంచి ఆ కమిటీకి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు. కాబట్టి తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి నేను మనవి చేసేదేమంటే మీరు నామినేట్ చేస్తారా లేదా ఎలక్షన్ ద్వారా ఒక కమిటీని ఏర్పాటు చేస్తారా అని ప్రశ్నిస్తున్నాను. రైతులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తే నిధులు దుర్వినియోగం కాకుండా చూసే

అవకాశం ఉంటుంది. ఇటీవల ఎండీగా అక్కడ పనిచేసిన సుధాకర్ రెడ్డి చేసిన అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో జిల్లా కలెక్టర్ ఆయన్ని సస్పెండ్ చేశారు. కాబట్టి వచ్చిన ప్రతీ మేనేజింగ్ డైరెక్టర్ దానిని దోచుకునే ప్రయత్నం చేస్తున్నారు. దానిని అరికట్టాలంటే ఖచ్చితంగా దానికి నామినేట్ చేయడం ద్వారా గానీ లేదా ఎలక్షన్ నిర్వహించైనా సరే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ కార్మికులకు 19 నెలల నుంచి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సహృదయంతో గౌరవ ఆర్థిక శాఖామాత్యులు ముఖ్యమంత్రి గారితో మాట్లాడి వారికి సంబంధించిన నిధులు ఖచ్చితంగా విడుదల చేసి వారిని ఆదుకోవడంతో బాటు ఫ్యాక్టరీకి తిరిగి పునర్వైభవం కల్పించడానికి ఒక అవకాశం కల్పించమని కోరుతున్నాను. నేను స్వయంగా అక్కడి శాసన సభ్యుడిగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రాబోయే రోజుల్లో నష్టాలు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ముందుకు తీసుకుపోవడం జరుగుతుందని మనవి చేస్తున్నాను. వెంటనే నిధులు విడుదల చేసి కార్మికుల వేతనాలను ఇవ్వడంతోబాటు, అక్కడ జరగాల్సిన ఓవరాలింగ్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సవినయంగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (చంద్రగిరి) : అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో రెండు షుగర్ ఫ్యాక్టరీలున్నాయి. ఒకటి చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ మరొకటి గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ. గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీలో రైతులకు 2012-13లో టన్నుకి రూ.2106/- ప్రకటించారు. కానీ రూ.1800/- మాత్రమే రైతులకిచ్చారు. ఫ్రీ ట్రాన్స్‌పోర్టు కూడా పెట్టారు. 2012-13లో రైతులకి 1,48,162 టన్నుల చెరకుని షుగర్ ఫ్యాక్టరీకి సరఫరా చేశారు. 2013-14 లో 1,22,861 టన్నులు సరఫరా చేశారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీలో 2012-13లో 1,44,000 టన్నులు, 2013-14 సంవత్సరానికి 98,000 టన్నులు సరఫరా చేశారు. గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీకి రూ.9,54,00,000/- బ్యాలెన్స్ ఉంది. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీకి రూ.8,93,000/- బ్యాలెన్స్ ఉంది. నేను ప్రభుత్వానికి ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నాను. గత రెండు, మూడు సంవత్సరాలుగా రైతులు చెరకుని సరఫరా చేసినా వాళ్లకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు చెల్లించకుండా, బ్యాలెన్స్ రూ.360/- ఇవ్వక షుగర్ ఫ్యాక్టరీ చుట్టూ తిరుగుతున్నారు. దయచేసి మంత్రి గారు ఆ బ్యాలెన్స్ మొత్తాన్ని రైతులకు ఇప్పించాలి. వాళ్లు సరఫరా చేసిన చెరకుకే వాళ్లు డబ్బులు అడుగుతున్నారు. 15 రోజుల్లోపల ఇవ్వాలని నిబంధన ఉంది. రెండు, మూడు సంవత్సరాలు అయిపోయింది. కాబట్టి రైతులకి ఇవ్వాల్సిన డబ్బులను చెరకు సరఫరా చేశారు కాబట్టి ఇప్పించవలసిందిగా ప్రభుత్వాన్ని, మంత్రి గారిని కోరుతున్నాను.

...

శ్రీ యనమల రామకృష్ణుడు(ఆర్థిక మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి) : అధ్యక్షా, చెవిరెడ్డి భాస్కరరెడ్డి గారు సపరేట్ ప్రశ్న వేస్తే దానికి సమాధానం చెబుతాను. రెండవది, గౌరవ సభ్యులు రెండు మూడు ప్రశ్నలు అడిగారు. ఇప్పటికే రూ.6 కోట్ల పైచిలుకు నిధులను రిలీజ్ చేశాము. ఇంకా మూడు నాలుగు కోట్ల వరకు రిలీజ్ చేయాలని అడగటం జరిగింది,

దానిని పరిశీలిస్తాను. రెండవది, కమిటీ గురించి చెప్పారు. కమిటీ వేయాలా, ఎలక్షన్ పెట్టాలా అనేది ముఖ్యమంత్రిగారి పరిధిలో ఉన్న అంశం. గవర్నమెంటు పరంగా పాలసీ డెసిషన్ తీసుకోవాల్సిన అవసరం ఉంది. మూడవది, ఎం.డి. అపాయింట్‌మెంటు గురించి చెప్పారు, దాని గురించి సంబంధిత శాఖతో నేను మాట్లాడతాను.

**ప్రశ్న నెం.190 (124) సర్వ శ్రీ / శ్రీమతి కిడారి సర్వేశ్వరరావు, గిడ్డి ఈశ్వరి, ఎం.ఎల్.ఏలు.**

**గౌరవనీయులైన పంచాయితీరాజ్ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచార తెలియజేస్తారా?**

అ) గిరిజన ప్రాంతాలలోని అనేక గ్రామాలలో త్రాగునీటి సదుపాయం లేదన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ) అయితే, ఇప్పటి వరకు ప్రభుత్వం గుర్తించిన అట్టి గ్రామాల సంఖ్య ఎంత?

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్య ఏమిటి?

గౌరవనీయులైన పంచాయితీరాజ్ శాఖ మంత్రి (శ్రీ సీ.హెచ్. అయ్యన్న పాత్రుడు)

అ) అవునండీ.

ఆ) త్రాగునీటి సదుపాయములేని (ఎన్‌సి) జనావాసాల (గ్రామాల) సంఖ్య -15 జనావాసాలు. రక్షిత వనరు లేని జనావాసాలు (గ్రామాల) సంఖ్య - 118 జనావాసాలు.

ఇ) అవునండీ.

త్రాగునీటి సదుపాయంలేని 15 జనావాసాలకు నీటి సదుపాయాన్ని కల్పించడానికి సుమారు రూ.91.10 లక్షల మొత్తం అవసరమవుతుంది. పనులను త్వరలోనే చేపడతాము. రక్షిత వనరులులేని (ఎన్ఎస్ఎస్) 118 జనావాసాలకుగాను, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 13వ ఆర్థిక సంఘం క్రింద 5 జనావాసాలను గుర్తించడం జరిగింది. వాటికి రూ.66.00 లక్షల అంచనా వ్యయంతో ఈ పథకాలను చేపట్టడం జరుగుతుంది. మిగిలిన 113 జనావాసాలకు సుమారు రూ.2077 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేయడం జరిగింది. వాటికి త్వరలోనే పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని మనవి చేస్తున్నాను.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు(అరకు వ్యాలీ) : అధ్యక్షా, రాష్ట్రంలో ఎన్ని గిరిజన గ్రామాలకు త్రాగునీటి సదుపాయం లేదు అని అడగటం జరిగింది. ఇక్కడ మంత్రి గారు సమాధానమిస్తూ కేవలం ఒక 15 జనావాసాలకు మాత్రమే రక్షిత మంచినీరు లేదని, 118 జనావాసాలకు త్రాగునీటి సదుపాయం లేదని చెప్పడం జరిగింది. ఈరోజున గిరిజన ప్రాంతంలో రకరకాల వ్యాధులు వస్తున్నాయంటే, అందుకు గల కారణం, అక్కడ రక్షిత మంచి నీటి సదుపాయం లేకపోవడం వలనే ఆ వ్యాధులు వస్తున్నాయి. మంచినీటి సదుపాయం లేదు కాబట్టే అక్కడ వ్యాధులు వచ్చే పరిస్థితి ఉంది. ఒక ప్రక్క త్రాగునీటి కోసం ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను ఖర్చు పెడుతున్నామని చెబుతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో నీళ్ల పుష్కలంగా ఉన్నాయి, కానీ అవి త్రాగడానికి ఉపయోగపడవు. అక్కడ పారే సెలయేర్లలో, అక్కడ ఉండే చెట్ల నుండి పడే ఆకుల వల్ల ఆ నీళ్ల కలుషితమైపోయి, ఆ నీటిని త్రాగడం వల్ల జాండీస్ / మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయి. అయితే మా పాడేరు ప్రాంతంలో సుమారు 3500 గ్రామాలు ఉండగా, కేవలం 500 గ్రామాలకు తప్ప 3000 గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం లేదు.

అలాగే రాష్ట్రంలో అటు శ్రీకాకుళం నుండి పశ్చిమ గోదావరి వరకు ఉన్న గిరిజన గ్రామాలన్నింటికీ త్రాగునీరు సౌకర్యం లేని పరిస్థితి ఉంది. కానీ మంత్రిగారు సమాధానం చెబుతూ, అక్కడ 15 గ్రామాలు, ఇక్కడ 118 గ్రామాలని చెప్పడం జరిగింది. ఇది చాలా అన్యాయం. గిరిజన గ్రామాలన్నింటికీ కూడా ఎప్పటిలోగా స్వచ్ఛమైన త్రాగునీటిని అందించే ఆలోచనను చేస్తున్నారు? ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా అన్ని గిరిజన గ్రామాలకు త్రాగునీటి సదుపాయాన్ని కల్పించే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? ఉంటే ఎప్పటిలోగా అందిస్తారు? నేషనల్ గ్రామీణ డ్రింకిగ్ వాటర్ ప్రోగ్రాం క్రింద కేంద్ర ప్రభుత్వం నుండి ఎన్ని నిధులు వచ్చాయి? ఎన్ని గ్రామాల ప్రజలకు ఆ నిధుల ద్వారా త్రాగు నీటిని అందిస్తున్నారు? వివరాలను తెలుపగలరా? అలాగే ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ క్రింద ఎంత డబ్బును ఖర్చు పెట్టారు? ఆ నిధుల ద్వారా ఎన్ని గ్రామాల ప్రజలకు త్రాగు నీటిని అందిస్తున్నారు? ఆ వివరాలను తెలియజేయాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

అలాగే త్రాగునీటికి సంబంధించి గ్రౌండ్ కాని నిధులన్నింటినీ, ఆ వర్కులన్నింటినీ ప్రభుత్వం నిలుపుదల చేసిన మాట వాస్తవమేనా? 13 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా ఎన్ని గిరిజన గ్రామాల ప్రజలకు త్రాగునీటిని అందిస్తున్నారు? వాటి వివరాలేమైనా చెప్పగలరా? పంచాయితీ త్రాగునీటి మెయిటెనెన్స్ గ్రాంటు క్రింద సంవత్సరానికి పర్ క్యాపిటా రూ.85 ఇస్తున్నారని తెలిసింది. ఆ పర్ క్యాపిటాను పెంచే ఆలోచన ఏమైనా ఉందా?

అంతేకాకుండా, నిన్న గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఉన్న బాక్సైట్‌ను వెలికి తీస్తామని చెప్పడం జరిగింది. బాక్సైట్‌ని వెలికితీసినట్లయితే భూగర్భ జలాలు ఇంకిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికే గిరిజన ప్రాంతాలు త్రాగునీరు లేక రకరకాల

వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే ఢిల్లీ నుండి వచ్చిన కాలా కమిటీ వారు అక్కడ బాక్సైట్‌ని వెలికి తీసినట్లయితే భూగర్భ జలాల్లో విషపూరితమైన రసాయనాలు వెలువడి, భూగర్భజలాలు ఇంకిపోయి కలుషితమైపోతాయని, ఆ నీటిని త్రాగడం వల్ల గిరిజన ప్రజలకు కొత్త రకాలైన వ్యాధులు వస్తాయని చెప్పడం జరిగింది.

అలాంటి పరిస్థితులో ఇవాళ బాక్సైట్‌ని వెలికి తీస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. అలాగే బాక్సైట్‌ని వెలికి తీయడం వల్ల, ఇటు మైదాన ప్రాంతంలో ఉన్న తాండవ రిజర్వాయర్, పెద్దేరు, బోస్తానానది, కోనం, తారకరామ రిజర్వాయర్ ఈ విధంగా 15 రిజర్వాయర్లు, గిరిజన ప్రాంతంలో ఉన్న కొండల నుంచి వచ్చే వాగుల వల్ల, అక్కడ ఉన్న చిన్న చిన్న జీవనదుల వల్ల  ఇవి నిండి మైదాన ప్రాంతంలో ఉన్న విశాఖపట్నం, ఎస్.కోట, తాండవ నుండి స్టీల్‌ప్లాంటు ప్రాంతాల ప్రజలకు త్రాగునీటి సమస్యను తీరుస్తున్నవి. ఈ నదులన్నీ పూర్తిగా ఇంకిపోయినట్లయితే ఆ ప్రాంతం మొత్తం ఎడారి అయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వానికి నేను విన్నవించేదేమంటే, బాక్సైట్‌ని వెలికితీయడం అనే ప్రతిపాదనను ప్రక్కన పెట్టాలని, గిరిజన ప్రాంతాలన్నింటికీ త్రాగు నీటిని అందించే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీమతి విశ్వాసరాయి కళావతి(పాలకొండ) : అధ్యక్షా, మాది పాలకొండ నియోజక వర్గం, గిరిజన నియోజక వర్గం.  మా నియోజక వర్గంలో సుమారు 850 గ్రామాలు ఉన్నాయి. గిరిజన ప్రాంతంలో ఉన్న సీతంపేట మండలంలో 104 గ్రామాలకు పూర్తిగా త్రాగునీటి సౌకర్యం లేదు. ఆ గ్రామాలకు ఎప్పటిలోగా త్రాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తారు? అలాగే మిగిలిన 550 గ్రామాలకు రక్షిత మంచినీటి సదుపాయం లేక మహిళలు చాలా దూరం నడిచివెళ్లి బావుల నుండి తెచ్చుకున్న కలుషితమైన నీటిని త్రాగటం వలన అనేక వ్యాధుల బారిన పడి అవస్థలకు గురవుతున్నారు. ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం క్రింద ఎప్పటిలోగా ఈ గ్రామాలకు మంచి నీటిని అందిస్తారో తెలియజేయాల్సిందిగా కోరుతున్నాము. అలాగే మా ప్రాంతంలో ఉన్న బోర్లు చెడిపోయి మరమ్మత్తులు చేయాల్సి వచ్చినప్పుడు వాటిని పట్టించుకునే నాథుడు లేడు. వాటి మరమ్మత్తులను కూడా చూసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జి.వి.ఆంజనేయులు(ఉంగుటూరు) : అధ్యక్షా, మాకు బొల్లాపల్లి మండలంలో వేలాది మంది గిరిజనులు ఉన్నారు. అక్కడ ఫ్లోరైడ్ వాటర్ సమస్య ఎక్కువగా ఉంది. అక్కడ నీళ్లు త్రాగిన వారికి మోకాళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు వస్తున్నాయి. అయితే తమరి ద్వారా మంత్రి గారిని కోరేదేమంటే, అక్కడ త్రాగునీటిని ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నాను. ఆ ప్రాంతంలో గిరిజనులు, ఎస్సీలు ఎక్కువగా ఉన్నారు. అందులో రావులాపురం వంటి గ్రామాల్లో 400 నుండి 600 లోతు త్రవ్వితే గానీ నీరు వచ్చే పరిస్థితి లేదు. త్రాగడానికి మంచి నీళ్లు కూడా

లేవు. స్థానికంగా లభించే వాటర్ మొత్తం ఫ్లోరైడ్ వాటర్ లభించడం చాలా బాధాకరమైన అంశం. గత ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో తీసుకోలేదు. అంటే ఫ్లోరైడ్ వాటర్ ఉన్న గిరిజన ప్రాంతాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని మేము కోరుతున్నాము. గత ప్రభుత్వం ఆ ప్రాధాన్యతాక్రమాన్ని పాటించలేదు. అలాగే నిధులు కూడా గత ప్రభుత్వంలో దుర్వినియోగమయ్యాయి. నిధులను సద్వినియోగం చేయమని కోరుతున్నాము. ఫ్లోరైడ్ వాటర్ ఉన్న బొల్లాపల్లి మండలానికి ప్రాధాన్యతనివ్వాలని, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నాము.

...

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, గౌరవ సభ్యులు సర్వేశ్వరరావు గారు, పాలకొండ ఎమ్మెల్యే గారు మరియు శ్రీ ఆంజనేయులుగారు ముగ్గురు సభ్యులు కూడా గిరిజన ప్రాంతాల్లోని మంచినీటి సమస్యపై ప్రశ్నలడిగారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం దగ్గర ఉన్నటువంటి లెక్కల ప్రకారం 8,943 గిరిజనఆవాసాలున్నాయి. త్రాగునీటి వసతి సంపూర్ణంగా ఉన్నటువంటి 2,796 గిరిజనఆవాసాలు పాక్షికంగా అంటే పి.సి.1, పి.సి. 2, పి.సి. 3, పి.సి.4 క్రింద (దశలవారీగా) (పూర్తిస్థాయిలో త్రాగునీటి వసతి కల్పించకపోయినప్పటికి) త్రాగునీటి వసతి కల్పిస్తున్నట్టి గిరిజనఆవాసాలు సుమారు 6,014 గిరిజన గ్రామాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. పూర్తిగా స్కీమ్‌లు లేని గిరిజన గ్రామాలు మా లెక్కల ప్రకారం 118 గ్రామాలున్నాయి. త్రాగునీటి వసతి లేని గిరిజనఆవాసాలు 15 ఉన్నాయి.

అధ్యక్షా, క్లారిటీగా చెప్పాలంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గిరిజన ప్రాంతాల్లో Single Village Schemes 1248 ఉన్నాయి. Mini P.W.D. Schemes 1290, C.P.W.S. 40. ఇవి పెద్ద స్కీమ్‌లు. ఈ 40 స్కీమ్‌ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 గ్రామాలకు ప్రభుత్వం మంచినీటి సౌకర్యాన్ని అందిస్తోంది. అదే కాకుండా Direct pumping Schemes కూడా ఉన్నాయి. సుమారు 1374 స్కీమ్స్ ఉన్నాయి. అవేగాకుండా హ్యాండ్ పంప్స్ (Bore wells) 14,823 బోర్‌వెల్స్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఓపెన్‌వెల్స్ 1,948 ఉన్నాయి. అవి కాకుండా swallow hand pumps, అంటే సుమారు 50 అడుగుల లోతు లోపు ఉన్నటువంటి బోర్‌లు 625 ఉన్నాయి.

అధ్యక్షా, సర్వేశ్వరరావు గారు గిరిజనప్రాంత నియోజకవర్గం నుంచి వచ్చిన వ్యక్తి.. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కూడా గిరిజన ప్రాంతాలకు దగ్గర్లోనే ఉంది. నాకు కూడా వారందరితో పరిచయాలున్నాయి. బోర్‌వెల్స్ వేయడానికి సంబంధించన వాహనాలు వెళ్లే పరిస్థితి లేనటువంటి గ్రామాలు, కనీసం రోడ్ సౌకర్యం లేనటువంటి గిరిజన గ్రామాలు చాలా ఉన్నాయి. బోర్‌లు వేసే ఉద్దేశం ప్రభుత్వానికున్నా వెహికల్స్ వెళ్లలేనటువంటి పరిస్థితి కనబడుతోంది. ఆయా గ్రామాల్లోని సెలయేర్ల దగ్గర సుమారు 15 అడుగుల లోతులో బావులు త్రవ్వి అక్కడ ఒక ఫిల్టర్ ఏర్పాటు చేసి తద్వారా గిరిజన గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం

యోచిస్తోంది. 40, 50, 60 కుటుంబాలే నివసించే గిరిజన గ్రామాలు కూడా రాష్ట్ర వ్యాప్తంగా చాలా ఉన్నాయి. ఆ విషయం కూడా గౌరవ సభ్యులకు తెలిసిందే. ఆయా గ్రామాల్లో స్కీమ్స్‌ను అమలుచేసే అవకాశాలు చాలా తక్కువ. అందుచేత ఈమధ్యే పది రోజుల క్రితం కొన్ని ఎన్.జి.వో. (Non-Government Organizations)లను పిలిపించి మాట్లాడడం జరిగింది. రవాణా వసతి సౌకర్యంలేని గ్రామాలకు మరియు తక్కువ కుటుంబాలు నివసించే గిరిజన గ్రామాలకు త్రాగునీటి వసతి ఏ విధంగా కల్పించాలనే విషయమ్మై సమావేశాన్ని ఏర్పాటుచేసి ప్రభుత్వం సదరు ఎన్.జి.వో.ల సలహాలు, సూచనలు తీసుకొవడం జరిగింది. ఎన్.జి.వో.లకు ఉండే అనుభూతిని చెప్పడం జరిగింది. గిరిజన గ్రామాలకు దగ్గర్లోని కొండల్లో, కోనల్లో రాళ్ల మధ్య నుంచి స్ప్రింగ్ వాటర్ వస్తుంటుంది. ఆ స్ప్రింగ్ వాటర్‌ను క్యాచ్ చేసి పైపుల ద్వారా గ్రావిటీ సిస్టమ్ ద్వారా తీసుకువచ్చి చాలా గిరిజన గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు అవకాశం ఉందనే విషయాన్ని ఎన్.జి.వో.లు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగింది. కేవలం ఐదారు లక్షల రూపాయల వ్యయంతో ఈ స్కీమ్‌లు అమలయ్యే అవకాశాలున్నాయి. వాటిని ప్రభుత్వం పరిశీలిస్తోంది. తప్పనిసరిగా ఎన్.జి.వో.ల ద్వారా ఆ స్కీమ్‌లను అమలుచేసే అవకాశాలున్నాయని తమరిద్వారా గౌరవ సభ్యులకు మనవిచేస్తున్నాను.

అధ్యక్షా, ఎన్.టి.ఆర్.సుజల త్రాగునీటి పథకం. ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో త్రాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఎన్.టి.ఆర్. సుజల త్రాగునీటి పథకానికి ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇవ్వాలని అనుకుంటోంది. అందుకుగాను గౌరవ సభ్యులు సూచనలివ్వాలని సభాముఖంగా కోరుతున్నాను. గిరిజన ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని గౌరవ సభ్యులు ఇవ్వొచ్చు. ఫ్లోరైడ్ సమస్యతో త్రాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వవల్సిందిగా సభాముఖంగా గౌరవ సభ్యులను కోరుతున్నాను. అటువంటి గ్రామాలకే ఎన్.టి.ఆర్. సుజల త్రాగునీటి పథకానికి మొదటి ప్రాధాన్యత కల్పింపబడుతుందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

...

**MR SPEAKER: Question No. 61 (125) Minister for Finance and Legislative Affairs.**

ప్రశ్న నెం. **61 (125)** **శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి,ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) రాజమండ్రిలో పెట్రో- కెమికల్ పరిశ్రమను స్థాపించడానికి ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకున్నదా ;

ఆ) అయితే, ఎప్పటిలోగా దానిని స్థాపించడమవుతుంది?

**గౌరవ ముఖ్యమంత్రి గారి తరఫున ఆర్థిక మరియు శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి (శ్రీ యనమల రామకృష్ణుడు) గారి సమాధానం:**

అ) అవునండి

ఆ) ఈ విషయం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

శ్రీ యనమల రామకృష్ణుడు: అధ్యక్షా, There is a small mistake with the Question. అందుకు తగ్గట్టుగానే డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా సమాధానం అందించారు. There is a mistake on the part of the Department and well as on the part of the Assembly Secretariat. I don't know whether the Member has given intended question or not?

SRI GORANTLA BUTCHAIAH CHOWDARY: I haven given it rightly.

SRI YANAMALA RAMAKRISHNUDU: He has given rightly.. అని చెబుతున్నారు.

అధ్యక్షా, తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో కెమికల్ ఇండస్ట్రీని ఏర్పాటుచేయాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంది. ప్రభుత్వ పరిశీలనలోనే ఆ ప్రతిపాదన ఉంది. రాజమండ్రికి సంబంధించి పెట్రో యూనివర్శిటీని ఏర్పాటుచేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అందుకు గాను తగిన కసరత్తును ప్రభుత్వం చేస్తోంది. కేంద్రప్రభుత్వ స్థాయిలో త్వరలోనే అందు నిమిత్తం ఒక నిర్ణయం తీసుకోబోతోంది. కేంద్రప్రభుత్వ స్థాయిలో ఇప్పటికే నెగోషియేషన్స్ కూడా జరుగుతున్నాయి. ఏది ఏమైనప్పటికి రాజమండ్రి నందు పెట్రో యూనివర్శిటీని ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను.

శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్): అధ్యక్షా, నేను ప్రశ్నను కరెక్టుగానే పంపించాను. కానీ లోపం ఇక్కడో, అక్కడో తెలియదు.

నేను అడిగిన ప్రశ్న కూడా National Petroleum University గురించి. నేషనల్ పెట్రో కెమికల్ యూనివర్శిటీని రాజమండ్రిలో ఏర్పాటుచేసే ఆలోచన ఏమైనా ప్రభుత్వానికుందా? అందుకు సంబంధించిన సమాధానం ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నాను. ఎందుకంటే చారిత్రక విద్యా సాంస్కృతిక కేంద్రంగా రాజమండ్రి ఒకనాడు విలసిల్లింది. ఆంధ్ర

విశ్వవిద్యాలయాన్ని కూడా రాజమహేంద్రవరంలోనే ప్రారంభించాలని మన రాష్ట్ర విభజన తరువాత ఆనాడు కోరుకున్నారు. కానీ విశాఖపట్టణం నగరానికి ఆంధ్ర యూనివర్శిటీ తరలివెళ్లింది. అలాగే తెలుగు విశ్వవిద్యాలయాన్ని స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు రాజమండ్రి నగరంలో ప్రారంభిస్తే, ఆ తరువాత తెలుగు యూనివర్శిటీని కేవలం సాహిత్య పీఠంగానే నిలిపి మిగితా ప్రధాన విభాగాలను హైదరాబాద్ నగరానికి తరలించారు. ఒకనాడు ఎంతో బ్రహ్మాండంగా విలసిల్లిన విద్యా కేంద్రం రాజమహేంద్రవరం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి పేరున ఇవాళ ఎవరి పేరుతోనైతే గురువుగా పూజిస్తున్నామో ఆ మహానుభావుడు విద్యార్థులకు పాఠాలు నేర్పిన కేంద్రం రాజమహేంద్రవరం. చారిత్రకంగా రాను రాను గత వైభవాన్ని కోల్పోతోంది రాజమహేంద్రవరం. నేను అందుకే రిక్వెస్ట్ చేస్తున్నాను. పారిశ్రామికంగా రాజమండ్రి నందు అభివృద్ధి జరగలేదనేది మొదటి అంశం. ఏనాడో మొట్టమొదట ఏర్పాటు చేసిన పేపర్ మిల్లు తప్పితే మరో సంస్థ ఏది రాజమండ్రిలో ఏర్పాటు చేయలేదు. తద్వారా ఉపాధి అవకాశాల కల్పన జరగలేదు. అలాగే విద్యా కేంద్రంగా విలసిల్లన రాజమహేంద్రవరం వెనుకబడిపోతోంది. కాబట్టి పెట్రో కెమికల్ యూనివర్శిటీని, ఐ.టి. హబ్‌ను రాజమండ్రిలో స్థాపించమని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. తప్పకుండా నేను కోరినవన్ని రాజమండ్రిలోనే ఏర్పాటుచేస్తారా, లేదా? గౌరవ మంత్రి గారు సమాధానం చెబుతారని నేను ఆశిస్తున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు(ఆర్థిక మరియు శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి): అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగిన ప్రకారంగా పెట్రో కెమికల్ యూనివర్శిటీని రాజమండ్రిలోనే ఏర్పాటుచేయడానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి వల్ల కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎందుకంటే కేంద్రప్రభుత్వం ఇచ్చినటువంటి One of the Assurance. కాబట్టి కేంద్ర ప్రభుత్వంతో నెగోషియేషన్స్ రాష్ట్ర ప్రభుత్వం జరుపుతోంది. తప్పకుండా రాజమండ్రిలోనే పెట్రో కెమికల్ యూనివర్శిటీని ఏర్పాటుచేయడం జరుగుతుందని ప్రభుత్వం తరపున హామీని సభ ద్వారా గౌరవసభ్యులకు ఇస్తున్నాను.

**MR SPEAKER: Question No. 112 (126) Minister for Rural Development and Housing**

**ప్రశ్న నెం. 112 (126) సర్వశ్రీ రాజన్నదొర పీడిక, కిడారి సర్వేశ్వరరావు, చిర్ల జగ్గిరెడ్డి,ఎమ్మెల్యేలు.**

**గౌరవనీయులైన గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:-**

అ) రాష్ట్రంలో గృహాల నిర్మాణాలకు, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన బిల్లుల చెల్లింపులను నిలిపివేశారన్న విషయం వాస్తవమేనా ;

ఆ) అయితే, ఆ విధంగా నిలిపి వేసిన బిల్లుల జిల్లా వారి వివరాలు; అందుకు గల కారణాలు ఏమిటి;

ఇ) రుణాలను సమీకరించడం ద్వారా గృహాలను నిర్మించుకొనిన లబ్ధిదారులు వారి బిల్లులను చెల్లించనందున ఆర్థికపరమైన, మానసికపరమైన సమస్యలకు గురవుతున్నారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;

ఈ) పథకం క్రింద ఉన్న పెండింగు బిల్లులను ఎప్పటిలోగా పరిష్కరించడమవుతుంది?

**గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి (శ్రీమతి కిమిడి మృణాళిని) గారి సమాధానం:**

అ) అవునండి.

అధ్యక్షా, మొదటి ప్రశ్నకు సమాధానంగా అవునండి అని చెప్పడం జరిగింది. మార్చి 2014 నుండి రాష్ట్రంలోని గృహ నిర్మాణాలకు, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన బిల్లు చెల్లింపులను గత ప్రభుత్వంలో నిలిపివేయడం జరిగింది.

ఆ) ఆధార్ సమాచారం సేకరణ, జియో- ట్యాగింగ్ పనులు కొనసాగుతున్నందున చెల్లింపులు పెండింగులో ఉన్నాయి. లబ్ధిదారులకు బకాయి ఉన్న మొత్తం రూ.196.30 కోట్లు. జిల్లా వారీ వివరాలను అనుబంధంలో చూపడమయింది.

**ప్రశ్న నెం.112 లోని (ఆ) ఖండానికి అనుబంధం**

**పెండింగులో ఉన్న చెల్లింపుల వివరాలు**

(రూ. కోట్లలో)

| వరుస సంఖ్య | జిల్లా పేరు | 26-03-2014 నుండి 24-05-2014 వరకు పెండింగులో ఉన్న చెల్లింపులు |
|---|---|---|

| (1) | (2) | (3) |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం | 9.62 |
| 2. | విజయనగరం | 9.14 |
| 3. | విశాఖపట్నం | 9.33 |
| 4. | తూర్పు గోదావరి | 40.37 |
| 5. | పశ్చిమ గోదావరి | 18.62 |
| 6. | కృష్ణా | 12.44 |
| 7. | గుంటూరు | 13.98 |
| 8. | ప్రకాశం | 9.43 |
| 9. | ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు | 10.88 |
| 10. | చిత్తూరు | 15.30 |
| 11. | అనంతపురం | 21.07 |
| 12. | కర్నూలు | 11.95 |
| 13. | వై.ఎస్.ఆర్.కడప | 14.17 |
| | మొత్తం | రూ.196.30 కోట్లు |

ఇ) లేదండి

అధ్యక్షా, మీ ద్వారా ఈ సభకు తెలియజేస్తున్నాను. గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు గానీ, ఈ ప్రభుత్వం గానీ పేదవాళ్ల కార్యక్రమాలపట్ల గానీ, పేదవారి ఉన్నతికి గాను సానుకూల దృక్పథంలో ఉంటూ వారికి కావల్సిన అన్ని సహకార కార్యక్రమాలను చేయుట కొరకు ముందుంటుంది. అయితే, ఆరోపణలున్న దృష్ట్యా సమగ్రమైన దర్యాప్తు జరిపి నిజమైన అర్హులైన లబ్ధిదారులకు బిల్లు చెల్లింపులు చేయడం జరుగుతుంది. ఉదాహరణకు విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ రాజన్న దొర గారు, అరుకు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ సర్వేశ్వరరావు గారు మరియు కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జగ్గిరెడ్డి గారు ఈ ప్రశ్నను అడగడం జరిగింది.

అధ్యక్షా, సాలూరు నియోజకవర్గంలో 1275 గృహాలు disabled houses అని గత ప్రభుత్వమే మూడు సంవత్సరాల క్రితం ఐడెంటిఫై చేయడం జరిగింది. అందు నిమిత్తం రూ. 2,72,37,000.00 ల పెండింగ్ బిల్లులకు సంబంధించి లబ్ధిదారులకు చెల్లించడం జరిగింది.

అదే విధంగా అరకు నియోజకవర్గానికి సంబంధించి disabled houses 6,194 గా గత ప్రభుత్వ హయాంలోనే గుర్తించడం జరిగింది. అందుకు గాను రూ.9,16,39,418.00 ల మేరకు పెండింగ్ బిల్లులకు సంబంధించిన పేమెంట్ జరిగింది.

అదే విధంగా కొత్తపేట నియోజకవర్గానికి సంబంధించి 1,182 disabled houses ఉన్నట్టుగా గత ప్రభుత్వ హయాంలోనే మూడు సంవత్సరాల క్రితమే గుర్తించడం జరిగింది. అందుకు గాను రూ.2,51,46,246.00ల పెండింగ్ బిల్లులకు గాను చెల్లింపులు చేయడం జరిగింది.

ఈ విధంగా ప్రశ్న అడిగినటువంటి ముగ్గురు గౌరవ శాసనభ్యుల నియోజకవర్గాలకు సంబంధించి రూ.14,46,43,213.00ల మొత్తాన్ని disabled houses pending bills నిమిత్తం పేమెంట్ జరిగింది. కనుక ఈరోజున రాష్ట్ర వ్యాప్తంగా 493 లక్షల గృహాలు in progressలో ఉన్నాయి. అన్ని గృహాలకు సంబంధించిన సమగ్రమైన దర్యాప్తు జరుగుతోంది.

ఈ) జియో- ట్యాగింగ్, ఆధార్ సమాచార సేకరణ పని పూర్తయిన తరువాత, చెల్లింపులను విడుదల చేసేందుకు పరిశీలించడమవుతుంది.

...

ఈరోజు రాష్ట్రంలో సుమారు 493 లక్షల ఇళ్లు ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. అన్ని ఇళ్లకు సమగ్రమైన దర్యాప్తు జరుపుతున్నాం. టెక్నాలజీని వినియోగించడం వలన దర్యాప్తు సక్రమంగా జరుగుతుందని భావించి ఆధార్‌సీడింగ్, జియో ట్యాగింగ్ జరిపి అర్హులైన వారిని గుర్తించి బిల్స్ పేమెంట్ చేయడం జరుగుతుంది. అయితే ఈ ఆధార్ సీడింగ్ ఈ నెలాఖరుకే పూర్తిచేయమని ముఖ్యమంత్రిగారు ఆదేశించడం జరిగింది. అదేవిధంగా జియోట్యాగింగ్ ప్రొసీజర్‌ను కూడా పూర్తి చేసి 2014 డిసెంబర్ 31నాటికి ఈ దర్యాప్తులు పూర్తి చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ దర్యాపు జరిగిన తరువాత అర్హులైన వారిని గుర్తించి వారికి డబ్బులు ఇవ్వడం జరుగుతుందని ఈ సభకు మీ ద్వారా తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ : రాజన్నదొర గారు..

శ్రీ పి.రాజన్నదొర(సాలూరు) : అధ్యక్షా, గౌరవ మంత్రిగారు మా నియోజక వర్గాలు కూడా అన్యాయం జరిగిందని చెప్పారు. నేను ఏ ప్రభుత్వం అనేది కాదు. నేను ప్రతిపక్షం కాదు అధ్యక్షా, నేను ప్రజాపక్షం.

(ఈ సమయంలో అధికారపక్ష సభ్యులు దోపిడి, దోపిడి అన్నారు. )

రాజశేఖరరెడ్డి గారు 48 లక్షల ఇళ్లు ఇచ్చారు. తినేయమని ఇవ్వలేదు. దయార్థహృదయంతో, మానవత్వంతో అర్హులైన వారికి ఇళ్లు కట్టుకోమని ఇచ్చారు. అంతే తప్ప, ఎవరూ తినేయమని ఇవ్వలేదు. నా నియోజకవర్గంలో..

(ఈ సందర్భంలో అధికారపక్షం వైపు నుండి అంతరాయం.)

నా నియోజక వర్గంలో ముగ్గురు ఏ.ఇ.ల పై నేను ఫిర్యాదు చేశాను. ఈ విషయం మంత్రిగారికి తెలుసో, లేదో. ఒక ఏ.ఇ. డిస్మిస్ అయ్యారు. మరో ఇద్దరు సస్పెండ్ అయిన తరువాత చనిపోయారు. 10 మంది వర్క్ ఇన్స్పెక్టర్స్ సస్పెండ్ అయ్యారు. నాదృష్టికి ఏది వచ్చినా నేను విడవను. నేను మొదటి నుండి ప్రభుత్వాన్ని ఒకటే డిమాండ్ చేస్తున్నాను. ఎక్కడ అన్యాయాలు జరిగినా, ఎక్కడ అక్రమాలు జరిగినా, క్రిమినల్ చర్యలు తీసుకోండి. ఆ విధంగా రికమండ్ చెయ్యండి. అధ్యక్షా, నేను కోరేది ఒకటే. ఒక ప్రక్క ఎన్నికల కారణంగా ఇంకొక పక్క సమైక్యాంధ్ర కారణంగా మొన్ననే ప్రభుత్వం ఆపేసింది. ఎక్కువ మంది గిరిజనులు, హరిజనులకు పేదలకు ఇళ్లు ఇచ్చారు. ఇళ్లు ఇచ్చారు కదా అని వారికి ఉన్న పూరిపాకను పీకేశారు. అప్పులు తెచ్చుకున్నారు. అద్దెఇళ్లలో ఉంటున్నారు. దానివల్ల ఇల్లు లేక, బిల్లు రాక అప్పుల పాలై మానసికంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. అటువంటి వారికి బిల్లు చెల్లించండి. అందరికీ చెల్లించమని చెప్పడంలేదు. నా హయంలోనే ముగ్గురు ఏఇ.లను సస్పెండ్ చేయించాను. మొన్ననే మా నియోజక వర్గానికి మంత్రి గారు వచ్చిన సందర్భంలో కొంతమంది ఆరోపణలు చేస్తూ, ఫిర్యాదులు ఇచ్చారు. ఫిర్యాదులు ఎవరైతే ఇచ్చారో మొదట తెలుగుదేశం పార్టీలో ఉండి దానిని రక్షించుకోడానికి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఇప్పుడు మరలా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి మళ్లీ అటు వస్తున్నారు. వారిపై ఎఫ్ఐఆర్. కూడా నమోదు అయ్యింది. నేను అందుకే చెబుతున్నాను. 1995 సంవత్సరం నుండి దర్యాప్తు చెయ్యండి. ఎవరు తప్పు చేసినా, నాది తప్పు ఉంటే నామీద క్రిమినల్ చర్యలు తీసుకోండి. ఎవరినీ విడిచి పెట్టవద్దు. అందరికీ బిల్లు ఇవ్వాలి. మానసికంగా, ఆర్థికంగా, హరిజనులు గిరిజనులు పేదలై ఉన్న అర్హులు బిల్లు తీసుకుంటున్నారు. ఇదొక బర్నింగ్ సమస్య అయింది. ఇన్ని ఇబ్బందులు పడుతున్నారు. వారు ధర్నాకు సిద్ధమౌతున్నారు. త్వరలోనే గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకు వెళతాను, అవసరమైతే ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకు వెళతాను, అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాను, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పాను. ప్రతిదానికి మనం ఉద్యమాలు, సమ్మెలు అంటే బాగుండదు అని వారితో చెప్పాను. నేను ఆరోపణలు చేయడం కానీ, అపవాదులు వేయడం కానీ చేయడం లేదు. ఉన్న సమస్యను సామరస్యంగా పరిష్కరించమని తమ ద్వారా కోరుతున్నాను.

సిమెంట్, ఇసుక, ఇనుము రేట్లు పెరిగాయి, తమకు తెలుసు. తాపీ మేస్త్రీలు రోడ్డుపై పడ్డారు. దానితో, సగం చేసి ఆగిపోయిన బిల్లులు ఎలా చెల్లిస్తారు. అందుచేత తమకు మనవి

చేసేదేమనగా బి.సి.లకు ఇచ్చే రూ.100,000. ఎస్సీలకు రూ.1.50వేలు అంటున్నారు. స్లాబ్ సిస్టంలో ఇవ్వండి. ఎవరైతే అర్హులై ఉండి, సగం పనులు పూర్తి చేసుకొని బిల్లులు ఆగిపోయి ఉండి ఉన్నారో వారందరికీ పూర్తి చేయండి. సఫలీకృతం చేయండి.

మిస్టర్ స్పీకర్ ః ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ పి.రాజన్నదొర ః అర్హులు కాని వారికి ఎవరికీ ఇవ్వద్దు. వారు ఏ కులమైన, మతమైనా, ఏ పార్టీ వారైనా అర్హులైతే వారికి ఇవ్వండని తమ ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను. ఈ బిల్లులకు ఆధార్ కార్డు, జియో టాగింగ్ అంటున్నారు, తమ ద్వారా ప్రభుత్వానికి మనవి చేస్తున్నాను.

(ఈ సందర్భంలో సభ్యులు (శ్రీ పి.రాజన్న దొర) తమ దగ్గరున్న రెండు ఆధార్ కార్డులను గౌరవ సభాపతి గారికి చూపించారు. )

ఈబిల్లులకు ఆధార్ కార్డు ఉండాలంటున్నారు. నేను, నా భార్య 2012 సంవత్సరంలో ఆధార్ కార్డు కొరకు అప్లై చేసుకోగా, 2014లో తీసుకున్నాను. తమకు చూపిద్దాం అని సీల్ కూడా తీయలేదు. ఆధార్‌ను నమ్ముకుంటే ఆధార్ కార్డులు తీసుకోవడం ఎప్పటికి పూర్తి అవుతుంది అధ్యక్షా. జియో టాగింగ్ చెయ్యద్దు అని చెప్పండి. నిష్పక్ష పాతంగా పూర్తి చేయండి. నిర్ధిష్టమైన టైం ఉంచుకొని పూర్తి చేయమనండి సార్. ఫలానా తేది లోపల విచారణ పూర్తి చేసి బిల్లుల చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పమనండి. 1995 నుండి కూడా అవసరమైతే విచారణ చేపట్టండి. ఎవరు తప్పుచేసినా కఠినంగా చర్యలు తీసుకోమని తమద్వారా మనవి చేసుకుంటున్నాను. త్వరగా బిల్లులు చెల్లించండి.

మిస్టర్ స్పీకర్ ః జగ్గిరెడ్డి గారు..

శ్రీ సి.జగ్గిరెడ్డి (కొత్తపేట)ః అధ్యక్షా, ఈ రోజు రాష్ట్రంలో ఒక ప్రధానమైన సమస్యగా ఈ హౌసింగ్ బిల్లు ఉంది. ముఖ్యంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ, రూ.196.30 కోట్లు ఇవ్వాల్సి హౌసింగ్ బిల్లులు పెండింగ్ ఉన్నట్లు చెబుతున్నారు. ఎవరైతే దారిద్ర్యరేఖకు దిగువున ఉండి నిలువ నీడలేక ఇబ్బందులు పడుతున్నారో, అటువంటి వారికి ఇల్లుకట్టే కార్యక్రమం ఈ గృహనిర్మాణం. అటువంటి దాంట్లో బిల్లులు ఈరకంగా పెండింగ్ పెట్టడం ద్వారా ఎంతోమంది అప్పుల పాలైపోయి ప్రైవేట్ ఫైనాన్స్ దారులకు కట్టిన ఇల్లు తనఖా పెట్టే పరిస్థితి ఈవేళ రాష్ట్రంలో ఏర్పడింది. ముఖ్యంగా ఏదైతే మంత్రిగారు చెబుతున్నారో గతంలో జరిగిన అవకతవకలు మీద తప్పని సరిగా విచారణ చెయ్యండి, తగు చర్యలు తీసుకోండి. ఇబ్బంది లేదు. కానీ వారిని

సాకుగా చూపించి బిల్లుల చెల్లింపులు ప్రభుత్వం ఎందుకు పెండింగ్ పెడుతుంది అని తమ ద్వారా అడుగుతున్నాను.

కడుపు చించుకుంటే కాళ్లమీద పడుద్ది. అవతల కూర్చున్న వారు మాట్లాడ లేకపోతున్నారేమో కానీ, నియోజక వర్గాలకు వెళ్లితే ప్రతి శాసనసభ్యునికి, ప్రతి నియోజక వర్గంలోనూ, ఏమండి మేము ఇల్లు కట్టుకొని ఎంత కాలం అయింది, నిబంధనల ప్రకారం కట్టుకున్నాం. బిల్లు ఇస్తారని కట్టుకున్నాం, బిల్లు ఎందుకు ఇవ్వరని నిలదీస్తున్నారు. విచారణ చేసుకోండి కాదనటం లేదు. మీరు ఎవరిచేత విచారణ చేపించుకున్నా ఇబ్బంది లేదు. ఇప్పటికైనా ముందు పెండింగ్ ఉన్న బిల్లులు ఎప్పటిలోగా చెల్లింపులు ప్రారంభిస్తారని ఈ హౌస్‌లో మీరు తేల్చి చెప్పాల్సిందిగా తమ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. మిగిలిన అన్ని జిల్లాల్లో ఒకసారి చూస్తే, తూర్పు గోదావరి జిల్లాలో రూ.40 కోట్లు, మిగిలిన చోట్ల రూ.9,8,11కోట్లు ఉంటే కేవలం తూర్పు గోదావరి జిల్లాలోనే రు.40 కోట్లు ఎందుకు పెండింగ్ పెట్టారో మంత్రివర్యులు సమాధానం చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః చాంద్ బాషా గారు.

శ్రీ ఎ.చాంద్‌బాషా (కదిరి) ః అధ్యక్షా, ఈరోజు రాష్ట్రంలో నివశిస్తున్న బడుగు బలహీ న వర్గాల వారు అందరూ ఎంతో ఆశగా ఇందిరమ్మ గృహాలు కట్టుకొని తమ స్వంత ఇంట్లో మన జీవనం సాగించాలనే ముఖ్య ఉద్లేశ్యంతో అప్పు, సప్పు చేసి, రూ.5, రూ.10 లకు వడ్డీకి తెచ్చుకొని చాలామంది గృహలు మొదలు పెట్టి, పునాదులు, గోడలు, స్లాబులేసి ఇలా స్టేజ్‌ల వారిగా చాలమంది నా నియోజక వర్గంలో దాదాపు 42వేల మంది ఇందిరమ్మ గృహాలకు అప్లై చేసుకొంటే,12వేల గృహాలు పూర్తి కాగా, ఇంకా 30 వేల గృహాలు పూర్తి కావల్సి ఉంది. 15వేల గృహాలు స్లాబ్, పునాది లెవల్ లలో ఉండాయి. వారు బిల్లుల కోసం తిరుగుతున్నారు. మంత్రి వర్యులు చెప్పినట్లు మార్చి 24 నుండి బిల్లులు నిలుపుదల చేశారు. డిసెంబర్ 12 వరకు కూడా ఈ బిల్లులు ఆన్‌లైన్‌లో పెట్టే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. ఈ రాష్ట్రంలో పేద, బలహీన, బడుగు వర్గాల వారున్నారు. ప్రభుత్వాన్ని నేను కోరేదేమనగా దయచేసి ఏదైతే అక్రమాలు జరిగాయో, అన్యాయానికి పాల్పడ్డారో వారిని తీసివేసి, అటువంటి వారికి మాత్రం చెల్లింపులు నిలిపేసి, ఎవరైతే నిజమైన లబ్ధిదారులు ఉన్నారో వారికి బిల్లులు వీలైనంత త్వరగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారు.

శ్రీ కె.మృణాళిని (చీపురుపల్లి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు ప్రశ్నించినట్లుగా బిల్స్ పేమెంట్ ఆగింది అని చెబుతున్నారు, అది మా ప్రభుత్వం వచ్చిన తరువాత ఆపడం జరగలేదు. ఇది గత

ప్రభుత్వం లోనే మార్చి, మే నెలల మధ్య జరిగింది. అప్పటికి మా ప్రభుత్వం రాలేదు. ఎందుకు ఈ విధంగా జరిగింది అంటే ఇన్-ఎలిజబుల్ బెనిఫిషరీకి ..

(ఈ సందర్భంలో వైఎస్ఆర్. సభ్యులచే అంతరాయం.)

గౌరవ సభ్యులు వినాలండీ, ఒక్క నిమిషం ఆగాలి. మేము ఒక పద్ధతి ప్రకారం చేయాలనే జియో టాగింగ్ ప్రొసీజర్ ఆధార్ సీడింగ్ చేస్తున్నాం. గత 10 సంవత్సరాలుగా వారు చేయలేనటువంటిది 3 సంవత్సరాలుగా ఆగిపోయాయి. ఇళ్ల నిర్మాణం ఏ స్టేజ్‌లో ఆగిపోయాయో ఆదే స్టేజ్‌లో ఆగిపోయాయి. అప్పుడేమి చేయలేని గౌరవ సభ్యులు వేము వచ్చి 90 రోజులు కూడా దాటలేదు. ఈ 15 రోజులుగా చూస్తుంటే ప్రతి రోజు హౌసింగ్ మీద ఒక ప్రశ్న వస్తుంది. ఈ విధంగా ప్రశ్న వస్తుందంటే దానికి కారణం ఎవరు అధ్యక్షా. గత ప్రభుత్వం కాదా అని ఈ సభా ముఖంగా గౌరవ సభ్యులను తమ ద్వారా ప్రశ్నిస్తున్నాను.

(అధికారపార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

...

నిన్న గౌరవ సభ్యులు తాపేశ్వరం గురించి అడిగారు. తాపేశ్వరం గ్రామంలో సుమారు 1200 ఇళ్లు కడితే, గత 5, 6 సంవత్సరాలుగా దఫ, దఫాలుగా విచారణ జరిగినా... చివరకు కలెక్టరుగారు 13 గ్రూపులను పెట్టి, ప్రత్యేకంగా ఆ ఒక్క గ్రామంలోనే దర్యాప్తు జరిపితే, 1200 ఇళ్లలో కేవలం 18 మంది మాత్రమే అర్హులైనవారు ఉన్నారని తేలింది. ఈ 18 మంది బాధపడుతున్నారని బిల్లు చెల్లింపులు జరిగితే, 1100 పైచిలుకు అనర్హులకు బిల్లులను చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, ఈ అనర్హులను పక్కనపెట్టి, అర్హులైనవారికి, నిజాయితీగా ఉన్నవారికి, నిజమైన పేదవారికి బిల్లు చెల్లింపులు జరగాలనే ఉద్దేశంతోనే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు చాలా స్ట్రిక్ట్‌గా ఉండి, ఆధార్ సీడింగ్‌ను జరిపిస్తున్నారు. ఇంకా 10 నుంచి 15 శాతం మిగిలిఉంది. ఈ నెలాఖరవరకు ఆధార్ సీడింగ్ పూర్తవుతుంది. జియో ట్యాగింగ్ పద్ధతిని ప్రారంభించి, ఈ జియో ట్యాగింగ్ పద్ధతి ద్వారా సాఫ్ట్‌వేర్‌ని వినియోగించి, ప్రతీ ఇంటికీ longitude, latitude అనే ఫొటోను తీసి, డూప్లికేషన్స్ లేకుండా నిజమైన అర్హులను గుర్తించి, బిల్లు చెల్లింపులు చేయడం జరుగుతుంది. ఈ అవకతవకలు కూడా గత ప్రభుత్వంలో జరిగినవే తప్ప, మా ప్రభుత్వంలో కాదు. మేము ఎప్పుడూ కూడా పేదప్రజానీకానికి సానుకూలంగా ఉంటాం.

స్వర్గీయ ఎన్.టి.రామారావుగారి దగ్గర్నుంచి, శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి దగ్గర్నుంచి... తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ఎన్.టి.రామారావుగారు ఇళ్ల నిర్మాణాన్ని ప్రవేశపెట్టారు. ఒక ఎం.ఎల్.ఏ. 10 నుంచి 15 వందల ఇళ్లు తెచ్చుకుంటే... ఎవరు నిజమైన లబ్దిదారులు అనేది ప్రతీ గ్రామంలో ఒక దగ్గర సమావేశమై, ఎవరు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారో, ఎవరికి తెల్లకార్డులున్నాయో, అర్హులైన వారిని గుర్తించి, నిజమైన నిరుపేదలు ఎవరైతే

ఉన్నారో వాళ్లకి, అప్పట్లో మాప్రభుత్వం ఇళ్లను ఇవ్వడం జరిగింది. తరువాత కాంగ్రెస్ ప్రభుత్వంలో పుంఖానుపుంఖాలుగా, మాకున్న స్టాఫ్ ప్రకారం ఒక సంవత్సరంలో 1 లక్ష ఇళ్లను మాత్రమే కట్టగలమని అధికారులే చెప్పినప్పటికీ, ఇష్టమొచ్చిన రీతిలో అత్యధికంగా సంవత్సరానికి 5లక్షల పైచిలుకు ఇళ్లను మంజూరుచేయటం వలన, చాలా ఆరోపణలు వచ్చాయి.

నిజంగా ఈ ఇళ్లల్లో ఈరోజు పింక్ కార్డుదారులు ఉన్నారంటే, ఎంత బాధాకరమైన పరిస్థితి. అదేవిధంగా ఒకే ఇంటిమీద రెండు, మూడు బిల్లులు చెల్లింపులు జరిగాయి. అసలైన లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు అయిందన్న విషయం, బిల్లు అయిపోయిందన్న విషయం కూడా తెలియదు. తర్వాత ఎవరో అతనికి చెబితే, ఆహా నాకు ఇల్లు మంజూరయ్యిందా? నాకు తెలియదే, నాకు ఏ బిల్లులూ రాలేదు, నేను ఇల్లు కట్టుకోలేదు. అనే పరిస్థితిలో ఈరోజు నిజమైన పేదవాడున్నాడు. కనుక, మేం పేదవారికి న్యాయం చేస్తాం. నిజమైన పేదవారికి, అర్హులైనవారికి బిల్లు చెల్లింపులు చేస్తామని ఈ సందర్భంగా, ఈ సభాముఖంగా చాలా బాధాకరమైన పరిస్థితిలో తెలియజేస్తున్నాను.

(ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు)

**MR. SPEAKER: Question No.7 (127), Minister for Agriculture.**

**సర్వశ్రీ వాసుపల్లి గణేష్‌కుమార్, ఎం.ఎల్.ఎ.**

అ) రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించిందా?

ఆ) మత్స్యకారుల కులాన్ని షెడ్యూల్డ్ తరగతుల జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

ఇ) అయితే, ఆ వివరాలు ఏమిటి?

**వ్యవసాయ మరియు పశు సంవర్థక శాఖా మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు:**

అ) ఏవిధమైన నిర్ధిష్ట సమస్యను పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి మరియు మత్స్య పరిశ్రమశాఖ దృష్టికి తేబడలేదు.

ఆ) మత్స్యకారుల కులాన్ని షెడ్యూల్డు తరగతుల జాబితాలో చేర్చడానికి గిరిజన సంక్షేమ శాఖలో అట్టి ప్రతిపాదన ఏదీ లేదు.

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

మిస్టర్ స్పీకర్: శ్రీ గణేష్ కుమార్ గారు.

శ్రీ వాసుపల్లి గణేష్ కుమార్(విశాఖపట్నం సౌత్): అధ్యక్షా, డా.బి.ఆర్.అంబేద్కర్ ఏమన్నారంటే, " I pity when I see born as men but living worse than animals". అదీ మా మత్స్యకారుల పరిస్థితి. మా పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. మేం అలాంటి పరిస్థితిలో బతుకుతున్నాం. "మీకోసం'' యాత్రలో, "వస్తున్నా మీకోసం'' యాత్రలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు స్వయంగా చూసి, మమ్మల్ని ఎస్టీలలో చేర్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని మానిఫెస్టోలో కూడా పెట్టడం జరిగింది. అందుకనే గౌరవ మంత్రిగారిని దీనిగురించి ఒకసారి రిఫర్ చేయమని కోరుతున్నాను.

మళ్లీ డా.బి.ఆర్.అంబేద్కర్ ఏమన్నారంటే, " Religion, social status and property are all the sources of power and authority which one man has to control the liberty of others". ఈరోజు లిబర్టీని కంట్రోల్ చేయడమన్నదే ఒక సోషల్ పవర్. ఫిషర్‌మేన్‌కి ఒక పవర్, ఒక లిబర్టీ అనేవి ఏమీ లేవు. ముందుగా రిలీజియన్స్ అంటే, మేం పూజించేది గంగమ్మ తల్లినే. గంగమ్మ తల్లికి కనీసం ఒక గుడి కూడా ఉండదు. ఎవరూ కట్టరు. మేమే కట్టుకుంటాం. భారతదేశంలో ఎక్కడ చూసినా గంగమ్మ తల్లి గుడులు ఉండవు. ఒక్క మత్స్యకారులే పెట్టుకుంటారు. గంగమ్మ తల్లే మా రిలీజియన్. సముద్రమే మా రిలీజియన్.

ఈరోజు మా స్టేటస్ చూస్తే, చాలా అధ్వానంగా ఉంది. డా.బి.ఆర్.అంబేద్కర్ ఏమన్నారంటే, " No one can dare to raise their eye brows even against the Community if they have 10 Doctors, 20 Engineers and 30 Lawyers'' మా పరిస్థితీ అంతే. మాకు లాయర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు లేరు. ఉంటే ఎక్కడో ఒక దగ్గర అరకొర ఉంటారు. అందుకనే మమ్మల్ని ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నాం.

ఆయిల్, సీ ఫుడ్స్, పోర్టులను, పిసిపిఐఆర్స్ కొన్ని లక్షల కోట్లు సంపాదిస్తున్నాయి. అదే ట్రోపోగ్రఫీలో నివసిస్తున్న మా మత్స్యకారులందరూ కనీసం మూడు పూటలా తిండి లేక చాలామంది చనిపోతున్నారు. మా ఆస్తి కేవలం సముద్రం మాత్రమే. కనీసం మాకు పవర్ కూడా లేదు. కాబట్టి, దయచేసి మమ్మల్ని ఎస్టీలలో చేర్చాలని కోరుతున్నాను.

ఎందుకంటే కొండలమీద నివసిస్తున్న వాళ్లని ట్రైబల్స్ అంటారు. ఇక్కడ మత్సకారుల్ని బీచ్ ట్రైబల్స్ అంటారు. ఈ రెండు జాతులకు తేడా ఏమీ లేదు. మేమూ అడ్డపొగ పెడతాం. వాళ్లూ చేసేది అదే. మాకూ తినటానికి తిండి లేదు, వాళ్లదీ అదే పరిస్థితి. దయచేసి వీటన్నిటినీ కూడా దృష్టిలో పెట్టుకుని ఎస్టీల్లో చేర్చమని తెలియజేస్తున్నాను.

ఇంకో విషయం ఏమంటే, ఈరోజు ఫిషర్‌మేన్‌కు ఇమ్మీడియట్‌గా కొన్ని రిలీఫ్స్ రావాలి. ఎందుకంటే మేం సముద్రాన్ని నమ్ముకొని బతుకుతాం. అక్కడే పోర్టులు వస్తాయి. మాకు దగ్గరలో విశాఖపట్టణం పోర్టు ఉంది. 15.4 కిలోమీటర్ల వాటర్ ల్యాండ్ ఏరియా ఉంది. అలాగే గంగవరం పోర్టుకు 30 కిలోమీటర్లు, Advance technology vessels నేవీకి 30 కిలోమీటర్లు ఇచ్చారు. ప్రతీ ఒక్కరూ No Fishing Zone అని తీసేసుకుంటున్నారు. అలా అయితే మేం ఎలా బతకాలి? గత చరిత్రను తీసుకుంటే ఒకప్పుడు విశాఖపట్టణం, It is a fishermen village. No Fishing Zone అని ఒకరికొకరు రిజొల్యూషన్లు పాస్ చేసుకునే అధికారం వీళ్లకి ఎవరిచ్చారు? అందుకని ఇలాంటివాటిపైన శ్రద్ధ చూపించి, వీళ్ళందరి ఆట కట్టించాలని కోరుతున్నాను.

అదేవిధంగా తొందరగా మత్స్యకారులకోసం కొన్ని Remedial measures తీసుకురావాలని కోరుతున్నాను. ఈ రాష్ట్రంలో సుమారు 5 లక్షల కుటుంబాలు మత్స్య సంపద మీదే బతుకుతున్నాయి. We need a separate Ministry, Separate agricultural Status, The fishermen should be included in the S.T category, Integrated Fishermen Development Agency కావాలి. ITDA ఎలా ఉందో అలానే ఇక్కడా కూడా IFDA పెట్టాలి. అదేవిధంగా Processing plants, 50% Capital Investment, State Maritime Board ను విశాఖపట్టణంలో పెట్టాలి. National Fishermen Development Board ను హైదరాబాదు నుంచి విశాఖపట్టణానికి తరలించాలి. A.P Marine Fishermen Regulation Act ను పెట్టాలి. ఎందుకంటే రింగువలలు అని చెప్పి ఈమధ్య కాలంలో మన రాష్ట్రంలో half inch కన్నా తక్కువ ఉండే వలలను నిషేధించారు. కానీ మిగతా రాష్ట్రాలలో అలా చేయలేదు. దీనివలన ఫిషర్‌మెన్‌కు తగాదాలు వస్తున్నాయి. కాబట్టి, వీటిని తొందరగా రివైజ్ చేయాలని కోరుతున్నాను. **(బెల్)** అలాగే, Office of the Commissioner of Fisheries హైదరాబాదులో ఉంది. దీనిని కూడా ఆంధ్రప్రదేశ్‌లో సముద్రం ఒడ్డున ఉన్న నగరాలలో పెడితే బాగుంటుంది. అలాగే State Fisheries Co-operative Society విశాఖపట్టణానికి తరలించాలి. అలాగే 2002వ సంవత్సరానికి ముందున్న బోటులకు మాత్రమే ఆయిల్ సబ్సిడీని ఇస్తున్నారు. 2002వ సంవత్సరం తర్వాత బోటులు, బోటులు కాదా? చాలా బోటులు పాతబడి కనీసం మరమ్మత్తు చేయించుకునే పరిస్థితి కూడా లేదు. కొత్త బోట్లును కట్టుకోలేరు. కట్టుకుంటే వాటికి ఆయిల్ సబ్సిడీ ఇవ్వటం లేదు. **(బెల్)** కనుక ఇప్పటివరకు కట్టుకున్న అన్ని బోట్లకు ఆయిల్ సబ్సిడీ ఇవ్వాలి. అలాగే ఆయిల్‌రేటు పెరుగుతున్నందున, దానికి అనుగుణంగా ఈ ఆయిల్‌సబ్సిడీని పెంచుకుంటూ వెళ్లాలని కోరుతున్నాను. అలాగే Compensation to the fishermen people. సముద్రంలోకి వెళ్ళి చనిపోతే, కనీసం 9, 10 సంవత్సరాలైనా మృతదేహం దొరకట్లేదు. మృతదేహం దొరక్కపోతే ఇన్సూరెన్స్ ఇవ్వనంటారు. కేరళలో 5 లేదా 6 నెలల్లో ఇన్సూరెన్స్‌ను రూ. 5 లక్షలు లేదా 6 లక్షలు ఇస్తున్నారు. మరి

ఆంధ్రప్రదేశ్‌లో బతికే ఫిషర్‌మేన్‌కు అలా జరగటం లేదు. తక్షణమే ఆ రూలును మార్చాలని కోరుతున్నాను.

...

అలాగే, మత్స్యకారులకు Sea safety and navigational equipment ను అందించాలి. Fishing Harbers లో No Fishing Zone లను సవరించాలి. అలాగే, Letter of permissions ను international boats కూడా ఇవ్వడం వలన, 12 nautical miles నుండి 200 nautical miles వరకూ international nautical miles. అక్కడకూడా ఈ international fishing జరుగుతోంది. దాన్ని కూడా వెంటనే ఆపాలి. అదేవిధంగా Sea erosion కూడా ఆపాలి. విశాఖపట్నం పోర్టులో రెండు లక్షల డి.డబ్ల్యు.ఎస్.ఎల్. కోసం Dredging చేయడంకోసం, Dredging Corporation of India అనుమతి తీసుకుని, బాంబులు పెట్టి ఇష్టానుసారంగా అక్కడుండే బీచ్‌ను Sea erosion కు గుర్రైయ్యేట్లు చేస్తున్నాయి. (బెల్) దానివల్ల పల్లంలో నివసిస్తున్న మా కుటుంబాలను సముద్రం ముంచేస్తోంది. ఈ Sea erosion ను వెంటనే ఆపేందుకు చర్యలు తీసుకోవాలి.

MR. SPEAKER: I know it is important. But conclude.

శ్రీ వి.గణేశ్ కుమార్ః అధ్యక్షా, త్వరగా ముగిస్తాను. ప్రభుత్వ ఉత్తర్వు నెం. 373, 575, 345లలో పేర్కొన్న మాస్టర్ ప్లాన్‌ను వెంటనే మత్స్యకారుల గ్రామాలకు అమలుపరచాలి. అదేవిధంగా House plots and house rights within CRZ vide G.O. Ms. Nos. 168 and 345. దీన్ని కూడా అమలుపరచాలి. అలాగే CSR Cooperative Social Responsibility Funds, CRZ Tourism లో ఉండేవన్నీ కూడా మత్స్యకారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా 25% reservation for Fishermen community in the CRZ activities CRZ and PCP Marine EIA, implementation of EMP boards – minimum two members from the fishing community, ఈ బోర్డులో కనీసం ఇద్దరైనా మత్స్యకారులు ఉండాలని మరీమరీ కోరుతున్నాను. జైహింద్.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ గారు..

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట)ః అధ్యక్షా, మత్స్యకారులు ప్రస్తుతం, వెనుకబడిన తరగతుల జాబితా గ్రూప్-ఏ లో వరుస సంఖ్య.1 లో ఉన్నారు. చేపలు పట్టడం వీరి ప్రధానవృత్తి. వీరు సముద్ర తీరాల్లోని నదుల ఒడ్డున ఉప్పునీటి కయ్యల వద్ద జీవిస్తుంటారు. మత్స్యకారులు తమని తాము పల్లీలని, అగ్నికుల క్షత్రియులని పిలుచుకుంటారు. వారు సముద్రంలోనూ, అదేవిధంగా చెరువుల్లోనూ చేపలు పడుతుంటారు. ఇటీవల కాలంలో వారు అగ్నికుల క్షత్రియులనే సంస్కృతీకరించబడ్డ పేరు వాడుతున్నారు. యజ్ఞోపవీతం ధరిస్తున్నారు. తమ పేర్ల చివర వర్మ అని చేర్చుకుంటున్నారు. వాడబలిజ, బెస్త, గుండ్ల, జాలరి, గుల, నెయ్యల,

కందర, చేపలబట్టి వంటి పేర్లతో పిలువబడుతున్న సమాజాలు కూడా మత్స్యకారుల వృత్తిలోనే జీవిస్తున్నారు. అయితే, వీరిలో ఒకరికి మరొకరికి మధ్య వివాహ సంబంధాలు లేవు. పల్లీలు తెలుగు మాట్లాడుతారు. వీరి వివాహ పద్ధతులు, తక్కిన వెనుకబడిన తరగతుల మాదిరిగానే ఉన్నాయి. కొన్ని గిరిజనుల తెగల్లోనూ, ఆదిమ గిరిజనుల్లో ఉన్నట్లుగా, 'Marriage by capture & Leverage type of marriages' ఈ సమాజంలో కనిపించవు. వారికి చెప్పుకోదగ్గ ప్రత్యేకమైన భాష లేదు. కానీ, సంస్కృతి, తక్కిన ఆచార వ్యవహారాలు, తెలుగు మాట్లాడే ఇతర సమాజాలకన్నా భిన్నమైనవి కావు.

ఈ మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చమని గౌరవ సభ్యులు శ్రీ గణేశ్ కుమార్ గారు కోరారు. భారత రాజ్యాంగంలోని అధీకరణం 344 ప్రకారం, భారత రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర గవర్నర్‌తో చర్చించి, ఏ తెగలు లేదా తెగలకు సంబంధించిన సమాజాలు, షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించబడతాయో ప్రకటిస్తారు. ఆర్టికల్ 342(2) ప్రకారం, ఒక తెగను షెడ్యూల్డ్ తెగల నోటిఫికేషన్‌లో చేర్చడానికి గానీ, లేదా తొలగించడానికి గానీ భారత పార్లమెంట్ మాత్రమే చట్టం ద్వారా నిర్ణయించగలుగుతుంది. షెడ్యూల్డ్ తెగల జాబితా నుంచి ఒక తెగను తొలగించడానికి గానీ, చేర్చడానికి గానీ పాటించవలసిన పద్ధతులని భారత ప్రభుత్వం 1999లో స్పష్టం చేసింది. ఆ పద్ధతి ప్రకారం, ఏదైనా షెడ్యూల్డ్ తెగగా గుర్తింపు పొందాలంటే, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, Registrar General of India, National Commission for S.Ts. కూడా ఆమోదించాలి.

అధ్యక్షా, ఏదైనా ఒక తెగ, తమను షెడ్యూల్డ్ తెగగా గుర్తించాలని గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖను కోరినప్పుడు, ఆ మంత్రిత్వశాఖ ఆ ప్రతిపాదనలను పరిశీలించి, తమ అభిప్రాయం తెలియజేయవలసిందిగా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాన్ని, భారత ప్రభుత్వం కోరుతుంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను అంగీకరిస్తే, ఆ ప్రతిపాదనను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు పంపించబడుతుంది. వారు ఆమోదించిన తరువాత, అ ప్రతిపాదనను National Commission for S.Ts. వారి సిఫార్సుకు పంపబడుతుంది. వారు కూడా అంగీకరించినట్లైతే, అప్పుడు అది సంబంధిత మంత్రిత్వశాఖలతో చర్చించిన తరువాత మంత్రివర్గనిర్ణయానికి వెళ్తుంది. గౌరవ సభ్యులు అటువంటి ప్రతిపాదన ఇచ్చివుంటే, తప్పకుండా ప్రభుత్వం పరిశీలిస్తుంది.

మత్స్యకారుల సంక్షేమానికి Fishing Zone విధించడం వలన మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు శ్రీ గణేశ్‌కుమార్ గారు సభ దృష్టికి తీసుకురావడం జరిగింది. అదేవిధంగా మత్స్యకారులకు Agricultural status ఇవ్వాలని కూడా సభదృష్టికి తీసుకువచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన NFDB హైదరాబాద్‌లో ఉంది. ఇప్పుడు దాన్ని మనం కోస్తా ప్రాంతంలో కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కూడా ప్రభుత్వం వద్ద ఉన్నది.

అదేవిధంగా కమీషనరేట్‌ను కూడా ఏర్పాటు చేయమని కోరారు. కోస్తా ప్రాంతంలో ఫిషరీస్ కమీషనర్ కార్యాలయం ఏర్పాటు ప్రతిపాదన కూడా ప్రభుత్వం వద్ద ఉన్నది. డీజీల్ మీద సేల్స్‌టాక్స్ సబ్సిడీ, వ్యాట్ ఇవ్వమని అడుగుతున్నారు. ప్రస్తుతం లీటరుకి రు.6లు సబ్సిడీ ఇవ్వడం జరుగుతోంది. శ్రీ గణేశ్‌కుమార్ గారు సభ దృష్టికి తీసుకువచ్చిన విషయాలను తప్పకుండా పరిశీలించి, మత్స్యకారుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటాం.

**మిస్టర్ స్పీకర్: ప్రశ్న నెం.172 (128), నీటిపారుదలశాఖ మంత్రి గారు.**

**ప్రశ్న నెం.172 (128)**

**సర్వశ్రీ చిర్ల జగ్గిరెడ్డి, – ఎం.ఎల్.ఏ.**

ఎ) రాష్ట్రంలోని నదీతీరాలను రక్షించడంలో, లస్కర్‌ల పాత్ర కీలక ప్రాధాన్యతగావున్న విషయం వాస్తవమేనా;

బి) వివిధ ప్రాంతాలలో లస్కర్ పదవుల ఖాళీలను భర్తీ చేయవలసియున్న విషయం కూడా వాస్తవమేనా;

సి) అయితే, ఖాళీగా ఉన్న లస్కర్ పదవుల జిల్లా వారీ వివరాలు, ఆ పదవులను భర్తీ చేయడానికి ప్రభుత్వం తీసుకోనున్న చర్యలు ఏమిటి?

**సాగునీటి పారుదల, పరీవాహక ప్రాంత అభివృద్ధి మరియు జలవనరుల నిర్వహణ మంత్రివర్యులు శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:**

ఎ) అవునండీ.

బి) శాశ్వత సిబ్బంది సంఖ్య లేనందున ఖాళీ పదవులు లేవు. లస్కర్ అవసరతను గుర్తిస్తూ, లస్కర్ వ్యవస్థను పటిష్టపరచాలని ప్రభుత్వం పరిశీలిస్తుంది.

సి) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

మిస్టర్ స్పీకర్: జగ్గిరెడ్డి గారు.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి(కొత్తపేట): అధ్యక్షా, ఇంతకుమునుపు హౌసింగ్ మినిస్టర్ గారు మాట్లాడుతూ, పదేపదే మా వైపు చూపిస్తూ, గత సంవత్సరంలో మీరే అధికారంలో ఉన్నారని చెప్తున్నారు. వారేమైనా మర్చిపోతున్నారేమో మాకు తెలియట్లేదు. నేను మీద్వారా మనవి చేస్తున్నాను. **(బెల్)** శాసనసభలో శాసనసభ సాక్షిగా ఓటేసి అప్పటి ప్రభుత్వానికి మద్దతునిచ్చింది వారేనని తెలుసుకోవాలి.

లస్కర్‌ల విషయంలో మొదటి ప్రశ్నకు మంత్రిగారు 'అవునండీ' అని సమాధానం ఇచ్చారు. అందుకు ధన్యవాదాలు. రెండవ ప్రశ్నకు 'లస్కర్‌ల పదవులు ఖాళీలను భర్తీ చేయవలసిన విషయం కూడా వాస్తవమేనా అని అడిగిన ప్రశ్నకు, శాశ్వత సిబ్బంది సంఖ్యలేరు. ఖాళీ పదవులు లేవు. లస్కర్‌ల అవసరతను గుర్తిస్తూ ప్రభుత్వం పరిశీలిస్తుంది.' అని సమాధానం చెబుతున్నారు.

వాస్తవంగా, ఈ లస్కర్‌లు కరకట్టలు కాపాడడంలో వారి పాత్ర చాలా అమోఘం. ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖరరెడ్డి గారు, ఆనాటి డెల్టా ఆధునీకరణలో భాగంగా, భారీఎత్తున చేపట్టిన కరకట్టల నిర్మాణాలను కాపాడే బాధ్యత లస్కర్‌లపైనే ఉంటుంది. ముఖ్యంగా, మా కోనసీమ ప్రాంతంలో, వరదల సమయంలో ఎక్కడైనా లీకేజ్‌లు ఏమైనా ఉంటే, ఎప్పుడు ఎక్కడ గండ్లు పడతాయో తెలియని పరిస్థితులో, ఈ లస్కర్‌లే సమయస్ఫూర్తితో గమనించి, కరకట్టలను పరిరక్షించడం ద్వారా అనేక సార్లు గండ్లు పడకుండా కాపాడినటువంటి చరిత్రలు కూడా ఉన్నాయి. మా నియోజక వర్గంలో పేర్వారం అనే గ్రామంలో గతంలో వచ్చిన వరదల సమయంలో ఒక లస్కరే కాపాడిన సందర్భం ఉంది. గతంలో ప్రభుత్వం ఉత్తర్వు సంఖ్య.29, తేది.19.03.1986లో ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా, లస్కర్‌ల విధివిధానాలను పొందుపరచడమే కాకుండా, శాశ్వత ప్రాతిపదికన లస్కర్‌లను ఏర్పాటు చేయడం కోసం, ఆ కమిటీ ఒక సిఫార్సు కూడా చేసింది. దానిప్రకారం, డెల్టా ప్రాంతంలో ప్రతీ 5 కి.మీ.లకు ఒక లస్కర్ చొప్పున, నాన్‌డెల్టా ప్రాంతంలో 6 కి.మీ.లకు ఒక లస్కర్ చొప్పున ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది. బ్రాంచ్ కెనాల్‌కి, డిస్ట్రిబ్యూటరీ కమిటీకి, రెగ్యులేటర్స్ ఉన్నచోట, అదేవిధంగా ఫ్లడ్ బ్యాంక్స్‌కి లస్కర్‌లు కావలసి ఉంటుందని, వారి ప్రాధాన్యతను గుర్తించి ఆనాటి ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నారు.

...

ఇప్పటి వరకు శాశ్వత ప్రాతిపదికన నిర్ణయం తీసుకోలేదని మంత్రి గారు చెబుతున్నారు. తూర్పు గోదావరి జిల్లానే కాదు విజయనగరం జిల్లాలో శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి దయవల్ల ఈ రాష్ట్రంలో ఏర్పడిన సాగు నీటి ప్రాజెక్టులకు లస్కర్ల అవసరం చాలా ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకొని ఏ రకమైన చర్యలు తీసుకొని లస్కర్ పోస్టులను భర్తీ చేస్తారో తెలుపవలసిందిగా కోరుతున్నాను. అలాగే విజయనగరం జిల్లాలో లస్కర్లు. . . .

(మైక్ కట్ చేయబడింది)

MR.SPEAKER: Yes, Sivarama Raju garu.

శ్రీ వి.వి.శివరామరాజు(ఉండి): అధ్యక్షా, మా పశ్చిమ గోదావరి జిల్లాలో లస్కర్ల కొరత చాలా ఎక్కువగా ఉంది. 306 పోస్టులకు గాను కేవలం 106 మాత్రమే లస్కర్లు ఉన్నారు. ఇంకా సుమారు 200 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మా 'ఉండి' నియోజకవర్గంలో కాలువల విస్తీర్ణం చాలా ఎక్కువ. వ్యవసాయాధారిత భూమి సుమారు 240 కిలోమీటర్లు, మురుగు కాలువలు 400 కిలోమీటర్లు ఉన్నాయి. వరదలు వచ్చినపుడు, కాలువ చివరి భూములకు నీళ్ళ కొరత ఉన్నప్పుడు రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లస్కర్ పోస్టులను భర్తీ చేసి రైతుల సమస్యలను తీర్చవలసిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ కె.అప్పల నాయుడు(గజపతి నగరం): అధ్యక్షా, మా నియోజకవర్గంలో గోస్తని, చంపావతి రెండు నదులున్నాయి. గోస్తననదిపై తాటిపూడి రిజర్వాయర్ ఉంది. ఈ రిజర్వాయర్ ఎడమ కాలువ నుంచి నీటిని సేద్యానికి ఇస్తున్నారు. అలాగే చంపావతి నదిపై ఎంఎస్ చానల్ ఆంధ్ర రిజర్వాయర్ ఉంది. ఎడమ కాలువ నుంచి ఎంఎస్, బీవి చానల్, థర్టీన్‌షేప్ చానల్స్ ఉన్నాయి. వీటి నిర్వాహణకు లస్కర్లు లేకపోవడం వలన, నీటి పంపిణీ చేసేటప్పుడు, కరకట్లకు భద్రత ఇచ్చేటప్పుడు గ్రామల మధ్య తగాదాలు అవుతున్నాయి. వెంటనే లస్కర్లను నియమించాల్సిందిగా, ఏదైన కార్యనిర్వాహణ జాప్యం ఉంటే ఔట్‌సోర్సింగ్ ద్వారా గాని లస్కర్లను నియమించాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ దేవినేని ఉమమహేశ్వరరావు(మైలవరం): అధ్యక్షా, నీటి నిర్వాహణలో లస్కర్ బాధ్యతలు చాలా కీలకమైనవి. సాగునీటి నిర్వహణ, గ్రీజింగ్, బోల్టింగ్, గేట్లు సరిగా నిర్వహించడం, ప్రధాన రెగ్యులేటర్లను నిర్వహించడం, కాలువ గండ్లను పూడ్చడం, గండ్లను సరిగా నిర్వహించడం, వాటిన కాపాడడం, చిన్న చిన్న చెట్లు ఉంటే తొలగించడం, ప్రధాన కాలువ, అనుబంధ కాలువలలో తూడు తొలగించడం, మురుగును తొలగించడం, నీటి పారుదలకు అడ్డంకులు తొలగించడం, గట్లు నిర్వహించడం ఇలా చాలా బాధ్యతలు లస్కర్లపై ఉన్నాయి. ఈ కేడర్ సామర్థ్యం శాశ్వత ప్రాతిపదికన లేనందున వారిని నియమించడానికి ఇబ్బందులు వస్తున్నాయి. వాటిని ప్రభుత్వం పరిశీలిస్తుంది. గోదావరి డెల్టాలో దాదాపు 652 మంది, కృష్ణా డెల్టాలో 566 మంది లస్కర్లు పనిచేస్తున్నారు. గత ప్రశ్నోత్తరాల సమయంలో ప్రజాప్రతినిధులకు ఇచ్చిన హామీ ప్రకారం గోదావరి డెల్టా శాసనసభ్యులతో ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేస్తున్నాం. నిపుణుల కమిటీని కూడా వేశాం. ఈ నెల పద్నాల్గవ తేదీన గోదావరి డెల్టా, గుంటూరు శాసనసభ్యులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు

చేసి, ఏయే కాలువపై లస్కర్ల అవసరం ఉందో, గతంలో గోదావరి, కృష్ణా ఆధునీకరణలో జరిగిన అవకతవకల్ని సరిదిద్ది, ప్రజాప్రతినిధులు అడుతున్నారో, ఏ పనులైతే రాబోయే రబీ సీజన్లో చేసుకోగలమో, ఇప్పుడు ఏ పనులు జరుగుతున్నాయి, ఏ పనులకు ప్రాధాన్యతను ఇవ్వాలో సమావేశంలో నిపుణుల కమిటి, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో చర్చించి ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిర్ణయం తీసుకుంటుంది.

**ప్రశ్న నెం.285(129)**

**సర్వశ్రీ వి.జోగేశ్వరరావు, ఎమ్మెల్యే ,**

**గౌరవనీయులైన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా ;**

అ) యుఐడిఎస్ఎస్ఎంటి పథకం క్రింద వరదనీటి మురుగుకాలవ నిర్మాణం కోసం రూ.23.82 కోట్ల మొత్తాన్ని మంజూరు చేయడమయిందన్న విషయం, తూర్పుగోదావరి జిల్లా మండపేట మునిసిపాలిటీ టెండర్లులను ఆమోదించిందన్న విషయం వాస్తవమేనా ;

ఆ) మధ్యలోనే పనులను నిలిపివేసిన విషయం కూడా వాస్తవమేనా;

ఇ) అయితే, అట్టి పనులను ఎప్పటిలోగా ప్రారంభించడమువుతుంది?

**పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ (శ్రీ పి.నారాయణ) :**

అ) అవునండీ

ఆ) అవునండీ

ఇ) ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలిస్తున్నది

శ్రీ వి. జోగేశ్వరరావు (మండపేట): అధ్యక్షా, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖను మంత్రి గారు తీసుకున్నప్పటి నుంచి చాలా చక్కగా పని చేస్తూ, అన్ని మున్సిపాలిటీలను బాగా పనిచేయించడానికి, వాటిని ఒక త్రాటిపై తీసుకురావడానికి శాయశక్తుల కృషి చేస్తున్నందుకు వారికి ధన్యవాదాలు. యు.ఐ.డి., ఎస్.ఎస్.ఎమ్.టి పథకాన్ని 2009వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ఎన్నికలకు రెండు నెలల ముందు శంకుస్థాపన చేస్తే నేను చాలా సంతోషించాను. ఎన్నికలలు అయ్యాయని, పనులు ఇంకా మొదలు పెట్టలేదని

అడిగితే ఆ ప్రాజెక్టు మంజూరు కాలేదని అన్నారు. మేమంతా మోసపోయామని తెలిసింది. 2005వ సంవత్సరంలో మున్సిపల్ ఎన్నికలు రావడానికి రెండు, మూడు నెలల ముందు మండపేట కాలువపై బ్రిడ్జీని శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు అది కూడా పూర్తి కాలేదు. శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారిచే శంకుస్థాపన చేయబడి మండపేట ప్రజలు మోసపోయినందున ఈ ప్రభుత్వంలోనైనా ఈ పథకాల్ని పూర్తి చేయించాలని మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను. మంత్రి గారి సమాధానంలో పరిశీలిస్తామన్నారు. మరలా మా నియోజకవర్గం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆ పనులను త్వరగా మొదలుపెట్టమని, ఎప్పటివరకు పూర్తి చేస్తారో తెలియచేయాల్సిందిగా కోరుతున్నాను.

శ్రీ పి.నారాయణ(మునిసిపల్‌శాఖ మంత్రి)ః అధ్యక్షా, Urban Infrastructure Development Scheme for Small and Medical Towns, Mandapet. This is a Central Government Project. ఈ స్కీం క్రింద 38.84 కిలోమీటర్లలో పొడవులో మురుగు కాలువలను నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకుండానే 17-01-2008వ తేదీన పరిపాలనా సంబంధమైన ఆమోదం ఇచ్చి, 25-08-2008వ తేదీన టెండర్లు మంజూరు చేసి, 23-10-2008న తేదీన టెండర్‌ను ఆమోదించి, 23-10-2008న తేదీన ఆర్‌వి కాకినాడ వారితో 18 నెలలలో పూర్తి చేయాలని ఒప్పందాలు చేసుకొని, పని ప్రారంభించి 16-03-2012వ తేదీన రూ.43 లక్షలతో బిల్ పెట్టి 16-04-2012వ తేదీన రూ.43 లక్షలతో బిల్లు మంజూరుకు ప్రతిపాదనలు పెట్టారు. కాంట్రాక్టర్ నిధుల మంజూరుకు బిల్లులు పెడితే అవి మంజూరు కాలేదు. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదు. రాష్ట్రంలోనున్న ఇటువంటి 16 ప్రాజెక్టులను రూ.696 కోట్లతో చేశారు. దానికి కేంద్ర ప్రభుత్వం త్రోసిపుచ్చింది. అప్పుడు దానిని రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని రూ.150 కోట్లు మంజూరు చేస్తామని, మిగిలిన పనిని హడ్కోతో చేయమని, కాంట్రాక్టర్లు కొంత భాగమే పూర్తిచేసి వదలేసి వెళ్ళిపోయారు. మిగిలిన పనిని ఎమ్మెల్యే గారు మా ప్రభుత్వంలోనైనా పూర్తి చేయమన్నారు. ప్రభుత్వం తరఫున పరిశీలించి, ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించి మంజూరయ్యే విధంగా చేసి త్వరగా పూర్తి అయ్యేటట్లు చేస్తాం.

**ప్రశ్న నెం.41(సి) (130)ః**
**సర్వశ్రీ పెన్మత్స విష్ణు కుమార్ రాజు, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన వెనుకబడిన తరగతుల సంక్షేమం, అబ్కారీ, మద్య నిషేధం శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;**

అ) విశాఖపట్టణం ఉత్తరంలోని నైవాసిక ప్రాంతంలో ఏమైనా వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, ఉన్నాయా ;

ఆ) ఆ దుకాణాలు ప్రభుత్వం నిర్ధష్టపరచిన సమయపాలనను పాటిస్తున్నాయా ;

ఇ) ఆ ప్రాంతంలోని ప్రజలు / నివాసితులు వైన్ షాపులు, బార్, రెస్టారెంటుల ఎదుట సమస్యలను ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనా ;

ఈ) రెస్టారెంటు కోసం కూడా స్థలం కలిగి ఉన్న వైన్ షాపుల నుండి ప్రభుత్వం 2 లక్షల రుసుమును వసూలు చేస్తున్న విషయం కూడా వాస్తవమేనా ;

ఉ) వైజాగ్‌లోని వైన్ షాపులకు ఎదురుగా శాంతిభద్రతలను నియంత్రించడానికి ప్రభుత్వం తీసుకోదలచిన చర్యలేమిటి?

**సంక్షేమం, అబ్కారీ, మద్య నిషేధం శాఖ (శ్రీ కొల్లు రవీంద్ర) :**

అ) లేదండీ, విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో 7, ఎ4 దుకాణాలు, 8, 2బి బార్లు వాణిజ్య ప్రాంతాలలో మాత్రమే ఉన్నాయి.

ఆ) అవునండీ, ఎ4 దుకాణాలు మరియు 2బి బార్లకు శాఖ సమయాలను అమలుచేస్తున్నది. ఉల్లంఘనలు జరిగాయని దృష్టికి వచ్చినప్పుడు కేసులను నమోదు చేయడం జరుగుతున్నది. ప్రస్తుత సంవత్సరంలో విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో నిర్ణీత సమయాలను ఉల్లంఘించినందుకు ఎ4 దుకాణంపై ఒక కేసును మరియు 2బి బార్‌పై ఒక కేసును నమోదు చేయడమయింది.

ఇ) లేదండీ

ఈ) లేదండీ, అయితే 2012, ఆంధ్రప్రదేశ్ ఆబ్కారీ దుకాణ నియమావళిలోని 25(2) నియమం ప్రకారం, 5000 మంది మించి జనాభా ఉన్న ప్రాంతాలలో ఎ4 దుకాణం లెసెన్స్‌దారు ఎ4(బి) ఫారంలో ఒక పర్మిట్ రూమ్ లైసెన్స్‌ను తీసుకోవాలి.

ఉ) ఎ4 దుకాణాలు, 2బి బార్లు నిర్దిష్ట సమయాలు పాటించే విధంగా చేయడానికి మరియు విడి మద్యం అమ్మకాలను నిరోధించడానికి శాఖ కఠినమైన చర్యలను తీసుకుంటున్నది. అవసరం ఏర్పడినపుడు, శాంతి భద్రతలను నియంత్రించడానికి పోలీసు శాఖ చర్యలు తీసుకుంటున్నది.

...

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు(విశాఖపట్నం నార్త్) ః అధ్యక్షా, సభకు నమస్కారం. మంత్రి గారిచ్చిన సమాధానాలు చూస్తే అన్నీ సత్యదూరంగా వున్నాయి. ఆ వర్డ్ అనకుంటే నేను వీళ్లతో కలిసిపోయాననుకుంటారు. వాస్తవానికి దగ్గరగా లేవు. కారణమేమంటే విశాఖపట్నంలో ప్రత్యేకించి మా నార్త్ నియోజకవర్గంలో అన్ని వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు బార్లు అంటే మంచి హోటళ్లలో వుండే బార్లుకాదు. రోడ్‌సైడ్ బార్ అండ్ రెస్టారెంట్లు అన్నమాట. ముఖ్యంగా మా కాలనీ ఎంట్రెన్స్‌లోనే ఒక వైన్ షాపుంటుంది. అది శుభ్రంగా ఉదయం నుంచి రాత్రి వరకు బారుగా కూడా రన్ అవుతుంటుంది. వైన్ షాపుకి, బార్ అండ్ రెస్టారెంటుకి తేడా లేదు. టెక్నికల్‌గా మాత్రం తేడా వుంటుంది. కాని అక్కడ ప్రాక్టికల్‌గా అట్లా జరగడం లేదు. పబ్లిక్ ఇన్‌కన్వీయన్స్ లేదని చెప్పడం హాస్యాస్పదం. చాలా ఇన్‌కన్వీనియంట్‌గా వుంది. ఎందుకంటే ప్రతి వైన్‌షాపుకీ పర్మిట్‌రూమ్ అని ఇస్తున్నారు. ఆ పర్మిట్‌రూమ్స్‌లో టాయిలెట్స్ వుండవు. అందువల్ల బయటనే యూరినేషన్ చేస్తుంటారు. పైగా పబ్లిక్‌గా తాగేస్తుంటారు. చాలా ఘోరగా వుంటుంది. గుడి ఎదురుగానే పర్మిషన్ ఇస్తున్నారు. ఏమని అడిగితే ఎండోమెంటు శాఖలో ఆ గుడి రిజిస్టర్ కానందున ఇచ్చామంటున్నారు. ఇది నేను ఎవరెనరినో బ్లేమ్ చెయ్యాలన్న ఉద్దేశంతో చెప్పడం లేదు. పాలసీలో మాత్రం దీనికి సంబంధించిన చేంజెస్ తీసుకురావలసిన అవసరమున్నది. స్కూల్స్ ఎదురుగుండా కూడా ఇస్తున్నారు. ఏమనంటే అవి రిజిస్టర్డ్ స్కూల్స్ కాదంటున్నారు. ఆసుపత్రుల ఎదురుగా కూడా ఇస్తున్నారు. 30 పడకల ఆసుపత్రులైతేనే వంద మీటర్ల పరిధిలో ఇవ్వకూడదని నిబంధనలున్నాయంటున్నారు. ఇలాంటివి జరగకుండా పాలసీలో మార్పులు తీసుకురావలసిన అవసరముంది. అలాంటి వాటికి ఎదురుగా వుండడం వల్ల ముఖ్యంగా ఫ్యామిలీస్ అలాంటి చోట్లకు వెళ్లలేని పరిస్థితులున్నాయి.

లా అండ్ ఆర్డర్ కూడా చాలా బాగా చేస్తున్నామంటున్నారు. అది మాత్రం వాస్తవం కాదు. నేను గనుక నియోజకవర్గంలో వుంటే రాత్రి పదకొండున్నర గంటల వరకు రోజూ తిరగడమే నా పని. ఎందుకంటే వాళ్లు క్లోజ్ చేస్తున్నారా లేదా అని చూస్తాను. అందుకే మొన్న మిమ్మల్ని బల్బు అడిగాము. రీజన్ ఇది అధ్యక్షా. మీరు కావాలంటే ఎంక్వయిరీ చేయండి. ఎందుకంటే నేను సభకు అబద్దాలు చెప్పలేను. కాబట్టి లా అండ్ ఆర్డర్ విషయంలో అన్ని డిపార్టుమెంట్లు స్ట్రిక్ట్‌గా వుండకపోతే చాలా ప్రాబ్లమ్ వస్తాయి. ఒక ఎగ్జాంపుల్ చెబుతున్నాను. మొన్న జూలై 12వ తారీఖున 34వవార్డు అభ్యర్థి పిడపర్తి అప్పల నాయుడు అని తెలుగు దేశం పార్టీ వార్డ్ ప్రెసిడెంటును బ్రూటల్‌గా మర్డర్ చేశారు. అది యాక్చ్యువల్‌గా నా కాన్‌స్టిట్యుయన్సీలోని వార్డే. అది కాంట్రాక్ట్ కిల్లింగ్. ముడున్నర లక్షల డీల్. మర్డర్ చేసిన వాళ్లు దొరికారు. డబ్బులిచ్చేయడం కొట్టేయడం..... అదీ లా అండ్ ఆర్డర్. చంపినవాడు దొరికాడు. డబ్బిచ్చినవాడు దొరికాడు. కాని డబ్బిచ్చిన వాడుమాత్రం ఒక పార్టీ నాయకునికి రిలేటివ్. కాని ఆయన పేరు మాత్రం బైటికి రాలేదు. అదీ మా నియోజకవర్గంలో వున్న లా అండ్ ఆర్డర్ పరిస్థితి.

అధ్యక్షా, దానిపై న్యాయం జరగాలంటే సీబీఐ ఎంక్వయిరీ చేయిస్తేనే కాని చనిపోయిన వ్యక్తికి న్యాయం జరగదు. మేము మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేది దానిపై సీబీఐ ఎంక్వయిరీని వేయండి. న్యాయాన్ని కాపాడండి. ఇది చాలా ఇంపార్టెంట్ అధ్యక్షా.....

మిస్టర్ స్పీకర్ః   ప్లీజ్ కన్‌క్లూడ్......

శ్రీ పి. విష్ణుకుమార్ రాజు(విశాఖపట్నం నార్త్)ః అధ్యక్షా, 12వ తారీఖున మర్డర్ అయిన వ్యక్తి 10వ తారీఖున నా దగ్గరకొచ్చారు. వచ్చి ఒక వ్యక్తి పేరు చెప్పి అతని మూలాన మీకు చాలా ఇబ్బందుందని నాతో చెప్పాడు. నాకు ఇబ్బందేమిటయ్యా, నీ సంగతి చూసుకో ముందు అని చెప్పేశాను. ఇది జరిగిన రెండోరోజునే అతన్ని చంపేశారు. కనుక తప్పనసరిగా దానిపై ప్రభుత్వం సీబీఐ ఎంక్వయిరీ చేయించి న్యాయం చేయాలని కోరుతున్నాను.

శ్రీ జి.వి.ఆంజనేయులు(ఉంగుటూరు)ః అధ్యక్షా, గ్రామానికి మూడు నాలుగు బెల్టు షాపులు పెట్టి కాకా హోటళ్లలో, కిళ్లీ బంకుల్లో కూడా మందు దొరికే పరిస్థితి గత ఐదు సంవత్సరాల కాలంలో చూశాము. ఎమ్ఆర్‌పి కూడా ఒక్కో బాటిల్‌కు రు. 30 నుంచి రు.60 దాకా అదనంగా వసూలు చేసిన పరిస్థితిని మనం ఎన్నో సందర్భాలలో చూశాము. గతంలో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. బెల్ట్ షాపులను కంట్రోల్ చేయమన్నాము. ప్రభుత్వం అదుపు చేయలేకపోయింది. ఎమఆర్‌పి కంట్రోల్ చేయమన్నా చేయలేకపోయింది. కాని, ఈ ప్రభుత్వం వచ్చాక బెల్ట్ షాపులను, ఎమ్ఆర్‌పిని కంట్రోల్ చేసినందుకు మీ ద్వారా మంత్రి గారికి అభినందనలు తెలియజేస్తున్నాను. కాని ఇంకా కొన్ని చోట్ల ఎమ్ఆర్‌పి కంటే ఎక్కువకు అమ్ముతున్నారు. దానికి కారణాలేమంటే గత ప్రభుత్వంలో లాగానే బెల్టు షాపులు పెట్టుకోవచ్చు, బ్రహ్మాండంగా దోచుకోవచ్చునన్న ఉద్దేశంతో ఆక్షన్‌లో ఎక్కువధరలకు పాడి షాపులను తీసుకున్నారు. టౌన్లలో రు. 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు షాపులను తీసుకున్నారు. దాని వలన అద్దెలు గిట్టుబాటు కావడానికి బెల్టు షాపుల ద్వారా అమ్మడానికి, ఎక్కువ ఎమ్ఆర్‌పికి అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కావున మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేదేమంటే ఎక్కువ ధరలకు తీసుకున్నచోట్ల అవసరమైతే మార్జిన్ ఐదు శాతం వరకు పెంచైనా సరే బెల్టు షాపులు నడవకుండాను, ఎమ్ఆర్‌పి కంటే ఎక్కువకు అమ్మకుండా చూడాలని, తద్వారా రాష్ట్రం మొత్తం బాగుండేలా చూడాలని నేను కోరుతున్నాను.

అట్లాగే ఇంకొక విషయం మీ ద్వారా చెప్పాలనుకుంటున్నాను. తమిళనాడులో మాదిరిగానే పేద వారికి ఉపాధి లభించే విధంగా ప్రభుత్వమే వారి ద్వారా షాపులను నడిపించినట్లయితే వాళ్లకు ఉపాధి దొరుకుతుంది తద్వారా బెల్టు షాపుల బారినుండి ప్రజలను తప్పించే అవకాశముంటుందని మీద్వారా మనవి చేస్తున్నాను.

శ్రీ కొల్లు రవీంద్ర(మచిలీపట్నం): అధ్యక్షా, గౌరవ సభ్యులు విష్ణుకుమార్ రాజు గారు చాలా ఆవేదనతో చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాను. అక్కడ ఏదైనా పబ్లిక్ ఇన్‌కన్వీనియన్స్ జరిగితే తప్పకుండా దృష్టి పెడతాము. పర్మిట్ రూములలో బాత్‌రూములు, టాయిలెట్స్ వంటివి వుండేలా చర్యలు తీసుకుంటాము. టెంపుల్స్, స్కూల్స్, హాస్పిటల్స్ వంటి ప్రాంతాలలో నిబంధనలకు విరుద్ధంగా వంద మీటర్ల పరిధిలో వున్నట్లయితే కచ్చితంగా వాటిపై చర్యలు తీసుకుంటాము. అయితే వచ్చే సంవత్సరంలో నూతన పాలసీ తీసుకువచ్చే ఆలోచన వుంది కాబట్టి ఆ సమయంలో వారు చెప్పిన విషయాలన్నిటిపై తప్పకుండా దృష్టిపెట్టడం జరుగుతుంది. అలాగే అప్పలనాయుడుగారి గురించి చెప్పారు. అది చాలా బాధాకరం. దానిని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అలాగే ఆంజనేయులు గారు చెప్పినట్లుగా బెల్ట్ షాపుల విధానం అనేది ఈ రాష్ట్రానికి ఒక మాయని మచ్చ లాంటిది. 2004లో అధికారంలోకి వచ్చిన ఆనాటి ప్రభుత్వం ప్రభుత్వాదాయాన్ని పెంచుకోవాలన్న ఉద్దేశంతో 2006లో ఆక్షన్ విధానాన్ని పెట్టారు. దాని ఫలితంగా 80 శాతం నుంచి 120 శాతం వరకు వెళ్లిపోవడం జరిగింది. దాని వల్ల ఒక్క దాచేపల్లిలోనే ఒక షాపు ఐదు కోట్ల రూపాయల వరకు వెళ్లిపోయింది. అందువల్ల వాళ్లు దానిని రాబట్టుకోవడానికి గాను ఎమ్ఆర్‌పీలను మించి అమ్మడం వల్ల ఈ పరిస్థితి వచ్చింది. ముఖ్యమంత్రి గారి పాదయాత్రల సందర్భంగా గ్రామాలలో మహిళలు శాంతిభద్రతలు లోపించాయని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆయన దృష్టికి తీసుకురావడం, ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే 8వ తారీఖున మూడవ సంతకంగా బెల్టు షాపుల రద్దు మీద పెట్టడం జరిగింది. బెల్టుషాపుల మీద 2,500 కేసులు పెట్టడం జరిగింది. 2,400 మందిని అరెస్ట్ చేయడం కూడా జరిగింది. బెల్టు షాపులను పూర్తి స్థాయిలో కంట్రోల్ చేస్తామని మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

## స్వల్ప వ్యవధి ప్రశ్నలు

**స్వల్ప వ్యవధి ప్రశ్న నెం.8 (130-A)**

**శ్రీవాసుపల్లి గణేష్ కుమార్,ఎమ్ఎల్ఎ.,**

**గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు దయచేసి ఈ క్రింద సమాచారం తెలియజేస్తారా:**

అ. పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి విశాఖపట్నం జిల్లా, అరకులోని ప్రాంతాన్ని డీనోటిఫై చేయడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉన్నదా?

ఆ. అయితే, ఆ వివరాలేమిటి?

**ముఖ్యమంత్రి గారి తరపున యువజనాభ్యుదయం, పర్యాటక మరియు సాంస్కృతిక(టి) శాఖ మంత్రి( శ్రీ కె.అచ్చెన్నాయుడు):**

అ. లేదండీ.

ఆ. ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఇ. విశాఖపట్నం నుండి అరకుకు ప్రయాణం కోసం కిరండోల్ ఎక్స్‌ప్రెస్‌కు రెండు ట్రాన్స్‌వ్యూ రైల్ బోగీల(గ్లాస్ బోగీలు)ను సమకూర్చడానికి ప్రతిపాదించడమయింది. లంబసింగి హిల్ రిసార్ట్ అభివృద్ధి కోసం ఒక ప్రాజెక్టు నివేదికను రూపొందించడమయింది. ప్రాజెక్టును సాధ్యాసాధ్యతలకు లోబడి చేపట్టడమవుతుంది.

SRI VASUPALLI GANESH KUMAR (VISAKHAPATNAM SOUTH): Present status of the Araku Valley; notified as categorisation of Criminal under Criminal Tribals Act. దీనివలన అభివృద్ధి కుంటుపడుతుందని చెప్పాలి. ఎందుకంటే ఊటీ ప్రాంతాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం డీ-నోటిఫై చేసింది కావున అరకు ప్రాంతాన్ని కూడా డీ-నోటిఫై చేసేందుకు ఆలోచించాలని కోరుతున్నాను. లంబసింగి ప్రాంతం దక్షిణ భారతదేశంలోనే కాశ్మీరు లాంటి ప్రదేశం, మంచి చల్లని వాతావరణమున్న ప్రదేశం. ఆ ప్రాంతాన్ని కొర్రబయలు అంటారు. కొర్ర అంటే కర్ర, బయలు అంటే బయట ప్రాంతం. రాత్రి సమయంలో బయట ఉంటే కర్రలాగా బిగుసుకుపోతారని అర్థం. ఆ ప్రాంతంలో సగటు ఉష్ణోగ్రత 10 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఊటీలో సగటు ఉష్ణోగ్రత 14 డిగ్రీలు ఉంటే కొర్రబైలులో కేవలం 10 డిగ్రీలు మాత్రమే ఉంటుంది. ఆ ప్రాంతం సముద్రమట్టానికి 1000 మీటర్ల ఎత్తులో ఉంది. అక్కడ మంచు కూడా కురుస్తుంది. అక్కడ కనీసం ఒక్క టీ దుకాణం కూడా లేదు, కనీస వసతులు కూడా లేవు. అక్కడ టూరిజం అభివృద్ధి చేస్తే మంచి ప్రాంతం అవుతుంది, అభివృద్ధి చెందుతుంది. అక్కడ ఉదయం పది గంటలకు కానీ సూర్యుడు కనిపించడు. శీతాకాలంలో అయితే మధ్యాహ్నం 12.00 గంటలకు సూర్యుడు కనబడినా మధ్యాహ్నం మూడు గంటలకే చీకటి పడుతుంది. కాబట్టి ఆ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలి.

అరకు ప్రాంతాన్ని ఆంధ్రాఊటీ అంటారు. అరకులో జోస్ థామస్ అనే అతను కొన్ని సంవత్సరాం క్రితం పది వేలకు పైగా పైన్ మొక్కలను నాటి వాటికి ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు నీరు పోసేవాడు. అతని విధానాన్ని చూసి ఆ ప్రాంత ప్రజలు అతనిని మ్యాడ్ థామస్ అని పిలిచేవారు. ఆయన పెంచిన 10వేల పైన్ చెట్లు ముప్పై సంవత్సరాలు బాగా ఏపుగా పెరగగా ఇపుడు ఆంధ్రాఊటీగా తయారైనది. అరకు భగవంతుడు సృష్టించినది. బొటానికల్ గార్డెన్స్, బొర్రా గుహలు ఆ ప్రాంతంలో ఉన్నాయి. ఇండియానా జోన్స్ అనే సినిమా అక్కడ గుహలలోనే తీశారు. అక్కడ సినిమాలు తీయడానికి గుహలు, గార్డెన్స్ ఉన్నాయి. లంబసింగి ప్రాంతంలో మౌంటెన్ రైల్వేను అద్దాల బోగీలతో తయారుచేస్తే ఆ రైలులో ప్రయాణిస్తూ ఆహ్లాదకరమైన దృశ్యాలను పర్యాటకులు వీక్షించవచ్చు కాబట్టి అటువంటి రైళ్లను ఏర్పాటుచేయాలని కోరుతున్నాను. లంబసింగిని ఊటీలాగా పర్యాటక ప్రాంతం, వేసవి విడిది కేంద్రంగా తయారుచేయాలని కోరుతున్నాను. హ్యాండ్‌గ్లైడింగ్, గోల్ఫ్ కోర్టులు ఏర్పాటుచేసినచో టూరిజం అభివృద్ధి చెందుతుంది.

అరకులో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించినచో లండన్‌లోని ఓవల్ స్టేడియం వద్ద ఉన్న ఉష్ణోగ్రత అక్కడ కూడా ఉంది. అదే విధంగా ఫైవ్‌స్టార్ హోటళ్లు నిర్మించినచో టూరిజం పెరుగుతుంది. క్రీడల కోసం విశాఖపట్నం జిల్లాలో 300 ఎకరాలు కేటాయించాలని ముఖ్యమంత్రిగారు అన్నారు కాబట్టి దానిని అరకులో ఏర్పాటుచేస్తే that will be ideal place కాబట్టి బాగా ఉపయోగపడుతుంది. అక్కడ ఉండే సిమ్రగురి ప్రాంతం సముద్రమట్టానికి 936 మీటర్ల ఎత్తులో భారతదేశంలోనే అత్యంత ఎత్తులో ఉండే రైల్వే స్టేషన్ ఉంది కాబట్టి అక్కడ ఉన్న సరస్సులు, జలపాతాలను అనుసంధానం చేసి టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరుగుతారు, ఆదాయం కూడా పెరుగుతుంది. అలాగే జాతీయ పార్కులు, డీర్ పార్క్‌లు, పక్షుల సంరక్షక కేంద్రాలు అరకులో ఏర్పాటుచేస్తే బాగుంటుంది. ఊటీ పర్యాటక కేంద్రంగా అందుకే ప్రసిద్ధి గాంచినది. ఊటీ నుంచి రోజా పూలు ప్రతి రోజూ 20,000 వరకు ఎగుమతి చేస్తుంటారు, తద్వారా అక్కడ 2300 మందికి ఉపాధి దొరుకుతుంది. అలాంటి రోజ్ ప్లాంటేషన్ అరకులో ఏర్పాటుచేయాలి.

ఊటీలో సెయింట్ స్టీఫెన్స్ చర్చ్ ఉన్నట్లుగా అరకులో సగటున 15 నుంచి 20 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నందున తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మిస్తే ఆహ్లాదంతోబాటు దేవాలయ పర్యాటకం కూడా పెరుగుతుంది. ఊటీలో పేరుగాంచిన విద్యాసంస్థలున్నాయి. ధనవంతులు చాలా మంది తమ పిల్లలను అక్కడ చదివిస్తుంటారు. అటువంటి మంచి ప్రదేశంలో improvement for all fields is available because such a quite and pleasant atmosphere is there. అక్కడ చాలా ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి ఆ ప్రాంతంలో తమ పిల్లలు చదువుకొని he can reach the pinacle of glory కావున అరకులో కూడా మంచి విద్యాసంస్థలు స్థాపించాలని కోరుతున్నాను. ఊటీలో ఫిల్మ్

ఇండస్ట్రీ ఉన్నట్లుగా అరకులో కూడా ఫిల్మ్ ఇండస్ట్రీని ప్రోత్సహించాలని, అభివృద్ధి చేయాలని కోరుతున్నాను. అరకు ప్రాంతంలో సినిమాలు నిర్మిస్తున్నారు కానీ సరైన ప్లాట్‌ఫారం ఏర్పాటుచేసినచో టూరిజం కూడా అభివృద్ధి చెందుతుందని మీ ద్వారా గౌరవమంత్రి గారికి తెలియజేస్తున్నాను.

శ్రీ కె.అచ్చెన్నాయుడు(టెక్కలి)ః అధ్యక్షా, అరకు ప్రాంతాన్ని డీనోటిఫై చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి ప్రభుత్వానికి ఆలోచన లేదని చెప్పాను. నిన్న గౌరవ ముఖ్యమంత్రి గారు విశాఖపట్నాన్ని ఒక మెగా సిటీగా తయారుచేయాలని, రాష్ట్ర విభజన తర్వాత సినిమా ఇండస్ట్రీని విశాఖపట్నానికి తరలిస్తామని చెప్పారు. విశాఖపట్నం జిల్లాలోని అరకు ప్రాంతం ఆంధ్రా ఊటీగా గుర్తింపు ఉంది. ఇప్పటికే సంవత్సరానికి 5 లక్షల మంది పర్యాటకులు దేశ, విదేశాల నుంచి వస్తున్నారు. దానిని ఇంకా మనం అభివృద్ధి చేయాల్సిన అవసరముంది. ఇప్పటికే టూరిజం అభివృద్ధి సంస్థ 120 గదులతో అరకులో, అనంతగిరిలో, తైడలో వసతి సౌకర్యం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికే ప్రైవేట్ రంగంలో హోటల్స్ వస్తే బాగుంటుందనే ఆలోచనతో వాటిని కూడా ఏర్పాటుచేయడానికి ప్రభుత్వం పరిశీలిస్తుంది. అరకు, మారేడుమిల్లి, లంబసింగిలలో మైనస్ డిగ్రీలు నమోదవుతుంది. కానీ లంబసింగి అటవీప్రాంతం కాబట్టి మనం అక్కడ వసతి సౌకర్యం కల్పించడానికి కొంత ఇబ్బంది ఉంది. కాబట్టి అటవీశాఖను కూడా ఇన్‌వాల్వ్ చేసి ఆరు కోట్ల రూపాయలతో అక్కడ వసతి ఏర్పాటుచేయడానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతిపాదనలు పంపించాం. ఆంధ్రప్రదేశ్‌లో భవిష్యత్తులో విశాఖపట్నాన్ని మెగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసినచో పర్యాటకులు కూడా ఎక్కువగా వస్తారు కాబట్టి టూరిస్టులను ఆకర్షించడానికి బొర్రా గుహలు, లంబసింగితోబాటు తూర్పు గోదావరి జిల్లాలో మారేడుమిల్లిలను టూరిజం కారిడార్‌గా తయారుచేసి పర్యాటకులను ఆకర్షించడానికి తగిన చర్యలు చేపడుతున్నాం.

అరకు ప్రాంతం గిరిజన ప్రాంతంలో ఇటీవల అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని విశాఖపట్నంలో జరుపుకొన్నప్పుడు గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా దేశంలో ఎక్కడా లేని విధంగా అన్ని రకాల టూరిజం పెంచే విధంగా అరకులో అధునాతన సౌకర్యాలతో గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటుచేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. విశాఖపట్నం కేంద్రంగా ఈ ప్రాంతాలన్నింటినీ టూరిజం కారిడార్‌గా తయారుచేసి ప్రపంచంలోనే విశాఖపట్నం జిల్లాకు, అరకు ప్రాంతానికి గుర్తింపు వచ్చే విధంగా టూరిజం హబ్‌గా తయారుచేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేసి అన్ని చర్యలు తీసుకుంటుందని గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను.

...

**స్వల్ప వ్యవధి ప్రశ్న నం.53 (130-B)**

**శ్రీ ఎస్.వి.మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే**

**గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారాః-**

అ) కర్నూలు సమీపంలో తుంగభద్ర నదిపై రూ.69కోట్ల అంచనా వ్యయంతో చెక్‌డ్యాం-కం-బ్రిడ్జిని మంజూరు చేసిన విషయం వాస్తవమేనా?

ఆ) హైదరాబాదులోని ఐడియల్ సర్వే అంచనా వ్యయాన్ని రూ.190కోట్లకు పెంచిన విషయం కూడా వాస్తవమేనా?

ఇ) తుమ్మల ఎత్తిపోతల పథకం ద్వారా 0.20 టీఎంసీల నీటిని తెలంగాణ ప్రాంతానికి మళ్లించిన విషయం వాస్తవమేనా?

**సాగునీరు, ఆయకట్టు ప్రాంత అభివృద్ధి జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు) ః**

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) అవునండీ.

(ఈ సందర్భంలో వైఎస్‌ఆర్‌సీపీ సభ్యులు శ్రీ కె.సర్వేశ్వరరావు మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

MR.SPEAKER: Now Short Notice Question No.53. Minister for Irrigation.

**స్వల్ప వ్యవధి ప్రశ్న నెం.53 (130-బి) శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి, ఎం.ఎల్.ఏ.,**

**గౌరవనీయులైన సాగునీటి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా;**

అ) కర్నూలు సమీపంలో తుంగభద్ర నదిపై రూ.69 కోట్ల అంచనా వ్యయంతో చెక్‌డ్యాం-కం-బ్రిడ్జిని మంజూరు చేసిన విషయ వాస్తవమేనా ;

ఆ) హైదరాబాద్‌లోని ఐడియల్ సర్వే అంచనా వ్యయాన్ని రూ.190 కోట్లకు పెంచిన విషయం కూడా వాస్తవమేనా ;

ఇ) తుమ్మల ఎత్తిపోతల పథకం ద్వారా 0.20 టిఎంసిల నీటిని తెలంగాణా ప్రాంతానికి మళ్లించిన విషయం వాస్తవమేనా?

**సాగునీటి శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

అ) అవునండీ.

ఆ) అవునండీ.

ఇ) కాదండీ.

మిస్టర్ స్పీకర్: మోహన్ రెడ్డి గారూ మాట్లాడండి.

(ఈ సందర్భంలో శ్రీ కె.సర్వేశ్వరరావు మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని కోరుతుండగా మరి కొంత మంది వైఎస్ఆర్‌సీపీ సభ్యులు ఆయనకు మద్దతుగా నిలబడి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

MR.SPEAKER: Please be seated. You are not a signatory. Mohan Reddy garu....

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి(కర్నూలు): అధ్యక్షా,

శ్రీ సర్వేశ్వరరావు (అరకు వ్యాలీ) (మైకు లేకుండా): అధ్యక్షా, రెండు నిమిషాల్లో ముగిస్తాను.

(ఈ సందర్భంలో శ్రీ కె.సర్వేశ్వరరావుతో బాటు కొంత మంది సభ్యులు వెల్‌లోకి వచ్చారు – సభకు అంతరాయం)

మిస్టర్ స్పీకర్: మోహన్ రెడ్డి గారూ.... మీ ప్రశ్న అడుగుతారా, లేదా?

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి (కర్నూలు): అధ్యక్షా, సభ ఆర్డర్‌లో లేదు.

MR.SPEAKER: Mr.Mohan Reddy please put your question. Otherwise I will be considered as deemed to have been answered. Please be seated.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి(కర్నూలు)ః సప్లిమెంటరీ క్వశ్చన్ ఉంది సార్.

శ్రీ కె.సర్వేశ్వరరావు(మైకు లేకుండా) ః అధ్యక్షా, ఒక్క నిముషం మాట్లాడతాను.

MR.SPEAKER: No. Mohan Reddy garu please put your question.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి(కర్నూలు)ః అధ్యక్షా, సభ ఆర్డర్‌లో లేదు.

(ఈ సందర్భంలో శ్రీ కె.సర్వేశ్వరరావు మరి కొంత మంది సభ్యులు పోడియం వద్దకు వెళ్లారు – కొంత మంది సభ్యులు వెల్‌లో ఉన్నారు)

MR.SPEAKER: Please go back to your seats. Sarveswara Rao garu, you are not the signatory. Why are you demanding from the Chair? You cannot dictate terms to the House. Now, let us take up the Demands for Grants.

(ఈ సందర్భంలో శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి పోడియం వద్దకు వెళ్లి సప్లిమెంటరీ క్వశ్చన్ అడగటానికి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

Now, Papers to be laid on the Table of the House.

## PAPERS LAID ON THE TABLE OF THE HOUSE

A copy of the 38th Annual Report of the Andhra Pradesh Forest Development Corporation Limited for the year 2012-2013, as required under Section 619/A of the Companies Act, 1956.

## Moving of the Demands

**MR. SPEAKER: Now, we will move the Demands for Grants.**

**SRI YANAMALA RAMAKRISHNUDU (MINISTER FOR FINANCE AND PLANNING, COMMERCIAL TAX AND LEGISLATIVE AFFAIRS): With your permission, I beg to move that:**

**"That the Government be granted a sum not exceeding Rs. 65,08,51,000/- under Demand No. I (1) - State Legislature."**

**"That the Government be granted a sum not exceeding Rs. 14153,98,51,000/- under Demand No. IX(9) - Fiscal Administration, Planning, Surveys and Statistics."**

**SRI YANAMALA RAMAKRISHNUDU, MINISTER FOR FINANCE AND PLANNING, COMMERCIAL TAX AND LEGISLATIVE AFFAIRS, (On behalf of the Chief Minister) Sir, with your permission, I beg to move:**

**"That the Government be granted a sum not exceeding Rs. 13,51,15,000/- under Demand No. II (2) - Governor and Council of Ministers."**

**"That the Government be granted a sum not exceeding Rs. 598,38,62,000/- under Demand No. III (3) - Administration of Justice."**

**"That the Government be granted a sum not exceeding Rs. 571,22,15,000/- under Demand No. IV (4) - General Administration and Elections."**

**SRI YANAMALA RAMAKRISHNUDU, MINISTER FOR FINANCE & PLANNING, COMMERCIAL TAX AND LEGISLATIVE AFFAIRS, (On behalf of the Minister for Information and Public Relations) Sir, with your permission, I beg to move:**

**"That the Government be granted a sum not exceeding Rs. 154,05,74,000/- under Demand No. XIX (19) - Information and Public Relations."**

**MR. SPEAKER: Demands Moved.**

(పోడియం వద్ద వైఎస్ఆర్‌సీపీ సభ్యులచే సభకు అంతరాయం)

శ్రీ కె.సర్వేశ్వరరావు(అరకువ్యాలీ): (మైకులేకుండా) సార్, సభలో చర్చ చేయమంటారా, వద్దా?

మిస్టర్ స్పీకర్: మీకే బాధ్యత లేదు. మీరు సంతకం కూడా పెట్టలేదు. ఎస్ఎన్క్యూలో సింగిల్ సప్లిమెంటరీ అని మీకు తెలుసు. సంతకం పెట్టే బాధ్యత కూడా మీకు లేదు. ఎవరు అన్యాయం చేస్తున్నారు? మీరు అర్థం చేసుకోండి. దయచేసి కూర్చోండి. You put your question again. మీరు దయచేసి సహకరించాలి.

(ఈ సందర్భంలో పోడియం వద్ద మిగతా సభ్యులు కూడా శ్రీ కె.సర్వేశ్వరరావుకి అవకాశం ఇవ్వమని కోరసాగారు)

Your Member has not signed in the questionaire. దయచేసి కూర్చోండి. Demands are moved. Let the business be transacted as per the agenda. Please go back to your seats.

(INTERRUPTIONS)

MR.SPEAKER: I request the Leader of the Opposition to call back your Members.

(Repeated Interrruptions)

Please withdraw from the Well.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి(కర్నూలు)ః (పోడియం నుంచి) సార్, సప్లిమెంటరీ ప్రశ్న ఉంది సార్.

MR.SPEAKER: Mohan Reddy garu, you lost your opportunity. What can I do? దయచేసి కూర్చోండి. డిమాండ్స్‌లో అవకాశం వస్తుంది మాట్లాడండి. సర్వేశ్వరరావు గారూ డిమాండ్స్‌లో సమయమిస్తాను మాట్లాడండి. దయచేసి కూర్చోండి. You are not the signatory. You are wasting the time of the House. Please sit down.

(అంతరాయం)

ఇప్పుడే డిమాండ్స్ మీద చర్చ ఉంది. మీరు ఆ సమయంలో మాట్లాడవచ్చు.

శ్రీ కె.సర్వేశ్వరరావుః అధ్యక్షా, నా నియోజక వర్గంలోని టూరిజమ్ గురించి చెబుతాను.

మిస్టర్ స్పీకర్ః డిమాండ్స్‌లో టూరిజమ్ మీద మాట్లాడవచ్చు.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డిః సార్, మంత్రి గారి నుంచి సమాధానం రాలేదు.

మిస్టర్ స్పీకర్ః మంత్రి గారి నుంచి సమాధానం వచ్చింది. మోహన్ రెడ్డి గారూ మీకు డిమాండ్స్ మీద మాట్లాడే అవకాశం వస్తుంది, అప్పుడు మాట్లాడండి. No discussion here. Please go back to your seat.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డిః సార్, డిమాండ్స్‌లో సమాధానం రాదు.

మిస్టర్ స్పీకర్ః సమాధానం వస్తుంది. Minister will answer your questions. Please go back to your seats.

(పోడియం వద్ద శ్రీ కె.సర్వేశ్వరరావు మాట్లాడటానికి అవకాశం ఇవ్వమని గట్టిగా కోరసాగారు)

MR.SPEAKER: Sarveswara Rao garu, this is not the way to behave. Follow the Rules and Procedures. Please go back. You are not the signatory. You don't have the right. Please go back to your seats.

(Interruptions continued)

The House stands adjourned for ten minutes.

**(The House then adjourned at 10.59 AM for ten minutes)**

* * *

**(The House Re-assembled at 11-25 a.m. with the Hon'ble Speaker in the Chair)**

**MR.SPEAKER: In view of the business to be transacted, working lunch has been arranged today for the Members in the Members Lobby.**

MR.SPEAKER: Now, we will take up the Bills:

**Now, I would request the Minister for Finance and Legislative Affairs on behalf of Chief Minister to introduce the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014.**

శ్రీ యనమల రామకృష్ణుడు : అధ్యక్షా, ఈరోజు నాలుగు బిల్లులు ఉన్నాయి. ఎందుచేతంటే ఆల్‌రెడీ దీంట్లో ఆర్డినెన్సులను రీప్లేస్ చేస్తున్నాము. మనకు ఉన్న రూల్స్ ప్రకారం డిఫరెంట్ టైమ్స్‌లో ఇంట్రడక్షన్, కన్సిడరేషన్, పాసింగ్ ఉండాలి. అయితే ఈరోజు మనకు సమయం లేదు కాబట్టి, రేపు అప్రాప్రియేషన్ బిల్లు వస్తుంది కాబట్టి, అది కాన్స్టిట్యూషనల్ ఆబ్లిగేషన్ అయినందున, ఈరోజు నాలుగు బిల్లులను కూడా ఇంట్రడక్షన్, కన్సిడరేషన్, పాసింగ్‌కు తమరు అనుమతినివ్వాల్సిందిగా కోరుతున్నాను.

**MR. SPEAKER : Permission granted. you can move.**

Sri YANAMALA RAMAKRISHNUDU: Sir, with your permission, I beg to move :

"That leave may be granted to introduce the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014.

MR.SPEAKER: Motion moved. Now, the question is:

"That leave may be granted to introduce the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014.

(Pause)

Motion was adopted and the bill was Introduced.

Sri YANAMALA RAMAKRISHNUDU :Sir, with your permission, I beg to move :

“That the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014 be taken into consideration.”

MR.SPEAKER: Motion moved. Now, the Minister will explain the salient features of the amdnement proposed.

SRI YANAMALA RAMAKRISHNUDU GARU: Thank you Sir. There is one Official amendment proposed for this bill.

మంత్రులు, అధికారులు, విప్‌లు ఎవరైనా ప్రైవేటు అద్దె గృహంలో గానీ సొంత గృహంలో గానీ ఉండే వారికి ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న బిల్లు ప్రకారం సంవత్సరానికి రూ.50 వేలు చెల్లిస్తున్నది. తమరికి సభ్యులకు కూడా తెలుసు, ప్రస్తుతం రూ.50,000లకు మంత్రులు ఉండే భవనాలేవి రావడం లేదు. అందుచేత ఒక మంత్రి లేక విఐపి ఉండాలంటే చాలా ఎకామడేషన్ కావాలి. దానితోబాటు సెంట్రికి వీటన్నింటికీ ప్లేస్ కావాల్సి ఉంటుంది. ఇప్పుడున్న రేట్లు ప్రకారం ప్రస్తుతం ఉన్న రూ.50,000 సరిపోదని భావించి ఆ మొత్తాన్ని రూ.1,00,000 చేస్తూ అఫీషియల్ అమెండ్‌మెంట్ మూవ్ చేస్తున్నాం. శాసనసభకు సమర్పించిన దాంట్లో రూ.50,000 నుండి రూ.75,000 అని ఉంది, దానిని రూ.1,00,000 లుగా అఫీషియల్ అమెండ్‌మెంట్‌ని మూవ్ చేస్తున్నాము. అందుచేత ప్రస్తుతం ఉన్న రూ.50,000 ను రూ.1,00,000 గా యాక్సెప్ట్ చేయాల్సిందిగా కోరుతున్నాను. దానికి కాన్సీక్వెంట్‌గా వచ్చే అమెండ్‌మెంట్స్ అన్నీ కూడా అఫీషియల్ అమెండ్‌మెంట్ రూపంలో మూవ్ చేస్తున్నాము. అందుచేతి ఇది సింపుల్‌గా రూ.50,000 ను రూ.1,00,000 చేసే బిల్లు, దీనిని సభ యాక్సెప్ట్ చేయాల్సిందిగా కోరుతున్నాను.

**Moving Amendment on the Bill**

MR.SPEAKER: There is one Official Amendment to the Bill and it is before the House. Minister for Finance & Legislative Affairs to move the motion with regard to the amendment.

SRI YANAMALA RAMAKRISHNUDU (MINISTER FOR FINANCE & LEGISLATIVE AFFAIRS) (ON BEHALF OF THE CHIEF MINISTER): Sir, I beg to move:

"That in clause 2, clause 3 and clause 4, wherever Rs.50,000/- occurs, replace it with Rs.1 lakh."

MR.SPEAKER: Motion moved.

Now, discussion and Consideration of the Bill.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి(నెల్లూరు రూరల్): అధ్యక్షా, రాష్ట్రం చాలా మొత్తంలో లోటు బడ్జెట్‌లో ఉంది. రాష్ట్రం చాలా కష్టాల్లో ఉంది. నూతన రాజధాని నిర్మాణం కోసం చందాలివ్వండని ప్రభుత్వం తరచు చెప్పే మాటలు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలంటే లోటు బడ్జెట్ అడ్డంకిగా మారిందని కూడా ప్రభుత్వం తరచు చెప్పే మాట. ప్రభుత్వోద్యోగులు పి.ఆర్.సి. కోసం సంవత్సరం నుంచి ఎదురుచూస్తూ ఉన్నారు. (అధికారపక్షం నుంచి సభకు అభ్యంతరం) నేను ప్రభుత్వం పైన విమర్శలు చేయడం లేదు. వాస్తవాన్ని సభ దృష్టికి తీసుకవచ్చే ప్రయత్నం చేస్తున్నాను.

అధ్యక్షా, అంగన్‌వాడి టీచర్లు, కార్యకర్తలు జీతాలు పెంచమని చాలా రోజులుగా పోరాటాలు చేస్తున్నారు. రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉన్నప్పుడే లోటు బడ్జెట్‌ను కారణంగా చూపుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్నట్టుగా ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేస్తోంది. గౌరవ ముఖ్యమంత్రి గారు పదే పదే త్యాగాలకు సిద్ధంకండి, రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉంది, మనది కొత్త రాష్ట్రం అనే విధంగా రాష్ట్ర పరిస్థితులకనుగుణంగా పిలుపునిస్తున్న ఈ తరుణంలో మంత్రులుగా ఉన్నటువంటి ఆ స్థాయి వ్యక్తులు కనీసం త్యాగాలు కాదు కదా, కొంత పొదుపునకు సిద్ధమైతే బాగుంటుంది. ఈరోజున శాసనాలు మన చేతిలో ఉన్నాయని, శాసనాలు చేసే అధికారం మన చేతిలో ఉందని, మన జీతాలు పెంచుకోవడానికి ఈ విధంగా సభలో తీర్మానం ప్రవేశపెట్టడం ఎంతవరకు సబబు?

అధ్యక్షా, రాష్ట్ర ప్రజానీకానికి మనం ఈరోజున ఎటువంటి సంకేతాలిస్తున్నాం? దయచేసి తమరి ద్వారా ప్రభుత్వానికి నేను విన్నవిస్తున్నాను. మంత్రులందరూ బాగున్నారు. ఏమి ఇబ్బందులు లేవు. ప్రస్తుతం పొందుతున్న జీతభత్యాలకు మంచి సౌకర్యవంతమైన గృహాలే అద్దెకు హైదరాబాద్ నగరంలో లభించే అవకాశం ఉంది. ఇప్పుడు రాష్ట్రం ఉన్న ఇబ్బందుల్లో, పరిస్థితుల్లో, ప్రస్తుత ఆర్థిక లోటు బడ్జెట్‌లో మంత్రులకు ఇంత పెద్దయెత్తున జీతభత్యాలు పెంచడం సమంజసంకాదనే విషయాన్ని మీద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ(పిఠాపురం): అధ్యక్షా, అవకాశం కల్పించినందుకు నమస్కారాలు తెలియజేస్తున్నాను. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలుగానీ, ప్రభుత్వంలోని మంత్రులుగానీ గత ఎన్నికల్లో ఎక్కువ మొత్తంలో ఖర్చుపెట్టకుండా ఎన్నికైనారు. ఆర్థికంగా, సామాన్యమైన కుటుంబాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులే ప్రస్తుత సభలో, ప్రభుత్వంలో ఉన్నారు. ఇప్పుడున్న వాస్తవ పరిస్థితుల్లో మంత్రులకు తప్పనిసరిగా సౌకర్యవంతమైన క్వార్టర్స్ ఉండాల్సిన అవసరముంది. వ్యక్తిగత సిబ్బందికి కూడా గౌరవ మంత్రులు వసతి ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. వి.ఐ.పి.లు వచ్చినప్పుడు, సిబ్బంది విధులు నిర్వహించేందుకు, ప్రజానీకం మంత్రి గారిని కలవడానికి వచ్చినప్పుడు అందుకు తగిన వసతి సౌకర్యం తప్పనిసరిగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అన్ని సౌకర్యాలు కల్గిన క్వార్టర్స్ మంత్రులకు కనీసం లక్ష రూపాయలకైనా దొరకనటువంటి పరిస్థితి ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ఉంది. కాబట్టి, భత్యాలను పెంచడం భావ్యమేనని నేను భావిస్తున్నాను. కనీస వసతి సౌకర్యాలతో సరిపడ క్వార్టర్స్ మంత్రులకు సమకూర్చవల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని నేను భావిస్తున్నాను.

శ్రీ వాసుపల్లి గణేశ్ కుమార్ (విశాఖపట్నం సౌత్): అధ్యక్షా, జీతభత్యాలు పది వేల రూపాయలా, పదహేను వేల రూపాయలా లేక యాభై వేల రూపాయలా అనేది ప్రధానం కాదు. కానీ భద్రత కావాలి. సెక్యూరిటీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదైనా జరిగితే, it will demoralize the system. భద్రతను ఇంటి యజమాని ఇవ్వలేడు. సిస్టమ్ డిమోరలైజ్ కాకుండా ఉండేందుకే ప్రజాప్రతినిధుల జీతభత్యాలు పెంచాల్సినటువంటి ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం గౌరవ ఆర్థిక మరియు శాసనసభా వ్యవహారాల శాఖామాత్యులు సభలో ఈరోజున ప్రవేశపెట్టిన బిల్లు ప్రాధాన్యతను సంతరించుకున్న బిల్లుగా నేను భావిస్తూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి(నెల్లూరు రూరల్): అధ్యక్షా, నేను తమరి ద్వారా స్పష్టంగా ప్రభుత్వానికి తెలియజేసేదేమిటంటే, దయచేసి ప్రతిపక్షం చేసే సూచనను విమర్శగా తీసుకోవద్దు. ఇదొక సలహాగా తీసుకోమని తెలియజేస్తున్నాను. కారణమేమిటంటే, ఈ 2014-2019వ శాసనసభలో ప్రతిపక్షం ఏ విషయం మాట్లాడినా దాన్ని విమర్శగా తీసుకోవడం ప్రభుత్వానికి అలవాటైపోయింది. దయచేసి గౌరవ సభ్యులకు, గౌరవ మంత్రులకు, ప్రభుత్వానికి తమరిద్వారా మనవిచేస్తున్నాను. నా మాటలను విమర్శగా తీసుకోవద్దు. ఈరోజున రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో ప్రస్తుత తీర్మానం ఎంతవరకు సబబు? గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. నూతనంగా ఏర్పడబోయే రాజధాని నగరంలో సచివాలయం ఏర్పాటు చేయడం ఆలస్యమైతే, అవసరమైతే చెట్టు క్రిందే సచివాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటుచేస్తానని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పడం జరిగింది. మేం దాన్ని ఆహ్వానిస్తున్నాం, స్వాగతిస్తున్నాం. గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పిన మాట చాలా మంచి మాట వాస్తవం కూడా. రాష్ట్రం గతంలో ఎప్పుడు లేనంతగా

అనేక ఇబ్బందుల్లో ఉంది. ఈ ఇబ్బందుల్లో గౌరవ ముఖ్యమంత్రిగా, మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా మనమే త్యాగాలకు సిద్ధపడకుంటే, ఇబ్బందులను అధిగమించడం ఎప్పటికి సాధ్యం కూడా కాదు. త్యాగం కూడా కాదిది, చాలా చిన్న పొదుపు మాత్రమే. ప్రజలను త్యాగాలకు సిద్ధపడమని మనం ఏమని పిలుపునిస్తాం? శాసనాలు చేసుకునే అధికారం మనకుందని మన ఇష్టారీతిన శాసనాలు చేసుకోవడం సమంజసం కాదని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

శ్రీ కె.ఎస్.జవహర్(కొవ్వూరు): అధ్యక్షా, నోటితో మాట్లాడితే నొసటితో వెక్కిరిస్తున్నట్టుగా ప్రతిపక్షపార్టీ పరిస్థితి ఉంది. ప్రతిపక్షం ఏమి మాట్లాడినా దాన్ని విమర్శనాత్మకంగానే తప్ప, సూచనలు చేసే పరిస్థితిలో ప్రస్తుత ప్రతిపక్షపార్టీ లేదు. మంత్రులకు తప్పనిసరిగా భద్రత కల్పించాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. భద్రత కల్పించడమనేది ఒక సిస్టమ్. సకల సౌకర్యాలతో వసతిని గౌరవ మంత్రులకు ఏర్పాటుచేయాలంటే ఆ మాత్రం మొత్తం ఖర్చు అవుతుంది. కాబట్టి ప్రభుత్వ తీర్మానాన్ని కన్సిడర్ చేయవల్సిందిగా కోరుకుంటున్నాను.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా చిన్న మనవి.

మిస్టర్ స్పీకర్: మాట్లాడండి శ్రీధర్ రెడ్డి గారు.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి: అధ్యక్షా, చిన్న మనవి చేయదలిచాను. మీ ద్వారా ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నాను. రాష్ట్ర విభజనానంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంత్రుల వసతి గృహాలు ఎన్ని ఉన్నాయి? అదే విధంగా ఎమ్మెల్యేలకు ఎన్ని వసతి గృహాలు కేటాయించారు. సౌకర్యంగా ఉన్న ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉండకుండా బయట అద్దె ఇంటికి వెళ్తామంటే, మనం చేయగల్గిందేమి లేదు. అసలు ఎన్ని ప్రభుత్వ క్వార్టర్సు అందుబాటులో ఉన్నాయి? ఆ వివరాలను తెలియజేయాలని నేను కోరుతున్నాను.

శ్రీ యనమల రామకృష్ణుడు(ఆర్థిక మరియు శాశనసభ వ్యవహారాల శాఖ మంత్రి): అధ్యక్షా, ఈ ప్రొసీజర్ గత కొన్ని సంవత్సరాలుగా నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, ఎవరైనా సొంత ఇంటిలో నివాసం ఉండి, వసతి లేమి కారణంగా బయట అద్దెకు ఇంటిని తీసుకున్నా, ఆ ఇంటికి అద్దెను ప్రభుత్వమే చెల్లించాల్సిన బాధ్యత ఉంది. అదొక సిస్టమ్. ఆ సిస్టమ్‌లో భాగంగానే from time to time ఇంటి అద్దె భత్యం పెరుగుతూ ఉంటుంది. ఇంటి అద్దె పెంపునకు అనుగుణంగానే ప్రభుత్వం భత్యాన్ని చెల్లించాల్సి ఉంటుంది. గౌరవ సభ్యులు అనుకున్నట్టుగా మంత్రులు, ఎమ్మెల్యేలకు సంబంధించిన జీతాలకు సంబంధించిన బిల్లు ఇది కాదు. మంత్రులైనటువంటి వాళ్లకు ఒకవేళ నగరంలో సొంత ఇల్లు లేకపోయినట్లైతే, వాళ్లేదైనా అద్దె ఇంటిలో ఉండాల్సివస్తే, వాళ్లకు ప్రస్తుతమున్న యాభై వేల రూపాయల నుంచి ఒక లక్ష రూపాయల వరకు భత్యం పెంచేందుకు ఉద్దేశింపబడినది, ఆ పెంపు అవకాశం మాత్రమే ఈ బిల్లు కల్పిస్తుంది. అలాగే కేబినెట్ ర్యాంక్‌లో ఎవరున్నప్పటికి

కూడా వాళ్లందరికి ఈ పెంపు వర్తిస్తుంది. అందుచేత కేబినెట్ స్థాయి మంత్రులకు గానీ, ఆ ర్యాంకులో ఉన్నటువంటి వారికి గానీ, జడ్జిలకు గానీ, ఉన్నతాధికారులకు గానీ, ఎవరైనా సరే, వాళ్లకు సొంత ఇండ్లు ఉన్నప్పటికి ఈ పెంపు వర్తిస్తుంది. రాష్ట్ర విభజనానంతరం అందుబాటులో ఉన్నటువంటి మంత్రుల నివాస గృహాల్లో తక్కువగా క్వార్టర్స్ మన రాష్ట్రానికి కేటాయింపు జరిగింది. వచ్చిన క్వార్టర్స్ కూడా నివాసయోగ్యంగా లేవనే భావన కొంత మందిలో ఉంది. నివాసయోగ్యంగాలేని క్వార్టర్ల మరమ్మత్తు పనులను కూడా ప్రభుత్వం చేయిస్తోంది. ప్రస్తుత్తం ఉన్న మంత్రుల్లో చాలా మంది క్వార్టర్స్‌లోనే ఉంటున్నారు. ఈ పెంపు వర్తింపులో ఇద్దరు, ముగ్గురు మంత్రులకంటే ఎక్కువగా ఉండరు. ఏది ఏమైనప్పటికి, It is a small amount involving finance to the tune of Rs.2 crores. This may be sanctioned by the Assembly.

**VOTING ON AMENDMENTS PROPOSED TO CLAUSES-2,3 & 4**

MR.SPEAKER: Now, the question is:

"That in clause 2, clause 3 and clause 4, wherever Rs.50,000/- occurs, replace it with Rs.1 lakh."

(PAUSE)

The motion was adopted and the amendment was carried.

MR.SPEAKER: Now the question is:

"That clauses 2, 3 and 4, as amended do stand part of the Bill."

(PAUSE)

The motion was adopted and clauses 2, 3 and 4 as amended were added to the Bill.

**CLAUSE 1, ENACTING FORMULA AND LONG TITLE**

MR.SPEAKER: I shall now put the clauses to vote. There are no amendments to Clause 1, Enacting Formula and Long Title and they are before the House.

The question is:

"That Clause 1, Enacting Formula and Long Title do stand part of the Bill."

(PAUSE)

The Motion was adopted and Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.

**PASSING OF THE BILL**

MR.SPEAKER: I shall now request the Minister for Finance and Legislative Affairs to move the motion for passing the Bill.

SRI YANAMALA RAMAKRISHNUDU (MINISTER FOR FINANCE & LEGISLATIVE AFFAIRS) (ON BEHALF OF THE CHIEF MINISTER): Sir, I beg to move:

"That the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014 be passed."

MR.SPEAKER: Motion moved. The question is:

"That the Andhra Pradesh Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Bill, 2014 be passed."

(PAUSE)

The motion was adopted and the Bill was Passed.

...

**THE ANDHRA PRADESH CHARITABLE AND HINDU RELIGIOUS INSTITUTIONS AND ENDOWMENTS (AMENDMENT) BILL, 2014**

SRI K ATCHENNAIDU (MINISTER FOR LABOUR AND EMPLOYMENT) (ON BEHALF OF THE MINISTER FOR ENDOWMENTS): Sir, with your permission, I beg to move:

"That leave be granted to introduce the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014."

MR. SPEAKER: Motion moved. Now, the question is:

"That leave be granted to introduce the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014."

(PAUSE)

The Motion was adopted and the Bill was Introduced.

SRI K ATCHENNAIDU (MINISTER FOR LABOUR AND EMPLOYMENT) (ON BEHALF OF THE MINISTER FOR ENDOWMENTS): Sir, with your permission, I beg to move:

"That the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014 be taken into consideration."

."

MR. SPEAKER: Motion moved. Now, the question is:

"That the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014 be taken into consideration."

(PAUSE)

The Motion was adopted and the Bill was Considered.

MR.SPEAKER: I shall now put the clauses to vote.

There are no amendments to Clauses 2 to 5, Clause 1, Enacting Formula and Long Title and they are before the House.

The question is:

"That Clauses 2 to 5, Clause 1, Enacting Formula and Long Title do stand part of the Bill."

(PAUSE)

The Motion was adopted and Clauses 2 to 5, Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.

MR.SPEAKER: I shall now request the Minister for Labour & Employment to move the Motion for Passing the Bill.

SRI K ATCHENNAIDU (MINISTER FOR LABOUR AND EMPLOYMENT) (ON BEHALF OF THE MINISTER FOR ENDOWMENTS): Sir, I beg to move:

"That the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014 be passed."

MR.SPEAKER: Motion moved. The question is:

"That the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014 be passed."

(PAUSE)

The Motion was adopted and the Bill was Passed.

.

**MR.SPEAKER: We shall now take up the Andhra Pradesh (Agricultural Produce and Live Stock) Markets Bill, 2014.**

SRI PRATHIPATI PULLA RAO (MINISTER FOR AGRICULTURE AND MARKETING): Sir, with your permission I beg to move:

"That leave be granted to introduce the Andhra Pradesh (Agricultural Produce and Live Stock) Markets Bill, 2014.

MR.SPEAKER: Motion moved. The question is:

"That leave be granted to introduce the Andhra Pradesh (Agricultural Produce and Live Stock) Markets Bill, 2014.

(PAUSE)

The Motion was adopted and the Bill was introduced.

SRI PRATHIPATI PULLA RAO (MINISTER FOR AGRICULTURE AND MARKETING): Sir, I beg to move:

"That the Andhra Pradesh Charitable and Hindu Religious Institutions and Endowments (Amendment) Bill, 2014 be taken into consideration."

**MR. SPEAKER: Motion moved. Now discussion on the Bill.**

శ్రీ వై.విశ్వేశ్వరరెడ్డి (ఉరవకొండ): ప్రధానంగా గతంలో ఉన్న మార్కెటింగ్ కమిటీస్‌ను రద్దు చేయడానికి అవసరమైన బిల్లు ఇది. అందుకనే కాల పరిమితిని 3 సంవత్సరాల నుండి 2 సంవత్సరాలకు తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఇప్పుడున్నటువంటి వారిని తొలగించడానికే అని అర్థమవుతుంది. అయితే, దీంట్లో మార్కెట్ కమిటీ తిరిగి ఏర్పాటు చేయబడనంత వరకు సదరు మార్కెట్ కమిటీ అధికారములను నిర్వర్తించుటకు, నిత్యకృత్యమును నిర్వర్తించుటకు ఒక వ్యక్తిని లేదా వ్యక్తులను నియమించుటకు ప్రభుత్వం సమర్థత కలిగి ఉండును అని చెపుతుంది సార్. ఇది మాములుగా ఇన్‌ఛార్జ్‌గా ఆఫీసర్స్‌ను పెడుతుంటారు, ఇక్కడ వ్యక్తి లేదా

వ్యక్తులు అనేటువంటి పదాన్ని తొలగించి అక్కడ అధికారులు అని చెపితే సరిపోతుంది. లేకపోతే ఈ వ్యక్తి, లేదా వ్యక్తులు అనేటువంటి దాన్ని దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉంటుంది. అందుచేతనే ఇన్‌ఛార్జ్‌గా ఆఫీసర్స్‌ను పెడితే బాగుంటుందని నా సూచన సార్.

శ్రీ దేశాయి తిప్పారెడ్డి (మదనపల్లె): మార్కెట్ కమిటీ చైర్మన్లుగా 3 సంవత్సరాలు నుండి 2 సంవత్సరాలు చేయడం అంటే వారు ఆ పోస్ట్‌లోకి వెళ్లి అవగాహన తెచ్చుకోడానికి కొంచెం టైం పడుతుంది. వై.ఎస్. హయాములో ఎక్కువ మందికి రిహాబిలిటేషన్ ఇవ్వడానికి ఉద్దేశించింది తప్ప ఇంకొకటి కాదు. ఈ రిహాబిలిటేషన్ తెలుగు దేశం కార్యకర్తకు ఇచ్చే కార్యక్రమం కాకుండా ఏదన్నా మార్కెట్ కమిటీలను అభివృద్ధి చేస్తే బాగుంటుంది. మార్కెట్ కమిటీలు Infrastructure లేక చాలా నిర్లక్ష్యానికి గురౌతున్నాయి. మదనపల్లి మార్కెట్ కమిటీలో టమోటాలు లక్ష కిలోలు వస్తుంటాయి. minimum facilities అక్కడ లేవు. రైతులకు water, restrooms లేక పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఈ మార్కెట్ కమిటీలు వేసి ఛైర్మన్స్‌కు లేదా కార్యకర్తలకు రిహాబిలిటేషన్ ఇచ్చే దానికంటే, మార్కెట్ కమిటీల అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందని నా ఉద్దేశ్యం సార్.

మిస్టర్ స్పీకర్ : మినిస్టర్ గారు..

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): అధ్యక్షా, ఇది ప్రధానంగా 18 మంది సభ్యులు ఉన్నటువంటి దానిని 19 మంది సభ్యులకు పెంచడం జరుగుతుంది. ప్రధానంగా వ్యవసాయ ఉత్పత్తి దారులను 11 నుండి 12 మందికి పెంచడం దీనియొక్క ప్రధానమైన ఉద్దేశ్యం. రెండవది, 3 సంవత్సరాల కాల పరిమితిని 2 సంవత్సరాలకు తగ్గించడం జరుగుతుంది. ఎందుకంటే వాళ్ల 2 సంవత్సరాల performance చూసుకొని కావాలంటే extend చేసుకొనే అవకాశం ఉంటుంది. అదేవిధంగా గౌరవ సభ్యులు విశ్వేశ్వరరెడ్డి గారు చెప్పారు. అది Officers ను personal incharge గా నియమించడం జరుగుతుంది. అదేవిధంగా మదనపల్లి మార్కెట్ కమిటీ మీద కూడా దృష్టి పెట్టి తప్పనిసరిగా దానిని కూడా అభివృద్ధి చేయడం జరుగుతుంది. తప్పకుండా చర్యలు తీసుకొంటాం. ఆ విధంగా ఈ యొక్క amendments ను చేయడం జరిగింది.

మిస్టర్ స్పీకర్ : రామానాయుడు గారు.

శ్రీ ఎస్.రామానాయుడు (పాలకొల్లు) : ఈరోజు నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రాణం అయిన వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయాన్ని రక్షించుకోవాలని, రైతులను కాపాడుకోవాలనే ఉద్దేశ్యంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకున్న నిర్ణయాలు ఈ రాష్ట్రంలో రైతుల విశ్వాసాలను పెంచుతున్నాయి. ప్రత్యేకించి ఈ రోజు

బిల్లులో చూసినట్లైతే 18 నుండి 19 మందికి సభ్యులను పెంచడం ఏదైతే ఉందో అందులో కూడా సన్న, చిన్నకారు రైతులు ఎవరైతే ఉన్నారో వారిని 11 నుండి 12 మందికి పెంచడం ద్వారా ఏదైతే గ్రామాలలో కింద స్థాయిలో ఇబ్బందులు పడుతున్న, సమస్యలును అనుభవిస్తున్న సన్న, చిన్న కారు రైతులకు ఈ నిబంధన ద్వారా వారికి ప్రాతినిధ్యం పెరగడం అనేది చాలా సంతోషకరమని తెలియజేస్తున్నాను. అదే విధంగా ఏఎంసి. పాలక వర్గాలు ఏవైతే ఉన్నాయో వాటిని 3 సంవత్సరాల నుండి 2 సంవత్సరాలకు తగ్గించడం, ఏవైతే ఒక కాంపిటేటివ్ స్పిరిట్, ఔత్సాహిక వక్తులు ఎంతో మంది గ్రామాల్లో ఉన్నారు కాబట్టి వాళ్లయొక్క కాంపిటేటివ్ స్పిరిట్ పెరిగి వారి పనితీరును మెరుపరచుకునే అవకాశం దీని ద్వారా కలుగుతుంది.

మంత్రివర్యులు చెప్పినట్లు పదవీ కాలంలో బ్రహ్మాండంగా రైతులకు కనుక ఉపయోగ పడినట్లైతే, తప్పనిసరిగా వారు తిరిగి రెండవసారి ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది కాబట్టి ఈ బిల్లు రైతులకు ఆమోదయోగ్యంగా ఉందని తెలియజేస్తున్నాను. దురదృష్టవశాత్తు గత 10 సంవత్సరాలలో వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ద్వారా జరిగే పథకాలు ఏవైతే ఉన్నాయో అవన్నీ నిరూపయోగమయినటువంటి పరిస్థితి ఉండింది. గతంలో మనం చూశాం. రైతు బంధు పథకం చూసినట్లైతే అందులో ధాన్యం నిలువ చేసుకుంటే, దానిపై 75 శాతం వరకు రైతు రుణం పొందే అవకాశం ఈ రైతు బంధు పథకంలో ఉంది. కానీ మేము గత 10 సంవత్సరాలుగా మార్కెటింగ్ యార్డ్‌లో చూస్తే, ఒక 10 లక్షలు మాత్రమే ఏఎంసి.లో గ్రాంట్ ఇవ్వడం జరిగింది. 10 లక్షలు అంటే ప్రతి ఒక్క రైతుకు 3 లక్షలు రుణం ఇస్తారు. అంటే 10 లక్షల రుణం ముగ్గురు నలుగురు రైతులకు ఇచ్చే సరికి అయిపోతుంది. మిగిలిన రైతులు ఎవరైనా అప్లై చెయ్యాలంటే ఎవరికీ కూడా ఈ రైతుబంధు ఉపయోగపడని దుస్థితి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చూశాం.

...

అదేవిధంగా ఏఎంసి. లు నిర్వహించే రైతు బజార్లు చూసినట్లైతే, రైతు దగ్గర రేటు రూ.5 ఉంటే మార్కెట్‌లో రేటు రూ.30 ఉంటుంది. దానిని అనుసంధానం చేయాలి. ఇటు రైతుకు గిట్టుబాటు ధర రావాలి, అటు వినియోగదారుడు కూడా మోసపోకూడదనే ఉద్దేశంతో రైతుబజారులను ఏర్పాటు చేస్తే, ఆ రైతుబజారులమీద సరైన పర్యవేక్షణ లేక, ఎస్టేట్ ఆఫీసర్లును తీసేయడం వలన ఈ పథకం అస్తవ్యస్తమయ్యే పరిస్థితి వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబజార్లలో ఎస్టేట్ ఆఫీసర్లు ఉండేవాళ్లు. వాళ్లు రైతులకు, వినియోగదారులకు సమన్వయం చేసి రేట్లు నిర్ణయించేవారు. వాళ్లు రైతు బంధు, రైతు బజారులను సమన్వయం చేసేవాళ్లు. అంతేగాకుండా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతు బజారులలో రైతులకు విత్తనాలమీద సబ్సిడీ, ఐడెంటిటీ కార్డులను కూడా ఇచ్చేవాళ్లు. వీటన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వం గత 10 సంవత్సరాలల్లో నిష్ప్రయోజనంగా మార్చిన పరిస్థితిని మనం ఇప్పుడు చూస్తున్నాం.

అదేవిధంగా AMC నిర్వహించిన పశువైద్య శిబిరాలను, కేవలం సంవత్సరానికి 5 సార్లు మాత్రమే నిర్వహిస్తున్నాయి. ఒకసారికి 5 గ్రామాలకు మించి ఎక్కువ కవర్ కావు. ఒక్కో నియోజకవర్గంలో 60 నుంచి 70 గ్రామాలుంటాయి. కనుక మొత్తం గ్రామాలు కవరయ్యే విధంగా ఈ పశు వైద్య శిబిరాలు ఉండాలని తెలియజేస్తున్నాను.

అదేవిధంగా రైతాంగానికి సంబంధించి ప్రత్యేకించి లింక్ రోడ్సు గురించి ముఖ్యమైన విషయం అధ్యక్షా. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు AMC ద్వారా గ్రామాల్లో లింక్ రోడ్లుండేవి. చాలామంది రైతులకు ఈ రోడ్లు బాగా ఉపయోగపడేవి. ప్రతీ రైతు తన పొలంలో పండిన పంటను రెండు, మూడు కిలోమీటర్ల దూరం నుంచి ధాన్యాన్ని గ్రామంలోకి తెచ్చుకోవలసి ఉంటుంది. ఈరోడ్లన్నీ మట్టి రోడ్లు అవ్వడం వలన, గ్రామాల్లో రైతులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యేకించి ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఎక్కువగా పడటం వలన ధాన్యం తీసుకువచ్చే బండిగాని, ట్రాక్టరుగాని ఆ రోడ్లలో దిగబడిపోయి, ఆ ధాన్యాన్ని తెచ్చుకోవటానికి వీళ్లేని పరిస్థితి ఉంటుంది.

మిస్టర్ స్పీకర్ః దయచేసి పూర్తి చేయండి.

డా.ఎన్. రామానాయుడు (పాలకొల్లు)ః అధ్యక్షా, దయచేసి కొద్దిగా సమయం ఇవ్వండి. ఎందుకంటే గత పది సంవత్సరాల నుండి మేం అనుభవిస్తున్నాం. ఇవాళ శాసనసభలో మాట్లాడటానికి అవకాశం దొరికినందువలన ఆ సమస్యను మీ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ లింక్ రోడ్సు అనేవి రైతులకు చాలా అత్యవసరం అని తెలియజేస్తున్నాను.

అదేవిధంగా ప్యాడీ డ్రయ్యర్స్ ముఖ్యమైనటువంటివి. ఇవాళ ఖరీఫ్ సీజన్‌లో రైతు నష్టపోతుంటే... తడిసిపోయిన పంటలో 24 నుంచి 35 శాతం తేమ ఉంటుంది. ఎఫ్‌సిఐ ప్రకారం తేమ 17 శాతం మాత్రమే ఉండాలి. అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్‌లో ఐకెపి ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెట్టుకొంటున్నాం. వాళ్లు 24 నుంచి 35 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయరు. ప్యాడీ డ్రయ్యర్స్‌ను AMC లో పెట్టినట్లయితే, ఆ రైతు తెచ్చిన ధాన్యంలో తేమను 35 నుంచి 17 శాతానికి తీసుకురావడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర కూడా వస్తుంది. అదేవిధంగా AMC లో ప్యాడీ డ్రయ్యర్స్‌ను ఏర్పాటుచేయడం వల్ల టన్నుకు కొంత అమౌంట్‌ను రైతు దగ్గర్నుంచి వసూలు చేయడంవలన, AMC కి కూడా ఆదాయం వస్తుంది.

మిస్టర్ స్పీకర్ః దయచేసి పూర్తి చేయండి.

డా.ఎన్. రామానాయుడు (పాలకొల్లు)ః అధ్యక్షా, వరి నూర్పిడికి కూడా రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సామూహికంగా వరికి సంబంధించిన కళ్లాలను కూడా ఏర్పాటుచేయాలి. మనమంతా చూస్తున్నాం. రైతులకు వేరే ఆధారం లేకపోవటం వలన, రోడ్ల మీదే వరి నూర్పిడిని చేస్తున్నారు. తప్పనిసరిగా ఈ ప్రభుత్వం రైతులకు కావలసిన వసతులన్నిటినీ సమకూర్చాలని కోరుతున్నాను.

చివరిగా ఒక్క విషయం మీ దృష్టికి తేవాలనుకొంటున్నాను. ఇవాళ మనందరం కూడా ప్రతీ నెలా జీతభత్యాలను తీసుకొంటున్నాం. అదేవిధంగా కొంతమంది రోజువారి కూడా జీతభత్యాలను తీసుకొంటున్నారు. కానీ సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే జీతం తీసుకున్నవారు ఈ దేశంలో ఎవరైనా ఉన్నారూ అంటే అది ఒక్క వ్యవసాయదారుడే. అలా సంవత్సరానికి ఒక్కసారే జీతం తీసుకున్న ఆ వ్యవసాయదారుడు, ప్రభుత్వం వైఫల్యం వలన, ప్రకృతి శాపం వలన నష్టపోతే, ఆ కుటుంబం ఏవిధంగా ఆర్థికంగా చిన్నాభిన్నమౌతుందో మనకు తెలుసు. అలా చిన్నాభిన్నమైన కుటుంబాన్ని ఆదుకోవడానికి ఇవాళ రుణమాఫీని మన ప్రభుత్వం ప్రకటిస్తే, ప్రతిపక్షం దాన్ని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అని ఈ సందర్భంగా నేను అడుగుతున్నాను. (ప్రతిపక్ష సభ్యులచే అభ్యంతరం). (మైకు కట్ చేయబడింది).

మిస్టర్ స్పీకర్ః రామానాయుడుగారూ దయచేసి కూర్చోండి. రమణమూర్తి గారూ.

శ్రీ బి. రమణమూర్తి (నరసన్నపేట)ః అధ్యక్షా, ఇప్పుడు మార్కెటింగ్ కమిటీలకి ఛైర్మన్లను నియమించాలని అనుకొంటున్నాం. దయచేసి ఈ అమెండ్‌మెంట్‌లో రైతుల నుంచి తీసుకున్న సభ్యులనే ఛైర్మన్లుగా నియమించవలసిందిగా మీద్వారా ఈ సభకు, గౌరవ ముఖ్యమంత్రిగారికి, వ్యవసాయశాఖామంత్రిగారికి తెలియజేస్తున్నాను. బేరర్స్‌ని, వేరేవాళ్లని కాకుండా, రైతుని ఛైర్మన్‌గా నియమిస్తేనే, రైతుల కష్ట సుఖాలు తెలుస్తాయి. కాబట్టి, రైతునే ఛైర్మన్‌గా నియమించాలని సవరణ చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః త్రిమూర్తులు గారు.

శ్రీ తోట త్రిమూర్తులు (రామచంద్రాపురం)ః అధ్యక్షా, మార్కెట్ కమిటీలకు సంబంధించిన సవరణ బిల్లును గౌరవ మంత్రిగారు సమర్థవంతంగా పనిచేసే వ్యక్తులను, వ్యవసాయం మీద పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తులను, రైతుగా ఉన్న వ్యక్తులను వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లుగా వేద్దామన్న ఉద్దేశంతో ఈ బిల్లును సవరిస్తున్నామని చెప్పారు. చాలా సంతోషం. దీనితోపాటు వ్యవసాయ మార్కెట్ కమిటీలో సెస్‌ద్వారా వసూలుచేసిన డబ్బులుతో, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయదారుల కోసం ప్రస్తుతమున్న గుంతరోడ్లు, మట్టిరోడ్లను, గ్రావెల్ రోడ్లుగా మార్చాలని కోరుతున్నాను.

రైతుకు పొలం నుంచి రోడ్డు ట్రాన్‌పోర్టు లేని కారణంగా, ఒక బస్తాను పొలం నుంచి బయటికి తీసుకురావాలంటే ఆ రైతు రూ.50 నుంచి 75 వరకు నష్టపోయే పరిస్థితి ఉంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారి హయాంలో మార్కెట్ సెస్ నుంచి మార్కెట్ కమిటీలకు రోడ్లు వేశారు. మళ్లీ ఇవాళ ఆ కార్యక్రమాన్ని చేపట్టాలని కోరుతున్నాను.

ఇంకో విషయం ఏమంటే వ్యవసాయ మార్కెట్ కమిటీలో "రైతు బంధు'' పథకం ఉండేది. రైతుకు గిట్టుబాటు ధర వచ్చేంతవరకు, రైతు పండించిన పంటను తీసుకొచ్చి గొడౌన్లలో పెట్టినట్లయితే, ఆ గొడౌన్లలో రేటు వచ్చినప్పుడు అమ్ముకొనే విధంగా, మార్కెట్ విలువ మీద 75 శాతం "రైతు బంధు'' పథకం ద్వారా రైతుకు డబ్బు ఇస్తూ, మార్కెట్‌లో రేటు వచ్చినప్పుడు అమ్ముకొనే విధానం ఉండేది. ఈ పథకం ద్వారా తక్కువ వడ్డీకే ఇస్తారు. దీనిని తప్పనిసరిగా పరిగణలోకి తీసుకుని, ఆ కార్యక్రమాన్ని కూడా చేపట్టవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః రాజన్నదొర గారు.

శ్రీ పి. రాజన్నదొర (సాలూరు)ః అధ్యక్షా, ఇందాక మా గౌరవ సభ్యులు చెప్పినట్లు మార్కెట్ కమిటీలో పర్సనల్ ఇన్‌చార్జ్‌ను, 'అధికారి' అనే దానిమీద స్పష్టత ఇవ్వవలసిన అవసరం ఉంది. అలాగే, ఇప్పుడు మనం బిల్లులపైన మాట్లాడుతున్నాం. బిల్లులకు పరిమితమై మాట్లాడితే బాగుంటుంది. ప్రతీదానికి విమర్శలు గుప్పించటం ఎంతవరకు సమంజసం? రైతులకు రుణాలను ఎంత తొందరగా ఇస్తారని మేము డిమాండ్ చేసి అడుగుతున్నాం, రైతులు కూడా ఎదురుచూస్తున్నారు. ఇంటా, బయటా మేమే డిమాండ్ చేస్తున్నాం. దానికి కూడా మేం ఆపుతున్నామని అనటం ఏంటి అధ్యక్షా? మేం మొదటి నుంచీ కూడా రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయండి, రైతులందర్నీ ఆదుకోండి, మీరిచ్చిన మాటకు కట్టుబడండి అని కోరుతున్నామే తప్ప, రైతుల తరపున మేం ఎక్కడా వ్యతిరేకంగా మాట్లాడటం లేదు. రైతుల ప్రభుత్వం అని మీరే మీ మానిఫెస్టోలో చెప్పారు. పూర్తిగా రుణమాఫీ చేస్తామని అన్నారు. పూర్తిగా రుణాలను మాఫీ చేయండి. రైతులందరికీ ఇవ్వండి, తొందరగా ఇవ్వండని కోరుతున్నాం. ప్రతీదానికి ప్రతిపక్ష నాయకుల్ని ఆపాదించడం అన్యాయం. కాబట్టి సబ్జెక్ట్‌కి పరిమితం చేయండి.

మిస్టర్ స్పీకర్ః మినిష్టరు గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు డా. రామానాయుడుగారు మార్కెట్ యార్డుకు సంబంధించి, "రైతు బంధు'' పథకం, రైతు బజార్లు, పశు వైద్య శిబిరాలు, లింక్ రోడ్లు గురించి మీద్వారా సభ దృష్టికి తీసుకొచ్చారు. "రైతు బంధు''

పథకం ద్వారా రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని ఇవ్వటం జరుగుతుంది. ప్రస్తుతం 80 రైతు బజార్లు ఉన్నాయి. ఈ 80 రైతు బజార్లను కూడా ఇంకా ప్రమోట్ చేసి, రైతు బజారు యాక్టివిటీస్‌ని పెంచాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం కూడా జరిగింది.

అదేవిధంగా పశు వైద్య శిబిరాలను కూడా ఆర్గనైజ్ చేయమని సభ దృష్టికి తీసుకొచ్చారు. అదీ కూడా ఏవిధంగా ఆర్గనైజ్ చేయాలో తప్పకుండా పరిశీలిస్తాం. అదేవిధంగా లింక్ రోడ్ల గురించి గౌరవ సభ్యులు తోట త్రిమూర్తులుగారు, డా. రామానాయుడుగారు అడిగారు. మార్కెట్ కమిటీ నిధులు మరియు NAREGA నిధులు కలిపి లింక్‌రోడ్డును నిర్మాణం చేయడానికి, రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకొచ్చేందుకు రూటు సౌకర్యం కల్పించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. లింక్ రోడ్లను కూడా ఏర్పాటుచేయడం జరుగుతుంది.

ఆవిధంగా సభ్యులు రమణమూర్తిగారు, అదేవిధంగా పర్సనల్ ఇన్‌చార్జ్ గురించి రాజన్నదొర గారు చెప్పారు. కొద్ది కాలం మాత్రమే పర్సనల్ ఇన్‌చార్జ్‌లుంటారు. కమిటీలను కూడా త్వరలో నియమించటం జరుగుతుంది.

MR.SPEAKER: Now, the question is:

"That the Andhra Pradesh (Agricultural Produce and Live Stock ) Markets Bill, 2014 be taken into consideration."

(PAUSE)

The Motion was adopted and the Bill was Considered.

**CLAUSES 2 TO 4, CLAUSE 1, ENACTING FORMULA AND LONG TITLE**

MR. SPEAKER **:** There are no amendments to Clauses 2 to 4, Clause 1, Enacting Formula and Long Title and they are before the House.

MR.SPEAKER: Now, the question is:

"That Clauses 2 to 4, Clause1, Enacting Formula and Long Title do stand part of the Bill"

(Pause)

The Motion was adopted and Clauses 2 to 4, Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.

MR.SPEAKER: Now, I will requests the Minister to move the Bill for Passing.

SRI PRATHIPATI PULLA RAO (MINISTER FOR AGRICULTURE): Sir, I beg to move:

"That the Andhra Pradesh (Agricultural Produce and Live Stock) Markets Bill, 2014 be passed".

MR.SPEAKER: Motion moved. The question is:

"That the Andhra Pradesh (Agricultural Produce and Live Stock) Markets Bill, 2014 be passed".

(Pause)

The motion was adopted and the Bill was passed.

**THE ANDHRA PRADESH POLICE (REFORMS) BILL, 2014.**

SRI N. CHINNA RAJAPPA, DEPUTY CHIEF MINISTER & MINISTER FOR HOME (On behalf of Chief Minister) : Sir, I beg to move:

"That leave be granted to Introduce the Andhra Pradesh Police (Reforms) Bill, 2014

MR. SPEAKER: Motion moved. Now, the question is:

"That leave be granted to Introduce the Andhra Pradesh Police (Reforms) Bill, 2014

(Pause)

The motion was adopted and the Bill was introduced.

SRI N.CHINNA RAJAPPA, DEPUTY CHIEF MINISTER AND MINISTER FOR HOME (On behalf of Chief Minister) : Sir, I beg to move:

"That the Andhra Pradesh Police (Reforms) Bill, 2014 be taken into Consideration".

MR.SPEAKER: Motion moved: Now, discussion on the Consideration of the Bill.

మిస్టర్ స్పీకర్ః ఎస్.వి.మోహన్ రెడ్డి గారు.

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి (కర్నూలు)ః అధ్యక్షా, హోమ్‌మినిస్టర్‌గారు బిల్లులో చెప్పడం జరిగింది. ఈరోజు హోమ్‌గార్డ్స్‌కు రూ.9000/- ఇస్తున్నట్లుగా ఉంది. నెలకు రూ.9000/- అంటే, రోజుకు రూ.300/- వస్తుంది. గౌండా పనికి పోయేవాళ్ళకు కూడా రూ.500/-రోజుకు వస్తుంది. వాళ్ళు ఉదయం 10 గంటలకు పనికి పోయి, సాయంత్రం 4 గంటలకు ఇంటికి వెళ్తారు. కానీ, హోంగార్డులు ఉదయ 6 గంటలకు విధులకు హాజరై, రాత్రి 10 గంటల వరకూ కూడా పనిచేయవలసి వస్తోంది. కాబట్టి, హోంగార్డులకు కనీస వేతనం రూ.15000/- చేసేందుకు చర్యలు తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము.

అధ్యక్షా, పోలీస్ స్టేషన్స్‌లో అటెండరు సిస్టం లేదు. ఎవరైనా ప్రజా ప్రతినిధులు గానీ, మరెవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళితే, అక్కడి ఎస్.ఐ.లు, సి.ఐ.లు మర్యాదపూర్వకంగా టీ గానీ, కాఫీ గానీ తెప్పించాలంటే, కానిస్టేబుల్స్‌ను ఉపయోగించుకోవాల్సిన పరిస్థితి ఉంది. వాళ్ళు శాంతిభద్రతలు కాపాడే వాళ్ళు. సమాజంలో వాళ్ళకి గౌరవం ఉండాలి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వాళ్ళలో మంచివాళ్ళతోబాటు క్రిమినల్స్ కూడా ఉండొచ్చు. అటువంటి వాళ్ళ ముందర వీళ్ళే టీ, కాఫీలు తెచ్చి ఇస్తుంటే, సమాజంలో కానిస్టేబుల్స్‌కు ఎంతమాత్రం విలువ ఉంటుందో ఒక్కసారి ఆలోచించాలి. (కొందరు అధికారపక్ష సభ్యులచే సభకు అంతరాయం) ఉండండయ్యా, పోలీసుల గురించి మాట్లాడుతుంటే.... కనీసం ఒక్కో పోలీస్ స్టేషన్‌కు ఔట్‌సోర్సింగ్ బేసిస్‌పై ఒక అటెండరును ఇచ్చినట్లైతే, పోలీస్‌లకు ఇటువంటి సమస్య లేకుండా పోతుందని మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. ఈ అటెండరులకు ఇచ్చే నాలుగైదు వేల రూపాయలు, ప్రభుత్వానికి కూడా పెద్ద భారం కాబోదని మీదృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ఈరోజు గ్రామీణ ప్రాంతాల్లో, మండల హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. అక్కడ ఉన్నటువంటి కానిస్టేబుల్స్‌కు గానీ, ఎస్.ఐ.లకు గానీ,

(మైకు కట్ చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః మోహన్ రెడ్డి గారు, ఒక్క నిముషం ఆగండి. The Bill is on a particular issue. ఆ బిల్లు గురించి మాట్లాడండి. జనరల్ డిస్కషన్ అంటే డిమాండ్స్ మీద మాట్లాడవచ్చు. బిల్లుకు సంబంధించి, బిల్లులో ఉన్న ఐటమ్స్ గురించి డిమాండ్స్‌లో మాట్లాడవచ్చు.

(మైకు కనెక్ట్ చేయబడింది)

శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి (కర్నూలు)ః సర్, చిన్న సమస్యలు సార్ ఇవి. మీద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో, మండల హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ స్టేషన్‌లు ఉంటాయి, కాబట్టి పోలీస్ సిబ్బంది అందరికీ, మీద్వారా క్వార్టర్స్ కట్టించాలని మీద్వారా ప్రభుత్వానికి సూచిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రావణ్ కుమార్ గారు.

శ్రీ టి. శ్రావణ్ కుమార్ (తాడికొండ)ః అధ్యక్షా, పోలీసు సంస్కరణలకు సంబంధించిన ఈ బిల్లును ప్రవేశపెట్టడం జరిగింది. 1861లో పోలీస్ చట్టం వచ్చింది. 1996లో పోలీసు శాఖలో సంస్కరణలు చేయవలసిందిగా, Prakash Sing Vs Union of India, ఒక WP వేయడం జరిగింది. దానిలో సుప్రీం కోర్టు ఇచ్చిన డైరెక్షన్ మేరకు ఈ బిల్లును పెడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, మన దేశంలో ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు మారి అనేక మార్పులు వచ్చినా కూడా, ఈ సంస్కరణలు మాత్రం రాలేదనే ఏకైక ఉద్దేశంతో సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కొన్ని డైరెక్షన్స్ ఇచ్చింది. భారత రాజ్యాంగంలోని అధికరణ 142లో మరియు 32లో ఆ అధికారం ఉందని చెప్పింది. అంతేకాకుండా అధికరణ 144 ప్రకారం సుప్రీం కోర్టు ఆదేశాలను అమలుపరచాలి అని చెప్పడంజరిగింది. ముఖ్యంగా ఈ బిల్లులో డి.జి.పి. మరియు ఇతర పోలీసు అధికారుల పదవీ కాలం గురించి చెప్పడం జరిగింది. దీనిలో డి.జి.పి. పదవికి కావలసిన అర్హత గురించి, విషయాల గురించి చర్చించారు. దీర్ఘకాలిక సర్వీసు ఉండాలనీ, ఉత్తమమైన రికార్డు ఉండాలనీ, అత్యధిక అనుభవ ప్రాతిపదిక మీద, పోలీస్ డైరెక్టర్ పదవిని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా ఎంపిక కాబడిన పోలీసు జాబితా యొక్క ఐదుగురు అత్యంత సీనియర్ అధికారుల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయాలని ఉంది. అందుకై ఇలా ఎంపికకు అర్హత కలిగిన వారిపై ఏరకమైన కేసులు గానీ, క్రమశిక్షణా చర్యలు తీసుకున్న సందర్భాలు లేకుండా ఉండాలని చెప్పారు. 20వ తేదీ, జూలై మాసము 2014న శాసనసభ సమావేశములో లేనందువలన ఈ విషయమై ఒక ఆర్డినెన్స్‌ను ఇచ్చారు. దాని స్థానంలో ఈబిల్లును ఆమోదించుకొనుట కొరకు ఈరోజు ప్రవేశపెట్టారు. అంతేకాకుండా అత్యంత సీనియర్ అయిన ఐదుగురు అధికారులకు బదులుగా,

ముగ్గురు అధికారులలో ఒకరిని నియామకం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది, కావున ఈ బిల్లును ప్రవేశపెడుతున్నారు. గౌరవ సభ్యులు దీన్ని పాస్ చేయవలసిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: రాజేంద్రనాథ్ రెడ్డి గారు.

శ్రీ బి.రాజేంద్రనాథ్‌రెడ్డి (డోన్): అధ్యక్షా, ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం 'fixing the minimum tenure of the DGP., కానీ, సెలక్షన్ అండ్ మినిమమ్ టెన్యూర్‌లో 3 మెంబర్స్ నుండి 5 మెంబర్స్‌ను సెలక్షన్ చేసుకునే దానిలో, దేర్ ఈజ్ ఎ ఛేంజ్, అధ్యక్షా. One of the directions given by the Hon'ble Supreme Court is "selection of minimum tenure of DGP to be complied by the State Government". గౌరవ మంత్రిగారు దీన్ని క్లారిఫై చేయాలి.

మిస్టర్ స్పీకర్: రాజన్నదొర గారు.

శ్రీ పి. రాజన్నదొర (సాలూరు): అధ్యక్షా, క్లారిఫికేషన్ అడిగే ముందుగా తమరి ద్వారా గౌరవ హోమ్ మినిస్టర్ గారికి చిన్న రిక్వెస్ట్ చేస్తున్నాను. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చినప్పుడు, రసీదు ఇవ్వడం ఆనవాయితీ. ఈ మధ్యనే మా గౌరవ శాసనసభ్యుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళితే,

మిస్టర్ స్పీకర్: రాజన్నదొరగారు. మీరు సీనియర్ మెంబర్. బిల్లుమీద డిస్కస్ చేయండి.

శ్రీ పి.రాజన్నదొర (సాలూరు): ఈ ఒక్కమాటే అధ్యక్షా, బిల్లుమీదే మాట్లాడతాను. ఈ డి.జి.పి. మరియు ఇతర అధికారుల ఎంపిక సీనియారిటీ ప్రాతిపదికన వెళ్తుందా, లేకపోతే సమర్థత మీద చేస్తున్నారా అని అడుగుతున్నాను. ఎందుకంటే, ప్రతీసారీ కూడా ఈ ఐ.ఏ.ఎస్. అధికారులు, ఐ.పి.ఎస్. అధికారులు గానీ, డి.జి.పి. పోస్ట్ గానీ, చీఫ్ సెక్రటరీ పోస్ట్ గానీ పోస్టింగ్ ఇస్తే, వాళ్ళు వెంటనే సెంట్రల్ ట్రైబ్యునల్స్‌కు వెళ్తున్నారు. అందుకే ఈపోస్టుకు ఎంపిక సీనియారిటీ బేసిస్‌గానా, లేదా సమర్థత బేసిస్‌గా చేస్తున్నారా అని అడుగుతున్నాను.

...

ఈ చట్టం తీసుకొని రావడంవల్ల పదోన్నతి అవకాశం ఒక దళిత అధికారి కోల్పోయాడనే అంశంపై కూడా స్పష్టత ఇవ్వాలని అడుగుతున్నాను. మూడవ అంశం, 2006వ సంవత్సరంలో సుప్రీం కోర్టు తీర్పు ఇస్తే ఇప్పుడు మనం 2014వ సంవత్సరంలో ఉన్నాం. ఈ మధ్య కాలంలో చట్టాలు ఎందుకు తీసుకురాలేదు, సవరణలు ఎందుకు చేయలేదు? ఇప్పుడే చట్టాలు, సవరణలు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో మీ ద్వారా ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

శ్రీ వై. ఐజయ్య (నందికొట్కూరు)ః అధ్యక్షా, డీజీపీని నియమించేటప్పుడు ఒకవేళ అతని వయస్సు 59 సంవత్సరాలు ఉంటే కనీసం రెండేళ్లు సర్వీసులో కొనసాగడానికి అవకాశం కల్పించారు. రెండు సంవత్సరాల తరువాత అతని వయస్సు 61 సంవత్సరాలు అవుతుంది. సాధారణంగా ప్రభుత్వ రూల్స్ ప్రకారం 60 సంవత్సరాలకు పదవీవిరమణ చేయాల్సి ఉంటుంది కదా? ఈ సవరణ ఎలా వర్తిస్తుంది?

శ్రీ ఎన్.చిన రాజప్ప (పెద్దాపురం)ః అధ్యక్షా, ముందు బిల్లుపై మాట్లాడిన తరువాత గౌరవసభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తాను.

MR.SPEAKER: You can take your own time.

శ్రీ ఎన్.చిన రాజప్ప (పెద్దాపురం)ః అధ్యక్షా, యూపీఎస్సీ ముగ్గురి పేర్లతో ప్యానెల్ ఎంపిక చేసి పంపుతుంది. ఆ ముగ్గురిలో ఒకరిని డీజీపీగా ఎంపిక చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నదని తెలియజేస్తున్నాను. మా ప్రభుత్వం ఇప్పుడు ఏర్పడింది కనుక సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇప్పుడు బిల్లు పెట్టడం జరిగింది. ఈ బిల్లు ప్రకారం ఈ ముగ్గురిలో ఒకర్ని ప్రభుత్వం ఎంపిక చేస్తుంది.

హోంగార్డులు, పోలీసు స్టేషన్లు, అటెండర్లు, పోలీసు క్వార్టర్ల గురించి పరిశీలిస్తాం.

శ్రీ వై. ఐజయ్య (నందికొట్కూరు)ః అధ్యక్షా, నా ప్రశ్నకు సమాధానం రాలేదు.

శ్రీ బి.రాజేంద్రనాథ్ రెడ్డి (డోన్)ః అధ్యక్షా, ఐదు మంది నుంచి ముగ్గురికి కుదిస్తే, సాధారణంగా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంటే సీనియర్ మోస్ట్ ఆఫీసర్. వారి 25, 30 సంవత్సరాల సర్వీస్‌లో ఎన్నో రకాల రివార్డులు, గుర్తింపులు, నైపుణ్యాలు ఉంటాయి. ఐదు మందికి ఎంపిక చేసుకొనే అవకాశం ఉన్నప్పుడు ముగ్గురి పేర్లను పంపించడంతో ఇద్దరికి అవకాశం కోల్పోతారు కదా?

శ్రీ ఎన్.చిన రాజప్పః అధ్యక్షా, కోర్టు ఆదేశాల ప్రకారం చేస్తాం.

MR.SPEAKER: You have taken two chances,

శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి (పులివెందుల)ః అధ్యక్షా, రెండు విషయాలు గౌరవ మంత్రిగారిని అడగదలచుకున్నాను. మొదటి క్లారిఫికేషన్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఐదు మందిని యూపీఏస్సీకి పంపమని చెప్పిందా లేదా ముగ్గురిని పంపమని చెప్పిందా అని అడుగుతున్నాను.

మొదటి క్లారిఫికేషన్, రెండు, మూడు నెలలకు పదవీ విరమణ చేయబోయే వ్యక్తులను డీజీపీ స్థానంలో కూర్చోబెడితే, మీరు ఇచ్చిన పదవి వల్ల పదవీ విరమణను ప్రక్కన పెట్టి, ఆయనను మరో రెండు సంవత్సరాలు పదవిలో కొనసాగడానికి అవకాశం ఇస్తున్నారు.

(అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు)

దీని వల్ల ప్రస్తుతమున్న ఐపీఎస్ అధికారులకు అన్యాయం చేసినట్లు కాదా అని అడుగుతున్నాను. ఈ రెండు ప్రశ్నలకు క్లారిఫికేషన్ ఇవ్వమని కోరుతున్నాను.

శ్రీ ఎస్.చిన రాజప్ప (పెద్దాపురం)ః అధ్యక్షా, సుప్రీం కోర్టు ముగ్గురినే పంపమని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం డీజీపీలందరి పేర్లను పంపుతుంది కాని యూపీఎస్సీ ముగ్గురిని మాత్రమే ఎంపిక చేస్తుంది.

మిస్టర్ స్పీకర్ః నాకు తెలిసినంత వరకు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పదవీవిరమణకు ఒక సంవత్సరం ఉన్నా, ఆరు నెలలు ఉన్నా Once he assumes the post of DGP, he will get two years tenure from the date of his/her assuming the charge.

Now, the question is:

"That the Andhra Pradesh Police (Reforms) Bill, 2014 be taken into consideration".

(Pause)

The Motion was adopted and the Bill was considered.

**CLAUSES 2 TO 4, CLAUSE 1, ENACTING FORMULA AND LONG TITLE**

MR.SPEAKER: Now, I will put the Clauses to vote.

There are no amendments to Clauses 2 to 4, Clause 1, Enacting Formula and Long Title and they are before the House.

Now, The question is:

"That Clauses 2 to 4, Clause1, Enacting Formula and Long Title do stand part of the Bill"

(Pause)

The Motion was adopted and Clauses 2 to 4, Clause 1, Enacting Formula and Long Title were added to the Bill.

MR.SPEAKER: Now, I will Irequest the Minister to move the Bill for passing.

SRI N. CHINNA RAJAPPA, DEPUTY CHIEF MINISTER, & MINISTER FOR HOME, (On behalf of the Chief Minister) : Sir, I beg to move:

"That the Andhra Pradesh Police (Reforms) Bill, 2014 be passed.".

MR.SPEAKER: Motion moved. The question is:

"That the Andhra Pradesh Police (Reforms) Bill, 2014 be passed.".

(Pause)

The motion was adopted and the Bill was passed.

**మిస్టర్ స్పీకర్: డిమాండ్స్‌పై చర్చిద్దాం. వ్యవసాయానికి సంబంధించిన విషయాలపై చర్చించాం. మిగిలిన డిమాండ్స్‌పై చర్చిస్తే I think you can have sufficient time. Members can utilize it .**

శ్రీ ఎస్. రఘురామిరెడ్డి (మైదుకూరు): అధ్యక్షా, 2014-15 సంవత్సరానికి నీటిపారుదలకు ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు నిరాశ, నిస్పృహ కలిగిస్తుంది. ఎందుకంటే 2004 సంవత్సరం తరువాత మొదలుపెట్టిన ప్రాజెక్టులు కొన్ని పూర్తికావచ్చాయి. ఇంకా కొన్ని 90 శాతం పూర్తి అయ్యాయి. కేవలం 10 శాతం పనులు మాత్రమే పూర్తి చేస్తే కొన్ని వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. మన రాష్ట్రంలో వనరులు చాలా ఉన్నాయి. గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, వంశధార, నాగావళి కాకుండా చిన్న చిన్న వంకలు, వాగులు చాలా ఉన్నాయి. వీటి ద్వారా దాదాపు 2,746 టీఎంసీల నీరు మనకు లభ్యమవుతుంది. ఇటువంటి నీటి వనరులున్న మన రాష్ట్రంలో సరైన ప్రాజెక్టులు కట్టుకుంటే ఒక్కొక్క టీఎంసీ నీటిని పదివేల ఎకరాలకు అందించే అవకాశముంది.

...

దీని ద్వారా దాదాపు రెండు కోట్ల 74 లక్షల ఎకరాలకు నీరిచ్చే స్తోమత, అవకాశాలు మన రాష్ట్రంలో పుష్కలంగా వున్నాయి. ఈ రాష్ట్రంలో దాదాపు 60 శాతం మంది రైతాంగం కేవలం వ్యవసాయం మీదనే ఆధారపడిన పరిస్థితి వుంది. నీటి పారుదల ప్రాజెక్టులనేవి ఆధునిక

దేవాలయాలు అని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. 2001లో బచావత్ అవార్డు ట్రైబ్యునల్ పునఃపరిశీలన జరుగుతుందని తెలిసినా అంతకుముునుపే మన పొరుగున వున్న మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు ఆలమట్టి, నారాయణపూర్ లాంటి ప్రాజెక్టులను కట్టుకోవడం కాని, లేదా వాటి ఎత్తును పెంచుకోవడం కాని జరిగింది. కానీ మన రాష్ట్రంలో మాత్రం 2001కి ముందు తెలుగు గంగ మరియు ఎస్ఆర్‌బిసి ప్రాజెక్టులు తప్ప వేరే ప్రాజెక్టులు చేపట్టబడలేదు. అది కూడా అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టి రామారావుగారు కలలు కన్న తెలుగు గంగ ప్రాజెక్టును ఆయన 1983లో శంకు స్థాపన చేయడం జరిగింది. 1983లో శంకుస్థాపన చేసినా ఆ ప్రాజెక్టు ఈనాటికి కూడా ఇంకా ప్రారంభానికి నోచుకోలేందంటే ఈ ప్రభుత్వం ఏ రకమైన నీటి పారుదల సౌకర్యాలు ఈ రాష్ట్రంలో కల్పిస్తున్నదో మనం అర్థం చేసుకోవచ్చు.

ముఖ్యంగా రాయలసీమలో సరియైన వర్షపాతాలు లేనందువల్ల అక్కడి రైతాంగం నీటిపారుదల రంగం మీద ఎక్కువ ఆధారపడాల్సిన పరిస్థితి వుంది. రాయలసీమలోని సగటు వర్షపాతం విషయానికొస్తే అనంతపురంలో 545 మిల్లీమీటర్లు, కర్నూలు 620 మిల్లీ మీటర్లు, కడప 696 మిల్లీమీటర్లు, చిత్తూరు 750 మిల్లీ మీటర్లు మాత్రమే వుంది. ఈ విధంగా అతి తక్కువ వర్షపాతమున్న రాయల సీమ ప్రాంతానికి చెందిన రైతాంగం కోసం సాగునీటి సౌకర్యం ఎక్కువగా కల్పించాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో జరిగిన, జరుగుతున్న రైతుల ఆత్మహత్యలను ఒకసారి పరిశీలించినట్లయితే రాయలసీమ ప్రాంతం నుండే ఎక్కువ జరుగుతున్నట్లు తెలుస్తుంది. దానికి ప్రధాన కారణమేమంటే సరియైన నీటిపారుదల సౌకర్యాలు లేనందువల్లనే రాయల సీమ ప్రాంతం నుండి రైతుల ఆత్మహత్యలు ఎక్కువగా వుంటున్నాయి. రాష్ట్రంలో జరిగిన రైతు ఆత్మహత్యల్లో రాయలసీమ ప్రాంతం నుండి 75/80 శాతం వరకు వున్నాయన్న విషయం మనందరికీ అర్థమవుతుంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకునే అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర రెడ్డి గారు రాయల సీమ ప్రాంతంలో 17.6 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావాలని పూనుకున్నారు. అదేరకంగా తెలుగు గంగ ప్రాజెక్టు విషయానికొస్తే ఐదు లక్షలా 75 వేల ఎకరాలను సాగులోకి తీసుకొస్తామని చెప్పడం జరిగితే ఇప్పటి వరకు నాలుగు లక్షలా 36 వేల ఎకరాల ఆయకట్టు అభివృద్ధి అయ్యిందని ప్రభుత్వం తన నివేదికలోచెప్పింది. ఇది సత్య దూరం. అధికారులిచ్చిన తప్పుడు సమాచారం అది. ఎందుకంటే మేం కళ్లారా చూస్తున్నాం. అక్కడ కనీసం సగం కూడా అంటే రెండున్నర లక్షల ఎకరాలు కూడా సాగులోకి రాలేదన్నది వాస్తవం. దయచేసి దానిని విచారించండి.... తెలుసుకోండి అని మనవి చేస్తున్నాను. అదేవిధంగా తెలుగు గంగ ప్రాజెక్టు పరిధిలో వెలుగోడు రిజర్వాయరు కూడా వుంది. అది కూడా ఈనాటి వరకు పూర్తి కాలేదు. 16.9 టిఎమ్‌సిల నీటి నిల్వ సామర్థ్యంతో ప్రారంభించిన ఆ రిజర్వాయరులో కనీసం 12 టిఎమ్‌సీల నీటిని నిల్వ చేసేందుకు కూడా వీలు కాని పరిస్థితి వుంది. అంతకు మించి నిల్వ చేస్తే అది కొలాప్స్ అయ్యే పరిస్థితిలో వుందని అక్కడి ఇంజనీర్లే చెబుతున్నారు. అట్లాగే బ్రహ్మంగారి మఠం వద్ద 17 టిఎమ్‌సీల నీటి నిల్వ సామర్థ్యం కోసం నిర్మించిన బ్రహ్మం సాగర్ రిజర్వాయరు కూడా కేవలం

11 టిఎమ్‌సిలకు మించి నిల్వ చేస్తే అదికూడా పూర్తిగా కొలాప్స్ అయిపోయే పరిస్థితుల్లో వుందని అక్కడున్న అధికారులే చెబుతున్న విషయాన్ని ఇక్కడ మనం గమనించాలి. ఈ వెలుగోడు రిజర్వాయర్‌లో కాని, బ్రహ్మం సాగర్ రిజర్వాయర్‌లో కాని, గత ఐదేళ్ల కాలంలో ఏ మేరకు నీటిని నిల్వ చేయగలుగుతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం ఒక దఫా పరిశీలించాలని నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అందువల్ల ఆ రిజర్వాయర్ల కట్టలను బలోపేతం చేసి, అంచనా మేరకు అక్కడ నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించాల్సిన అవసరముందని నేను మనవి చేస్తున్నాను. అదేవిధంగా తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా వెలుగోడు రిజర్వాయర్ నుంచి కడప జిల్లాకు బ్రహ్మం సాగర్ రిజర్వాయర్ ద్వారా 1.70 లక్షల ఎకరాలకు సాగునీరందించాల్సి వుంటే, 30 ఏళ్లు గడచినా ఆ పనులు ఇంకా నత్తనడకన నడుస్తున్నాయంటే తెలుగు గంగ ఆయకట్టు కింద వున్న రైతాంగం చాలా నిరుత్సాహంతో వున్నారని నేను తెలియజేస్తున్నాను. ఎందుకంటే వెలుగోడు రిజర్వాయరు కింద జీరో నుండి పది కిలోమీటర్ల మేరకు వున్న దూరంలో కాలువలకు లైనింగ్ పనులు ఇంకా పూర్తి కానందువల్ల ఐదు వేల క్యూసెక్కుల నీటిని నిల్వ చేయాల్సిన పరిస్థితుల్లో కేవలం మూడు వేల క్యూసెక్కుల నీటిని కూడా నిల్వ చేసే పరిస్థితి లేదని తెలియజేస్తున్నాను. అదేవిధంగా వెలుగోడు రిజర్వాయరు కడప జిల్లాలో ప్రవేశించే 98.2వ కిలో మీటర్ దగ్గర నుండి 108వ కిలో మీటరు దగ్గర డీప్ కట్ పోర్షన్‌లో మొత్తం కెనాల్ అంతా కొలాప్స్ అయిపోయి, ఈనాడు కడప జిల్లాకు తెలుగు గంగ రిజర్వాయరు ద్వారా సాగునీరు వచ్చే అవకాశం లేకుండా పోయిందని మనవి చేస్తున్నాను. మొన్ననే వాటిని ఎందుకు రిపేర్ చేయించడం లేదని సంబంధిత సిఈని, ఎస్ఈని ప్రశ్నించడం జరిగింది. వాళ్లయితే ఒకటే చెబుతున్నారు. మా దగ్గర నిధుల్లేవు. మేం ప్రభుత్వానికి రాశాము. ప్రభుత్వం నుండి నిధులొస్తే మేం వాటికి రిపేర్లు చేస్తామని చెప్పడం జరిగింది. దాని వల్ల వెలుగోడులో మూడు వేల క్యూసెక్కులే వదిలినా మా కడప జిల్లాకు వచ్చేసరికి కేవలం ఆరేడు వందల క్యూసెక్కులు మాత్రమే వుంటున్నది. మా కడప జిల్లాలోని లక్షా 70 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి వుండగా ఈ ఆరేడు వందల క్యూసెక్కులు ఏ మూలకు సరిపోతాయని నేను అడుగుతున్నాను. ఇటువంటి పరిస్థితులున్న ఈ తెలుగు గంగ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లో కేవలం 89 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయిస్తే ఇంకా పది సంవత్సరాల కాలంలో అయినా ఈ తెలుగు గంగ ప్రాజెక్టు పూర్తి అవుతుందా, మా కడప జిల్లాకు సాగు నీరు అందుతుందా అని నేను ప్రశ్నిస్తున్నాను. అదేవిధంగా గాలేరు నగరి ప్రాజెక్టుకు రివైజ్డ్ ఎస్టిమేషన్ ప్రకారం రు. 8.592 కోట్లు అవసరమవుతుంది. అయితే దానిపై ఇప్పటి వరకు రు.3,591 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం జరిగింది. ఇంకా దాదాపు ఐదు వేల కోట్ల రూపాయలు మంజూరు చేస్తే కాని ఆ ప్రాజెక్టు పూర్తి కాదు, మొత్తం ఆయకట్టు సాగులోకి వచ్చే అవకాశం లేదని మనవిచేస్తున్నాను. ఆ ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఐదు వేల కోట్ల రూపాయలు అవసరమైన పరిస్థితుల్లో ఈ బడ్జెట్‌లో కేవలం రు. 55 కోట్లు మాత్రమే కేటాయిస్తే కనీసం ఇంకో 20, 30 ఏళ్లకైనా ఆ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశం లేదని మీ ద్వారా మనవి చేస్తున్నాను. అట్లాగే అక్కడున్న ఒక మేజర్ బాటిల్‌నెక్ గురించి మీకు తెలియజేస్తున్నాను. బనకచెర్ల నుంచి

గోరుకల్లు వరకు 50 కిలో మీటర్ల దూరముంటుంది. మొదట్లో 11 వేల క్యూసెక్కుల క్యారీయింగ్ కెపాసిటీతో కెనాల్స్ నిర్మించడం జరిగింది. అయితే దానిని 22 వేల క్యూసెక్కుల క్యారీయింగ్ కెపాసిటీతో కెనాల్స్ నిర్మిస్తేనే కానీ దిగువ ప్రాంతానికి నీరు వెళ్లే పరిస్థితి లేదు. టోటల్ ఆయకట్టుకు నీరిచ్చే అవకాశం లేదని మనవి చేస్తున్నాను. అక్కడ ఎంతోకొంత ఎర్త్ వర్క్స్ చేశారు, కానీ ఆ స్ట్రక్చర్ వర్క్స్ ఇంకా మొదలు పెట్టలేదు. వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రారంభించాలని నేను మీ ద్వారా మనవి చేస్తున్నాను. **(బెల్)** ఇరిగేషన్ అనేది చాలా ఇంపార్టెంట్ సబ్జెక్ట్ అధ్యక్షా. మాట్లాడవలసింది ఇంచా చాలా వుంది.

మిస్టర్ స్పీకర్ః మీరు చెబుతున్నది కరెక్టే. దానిని కాదనడం లేదు రఘురామిరెడ్డి గారూ, కాని డిమాండ్ల మీద చర్చకు ఈ రోజే చివరి రోజు. అందరూ మాట్లాడిన తరువాత మినిస్టర్లు సమాధానం చెప్పాల్సి వుంది. మనకు టైం తక్కువగా వుంది. అందువల్ల త్వరగా ముగించండి.

శ్రీ ఎస్.రఘురామి రెడ్డి (మైదుకూరు)ః అధ్యక్షా.

...

అయిదు నిమిషాల్లో ముగిస్తాను. హంద్రీ-నీవా మొదటి దశలో కర్నూలు జిల్లాలో 80వేల ఎకరాలు, కరవుపీడిత ప్రాంతం, తక్కువ వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో లక్షా 18వేల ఎకరాల ఆయకట్టును తయారుచేసే ఉద్దేశంతో ప్రారంభించారు. రెండో దశలో అనంతపురం జిల్లాలో 2,27,000 ఎకరాలు, కడప జిల్లాలో 37,500 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో లక్షా 18వేల ఎకరాలు ఉంది. మొదటి దశ కింద రూ.1305కోట్లు 24.07.2004న అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర రెడ్డి గారు పరిపాలనా అనుమతిచ్చారు. దానిని ఈ రోజు లెక్క ప్రకారం చూస్తే దాదాపు రూ.2774కోట్లు అవసరమవుతుంది. రెండో దశలో రూ.1880 కోట్లతో 2005లో అప్పటి డేరింగ్, డాషింగ్, డైనమిక్ ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు ప్రారంభించారు. (అంతరాయం) ప్రజా నాయకుడు ఎవరో ప్రజలకు తెలుసు. మనం ఇక్కడ కూర్చొని మాట్లాడడం కాదు. న్యాయనిర్ణేతలు ప్రజలే. ఇక్కడ కూడా దాదాపు రూ.1567కోట్లు కేటాయిస్తే గానీ ఈ ప్రాజెక్ట్ పూర్తి కాదు. కానీ దానికి కేటాయించినది కేవలం వంద కోట్లు మాత్రమే. ఈ లెక్కన దాదాపు 15 సంవత్సరాలు కేటాయింపులు చేసినా కూడా పూర్తి కాదు. ఇటువంటి పద్ధతుల్లో ఈ ప్రాజెక్టులు నడిస్తే....

మిస్టర్ స్పీకర్ః దయచేసి ముగించండి.

శ్రీ ఎస్.రఘురామి రెడ్డి (మైదుకూరు)ః అధ్యక్షా, ఇలా నడిస్తే ఇంకా ఎన్ని సంవత్సరాలు పడుతుందో ఆలోచించాలి. కెసి కెనాల్ కడప జిల్లాలో 80వేల ఎకరాలు ఆయకట్టు స్థిరీకరణ

కోసం డిసెంబర్ 24, 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారు రాజోలి దగ్గర 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఆయన చనిపోయిన తరవాత వచ్చిన ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు దాని విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కడప జిల్లాను ఎంత నిర్లక్ష్యం చేశారో ఇంతకంటే వేరే నిదర్శనం అవసరం లేదు. దానికి ఇపుడు బడ్జెట్‌లో కూడా తగిన కేటాయింపులు జరగలేదు. దయచేసి ఆ రిజర్వాయర్ పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని కోరుతున్నాను.

ముఖ్యంగా జలయజ్ఞం పనులు ఏమీ జరగలేదని, ఫలితాలు రాలేదని వీరంటున్నారు. 1994 నుంచి 2000వరకు వారి హయాంలో ఆహారధాన్యాల ఉత్పత్తి కేవలం 1318 లక్షల టన్నులుంటే 2004 నుంచి 2014 వరకు దాదాపు 1816 లక్షల టన్నులకు అంటే దాదాపు 500 లక్షల టన్నులు పైన ఆహారోత్పత్తి జరిగిందంటే ఈ ఆయకట్టు వచ్చింది కాబట్టే ఆహారోత్పత్తి పెరిగింది. ఈ దేశంలో ఆహారభద్రత కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి తెలుసు. **(బెల్)** 1901లో భారతదేశ జనాభా కేవలం 21 కోట్లు ఉంటే, 2011 లెక్కల ప్రకారం అది దాదాపు 125 కోట్లకు పెరిగింది. ప్రపంచ జనాభాలో మన దేశ జనాభా 17 శాతం ఉంది, కానీ విస్తీర్ణంలో భారతదేశంలో కేవలం రెండు శాతం మాత్రమే ఉంది.

మిస్టర్ స్పీకర్ః దయచేసి ముగించండి.

శ్రీ ఎస్.రఘురామి రెడ్డి (మైదుకూరు)ః అధ్యక్షా, ఇటువంటి ప్రాజెక్టులు నిర్మించి నీరందించినపుడే ఆహారభద్రత కల్పించడానికి అవకాశముంటుందని మనవి చేస్తున్నాను. పోలవరం ప్రాజెక్ట్‌కు ఇపుడు జాతీయ హోదా కల్పించారు. అప్పటి జలయజ్ఞాన్ని ధనయజ్ఞమని చెప్పిన వీరు ఇపుడు జరగబోయేది ఏమిటో ఒకసారి ఆలోచించాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనది. కానీ కాంట్రాక్టర్లకు మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో మన రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రాష్ట్రపతి పాలన ఉన్నప్పుడు గవర్నర్ గారు, ఆర్థిక శాఖ తిరస్కరిస్తే ఈనాడు మరలా మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో పావులు కనబరుస్తున్నట్లు తెలుస్తున్నది. కాబట్టి ఆ రికార్డులను గౌరవసభాపతి గారి వద్ద ఉంచినచో పరిశీలించడానికి అవకాశముంటుంది. ఆరకంగా ఇచ్చేందుకు ఏమి అవకాశముందో తెలియజేయమని కోరుతున్నాను. ఏదైనా శుభకార్యం జరిగేటప్పుడు శుభస్యశీఘ్రం అని ఆశీర్వదిస్తాం. ఆశీర్వదించేటప్పుడు శీఘ్రమేవ కల్యాణ ప్రాప్తిరస్తు అంటాం. ఏ కార్యమైనా ఆలస్యం కాకుండా చేయమని చెప్పాలంటే ఆలస్యం అమృతం విషం అంటారు.

నిన్న ముఖ్యమంత్రిగారు తన ప్రసంగంలో ప్రకాశం జిల్లాలో వెలుగొండ ప్రాజెక్ట్ గురించి చెప్పారు. ఆ ప్రాజెక్ట్ కింద 4,47,300 ఎకరాల ఆయకట్టు వస్తుంది. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారు ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానన్నారు. శంకుస్థాపన చేశారు

కానీ దానిమీద ఎంత ఖర్చు పెట్టినది చెప్పలేదు. కానీ తరవాత వచ్చిన రాజశేఖరరెడ్డి గారి హయాంలో దాని మీద రూ.3556కోట్లు ఖర్చు పెట్టారు. నిన్న మాట్లాడుతూ ఆ ప్రాజెక్టును నేనే ప్రారంభిస్తానని చెప్పారు కానీ దానికి కేటాయింపులు చూస్తే కేవలం రూ.76.8కోట్లు మాత్రమే. ఇలా కేటాయిస్తే ఇంకా పది సంవత్సరాలైనా పూర్తి కాదు, కనీసం 20 సంవత్సరాలకు కూడా పూర్తి కాదు. **(బెల్)** గండికోట ప్రాజెక్టుకు కూడా చంద్రబాబు నాయుడుగారే శంకుస్థాపన చేశారు, అది అలాగే ఉంది. వచ్చే పది సంవత్సరాలలో అయినా ఈ ప్రాజెక్టులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరిచ్చేందుకు సిద్ధం చేయాలి.

MR.SPEAKER: Now, Kalva Srinivasulu garu, Kindly conclude within 10 minutes.

శ్రీ కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం)ః అధ్యక్షా, నీటిపారుదల రంగంలో గడచిన దశాబ్ద కాలంలో పనులు బాగా జరిగాయని, అంతకు ముందు తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో నీటిపారుదల రంగంలో పనులు సక్రమంగా జరగలేదని, ఇపుడైనా చేయమని పెద్దలు రఘురామిరెడ్డి గారు వైఎస్సార్‌సీపీ పక్షాన మాట్లాడారు. రఘురామిరెడ్డిగారికి తెలుగుదేశం పార్టీ కొత్త కాదు, వారు ఇంతకు ముందు తెలుగుదేశంలో పార్టీలో ఉన్నారు కాబట్టి వారికి బాగా తెలుసు. రాయలసీమలోని సీనియర్ నాయకులలో వారు ఒకరు. రాజశేఖరరెడ్డి గారిమీద అలుపెరగని పోరాటం సాగించిన వారిలో వారు ముఖ్యులు. కానీ దురదృష్టవశాత్తు వారు ఆ పార్టీ పక్షాన ఇపుడు మాట్లాడవలసి వచ్చింది. రాయలసీమతో సహా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని ప్రణాళికాబద్ధంగా శాస్త్రీయ పద్ధతుల్లో నడిపించినది తెలుగుదేశం పార్టీ, స్వర్గీయ ఎన్.టి.రామారావుగారు, ఆ తరవాత చంద్రబాబు నాయుడు గారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాగునీటిరంగంతో ముడిపడి ఉన్నదని బలంగా నమ్మిన పార్టీ తెలుగుదేశం పార్టీ. కాబట్టి నీటిపారుదల రంగాన్ని ప్రత్యేక దృష్టితో చూసి దశలవారీగా ఆ రంగాభివృద్ధికి శక్తివంతమైన చర్యలు తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరిగాయి. వాటిని నా ప్రసంగంలో అవసరమైన చోట ఉదహరిస్తాను.

...

రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి కొత్త అర్థాలు చెప్పడం జరిగింది. ఆయన వేషం, ఆయన భాష, ఆయన వ్యవహార తీరు చూసిన మేము రాజశేఖర్ రెడ్డి గారు రాయలసీమ నుంచి వచ్చారు, నీటిపారుదల రంగం పట్ల అవగాహన ఉంది, ఈయన బ్రహ్మాండంగా ఈ రాష్ట్రంలో నీటిపారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తారని ఆశించాం. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జలయజ్ఞం పేరుతో దాదాపు 86 ప్రాజెక్టులను రూ.1,90,000 కోట్ల అంచనాతో చేపట్టడం జరిగింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో గానీ, ఢిల్లీలోని ఏపీ భవన్‌కి వెళ్లినా బ్రహ్మాండమైన హోర్డింగ్స్ పెట్టారు. ఆ హోర్డింగ్స్‌లో నీళ్లు ఎక్కడబడితే అక్కడ పారుతున్నాయి, బ్రహ్మాండంగా అభివృద్ధి పథంలో ముందుకు పోతున్నదనే భ్రమలు కల్పించడంలో బ్రహ్మాండంగా చేశారు. ఎంత

భ్రమలు కల్పించారంటే ప్రకటనల్లో వర్షం పడితే వరుణ దేవుడికి కృతజ్ఞతల పేరుతో ఫుల్ పేజీ అడ్వర్టయిజ్‌మెంట్స్ ఇచ్చిన ప్రభుత్వం ఆనాటి రాజశేఖర్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.

మెరిసే మెరుపు, కురిసే వాన తన కోసమని చిన్న పిల్లవాడు భ్రమిస్తాడని ఒక కవి చెబుతాడు. అట్లా ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని కురిసే వర్షం తన వల్లనే, మెరిసే మెరుపు తన వల్లనే అని భ్రమల్లో పెట్టే ప్రయత్నం బ్రహ్మాండంగా జరిగింది. ఆ ప్రకటనలు చూస్తే రాజశేఖర్ రెడ్డి గారు నడుచుకుంటూ పోతే మొత్తం పచ్చదనమంతా పరచుకుంటూ ఉంటుంది. నీళ్లన్నీ పారుతుంటాయి. నేను ఒక మిత్రుడి ఇంటికి వెళ్లి టివి చూస్తుంటే ఆ ప్రకటన వచ్చింది. అప్పుడు ఆ మిత్రుడి కొడుకు అంకుల్, ఆయన నడుచుకుంటూ వెళుతుంటే నీళ్లన్నీ వెనక గుండా పోతున్నాయి కానీ ఆయన పంచె మాత్రం తడవలేదు ఎందుకని అడిగాడు. అంటే ఆ విధంగా పంచె కూడా తడవని ప్రాజెక్టులకి వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది ముఖ్యంగా రాజశేఖర్ రెడ్డి గారికే దక్కుతుంది. ఈ జలయజ్ఞం ప్రాజెక్టులు చేపట్టినప్పుడు ఉదాహరణకు పోలవరం తీసుకున్నా, పులిచింతల తీసుకున్నా జాయింట్ వెంచర్ ప్రాజెక్టుల కింద రష్యా, చైనా కంపెనీలు అట్లాగే రాయలసీమలో గాలేరు నగరి లాంటి ప్రాజెక్టుల కోసం గామన్ ఇండియా సంస్థ లేదా ఇరాన్ నుంచి వచ్చిన సంస్థలు వీటన్నింటినీ చూసి అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రాజెక్టులన్నీ రూపకల్పన జరుగుతాయి, బ్రహ్మాండంగా నీళ్లొస్తాయనే భ్రమలు కల్పించారు. తీరా చూస్తే ఏ ప్రాజెక్టూ పూర్తి కాకుండానే వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఈపీసీ రూపంలో ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ పేరుతో బ్రహ్మాండంగా ఉన్న విధానాన్ని ఎట్లా మార్చారంటే ఈపీసీ అంటే ఇంజనీర్లు, పొలిటీషియన్స్, కాంట్రాక్టర్లు కలిసి ప్రజా ధనాన్ని దోచుకోవడానికి దాన్ని రాచమార్గంగా ఈపీసీ విధానాన్ని ఎంచుకున్నారు. ఈ విధంగా ఎక్కడబడితే అక్కడ, ఎల్లంపల్లిలో ప్రాజెక్టు ఎత్తు పెంచడంలో రూ.600 కోట్లు అవినీతి జరిగిందనో లేకపోతే కల్వకుర్తి, భీమా లాంటి పథకాల్లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందనో స్వయంగా కాగ్ చెప్పింది. మా జిల్లాలో హంద్రీనీవా ప్రాజెక్టు ఉంది. కరువు సీమలో సాగునీటి వసతులు కల్పించడం కొరకు మహానుభావుడు ఎన్‌టి రామారావు గారి కలల రూపం హంద్రీనీవా గానీ, గాలేరు గానీ రాయలసీమ జిల్లాలో 40 టిఎంసీల సామర్థ్యంతో చేపట్టాలనుకున్న ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టుల నిర్మాణం ఒక క్రమపద్ధతిలో చేపట్టాలి అని ఎన్‌టి రామారావు గారు కలలు గంటే తరువాత చంద్రబాబు నాయుడు గారు వచ్చిన తరువాత దీనికి ఎలాగైనా నికర జలాలను తీసుకు వచ్చి ఈ ప్రాజెక్టులను చేపట్టాలని ఆయన తపిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత కాంగ్రెస్ పార్టీలో పనిచేసే నాయకులు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి వందల కోట్ల రూపాయలు రాత్రికి రాత్రే అంచనాలు పెంచుకుని ప్రజా ధనాన్ని యథేచ్ఛగా దోపిడీ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టులో వాళ్లు సెటిల్‌మెంటు చేశారని పోలీస్ రికార్డులకెక్కింది. అంటే ఎవరైతే ఫ్యాక్షనిస్టులున్నారో లేదా దౌర్జన్యపరులున్నారో వాళ్లే

కాంట్రాక్టరకు, కాంట్రాక్టరకు మధ్య లేదా పెద్ద కాంట్రాక్టర్లకు, చిన్న కాంట్రాక్టర్లకు మధ్య పంచాయతీలు నిర్వహించి కోట్ల రూపాయలు కమీషన్ల రూపంలో తీసుకున్న మాట వాస్తవమా కాదా దీనికి సమాధానం చెప్పగలరా అని అడుగుతున్నాను.

చంద్రబాబు నాయుడు గారు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని చెబుతున్నారు. నేను ఈ శాసన సభ ద్వారా ఎవరికైనా సరే బహిరంగంగా సవాలు చేస్తున్నాను. ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా పదివేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి పది లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి ఈ రాష్ట్రంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క చంద్రబాబు నాయుడు గారు తప్ప మరొకరు కాదు. ఈరోజు రూ.50,000 కోట్లు ఖర్చు పెట్టి 14 లక్షల ఎకరాలకు కూడా సక్రమంగా నీళ్లు రాని పరిస్థితి కల్పించారంటే అది గడచిన పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన నిర్వాకం కాదా అని అడుగుతున్నాను. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమలో ఎన్‌టి రామారావు గారు చొరవ తీసుకుని ఆ రోజు ప్రధాన మంత్రి గారి ద్వారా తెలుగుగంగ ప్రాజెక్టుకి శంకుస్థాపన చేసి నీళ్లివ్వడం ద్వారా చెన్నై రుణం తీర్చుకోవాలని, రాయలసీమలో చాలా భాగం సస్యశ్యామలం అవుతుందని భావించారు. తమరికి తెలుసు. శంకుస్థాపనకు వెళ్లిన పెద్దల్లో మీరు కూడా ఉన్నారు. ఈరోజు కోనసీమను తలపించే విధంగా ఆళ్లగడ్డ ప్రాజెక్టు అద్భుతంగా  అభివృద్ధి చెందిందంటే అది తెలుగుగంగ ప్రాజెక్టు వల్ల కాదా అని నేనడుగుతున్నాను. అట్లాంటి కార్యక్రమం రాయలసీమ నుంచి ముఖ్యమంత్రి అయిన రాజశేఖర్‌రెడ్డిగారి పరిపాలనలో ఎక్కడైనా వందెకరాల బిట్టు పచ్చదనంగా చూపిస్తారా అని అడుగుతున్నాను. ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదు. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. రాయలసీమ పేదరికం పేరు చెప్పి రాయలసీమ వెనుకబాటుతనాన్ని వీళ్ల జేబుల్లో వందల కోట్ల రూపాయలు నొక్కేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. అక్కడ పేదరికాన్ని సొమ్ము చేసుకున్నారు తప్ప రాయలసీమ పట్ల ఏ మాత్రం దయాదాక్షిణ్యం చూపకపోగా రాయలసీమకు మరణశాసనం రాసిన చరిత్ర కూడా రాజశేఖర్ రెడ్డి గారికే దక్కుతుందనే విషయాన్ని మనవి చేస్తున్నాను. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్, బచావత్ ట్రైబ్యునల్ ప్రకారం ఈ రాష్ట్రంలో 2130 టిఎంసీల నీళ్లలో మహారాష్ట్రకు 585 టిఎంసీలు, కర్ణాటకకి 734 టిఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కి 811 టిఎంసీల నీళ్లని పంచి 75 శాతం డిపెండబులిటీతో ఆరోజు నీటి పంపకం చేస్తే బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఆరోజు ఏర్పాటైన తరువాత ఈ రాష్ట్రంలో పస లేని అడ్వకేట్స్‌ని, క్రిమినల్ కేసులను వాదించే అడ్వకేట్స్‌ని నీటిపారుదల రంగానికి తీసుకు వచ్చి, ఢిల్లీకి పంపించి, ఈ రాష్ట్ర భవిష్యత్తుకి మరణశాసనం రాసింది రాజశేఖర్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అడుగుతున్నాను. ఆరోజు మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు నీటిపారుదల రంగంలో అపారమైన నైపుణ్యం కలిగిన అడ్వకేట్లను పెట్టుకుని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌లో వాదనలు వినిపించి వాళ్లు అదనంగా 666, 907 టిఎంసీల నీళ్లను తీసుకుని పోతే మనకు 145 టిఎంసీల నీళ్లు అదనంగా వచ్చాయి, కానీ వాటిలో ఏ ఒక్క టిఎంసీ కూడా వాడుకోవడానికి లేదు, కేవలం శ్రీశైలంలోనో,

నాగార్జున సాగర్‌లోనో క్యారీఓవర్‌గా నిలబెట్టుకోవాలి, అవసరమైన చోట లీన్ పీరియడ్‌లో మీరు వాడుకోవాలని సలహా ఇచ్చిన పరిస్థితి ఉంది.

...

ఇలాంటి పరిస్థితుల్లో ఆ రోజు రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఇదే బ్రిజెష్ కుమార్ ట్రైబ్యునల్‌కు ప్రభుత్వం ఒక మెమోను దాఖలు చేసింది. ఆ మెమోలో ఏమి ఉందో చూడండి. The State of Andhra Pradesh shall not claim any right to such surplus water by reason only of the proposed use thereof in the said project including any right to the continued use of such water because the community has grown up on such use. All such waters are available for equitable allocation. అని ఆ రోజు దాఖలు చేసిన ఈ మెమో కారణంగా రాయలసీమలో, అంటే నిఖర జలాలు కాకుండా మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులైన హంద్రినీవా, గాలేరు నగరి, ఇప్పుడున్న బీమా ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు ఇవన్నీ కూడా తెలంగాణా క్రిందకు వచ్చాయి.

ప్రధానంగా నేను ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గురించే మాట్లాడుతున్నాను. ఆ రోజు హంద్రినివా, గాలేరు నగరి లాంటి మిగుల జలాల ఆధారిత ప్రాజెక్టులకు నీళ్ల అడగమని స్వయంగా బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ఎదుట ప్రభుత్వం మెమో దాఖలు చేసింది. ఈ మెమోనే రాయలసీమ భవిష్యత్తుకు మరణశాసనంగా మారింది. రాయలసీమ భవిష్యత్తుకు మరణశాసనంగా మారిన ఈ మెమో దాఖలుకు ఎవరు కారణమని మేము అడుగుతున్నాము. ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కారణం కాదా అని అడుగుతున్నాము. మీరు రాయలసీమ భవిష్యత్తును నాశనం చేసి, రాయలసీమలోని ప్రాజెక్టులకు నీళ్ల రాకుండా చేసి, భవిష్యత్ తరాలు ఈరోజున అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాయలసీమ ప్రధానంగా కృష్ణా వాటర్ బేసినలో, పెన్నా బేసినలో ఉంది. అయితే ఈరోజు తుంగభద్ర రిజర్వాయర్‌కి తుంగానదే ప్రధానమైన నీటి వనరు. ఏదైతే బచావత్ ట్రైబ్యునల్ ఆరోజు KWDT- I అవార్డులో కర్నాటక, మహారాష్ట్రాకు సంబంధించిన ప్రాజెక్టులను తిరస్కరించింది. ఎగువ తుంగ గానీ, భద్ర ప్రాజెక్టు గానీ, సింగటలూరు గానీ ఇలాంటి అనేక ప్రాజెక్టులకు నీళ్ల అడిగితే, మీరు ఎట్లాబడితే అట్లా ఎగువ భాగాన నీళ్లు వాడుకుంటే దిగువ భాగాన ఉన్న ప్రాంతాలు నష్టపోతాయనే ఉద్దేశంతో ఆరోజు గౌరవనీయులైన బచావత్ గారు తన అవార్డులో ఆ ప్రాజెక్టులన్నింటినీ నిరాకరిస్తే, అదే ప్రాజెక్టుకు ఈ ప్రభుత్వం దాఖలు చేసిన మెమో ఆధారంగా ఈరోజు కర్నాటకకు అదనంగా 105 టిఎంసీల నీళ్లు బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ వల్ల లభించాయి.

దాని వల్ల మేము అనంతపురం, కర్నూలు మరియు ఇతర రాయలసీమ ప్రాంతాల్లో ఉన్న ప్రజలం తీవ్రంగా నష్టపోతున్నాము. ఎగువ తుంగ అనేది ఒక చిన్న ఆనకట్ట దాని క్రింద ఒక ఎకరం కూడా ఆయకట్టు లేదు. అయితే ఈరోజు ఆ ఆనకట్టను ఆయకట్టుకు నీళ్లిచ్చే ప్రాజెక్టుగా మార్చుకోవడం ద్వారా ఎగువ తుంగ, సింగటలూరు వంటి ప్రాజెక్టులకు 40 టిఎంసీల నిఖర జలాలను తెచ్చుకోవడం ద్వారా రాయలసీమ భవిష్యత్తుకు, రాయలసీమలో

సీజన్‌ని నష్టపోతున్నాము. తుంగభద్ర రిజర్వాయర్‌కు చాలా ఆలస్యంగా నీళ్లొస్తాయి. దాని వల్ల మన ప్రాజెక్టులకు ఆలస్యంగా నీళ్లు రావడమో, అసలు రాకపోవడమో జరిగితే చాలా నష్టం వస్తుంది. ఆ రోజు చూశాము ఆల్మట్టి రిజర్వాయర్ ఎత్తును పెంచాలని ప్రధానమంత్రి హోదాలో ఉన్న దేవేగౌడ గారు ప్రయత్నం చేస్తే చంద్రబాబు నాయుడు గారు అయిదు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఏకం చేసి ఒక నిపుణుల కమిటీని వేయించి, ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెరగకుండా అడ్డుకున్న నాయకుడు చంద్రబాబు నాయుడు గారు.

ఈరోజు ఏమైయ్యింది అధ్యక్షా, అదే ఆల్మట్టి డ్యాముకు అదనపు కేటాయింపుల ద్వారా మనకు దిగువనున్న శ్రీశైలంగానీ, నాగార్జున సాగర్ గానీ నష్టపోమా అని అడుగుతున్నాము. అడుగడుగునా ఈ రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టింది ఎవరు? పోలవరం ప్రాజెక్టు ఉంది. ఎప్పుడో 1943వ సంవత్సరం నుంచి దానికి ప్రతిపాదనలు ఉన్నాయి. దానిని నమ్ముకొని, పోలవరం ప్రాజెక్టుకు ఇందిరాసాగర్ అని ఇందిరాగాంధి గారి పేరు పెట్టి వేల కోట్ల రూపాయలు, కాలువల నిర్మాణానికి సంబంధించి మొన్ననే మా మిత్రుడు వర్మ గారు చెప్పారు. కాలువ ప్రక్కన కాలువ త్రవ్వారని, మరి కాలువల ప్రక్కన కాలువలు త్రవ్వి రిజర్వాయర్‌ని కట్టకుండా మొత్తం 32 శాతం పనులు పోలవరం ప్రాజెక్టులో పూర్తయితే కేవలం 7 శాతం మాత్రమే రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి.

ఇట్లా ప్రాజెక్టుల వారీగా ఎవరు కాంట్రాక్టర్లు, వాళ్ల వెనుక ఉన్నదెవరు, లబ్ధిపొందింది ఎవరు, అసలు ప్రాజెక్టులను కట్టకుండా కాలువలను త్రవ్వింది ఎవరనేది చూస్తే మరి మొత్తం కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వాళ్లు, రాజశేఖరరెడ్డిగారిని నమ్ముకున్నవాళ్లు, ఆయన కుటుంబానికో, కాంగ్రెస్ పార్టీ నాయకులకో కమీషన్లు ఇచ్చినవాళ్లు తప్ప, వీళ్లందరు కూడా ఈ రాష్ట్ర ప్రజాధనాన్ని ఎదేచ్ఛగా దోపిడీ చేసి, నీటి పారుదల రంగం గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి గానీ, ఆ పార్టీ నుంచి పుట్టుకొచ్చిన మరొక పార్టీకి గానీ లేనేలేదనే విషయాన్ని ఈ సందర్భంగా తమరి ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను.

తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోంది. చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో రాయలసీమలో అనేక ప్రాజెక్టులను పూర్తి చేసిన ఘనత మాకు ఉంది. ఈరోజు కూడా మేము చెబుతున్నాం, హంద్రినీవా వంటి ప్రాజెక్టులు గానీ, గాలేరు నగరి ప్రాజెక్టులు గానీ లేదా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను తీసుకొచ్చిన నాయకుడు మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారేనని మేము సగర్వంగా చెప్పుకుంటున్నాము. ఈ రాష్ట్రం రెండుగా విడిపోయి, మీ రాజకీయ స్వార్థానికి, ఢిల్లీలో ఉన్న పెద్దలు ఆడిన నాటకానికి తెలుగు ప్రజలు రెండుగా విడిపోతే, విడిపోయిన తెలుగు ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత నామీద ఉందని చెప్పిన నాయకుడు మా నాయకుడు చంద్రబాబునాయుడు గారు. ఢిల్లీకి వెళ్లి ఇంకా ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయకముందే, కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చి

పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదాను సాధించింది చంద్రబాబు నాయుడు గారు అవునా కాదా మీరు సమాధానం చెప్పాల్సిందిగా మేము కోరుతున్నాము.

మరి ముంపు ప్రాంతాల విషయంలోగానీ ఈరోజు పోలవరం ప్రాజెక్టు క్రింద అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అది బహుళార్ధసాధక ప్రాజెక్టు, ఆ ప్రాజెక్టు వల్ల లభ్యమయ్యే 80 టిఎంసీల్లో 35 టిఎంసీలను మహారాష్ట్రకు గానీ, కర్నాటకు గానీ మనం ఇచ్చుకున్నా కూడా గోదావరి, కృష్ణ ఇంటర్ లింకేజ్ ద్వారా అనేక ప్రయోజనాలను పొందే అవకాశం ఉంది. ఈ రోజు ఈ రాష్ట్రంలో లభ్యమయ్యే ప్రతి వాన చినుకును ఒడిచిపట్టి భూగర్భంలో దాచిపెట్టి, మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి, పడిన ప్రతి వర్షపు చుక్కను సద్వినియోగం చేసుకోవాలనే భావన ఈ ప్రభుత్వానికి ఉంది. కాబట్టి నీరు-చెట్టు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాము. అట్లాగే సర్ఫేస్ వాటర్ విషయంలో గానీ ఇతరత్రా లభ్యమయ్యే వాటర్ విషయంలో గానీ పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడానికి ఈ ప్రభుత్వం, మా మంత్రి శ్రీదేవినేని ఉమామహేశ్వరరావు గారి నాయకత్వంలో శక్తివంతమైన చర్యలను తీసుకుంటుంది. ఒక శాస్త్రీయ దృక్పథంతో ముందుకు పోతోంది. ప్రతి రిజర్వాయర్‌కు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి, చంద్రబాబు నాయుడు గారు నిన్ననే చెప్పారు ముఖ్యమంత్రి హోదాలో హంద్రినివా ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత ఈ ప్రభుత్వానిది, ఖచ్చితంగా హంద్రినివా ప్రాజెక్టుకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి అనంతపురం జిల్లాను ఆదుకుంటామని నిన్ననే ప్రకటన చేసినందుకు ఆ ప్రాంతం నుండి వచ్చిన ప్రజాప్రతినిధులుగా మేము తమరి ద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాము.

వీళ్లు కేవలం 14 లక్షల ఎకరాలను అదనంగా ఆయకట్టును క్రియేట్ చేయడం ద్వారా దాదాపు రూ.50 వేల కోట్లను ఈ 13 జిల్లాలకు ఖర్చు పెట్టారు. ఇంత ఖర్చు పెడితే మరి ఎంత ఆయకట్టు సాగులోకి రావాలి. ఒక విధానం, ఒక శాస్త్రీయ దృక్పథం లేకుండా రూ.1,90,000 కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులకు అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 20 శాతం బడ్జెట్‌లో నిధులను కేటాయించినా, ఆ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు పది పన్నెడు సంవత్సరాలు పడుతుంది. అట్లా కాకుండా నాలుగైదు శాతం బడ్జెట్లో నిధులను కేటాయించి ఎప్పుడు పూర్తి చేయాలనుకున్నారు. తీరా ఆ అగ్రిమెంట్లను చూస్తే నాలుగు సంవత్సరాల కాల పరిమితిలో ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఎవరిని మోసం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలన్నీ మీరు చేశారని అడుగుతున్నాము. దానికి సమాధానం చెప్పుకోవాల్సిన బాధ్యత మీ మీద ఉందని, మీరు భావిస్తే ఆ జలయజ్ఞానికి వారసులని మీరు అనుకుంటే రండి దీని పైన చర్చిద్దాం, ఎక్కడికైనా రావడానికి మేము సిద్ధంగా ఉన్నాము. ఈ రాష్ట్రంలో జలయజ్ఞం పేరుతో జరిగిన ప్రజాధనం దోపిడీ గానీ, కొంత మంది పెద్దలు జలగలుగామారి, జలయజ్ఞం ఫలాలను ఏ విధంగా దోచుకున్నారో నిరూపించడానికి తెలుగుదేశం పార్టీ సభ్యులుగా మేము సిద్ధంగా ఉన్నాము. మీరు చేసిన దుర్మార్గాలు మీరు చేసిన పాపాలు ఈ రాష్ట్రానికి శాపాలుగా మారి, బడుగు బలహీన

వర్గాల సంక్షేమాన్ని అభివృద్ధిని హరించి వేశాయి. కాబట్టి మళ్లీ ఒక బడుగుల ప్రభుత్వం, ఒక పేదల ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనే ఒక చిన్న ఆశ, చంద్రబాబు నాయుడు గారి సమర్థవంతమైన నాయకత్వంలో నీటిపారుదల శాఖకు మళ్లా పూర్వవైభవం, క్రొత్త వైభవం వస్తుందనే ఆశ ఈ రాష్ట్ర ప్రజానీకంలో ఉంది.

...

చంద్రబాబునాయుడు గారి సమర్థవంతమైన నాయకత్వంలో మళ్లీ చిన్ననీటిపారుదల రంగానికి పూర్వవైభవం, కొత్త వైభవం వస్తుందనే ఒక చిన్న ఆశ రాష్ట్ర ప్రజానీకానికుంది. పెద్ద పెద్ద నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో చిన్న నీటిపారుదల రంగాన్ని గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 25 లక్షల ఎకరాలకు చిన్న నీటిపారుదలరంగం ద్వారా సాగునీటి సౌకర్యాన్ని కల్పించాల్సి ఉండగా 2003వ సంవత్సరంలో కేవలం ఆరు లక్షల ఎకరాలకు, 2013వ సంవత్సరంలో పన్నెండు లక్షల ఎకరాలకు మించి నీరు పారే అవకాశం లేకుండా పోయింది. ఈ విధంగా చిన్న నీటిపారుదల చెరువులను గత పాలకులు నిర్వీర్యం చేశారు.

అధ్యక్షా, మనమెప్పుడో చరిత్రలో చదువుకున్నాం. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో చెరువులను బ్రహ్మాండంగా త్రవ్వించారు. మా ప్రాంతంలో చెరువుల త్రవ్వకానికి గాను ఆరోజుల్లో రాజులతో పాటు రాణులు కూడా తమకున్న బంగారు నగలను కుదువకు పెట్టి చెరువుల త్రవ్వకానికి ఆ సొమ్మును వెచ్చించారని చరిత్ర చెప్పింది. కానీ, గత పాలకుల ప్రజల సొమ్మును వేలాది కోట్ల రూపాయలను రివర్స్‌లో తినేశారు. ఆనాడు రాణులేమో నగలను కుదువ పెట్టి చెరువులు త్రవ్విస్తే, గత పాలకులు ప్రాజెక్టులు, కాలువల పేరుతో, జలయజ్ఞం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని యదేచ్ఛగా దోపిడి చేశారు. ఈనాడు రాష్ట్రంలో ఒక మంచి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. ప్రాజెక్టుల వారీగా సమీక్షలు చేయండి, ప్రాజెక్టుల వారీగా గత ప్రభుత్వాల హయాంలో జరిగిన లోపాల మీద తప్పకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఒక నిర్దిష్టమైన కాలవ్యవధిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రణాళికలను సిద్ధం చేయాల్సిన అవసరముంది. గత పాలకులు చేసిన పాపానికి సంవత్సరానికి రూ.4,632.00 కోట్లు వడ్డీ రూపంలో ఈ ప్రభుత్వం చెల్లిస్తోంది. చాలా బాధేస్తోంది. ఈ విధంగా వడ్డీ రూపంలో చెల్లించే డబ్బు ఎవరు తిన్నట్టు? ఈ డబ్బంతా ఎక్కడకు పోయింది? ఇది ప్రజల డబ్బు. రూ.4,632.00 కోట్లు కేవలం వడ్డీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోందంటే, కనీసం ఆ డబ్బు ఖర్చుకు గాను పండాల్సిన పంట కూడ పండనటువంటి పరిస్థితి కనబడుతోంది. ఇందాక పెద్దలు రఘురామిరెడ్డి గారు మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి హయాంలో బ్రహ్మాండంగా రాష్ట్రాభివృద్ధి జరిగిందని, ధాన్యాగారం ఉత్పత్తి పెరిగిందని చెప్పడం జరిగింది.

ఈ సందర్భంగా నేను ఒక చిన్న ఉదాహరణను సభకు వివరించదలిచాను. (సోషియో ఎకనామిక్ సర్వే పుస్తకం గౌరవ సభాపతి వైపు చూపిస్తూ) ఇది సోషియో ఎకనామిక్ సర్వే పుస్తకం.

రాష్ట్రంలో 14 హెక్టార్ల భూ విస్తీర్ణం తగ్గిపోయిందని ఈ పుస్తకంలో సమాచారం ఉంది. తమరికి తెలుసు. తమరు రైతు పక్షపాతి. వ్యవసాయరంగంపైన అపార అనుభవం మీకుంది. పార్టీ తరఫున అనేక కమిటీలకు గతంలో మీరు చైర్మన్‌గా వ్యవహరిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి మీ నాయకత్వంలో మేం కూడా అనేక ప్రాంతాలను సందర్శించడం వల్ల రైతుల బాధలను గురించి తెలుసుకునే అవకాశం మాకు కూడా కల్గింది. గత పదేళ్ల కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల హయాంలో గానీ, స్వర్గీయ శ్రీ రాజశేఖరరెడ్డి గారి హయంలో తూర్పు గోదావరి లాంటి జిల్లాలోనే రైతాంగం పంటల విరామాన్ని ప్రకటించిన సందర్భాన్ని మనం చూశాం. National Crime Records Bureau Report ప్రకారం.. 2004-2014 మధ్యకాలంలో 24,012 మంది రైతులు అన్నపూర్ణలాంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పుల ఊబిలో చిక్కుకుని అకాలమరణాలకు, ఆత్మహత్యలకు గురైయ్యారంటే దీనికి బాధ్యులెవరని మేం అడుగుతున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది రైతులను పొట్టనపెట్టుకున్న గత పాలకులు, ఈ రాష్ట్రంలో 14 లక్షల హెక్టార్ల విస్తీర్ణం తగ్గిపోవడానికి కారణమైన వీళ్లు, ప్రజలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞంగా మార్చి కాంట్రాక్టర్లకు, దళారీలకు అప్పగించిన వీళ్లు, తెలుగు దేశం పార్టీని, ప్రభుత్వాన్ని, లేకపోతే చంద్రబాబు నాయుడు గారి పరిపాలనను విమర్శించే నైతిక హక్కు లేనేలేదనే విషయాన్ని ఈ సందర్భంగా తమరి ద్వారా రాష్ట్ర ప్రజానీకానికి తెలియజేస్తున్నాను. కరువుపీడిత ప్రాంతాలుగా ఉత్తరాంధ్రలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి ఒకవైపున, మరోవైపున రాయలసీమ ప్రాంతంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి కచ్చితంగా ఈ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరముంది. అదే విధంగా కృష్ణా, గోదావరి, నాగావళి వంటి నదులు మన రాష్ట్రంలో ఉన్నాయి. తద్వారా ఆ నదుల ద్వారా ప్రవహించే నీటిని మనం సద్వినియోగం చేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం ఉంది. అందులో 25 లక్షల ఎకరాల భూమి మైనర్ ఇరిగేషన్ క్రింద ఉంటే, అందులోని పది లక్షల ఎకరాలకు కూడా నీరు అందనటువంటి పరిస్థితివల్ల పంట సాగులోలేదు. అట్లాగే 59 లక్షల ఎకరాల భూమి మేజర్ ఇరిగేషన్ క్రింద ఉంటే, చాలా చోట్ల సకాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల గానీ, ప్రాజెక్టులకు నీళ్లు రాకపోవడం వల్ల గానీ ఆయకట్టుకు సాగునీరందడం లేదు. కాబట్టి శాస్త్రీయ పద్ధతుల్లో, క్రమ పద్ధతిలో నీటిపారుదల రంగాన్ని అభివృద్ధిచేసి స్పష్టమైన ప్రభుత్వ విధానాలతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, ఉత్తరాంధ్ర ప్రాంతంపైన గానీ, రాయలసీమ ప్రాంతంపైన గానీ ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం ముందుకుపోవాల్సిన అవసరముందని సభాముఖంగా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, నీటిపారుదల రంగానికి సంబంధించి సత్వర ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిగావించుటకై నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ప్రభుత్వం ముందుకుపోవాలని కోరుకుంటూ, ఈ సంవత్సరం బడ్జెట్‌లో పొందుపర్చిన నిధులతోపాటు అదనంగా కూడా నిధులను సేకరించి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని తమరి ద్వారా

ప్రభుత్వాన్ని కోరుతున్నాను. చంద్రబాబునాయుడు గారి నాయకత్వం పైన నమ్మకం ఉండి గతంలో ఆర్.ఐ.డి.ఎఫ్. లాంటి సంస్థలు పేదరిక నిర్మూలనకుగాను నిధులను ఇచ్చాయి. మళ్లీ మేం అదే తరహాలో పయనిస్తున్నాం. విదేశీ నిధులను గానీ, అంతర్జాతీయంగా నిధులను రాష్ట్రానికి తీసుకువచ్చి, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులను రాష్ట్రాభివృద్ధికి తీసుకువచ్చి సాగునీటి పారుదల రంగానికి ఒక కొత్త రూపాన్ని ఇవ్వమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికై ప్రత్యేక శ్రద్ధచూపమని మీ ద్వారా గౌరవ మంత్రివర్యులను, ఈ ప్రభుత్వాన్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్: ఎస్వీ మోహన్ రెడ్డి గారు...........

శ్రీ ఎస్. రఘురామిరెడ్డి: అధ్యక్షా............

మిస్టర్ స్పీకర్: దయచేసి కూర్చోండి రఘురామిరెడ్డి గారు. మంత్రిగారి క్లారిఫికేషన్ సందర్భంలో మీకు అవకాశం ఇస్తాను. అప్పుడు మాట్లాడుదురు. దయచేసి కూర్చోండి. మోహన్ రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ ఎస్.వి.మోహన్‌రెడ్డి (కర్నూలు): అధ్యక్షా, డిమాండ్స్ పైన మాట్లాడే అవకాశం కల్పించినందుకు మొదట ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. సోదరులు శ్రీనన్న గారు సుదీర్ఘంగా ఉపన్యాసమిచ్చారు. తెలుగుదేశం పార్టీ మీటింగ్ సందర్భంలో డయాస్‌పైన ఇచ్చినట్టుగా సుదీర్ఘ ఉపన్యాసమిచ్చారు.

అధ్యక్షా, ఈరోజున శ్రీనివాసులు గారిచ్చిన ఉపన్యాసమంతా, గతంలో రాజశేఖరరెడ్డి గారు ఈ రాష్ట్రానికి ఇరిగేషన్ రంగంలో చాలా అన్యాయం చేశారని, నీటిపారుదలరంగాన్ని నిర్వీర్యం చేశారని, ఒక సందర్భంలో చాలెంజ్ చేసి చెప్పడం కూడా జరిగింది. రాజశేఖరరెడ్డి గారి హయాంలో ఒక ఎకరాకు కూడా నీరు అందలేదని చీఫ్ విప్ గారు చాలెంజ్ చేసి చెప్పాడు. అయితే, తమరిద్వారా సభకు ఒక విషయం తెలియజేస్తున్నాను. రాజశేఖరరెడ్డి గారి హయాంలో పూర్తయినటువంటి నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా ఇరిగేషన్ క్రిందకు వచ్చిన భూమి 3,25,000 ఎకరాలు. సభాధ్యక్షుల వారు సమయాన్ని కేటాయిస్తే, ఏయే ప్రాజెక్టుల ద్వారా ఎన్నెన్ని ఎకరాల భూమి సాగులోకి వచ్చిందనే వివరాలను తెలియజేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

అధ్యక్షా, నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా సాగులోకి వచ్చిన భూమే 3,25,000 ఎకరాలు ఉన్నట్టుగా ఈరోజున లెక్కలున్నాయి. తరువాత పూర్తయిన ప్రాజెక్టుల ద్వారానే గాకుండా, నిర్మాణ దశలో ఉన్నటువంటి ప్రాజెక్టుల ద్వారా 15,68,653 ఎకరాల భూమి ఇరిగేషన్ క్రిందకు వచ్చింది. నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న, నిర్మాణ దశలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు గాను

రూ.67.973 కోట్లు మంజూరుచేస్తే, 2009-10 వ సంవత్సరం వరకు అన్ని ప్రాజెక్టులకు కలిపి రూ.53.00 కోట్లు ఖర్చుచేసిన కారణంగానే దాదాపు 23 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చిన వాస్తవాన్ని గౌరవ చీఫ్ విప్ గారు సభకు చెప్పకుండా, పూర్తిగా సబ్జెక్ట్‌ను డైవర్ట్ చేసుకుంటూ తన ఉపన్యాసాన్ని కొనసాగించారు. అదే విధంగా 1997 నుంచి 2004వ సంవత్సరం వరకు కూడా సాగునీటిరంగానికి ఖర్చుచేసింది కేవలం రూ.10,000.00 కోట్లు మాత్రమే. గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా నిన్న సభలో హంద్రీ- నీవా ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. హంద్రీ- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి మొత్తం వ్యయం మా హయాంలోనే జరిగింది, ఆ ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యత కూడా మాదే అనే దోరణిలో గౌరవ ముఖ్యమంత్రి గారి నిన్నటి ప్రసంగంలో చెప్పడం జరిగింది. కానీ, ఆ ప్రాజెక్టుకు మొదట్లో ఆనాటి ముఖ్యమంత్రి గారైన స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు శంఖుస్థాపన చేశారు. ఆ తరువాత మరో దఫా ఆనాటి, ఈనాటి గౌరవ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆ ప్రాజెక్టుకు శంఖుస్థాపన చేశారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఆ ప్రాజెక్టు నిర్మాణం నిమిత్తం రూ.13.00 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. హంద్రి - నీవా, సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ. 6,850.00 కోట్లైతే, చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ హయాంలో ఖర్చు చేసింది కేవలం రూ.13.00 కోట్లు మాత్రమే.

...

రాజశేఖరరెడ్డి గారి కాలంలో 2004 నుండి 2009-10వ సంవత్సరం వరకు దాదాపుగా రూ.3996 కోట్లు ఖర్చు పెట్టి దాదాపుగా 70 శాతం పూర్తి చేయడం జరిగింది. తరువాత వచ్చిన కిరణ్‌కుమార్ రెడ్డి గవర్నమెంట్ అయితేనేమి, రోశయ్య గారి గవర్నమెంట్ అయితే నేమి రూ.1800 కోట్లు ఖర్చుపెట్టి దాదాపుగా ఈరోజుకి దాదాపుగా 90-95 శాతం పూర్తయింది. హంద్రీ నీవా గురించి, ఈ రోజు గురు రాఘవేంద్ర ఉంది. గురు రాఘవేంద్రకు చంద్రబాబు నాయుడుగారే శంకుస్థాపన చేశారు. 'గురు రాఘవేంద్ర' ఎస్టిమేషన్ కాస్ట్ రూ. 391కోట్లు అయితే కేవలం రూ.3 కోట్లు మాత్రమే చంద్రబాబునాయుడు గారు శాంక్షన్ చేయడం జరిగింది. 2004-09, 2010 వరకు, రూ.142 కోట్లు రాజశేఖర రెడ్డి గారు ఉన్నప్పుడు శాంక్షన్ చేయడం జరిగింది. రూ.17,500 కోట్లు ఆయకట్టు రావల్సి ఉండగా, రూ.6818 కోట్లు ఇప్పటికే ఆయకట్టు వచ్చింది. 1983వ సంవత్సరంలో పెద్దలు దివంగత నేత ఎన్‌టి.రామారావు గారు తెలుగు గంగ ప్రాజెక్టు స్టార్ చేయడం జరిగింది.

ఆరోజు తెలుగుగంగ 1983వ సంవత్సరం నుండి ఎన్‌టి.రామారావు గారు అయితేనేమి, కోట్ల విజయభాస్కరరెడ్డి గారు అయితేనేమి, చంద్రబాబు నాయుడు గారు అయితేనేమి 9 సంవత్సరాల కాలంలో మొత్తం కలిసి రూ.938 కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. 2004 నుండి 2009 రాజశేఖర రెడ్డి గారు ఉన్నప్పుడు రూ.1298 కోట్లు కోట్లు ఖర్చు పెట్టడం జరిగింది. ఎన్‌టి. రామారావు గారు మొదలు పెట్టిన తెలుగుగంగ ప్రాజెక్టుకు కూడా

రాజశేఖరరెడ్డి గారే ఎక్కువ ఖర్చుపెట్టడం జరిగింది. వారు ఇంత ఖర్చు పెట్టారు, వీరింత ఖర్చు పెట్టారు అంటూ ఎక్కువ సమయాన్ని తీసుకోదలచుకోలేదు అధ్యక్షా. నేను ముఖ్యంగా ప్రభుత్వాన్ని, గౌరవ మంత్రి గారిని కూడా నోట్ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాను. శ్రీనివాస్ గారికి గుర్తుందో లేదో కాని, కేసీ.కెనాల్ హెచ్ఎల్సీ ద్వారా అనంతపూర్‌కు 10 టిఎంసీ.ల నీటిని వైఎస్.రాజశేఖరరెడ్డి గారు ఇచ్చారు అనే అంశాన్ని శ్రీనివాసులు గుర్తించుకోవాలి అధ్యక్షా.

(ఈ సందర్భంలో ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీ కాలవ శ్రీనివాసులు మాట్లాడేందుకు తమకు మైక్ ఇవ్వాల్సిందిగా కోరుతూ తమ స్థానం నుండి లేచి నిలుచున్నారు. )

నేను ముఖ్యమైన డిమాండ్స్ చెపుతున్నాను. మీకు గుర్తు చేశాను అంతే. శ్రీనన్నా నేను కొత్తగా ఎన్నికై సభకు వచ్చాను భయపడనీయకు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఆగస్ట్ 15వ తేది, జెండా ఆవిష్కరించారు. ఆరోజు గుండ్రేవుల ప్రాజెక్టు గురించి గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రస్థావించారు. అది ఈరోజు శ్రీశైలం డ్యాం లో మనకు 300 టిఎంసీ.ల స్టోరేజ్ ఉండేది. ఈరోజు సిల్ట్ చేయడం వలన దాని సామర్థ్యం 250 టిఎంసీ.లకు తగ్గిపోయింది. అంతేకాదు తుంగభద్రానదిలో 120 టిఎంసీ. సామర్థ్యం ఉండగా అది సిల్ట్ చేయడం వలన 100 టిఎంసీ.లకు. తగ్గిపోయింది. తుంగభద్రనది కానీ, శ్రీశైలం డ్యాం ద్వారా రాయలసీమకు నీళ్లు వచ్చే అవకాశం ఉంది. ఈ రెండిండిలో వేస్ట్ అయ్యే వాటర్ ద్వారా గుండ్రేవుల ప్రాజెక్టు 20 టిఎంసి.లు ఉంది. కాంట్రాక్ట్ ఇచ్చామని చెబుతున్నారు. దాని ప్రాజెక్టు కాస్ట్ దాదాపు రూ.600 నుండి 700 కోట్లు అని కాంట్రాక్ట్ ఇచ్చామని చెబుతున్నారు. ఆ విషయం మంత్రి వర్యుల వారికే తెలుస్తుంది. ఈ రోజు గుండ్రేవుల ప్రాజెక్టు రావడం వలన అటు కేసీ కెనాల్‌కు కానీ, రాయలసీమ లోని మిగిలి ప్రాంతాలకు కానీ, కర్నులుకు త్రాగు నీటికి కానీ, వీటన్నింటికి గుండ్రేవుల ప్రాజెక్టు ప్రధానమైనటువంటిది. చంద్రబాబునాయుడుగారు ఆగస్ట్ 15వ తేదిన ప్రకటించడం జరిగింది.

**(ఈ సందర్భంలో గౌరవ ఉప సభాపతి స్థానంలోకి వచ్చారు.)**

కానీ నిన్న బడ్జెట్‌లోచూస్తే ఎటువంటి ప్రతిపాదన కానీ, ఎటువంటి కేటాయింపులు కానీ లేవు అనే విషయాన్ని గౌరవ మంత్రివర్యుల దృష్టికి తీసుకు వస్తున్నాను. దీనిని టాప్ ప్రయారిటీ కింద తీసుకొని ఖచ్చితంగా గుండ్రేవుల ప్రాజెక్టును సత్వరం చేపట్టాలని మీ ద్వారా మంత్రిగారి దృష్టికి తీసుకువస్తున్నాను.

ఈరోజు పోతిరెడ్డిపాడు చూస్తే కేవలం 10 టిఎంసీ.ల నీటితో పోతిరెడ్డిపాడు కేసీ కెనాల్‌కు కానీ, తెలుగు గంగకు కానీ నీళ్లు వచ్చే పరిస్థితి ఉంది. రాజశేఖరరెడ్డి గారు వచ్చిన తరువాత పోతిరెడ్డిపాడు ప్రధామైనటువంటి అంశంగా తీసుకొని అన్నింటికీ నీళ్లు ఇచ్చే అవసరం ఉంది కాబట్టి పోతిరెడ్డిపాడును 40 క్యూసెక్‌లకు పెంచాలని రాజశేఖరరెడ్డి గారు ప్రతిపాదన చేసి

దానిని చేపట్టడం జరిగింది. ఈరోజు పోతిరెడ్డిపాడులో ఎర్త్ వర్కులు జరిగాయి. మిగిలిన పనులు యుటిడబ్ల్యు వర్కులు జరుగగా, అక్కుడేటెడ్ వర్కులు, స్ట్రక్చర్ వర్కులు కొన్ని పెండింగ్ ఉన్నాయి. ఈరోజు పోతిరెడ్డిపాడు కింద పోలవరం ప్రాజెక్టు తయారు అవుతుందంటున్నారు, పోతిరెడ్డిపాడు కూడా కేవలం వరద నీటి కోసం నిర్మించిన ప్రాజెక్ట్ తప్ప, దానిమీద ఎవరికీ ఎటువంటి అనుమానాలు ఉండాల్సిన అవసరం లేదు. ఈరోజు వరద నీరు లక్షల క్యూసెక్‌ల నీరు సముద్రం పాలౌతున్నాయి.

ఈరోజు కేవలం వెనుకబడిన, కరువు ప్రాంతం అయినటువంటి రాయలసీమ ప్రాంతానికి ఈ పోతిరెడ్డిపాడు వరప్రదాయిని అవుతుంది కాబట్టి పోతిరెడ్డిపాడును వెంటనే పూర్తిచేసి రాయలసీమ ప్రాంతాన్ని ఆదుకోవాలని కూడా మీ ద్వారా మంత్రి గారికి తెలియజేస్తున్నాను. మాకు తుంగభద్ర దిగువ కాలువ ఉంది, దానినే ఎల్ఎల్‌సీ కాలువ అంటారు. ఎల్ఎల్‌సీ కాలువలో ప్రతిసంవత్సరం ఆంధ్రా బోర్డర్‌లో 650 క్యూసెక్‌ల నీరు రావల్సి ఉంది. ఏ సంవత్సరం కూడా 350 నుండి 450 క్యూసెక్‌లకు మించి ఏ సంవత్సరం రాలేదు. ప్రతి సంవత్సరం కూడా రైతులు ఆ నీటి కోసం ధర్నాలు చేయడం, కేసులుపెట్టించుకోడం వంటి పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. 2009-13 వరకు దాదాపు 71 టిఎంసీల నీళ్లు రావల్సి ఉండగా కేవలం 37.98 టిఎంసీలు మాత్రమే ఎల్ఎల్‌సి ద్వారా రావడం జరుగుతోంది. ఈరోజు 1.51వేల ఎకరాలకు నీటిపారుదల వస్తుంది. దానికంటతటకీ కారణం కర్నాటకలో జరుగుతున్న జల చౌర్యమే. వాస్తవంగా తుంగభద్ర డ్యాం నుండి మన రాష్ట్రానికి వదలాల్సిన కోటా అక్కడ వదులుతున్నారు. కానీ మన రాష్ట్రం నుండి అక్కడకు కొంత మంది ఆఫీసర్స్‌ను డిప్యుటేషన్‌పై పంపించారు. ఆ ఆఫీసర్స్ అవినీతి కావచ్చు, అలసత్యం కావచ్చు మన ప్రాంతానికి మాత్రం నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి చిన్న సూచన చేస్తున్నాను. దీనికి ధరూర్ అనే గ్రామం వద్ద 75వ కిలోమీటరు నుండి 185వ కిలోమీటరు కొలకుంద వరకు మనకు వచ్చే వాటా నీరు పైప్‌లైన్ ద్వారా కర్నూలుకు తీసుకు వస్తే కర్నూలు జిల్లాలోని ఆయకట్టు అంతటికీ పూర్తి న్యాయం చేసే అవకాశం ఉంటుంది.

దానికి కర్నాటక ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకోవల్సిన అవసరం ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి ఇంకొక విషయం తీసుకు వస్తున్నాను. కర్నూలుకు ఎక్కడా ఎప్పుడూ, ఏ ప్రాంతానికి జరగనటువంటి వరద నష్టం జరిగింది. అది రాష్ట్ర ప్రజలే కాదు. ప్రపంచం అంతా గుర్తించింది. ప్రపంచంలో ఏ నగరానికి రానటువంటి వరదలు కర్నూలు పట్టణానికి వచ్చాయి. అంతకు మునుపే 2007వ సంవత్సరంలో వచ్చిన వరదలను చూసి దివంగతనేత వైఎస్.రాజశేఖరరెడ్డి గారు, ఈ కర్నూలుకు ఎప్పుడైనా వరద ప్రమాదం ఉంది. ఆ వరద ప్రమాదం నుండి కర్నూలును రక్షించాలంటే హంద్రీనదికీ, తుంగభద్ర డ్యాం మీద హంద్రీ నదికి ప్రొటక్షన్ వాల్స్ పెట్టాల్సిన అవసరం ఉందని రూ.244 కోట్లు రూపాయలు శాంక్షన్ చేశారు.

...

టెండరు ప్రాసెస్ కూడా అయిపోయింది. నిధులు కూడా కేటాయించారు. పనులు కూడా మొదలుపెట్టి, రెండు మూడు కోట్లు ఖర్చుపెట్టి, తరువాత ఆ పనులను ఆపేశారు. తర్వాత కొన్ని కారణాల వలన ఆ పనులను కూడా రద్దు చేశామని చెప్పారు. దానిమీద సబ్‌స్ట్యూట్ వర్క్స్‌కి ప్రతిపాదనలు పంపించారు. మొన్న కర్నూలులో ఐడిసి మీటింగ్ జరిగినప్పుడు కూడా చీఫ్ ఇంజనీర్‌ని అడిగాం. ప్రభుత్వం నుంచి క్లియర్‌గా ఆర్డరు వచ్చింది. మ్యూచువల్ కన్‌సెంట్‌తో రద్దు చేసి, కొత్తగా టెండర్లును పిలవమని ప్రభుత్వం నుంచి కూడా చీఫ్ ఇంజనీర్‌కి నోటు వచ్చింది. ఇంతవరకూ వాళ్లు మ్యూచువల్‌గా కన్‌సెంట్ ఇవ్వలేదని రద్దు చేయలేదు. ఆర్టికల్ ప్రకారం సూపరెంటెండెంట్ ఇంజనీరుకు రద్దు చేసే అధికారం ఉంది కాబట్టి, గౌరవ మంత్రిగారు సూపరెంటెండెంట్ ఇంజనీరుకు డైరెక్షన్ ఇచ్చి, ఆ పనులను రద్దు చేసి, కొత్త పనులకు టెండర్లు పిలవాలని.. లేదంటే రూ.244 కోట్ల పనులు ఈరోజు రూ.850 కోట్ల అంచనాలకు వచ్చాయి. అది కూడా ఆలస్యమైతే ఆ అంచనా విలువ రూ.1500 కోట్లకు వెళ్లే ప్రమాదముంది. కాబట్టి, వెంటనే సబ్‌స్టిట్యూట్ వర్క్స్‌కి ప్రతిపాదనలను చేపట్టాలని గౌరవ మంత్రిగారికి మీద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అతి ముఖ్యమైన విషయం. ఇందాక నేను షార్ట్ నోటీసు క్వశ్చన్ ఇచ్చాను. దానికి సమాధానం రాకుండానే ఆ ప్రశ్న రద్దయింది. ఇది చాలా జాగ్రత్తగా, దీనిమీద గౌరవ మంత్రిగారు ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఇది ప్రభుత్వ సొమ్ము. రూ.294 కోట్లు వృథా అయ్యే పరిస్థితి ఉంది. అంతేగాకుండా కర్నూలు పట్టణంలో ఉన్న 6 లక్షల మంది ఆరోగ్యానికి, వాళ్ల ప్రాణాలకి సంబంధించిన అంశం.

ఈరోజు తుంగభద్ర నదిపై ఒక చెక్‌డ్యామ్-కమ్-బ్రిడ్జిని కట్టాలని ప్రతిపాదించారు. శ్రీ కిరణ్‌కుమార్‌రెడ్డిగారి ప్రభుత్వంలో, అప్పటి చిన్ననీటిపారుదలశాఖామంత్రి ప్రతిపాదన ద్వారా రూ.69 కోట్లతో చెక్‌డ్యామ్-కమ్-బ్రిడ్జిను మంజూరు చేసింది. పంచలింగాల గ్రామం నుంచి కర్నూలు పట్టణానికి కనెక్టివిటీ కోసం బ్రిడ్జి కావాలని ప్రజలు అడిగారు. కానీ అక్కడ చెక్‌డ్యామ్-కమ్-బ్రిడ్జిని మంజూరు చేశారు. కానీ, ఎక్కడా పెద్ద నదిమీద చెక్‌డ్యామ్-కమ్-బ్రిడ్జిని నిర్మించిన పరిస్థితి దేశంలో గాని, మన రాష్ట్రంలో గాని లేదు. (బెల్స్)

అధ్యక్షా, ఆఖరి కంక్లూజన్. మీరు బెల్ కొడుతుంటుంటే, మాకు ఇక్కడ గుండెలు దబ్‌దబ్ అంటున్నాయి. మేం కొత్తగా వచ్చాం. కొద్దిగా అవకాశం ఇవ్వండి. రూ.69 కోట్లకు గాను, ఈరోజు ఒక ప్రైవేటు ఏజెన్సీకి ఇస్తే రూ.190 కోట్లకు రివైజ్డ్ ఎస్టిమేషన్ ఇవ్వడం జరిగింది. ఈరోజు నేను ఒకటే ప్రశ్నిస్తున్నాను. పెద్ద నది మీద చెక్ డ్యాం కమ్ బ్రిడ్జిని కట్టే పరిస్థితి ఉండదు. దానికి చాలా పర్మిషన్లు తీసుకోవలసిన అవసరం ఉంటుంది. ఒక పెద్ద నదిమీద చెక్ డ్యాంను కాని, ప్రాజెక్టును కాని ప్లాన్ చేయాలంటే, భారీనీటిపారుదల శాఖలో ఉన్న ఇంజనీర్లు గాని, సిబ్బంది గాని ప్రతిపాదించాలి. ఆ ప్రతిపాదనలను మంజూరు చేయాలి. ఇది విచిత్రమైన

సంఘటన. భారీనీటిపారుదల శాఖ వాళ్లు ఇది రూలుకు వ్యతిరేకంగా ఉంది కాబట్టి, మేం దీంట్లో ఇన్‌వాల్వ్ కాము అని చెప్పడం జరిగింది. కానీ, అప్పటి చిన్న నీటిపారుదలశాఖామంత్రి బలవంతం మీద, భారీనీటిపారుదల శాఖవాళ్లు ముందుకు రాకపోతే, ప్రతిపాదనలు (ఫైలు) చిన్న నీటిపారుదల శాఖ ద్వారా నడిచాయి. చిన్న నీటిపారుదల శాఖవాళ్లు ఫైలు మువ్ చేస్తే, ప్రభుత్వం దానికి రూ.69 కోట్లు మంజూరు చేసింది.

మిస్టర్ డిప్యూటి స్పీకర్ః ముగించండి. చాలా సమయం తీసుకున్నారు.

శ్రీ ఎస్.వి. మోహన్ రెడ్డి (కర్నూలు)ః అధ్యక్షా, చివరిగా, ఇది చట్ట విరుద్ధం అవునా, కాదా? అన్నది గౌరవ మంత్రిగారు, ప్రభుత్వం ఆలోచించాలి. ఇది చట్టవిరుద్ధం అని అనుకుంటే ఖచ్చితంగా ఆ ఇంజనీర్ల మీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మీద్వారా అభ్యర్థిస్తున్నాను.

అదేవిధంగా 6 లక్షల ప్రజల ప్రాణానికి ఏవిధంగా హాని జరుగుతుందో ఒక రెండు నిమిషాల్లో వివరిస్తాను. 14 గ్రామాల నుంచి వచ్చే డ్రెయినేజ్ వాటర్ తుంగభద్రా నదిలో కలుస్తుంది. తర్వాత కర్నూలు పట్టణంలో ఉన్న డ్రెయినేజ్ అంతా కూడా తుంగభద్రా నదిలోనే కలుస్తుంది. ఈ చెక్ డ్యాం కమ్ బ్రిడ్జిని కర్నూలు పట్టణంలో కింది భాగంలో కట్టడానికి ప్లాన్ వేశారు. ఈ డ్రెయినేజ్ వాటర్ అంతా వచ్చి చెక్ డ్యాం దగ్గర స్టోర్ అవుతుంది. వర్షా కాలంలో అయితే కొట్టుకుపోతుంది. కానీ తుంగభద్ర స్టాటస్టిక్స్ ప్రకారం కేవలం మూడు నెలలు మాత్రమే ఫ్లో ఉంటుంది. తొమ్మిది నెలలు తక్కువ ఫ్లో ఉంటుంది. వేసవిలో అయితే అసలు ఫ్లో ఉండదు. ఈ 14 గ్రామాల డ్రెయినేజ్ వాటరు, కర్నూలు పట్టణంలో డ్రెయినేజ్ వాటరు అంతా అక్కడికి వచ్చి, అక్కడ ఎక్యుమలేట్ అయి, ఆ దుర్వాసన వల్ల 6 లక్షల ప్రజల ఆరోగ్యానికి హానికరం వచ్చే పరిస్థితి ఉందనే విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. గత సంవత్సరంలో దుర్వాసన విషయం మానవహక్కుల కమీషన్ వరకు వెళ్లింది.

(మైకు కట్ చేయబడింది.)

(శ్రీ ఎస్.వి. మోహన్ రెడ్డిగారు మైకు ఇవ్వమని గౌరవ ఉప సభాపతిని కోరారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః మీరు చాలా సమయం మాట్లాడారు. తొందరగా ముగించండి.

శ్రీ ఎస్.వి. మోహన్ రెడ్డి (కర్నూలు)ః అధ్యక్షా, ఒక చిన్న సూచన. కర్నూలు పై భాగంలో మాకు వాటర్ స్టోరేజ్ ట్యాంకు ఉంది. ఈ ప్రాజెక్టును కర్నూలు పైభాగంలో కడితే, అక్కడ నుంచి కర్నూలుకు తాగునీరు వచ్చే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా మీద్వారా గౌరవ

మంత్రిగారికి తెలియజేస్తూ, నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలను తెలియజేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కాలువ శ్రీనివాసులుగారు.

శ్రీ కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం)ః అధ్యక్షా, మిత్రులు శ్రీ మోహన్‌రెడ్డిగారు మాట్లాడుతూ, డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు అనంతపూర్ జిల్లాకు 10 టిఎమ్‌సీల నీళ్లు ఇచ్చారని, కెసి కెనాల్ నీటిని అనంతపురం జిల్లా హెచ్‌ఎల్‌సీకు మళ్లించారని చెప్పారు. అది అర్థ సత్యం. అనంతపురం జిల్లాలో వరుస కరువులతో రైతులు విలవిలాడిపోతున్నారని, ప్రజలకు తాగునీళ్లు లేవని, ఎలాగైనా ఈ జిల్లాను ఆదుకోవాలని, ఎప్పుడో హెచ్‌ఎల్‌సీ ప్రారంభంలో 32.5 టిఎమ్‌సీల నీళ్లు హెచ్‌ఎల్‌సీకి కేటాయిస్తే, తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడిక పెరిగిపోయిన కారణంగా 26, 27 టిఎమ్‌సీలకు మించి నీళ్లు రాకపోయిన పరిస్థితిలో, శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో... మోహన్‌రెడ్డిగారి బావగారు నాగిరెడ్డిగారు ఇక్కడ ఉండుంటే ఆయనకు తెలుసు. అప్పుడు, నేను పార్లమెంటు సభ్యునిగా ఢిల్లీలో ఉన్నాను. మా పెద్దలందర్నీ కూర్చోబెట్టి, ఎలాగైనా అనంతపురం జిల్లాకు నీళ్లు ఇవ్వాలి, లేకపోతే ఆ అనంతపురం జిల్లా భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, కెసి కెనాల్‌కు కేటాయించిన రివర్ అసిస్టెన్స్‌లో 10 టిఎమ్‌సీల నీళ్లు అనంతపురం హెఎల్‌సీకు కేటాయించాలని ఆలోచించిన మొదటి మహానుభావుడు శ్రీ ఎన్.టి.రామారావుగారు. 1985వ సంవత్సరంలోనే అఖిలపక్ష సమావేశం పెట్టి, ఒక తీర్మానాన్ని ఆమోదింపజేసి, దానిని తర్వాత శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 10 టిఎమ్‌సీలు ఇస్తే సమస్య అవుతుందని, మొదటి దశ కింద 5 టిఎమ్‌సీల ఇద్దామని అన్నారు. అనంతపురం జిల్లాలో 35 సంవత్సరాల కాలంలో అదనంగా ఒక ప్రభుత్వ జీ.ఒ. ద్వారా 5 టిఎమ్‌సీలు కేటాయించిన మొదటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారే. దానిని రాజేశేఖర్‌రెడ్డిగారికి ఆపాదిస్తున్నారు. శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఇచ్చిన జీ.ఒ. ఆధారంగా, మళ్లీ డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తర్వాత, మొదటి జీ.ఒ.లో ఉంటుంది చదవండి. ఆ జీ.ఒ. ఆధారంగా 5 టిఎమ్‌సీలకు అదనంగా ఇంకో 5 టిఎమ్‌సీలను కేటాయించారే తప్ప, 10 టిఎమ్‌సీలను రాజశేఖర్‌రెడ్డిగారు కేటాయించలేదు. ఆ 10 టిఎమ్‌సీల జీ.ఒ.కు మూలం శ్రీ నారా చంద్రబాబునాయుడుగారే. మొట్టమొదట 5 టిఎమ్‌సీలను కేటాయించింది కూడా శ్రీ నారా చంద్రబాబునాయుడుగారే. తుంగభద్ర రిజర్వాయర్‌లో పూడిక పెరిగిపోయిన కారణంగా, నష్టపోతున్న నీటిని సద్వినియోగం చేసుకోవడానికి, ప్యారలల్ హై లెవెల్ ఫ్లడ్ కెనాల్ తీసుకురావాలంటే, ఆ వాదన కూడా సక్రమంగా వాదించకుండా వీగిపోయేలాగా చేసి, బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ద్వారా సమాంతర వరద కాలువకు కూడా అనుమతులు రాకుండా చేసిన ఘనత అప్పటి మీ ప్రభుత్వానికే దక్కుతుంది.

...

అంతే తప్ప, ఏదైనా ఆలోచన చేశారంటే, ఎన్టీరామారావు గారు ఆలోచన చేశారు, చంద్రబాబునాయుడు గారు ఆలోచన చేశారు. ఏదైనా ఇచ్చారు, అనంటే అది చంద్రబాబునాయుడు గారు ఇచ్చుంటారు తప్ప, రాజశేఖర రెడ్డిగారు ఇవ్వలేదు. వివరాలు తెలియకుండా, విషయాలు తెలియకుండా, మీరు జలయజ్ఞాన్ని మెచ్చుకుంటే మిమ్మల్ని ఎవరి వారసులు అనుకోవాలి? జలయజ్ఞాన్ని, 2007-12 మధ్య కాలంలో నీటిపారుదలరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు వృద్ధి చెందాయే తప్ప, కాలువల క్రింద సాగునీటి విస్తరణ ఏమాత్రం పెరగలేదని స్వయంగా ప్రణాళికా సంఘం చేసిన వ్యాఖ్యలున్నాయి. హైకోర్టు తీర్పు ఉంది. రూపాయి ఇరవై ఐదు పైసలు తేడా వస్తేనే బస్ కండక్టర్‌ను సస్పెండ్ చేస్తాము. అటువంటిది ఇలాంటి ప్రాజెక్టుల్లో వేలకోట్ల రూపాయలు అవినీతి జరుగుతూ ఉంటే, ప్రభుత్వం స్పదించడం లేదు, అనేది కూడా ఉంది. ఈ ప్రభుత్వ పనితీరు, ఉగాండా నియంత ఈడీ అమీన్ పాలనను తలపిస్తోందంటూ హైకోర్టు అక్షింతలు వేసింది. ఇవన్నీ మరచిపోతే ఎలా? జలయజ్ఞంలో జరిగిన అవినీతి గానీ, జలయజ్ఞం ఫలితాల గురించి గాని ఎవరైనా మాట్లాడాలనుకుంటే మేము సిద్ధంగా ఉన్నాము. ఈ రాష్ట్రంలో సాగునీటిపారుదలరంగాన్ని సక్రమంగా నిర్వహించింది తెలుగుదేశం పార్టీ, తెలుగుదేశం ప్రభుత్వం. మళ్ళీ ఈరోజు ఆ నీటిపారుదలరంగానికి కొత్త రూపాన్ని ఇవ్వబోతోంది కూడా తెలుగుదేశం ప్రభుత్వమే.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ఆనంద రావు గారు.

శ్రీ ఎ.ఆనంద రావు (అమలాపురం)ః అధ్యక్షా, డిమాండ్స్ మీద, పంచాయితీ వ్యవస్థ, స్థానిక సంస్థలు అనే అంశం మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. గ్రామాల అభివృద్ధే ఈ దేశ అభివృద్ధి. మహాత్మాగాంధీ గారు చెప్పినట్లుగా, నిజమైన గ్రామస్వరాజ్యం కోసం ఈరోజు మనం మాట్లాడుకుంటున్నాం.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ఇరిగేషన్ సబ్జెక్టు గురించి మాట్లాడుతున్నారా. లేక...

శ్రీ ఎ.ఆనంద రావు (అమలాపురం)ః లేదు సర్. స్థానిక సంస్థల అంశం మీద మాట్లాడుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః మీరు కూర్చోండి. ఇరిగేషన్ మీద చర్చ పూర్తి కానివ్వండి. జి.వి.ఆంజనేయులు గారు.

శ్రీ జి.వి. ఆంజనేయులు (ఉంగుటూరు)ః అధ్యక్షా, ఈ డిమాండ్స్‌పైన మొదటిసారిగా అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. గతంలో చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 1994-2004 దాకా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో

ఉన్నప్పుడు, ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి, చాలా సమర్థవంతంగా, ప్రణాళికాబద్ధంగా, చక్కగా అమలు చేసి, ప్రతీ రూపాయి సద్వినియోగం చేసి; నీరు ప్రాణాధారమని, అలాగే త్రాగునీరు, సాగునీరు ఈ దేశానికీ, రాష్ట్రానికీ, రాష్ట్ర రైతులయొక్క భవిష్యత్తుకీ ఉపయోగపడాలని, రైతులు ఆర్థిక ప్రగతి సాధించాలని చిత్తశుద్ధితో, గొప్ప లక్ష్యాలతో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబునాయుడు గారు కేవలం రూ.10,394 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి, 23 లక్షల ఎకరాలకు పైగా రైతుల పొలాలకు నీళ్ళిచ్చారు. అంటే ఎకరానికి ఒక లక్ష రూపాయలలోపు రూ.98000 మాత్రమే ఖర్చు పెట్టి నీళ్ళిచ్చారు. ఇది చరిత్రలోనే ఒక గొప్ప విషయం. కానీ 2004 తరువాత వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఖర్చుపెట్టింది రూ.95,539కోట్లు. కానీ సాగులోకి వచ్చిన భూమి చాలా తక్కువ. 2004లో టి.వి.లో ప్రకటనలు చూసి ఆశపడ్డాము. ఒక నాయకుడు నడిచిపోతూంటే, వారి వెనకే నీరు జలజలా పారుతోంది. ఆయన వెనకాల కృష్ణమ్మ పరుగెడుతూ ఉంది. దాని వెనకాలే ఒక్క నిముషంలో పచ్చని పైర్లు పెరిగినట్లు ... అది చూస్తూంటే, నిజంగానే రైతుల పొలాలకు నీళ్ళు వస్తాయేమోనని ఆశపడ్డాము. దురదృష్టమేమంటే, రైతుల పొలాలకు నీళ్ళు రాలేదు. కాలువల్లో నీళ్ళు పారలేదు. ప్రాజెక్టుల్లో నీళ్ళు నిండలేదు. కాని, రైతులు కష్టాల్లో కూరుకుపోయారు. అప్పుల్లో కూరుకుపోయారు. రైతుల కళ్ళల్లో నీళ్ళు నిండాయి గానీ, ప్రాజెక్టుల్లో నీళ్ళు నిండలేదు. దానికి కారణం స్వార్థ ప్రయోజనాలు. కేవలం జలయజ్ఞాన్ని అడ్డంపెట్టుకొని, ధనయజ్ఞం చేసుకొని, వేలకోట్ల రూపాయలు దోచుకోవడం చాలా బాధాకరం. కష్టాల్లో ఉన్న రైతులు, పేదరికంలో ఉన్న రైతులు, అప్పుల్లో ఉన్న రైతులు వీళ్ళకి కనబడకపోవడం చాలా బాధాకరం. సుమారు రూ.95,000 కోట్లు ఖర్చుపెట్టి, ఎకరానికి రూ.4,00,000ల పైన ఖర్చుపెట్టి, ప్రాజెక్టుల్లో నీళ్ళు నింపకపోవడం చాలా బాధాకరం. ఐదు సంవత్సరాల్లో పూర్తిచేస్తామన్న ప్రాజెక్టులు, పది సంవత్సరాలకి కూడా పూర్తి చేయకపోవడానికి గల కారణాలేంటి? నిర్మాణంలో సరైన ప్రణాళిక లేకపోవడం.

ఒక రైతుకు నలుగురు కొడుకులుంటే, ఆర్థికంగా తక్కువగా ఉంటే, ముందు రెండు ఇళ్ళ నిర్మాణం చేపడతాడు. తరువాత మిగిలిన రెండు ఇళ్ళు చేపడతాడు. ఒక చిన్న రైతుకు కూడా తన కొడుకులకు ఇళ్ళు నిర్మించుకోవడానికి ఒక ప్రణాళిక ఉంటుంది. కానీ, కోట్ల మంది రైతుల ఆర్థిక ప్రగతికి ముడిపడి ఉన్న పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి, ఒక ప్రణాళికాబద్ధత లేదని కాగ్ నివేదికలో కూడా వెల్లడైంది. ప్రణాళికా లోపంవల్లనే ఈ ప్రాజెక్టులు పూర్తి కాలేదని. దీనిలో అవినీతివల్లనే వేలకోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు దోచుకున్నారని, దళారులు దోచుకున్నారుని ప్రభుత్వ సంస్థ కాగ్ నివేదికలో వెల్లడైంది. రేట్లు పెంచిన విధానంలో దోచుకున్నారు. ప్రణాళికావ్యయం పెంచడంలో దోచుకున్నారు. అదేవిధంగా ప్రాజెక్టుల నిర్మాణాలతోపాటు, స్వంత ఖజానాలు నింపుకోవడానికి బడ్జెట్‌లో కేటాయించుకుని దోచుకోవడం చాలా బాధాకరం. ఈవిధంగా ఆనాడు ప్రాజెక్టుల్లో దోచుకున్న వాస్తవాలు మాట్లాడడానికి 30 రోజులపాటు సమయం ఇచ్చినా సరిపోదు. ఆనాడు జరిగిన అవినీతి గురించి చర్చించడానికి సమయం

సరిపోదు. కాగ్ తనిఖీ చేసి ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రాజెక్టు వారీగా నష్టపోయింది... ఒక ప్రాజెక్టులో రూ.2375 కోట్లు, కల్వకుర్తి ప్రాజెక్టులో రూ.402 కోట్లు, ఎల్లంపల్లి ప్రాజెక్టులో రూ.359 కోట్లు. ఈవిధంగా ఎంతో దోపిడీ జరిగింది. గత పదేళ్ళలో రూ.95,000 కోట్లలో సగానికి పైగా అవినీతిమయం అయ్యింది. కాంట్రాక్టర్లు తప్పు చేశారనీ, రికవరీ చేయమంటే, రికవరీ చేయలేదు. దొంగలు, దొంగలు ఊళ్ళు పంచుకున్నట్లు, వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు దోచిపెట్టారు. అదేవిధంగా, ఈ చేత్తో మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇచ్చి, ఆ చేత్తో తీసుకుని దోచుకున్నారు. వేలకోట్ల రూపాయల డబ్బులు ఇలా దోపిడీకి గురవడం ఎంతో బాధాకరం. ఒక్క ఎల్లంపల్లి ప్రాజెక్టులోనే రాత్రికి రాత్రే రూ.400కోట్ల మేర అంచనాలు మార్చారు. ఈ విషయమై చంద్రబాబునాయుడు గారు ఆనాడు శాసనసభలో మాట్లాడారు. రాత్రికి రాత్రే వందల కోట్లు అంచనాలు మారుతున్నాయి. వెరిఫై చేయాలని కోరినా, ఆనాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. యథేచ్ఛగా దోపిడీ చేశారు. ఆనాడు అల్లూరి సీతారామరాజు మనదేశం కోసం పోరాడి స్వతంత్రం తెచ్చారు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఆంజనేయులు గారూ ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ జి.వి.ఆంజనేయులు (ఉంగుటూరు): అధ్యక్షా, ఒక్క నిముషం. అన్న ఎన్టీ రామారావు గారు తెలుగువారి గొప్పదనం ప్రపంచానికి చాటిచెప్పి, పేదలకోసం ఎన్నో అభివృద్ధి పథకాలు తీసుకువచ్చారు. సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళు అంటూ రాజకీయాలకే కొత్త భాష్యం చెప్పినటువంటి మహానుభావుడు. కానీ, ఈరోజు తెలుగువారు ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకొని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని లక్షల కోట్లు దోచుకోవడం ప్రపంచ చరిత్రలో అవినీతికి ఇది పరాకాష్ఠ. అధ్యక్షా,ప్రభుత్వాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్లు దోచుకోవడం ప్రపంచ చరిత్రలో అవినీతికి పరాకాష్ట. ఒక తెలుగువాడు ఇన్ని లక్షల కోట్లు దోపిడి చేయడమన్నది చాలా బాధాకరం.

...

శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు జంజావతిలో రబ్బర్ డ్యాంను ప్రారంభించి నా జన్మ ధన్యమైందని హెలీకేప్టర్ ఎక్కి హైదరాబాదుకు వచ్చేలోపు ఆ డ్యాం కొట్టుకొపోయింది. ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల, అవినీతి వల్ల అలా జరిగింది. ఇది చాలా బాధాకరమైన విషయం. వందల ప్రాణాలు పోయినా, రైతులకు నీరు అందకపోయినా, కోట్ల రూపాయాలు దుర్వినియోగం అయినా పరవాలేదు కాని మా సొంత ఖజానాలు నిండాలని, మా ఆస్తులు వేల కోట్ల రూపాయలుగా పెరగాలని శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం భావించింది. ఇది చాలా దురదృష్టకరం. ప్రాజెక్టుల నిర్మాణంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాల్సిన అవసరం ఉంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : దయచేసి ముగించండి.

శ్రీ జి.వి.ఆంజనేయులు (ఉంగుటూరు)ః ఆనాడు కాంట్రాక్టర్లు దోచుకున్న డబ్బును తిరిగి వసూలు చేయమంటే నిర్లక్ష్యం వహించారు. పేదలకు, రైతులకు ఉచిత విద్యుత్తు అని కేవలం మూడు గంటలే ఇచ్చారు. విద్యుత్తును ఇతర ప్రాంతాలకు అమ్ముకున్నారు. రూ.28,000 కోట్లు సర్‌చార్జ్, ఫ్యూయల్ సర్‌చార్జ్ క్రింద ప్రజల నుంచి వసూలు చేశారు. ప్రభుత్వం ఏ విధంగా ఉచిత విద్యుత్తు ఇచ్చినట్లు అవుతుంది. ఇది చాలా బాధాకరమైన విషయం. కాంట్రాక్టర్లపై వేల కోట్ల పెనాల్టీలు పడినా వసూలు చేయకుండా ప్రభుత్వం వదలివేసింది. కానీ పేద ఎస్సీ, ఎస్టీ వారు కరెంట్ బిల్లు కట్టలేమంటే వారి కాలనీలకు కరెంట్ కట్ చేశారు. ఇది చాలా బాధాకరమైన విషయం. **(బెల్)** కాగ్ నివేదిక ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపింది. ఆ రిపోర్టు నా దగ్గర ఉంది. ఈ రిపోర్టును ప్రతిపక్ష నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి చదవమని నేను కోరుతున్నాను. ఎందుకంటే ఎన్ని కోట్ల రూపాయల అవినీతి, దోపిడీలు జరిగాయో ఒకసారి గుర్తుకు తెచ్చుకోడానికి ఈ నివేదిక ఉపయోగపడుతుంది. ఆనాడు జరిగిన అవినీతిలో 20, 30 శాతం కమీషన్లు మాట్లాడుకున్న వాటిలో ఇంకేమైనా మిగిలి ఉంటే వాటిని వసూలు చేసుకోడానికి ఈ కాగ్ నివేదిక ఉపయోగపడుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : దయచేసి ముగించండి.

శ్రీ జి.వి.ఆంజనేయులు(ఉంగుటూరు)ః అధ్యక్షా, 10 సంవత్సరాలలో ప్రాజెక్టులు పూర్తికాక లక్షలాది రైతులు నష్టపోయారు. ఎన్‌సీబీసీ రిపోర్టు ప్రకారం 2004 నుండి 2013 దాకా 24,012 ఆత్మహత్యలు జరిగాయని రిపోర్టు చెబుతుంది. దీనికి కారణం ఆనాటి పాలకులే. డబ్బు దోచుకోకుండా, ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుకు నీరు, గిట్టుబాటు ధర ఇచ్చి ఉంటే ఇన్ని ఆత్మహత్యలు జరిగి ఉండేవా? రైతుల ఆత్మహత్యలు జరిగినపుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు ఓదార్పుయాత్ర చేశారు.. **(బెల్)** తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు రాష్ట్రాన్ని దోచుకున్నారు. మా కుటుంబం దోచుకున్నందున మీ కుటుంబం నష్టపోయిందని 'క్షమాభిక్ష యాత్ర' చేయాల్సి ఉంది. ఆత్మహత్యలు చేసుకున్న ప్రతి రైతు ఇంటికి శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు వెళ్ళాల్సిన అవసరముంది. (ప్రతిపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు) ఇప్పుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు మారాల్సి ఉంది. మంచి ప్రతిపక్ష నాయకుడిగా ఈ సభలో ఉండాలని మేము కోరుకుంటున్నాం. ఈ రాష్ట్ర అభివృద్ధికి మంచి, సలహాలు, సూచనలు ఇచ్చే సమర్థుడైన ప్రతిపక్ష నాయకుడి మాకు కావాలి. జరిగిన పాపాన్ని సరిదిద్దుకోడానికి ప్రతి రైతు ఇంటికి వెళ్ళి క్షమాపణ చెబితే ఆ పాపం కొంతైనా తగ్గుతుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ : మిగిలిన సభ్యులు మాట్లాడాల్సి ఉంది, దయచేసి ముగించండి.

శ్రీ జి.వి.ఆంజనేయులు (ఉంగుటూరు): అధ్యక్షా, తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం చాలా చిత్తశుద్ధితో ఉంది. బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఆలోచిస్తున్నారు. రాష్ట్రం రూ.16,000 కోట్ల లోటు బడ్జెట్‌లోనున్న వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం చాలా అభినందనీయం. గతంలో జరిగిన అవినీతి జరగకుండా మంత్రిగారు అదుపు చేయాలని, ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతున్నాను. తెలుగుదేశం ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేస్తుందన్న నమ్మకం మాకు ఉంది. వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి రూపాయి రైతులకు ఉపయోగపడుతుంది. ఆనాటి ప్రభుత్వంలో జలయజ్ఞంలో ధనం పారినట్లు కాకుండా ఈ ప్రభుత్వంలో నీరు పారుతుంది. ఆనాడు లూటీ చేసిన కాంట్రాక్టుల నుంచి రికవరీ చేసి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి సద్వినియోగం చేయాలని మంత్రి గారిని కోరుతున్నాను.

(ఈ సందర్భంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి తన స్థానంలో నిలబడి పది ప్రాజెక్టు పేర్లను చెప్పండని శ్రీ జి.వి.ఆంజనేయులు గారిని అడిగారు)

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి (కొత్తపేట): అధ్యక్షా, బడ్జెట్ కేటాయింపును చూస్తే నీటి పారుదల శాఖపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఎంత ఉందో తెలుస్తుంది.  సర్ ఆర్థర్ కాటన్ మన దేశం, మన ప్రాంతం వాడు కాదు. 1880లో ఆయన నిర్మించిన ప్రాజెక్టులు భూములను సశ్యశామలం చేశాయో, రైతాంగం కుటుంబంలో పిల్లలకు ఆయన పేరు పెట్టుకొనే సంస్కృతి ఇప్పటికీ ఉంది. ఈ రోజు 60 శాతానికి పైగా వ్యవసాయ భూమిపై ఆధారపడిన రైతాంగానికి గత 50 సంవత్సరాలలో ఎంతో మంది ముఖ్యమంత్రులు మారినప్పటికి కూడా 60 లక్షల ఎకరాలు సాగులోకి వస్తే, ఒక్క శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వ హయాంలోనే ఎన్నో లక్షల ఎకరాలు సాగులోకి వచ్చింది. మొన్న శ్రీ యనమల రామకృష్ణుడు బడ్జెట్ డాక్యుమెంట్‌లో 2004వ సంవత్సరం తరువాత శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వ హయాంలో ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయో చెప్పారు. కాని 2004వ సంవత్సరం ముందు శ్రీ చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వ హయాంలో ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయో చెప్పలేదు.

2004వ సంవత్సరం నుంచి రూ.80,620 కోట్ల అంచనా వ్యయంతో 54 భారీ, మధ్యతరహా సాగునీటి పథకాలు చేపట్టబడ్డాయి. ఇందులో 13 పథకాలు పూర్తి చేయబడ్డాయని స్వయంగా ఆర్థిక శాఖామంత్రిగారు బడ్జెట్ డాక్యుమెంట్‌లో చూపితే, నిన్న శ్రీ చంద్రబాబు నాయుడు గారు మాట్లాడుతూ శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వ హయాంలో ఒక్క ఎకరం కూడా సాగులోకి రాలేదని అన్నారు. చిన్నవాడైన శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారిని చూస్తే అధికారపక్షం వారికి గుండెల్లో రైళ్లు పరిగెడుతాయి.

(అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు)

మొన్న శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారి బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి ప్రజలు అధికారం ఇచ్చారు. అవసరమైన సాగునీటి పథకాలను ముందుకు నడిపించండి మేము మీకు సహకరిస్తామన్నారు. శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన జలయజ్ఞంలో అనేక ప్రాజెక్టులు పూర్తి అయ్యాయి. కొన్ని ప్రాజెక్టులకు తక్కువ నిధులు ఖర్చు చేస్తే సాగులోకి వస్తాయి. మొన్న శ్రీ వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి గారు 9 ప్రాజెక్టుల పేర్లు చెప్పారు.

...

ఆ తొమ్మిది ప్రాజెక్టులకయ్యే ఖర్చు రూ.4,501 కోట్లు. కానీ రైతుల శ్రేయస్సు కోరేవాళ్లమని, రైతు పక్షపాతులమని చెప్పుకునే వీరు కేవలం రు. 301 కోట్ల కేటాయింపులతో మాత్రమే ఈ ప్రాజెక్టులకు సరిపెడుతున్నారన్న విషయం ఈ సందర్భంగా ఇక్కడ అందరూ గమనించాలి. జలయజ్ఞం అంటే ధన యజ్ఞమని ఆ పేరుతో దోచేశారని చెబుతున్నారు. ఆ ప్రాజెక్టులకు సంబంధించిన కాంట్రాక్టర్లెవరని నేను ఈ సందర్భంగా వారిని అడుగుతున్నాను. ముఖ్యంగా నామా నాగేశ్వరరావుగారు ఎవరని నేనడుగుతున్నాను. ఆయన తప్పు చేశారని నేనటం లేదు. సాధారణంగా కాంట్రాక్టర్లనే వారు లాభాలు సంపాదించుకోవడానికో, నాలుగు డబ్బులు సంపాదించుకోవడానికో కాంట్రాక్టులు చేస్తారు తప్ప నష్టాలు భరించడానికి ఎవరూ రారన్న విషయాన్ని తెలియజేస్తున్నాను. ఆనాటి జలయజ్ఞం కాంట్రాక్టర్లలో నామానాగేశ్వరరావు గారు, ఆదాల ప్రభాకర రెడ్డి గారు, రాయపాటి సాంబశివరావు గారు, సిఎమ్ రమేశ్ గారు కడప ఎమ్‌పిగా వున్న శ్రీనివాస రెడ్డి గారు వీళ్లంతా ఎవరు? అంటే నాటి జలయజ్ఞంలో డబ్బులు చేసుకోవడానికి మీరు మీ వాళ్లను ప్రోత్సహించారా అని నేను ఈ తెలుగుదేశం పార్టీ వారిని అడుగుతున్నాను.

...

స్కూలుకు చదువుకోవడానికి వెళ్లే అబ్బాయి ఎలా చదువుతున్నాడన్న విషయాన్ని మనం కూడా అతనితో పాటు స్కూలుకెళ్లి తెలుసుకోవలసిన అవసరం లేదు. అతని ప్రోగ్రెస్ రిపోర్టు చూస్తే తెలుస్తుంది. అదేవిధంగా గతంలో చంద్ర బాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఇరిగేషన్ రంగానికిచ్చిన ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలంటే ఒక్కసారి గతంలోకి వెళితే చాలు. చంద్ర బాబు నాయుడు గారు ముఖ్యమంత్రి కాకముందు అంటే 1995-96కు ముందు రాష్ట్రంలో నెట్ ఇరిగేటెడ్ ఏరియా 41.59 లక్షల హెక్టార్లుంటే చంద్ర బాబునాయుడుగారు వచ్చిన తరువాత మరియు ఆయన ముఖ్యమంత్రిగా దిగిపోయే ముందు వరకు అంటే 2003-04లో అది 38.28 లక్షల హెక్టార్లకు తగ్గిపోయిన మాట వాస్తవం కాదా? అదే రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత 38.28 లక్షల హెక్టార్ల నుండి దానిని 46.19 లక్షల హెక్టార్లకు పెంచిన మాట వాస్తవం కాదా అని నేనడుగుతున్నాను. ఈ వివరాలు నేను సొంతంగా తయారు చేసి చెప్పడం లేదు. ఎకనమిక్ సర్వేలో ప్రభుత్వం

తెలియజేసిన వివరాలలో ఇవి వున్నాయని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. అలాగే పోలవరం ప్రాజెక్టు మా కష్టార్జితం అని, చంద్రబాబునాయుడుగారి కష్టార్జితమన్నట్లుగా చెబుతున్నారు. ఈ సందర్భంగా నేను ఒక విషయం మనవి చేయదలచుకున్నాను. తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా డెల్టాకు పోలవరం ఒక వరప్రసాదిని వంటిది. మా ప్రాంతంలో వున్న మొత్తం రైతాంగానికి అక్కడున్న ఆయకట్టును స్థిరీకరించుకోవడానికి మాత్రమే కాకుండా 194 టిఎమ్‌సీల నీటిని అక్కడున్న రైతాంగానికి ఉపయోగించుకునే అవకాశముండడమే కాకుండా 80 టిఎమ్‌సిల నీటిని కృష్ణానది నుంచి తరలించుకునే అవకాశం కూడా ఉంది.

...

గతంలో కేంద్ర జలవనరుల సంఘం వారు నియమించిన ఖోస్లా కమిటీ వారు కృష్ణా బేసిన్ నుంచి 350 టిఎమ్‌సిల నీటిని గోదావరి బేసిన్‌కు తరలిస్తే మంచిదని ఒక సిఫార్సు చేయడం జరిగింది. కృష్ణా జలాలపై ఏర్పాటు చేయబడిన బచావత్ కమీషన్ వారు కూడా బలపరచడం జరిగింది. అటువంటి సిఫారసులు చేసిన తరుణంలో ఆ తరువాత చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చారు. అవన్నీ ముట్టుకోవడం దండగ అనుకున్నారు. ఆయన మనసులో మాట అని చెప్పారు. ఆ మనసులో మాట పుస్తకంలో పేజీనెంబర్ 125లో అనుకుంటాను. సాగునీటి వ్యవస్థలో కాలువలు తవ్వితే లాభసాటిగా వుండవని ఆయన చెప్పడం జరిగింది. అలాంటి వ్యక్తి హయాములో పోలవరం ప్రాజెక్టుకు ఒక్కడుగు కూడా ముందడుగు వేసిన పాపాన పోని పరిస్థితుల్లో ఈ రోజున పోలవరం మా ఘనత అని ఏ విధంగా చెప్పుకుంటున్నారో ఒక్కసారి ఆలోచించాలని నేను వారిని కోరుతున్నాను.

...

రాజశేఖర రెడ్డి గారు ఏమి చేశారని ప్రశ్నిస్తే నాలుగు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి కాలువలు తవ్వించారు. రాజధానికి స్థలం నిర్ణయించడం కోసం ప్రచారాలు చేస్తున్నారు తప్పితే ఇంకా ఫైనలైజ్ చేయలేకపోయారు. రాజశేఖరరెడ్డి గారు పోలవరం ప్రాజెక్టుకు కాలువలు తవ్వారు గనుకే అది ఈ రోజు కాకున్నా రేపైనా పూర్తవుతుందన్న నమ్మకం అక్కడి ప్రజల్లో వుందన్న విషయాన్ని ఈ సందర్భంగా మీకు గుర్తు చేస్తున్నాను. అదేవిధంగా ఏదైతే పోలవరం పాజెక్టు వుందో దాని నిర్మాణం విషయంలో జాప్యం జరిగిన మాట వాస్తవమే. కారణమేమంటే దానికి సంబంధించిన కాంట్రాక్టు సంస్థ మధుకాన్ కంపెనీ యజమాని నామానాగేశ్వరరావు గారు వారి పార్టీకి సంబంధించిన వారే. ఆ కంపెనీ వారు అక్కడున్న రాక్‌ఫిల్ డ్యామ్‌ను కొంతవరకు పూర్తి చేసి తరువాత వదిలిపెట్టి వెళ్లిపోవడం జరిగింది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: కన్‌క్లూడ్ చేయండి.....

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి (కొత్తపేట): లాభాలు వచ్చే పనులు చేసి మిగతావి వదిలిపెట్టి వెళ్లిపొమ్మని వీరు వాళ్ల పార్టీవాళ్లను అలాంటి కార్యక్రమాలకు ప్రోత్సహించారా అని నేను అడుగుతున్నాను. తరువాత ఆ పనిని ట్రాన్స్టానిక్ అనే కంపెనీకి అప్పగించడం జరిగింది.

దాని మీద సోమా కంపెనీ వాళ్లు కోర్టుకెళ్లడం, దాని మీద కొన్ని ఇబ్బందులొచ్చి మళ్లీ చైనా పంపించి వారి అర్హతలపై కూడా వెరిఫై చేయించే కార్యక్రమాలు కూడా చేశారు. అవన్నీ పేపర్లలో కూడా వచ్చాయి. మనందరం చూశాము. ట్రాన్స్టానిక్ కంపెనీకి వున్న ఎక్స్పీరియన్స్ మీద, వారి అర్హతల మీద చైనా వెళితే అక్కడ వీళ్లు మొన్నటి వరకు ఓటు వేసి నిలబెట్టిన వీళ్ల ప్రభుత్వం, ఏదైతే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందో ఆ ప్రభుత్వానికి చెందిన రాయపాటి సాంబశివ రావు గారి హోటల్‌లోనే వాళ్లంతా వుండి వారికి అనువుగా ఈ కార్యక్రమాలన్నీ చేశారనే మాట మొన్న పేపర్లలో కూడా వచ్చిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ రకంగా జలయజ్ఞం పనుల్లో మీ కాంట్రాక్టర్లను పెట్టి వాళ్ల ద్వారా ఇలాంటివన్నీ చేసి నిందలు ఎందుకు రాజశేఖరరెడ్డి గారి మీద వేస్తున్నారని నేను వీళ్లను అడుగుతున్నాను.

ఇక గోదావరి డెల్టా మాడర్నైజేషన్ కోసం రూ.3300 కోట్లు ఖర్చు పెట్టిన ఘనత రాజశేఖర రెడ్డి గారిది. సర్ ఆర్థర్ కాటన్ తరువాత మళ్లీ అన్ని నిధులు ఖర్చు పెట్టి చేయించిన మొనగాడు రాజశేఖర రెడ్డి తప్ప ఎవరూ లేరు. ఆనాటి కాటన్ మన జాతీయుడు కాకపోయినప్పటికీ మన రైతాంగం కోసం తీసుకొచ్చిన ఆ ప్రాజెక్టు వంద సంవత్సరాలు దాటిపోయింది కాబట్టి వాటిని మాడర్నైజేషన్ చేయడం కోసం రాజశేఖరరెడ్డి గారు రూ.3,300 కోట్లు శాంక్షన్ చేశారు. మరి ఇవ్వాళున్న చంద్రబాబునాయుడుగారు చేసిన ఇరిగేషన్ కోసం శాంక్షన్లేవని అడుగుతున్నాను. చంద్రబాబునాయుడుగారు అధికారంలో వున్న తొమ్మిదేళ్ల కాలంలో సమారు వెయ్యి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఇంకుడు గుంతలు తవ్వారు. మరి ఆ గుంతల్లో నీళ్లెక్కడికి పోయాయో, ఆ వెయ్యి కోట్లు డబ్బెక్కడికి పోయాయో ఈ నాయకులు సమాధానం చెప్పాలని నేను కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కన్‌క్లూడ్ చేయండి....

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి (కొత్తపేట)ః ఒక్క నిమిషం అధ్యక్షా...... అలాగే గోదావరి డెల్టా మాడర్నైజేషన్‌కు సంబంధించి 16 ప్యాకేజీలను ఇవ్వడం జరిగింది. ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. రాష్ట్రంలో పరిపాలన చేయమని ప్రజలు మీకు అధికారం అప్పగించారు కాబట్టి వాటిని సకాలంలో పూర్తిచేయించే పనులు చేయకుండా మీరు అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడచినా ఇంకా మీరు రాజశేఖరరెడ్డిగారి మీదనో, జగన్మోహన్‌రెడ్డిగారి మీదనో మీకున్న భయాన్ని రోజుకు నాలుగైదు సార్లు ప్రదర్శించుకుంటున్నారని తెలియజేస్తున్నాను. అలాగే చంద్ర బాబు నాయుడు గారు గతంలో.. . **(మైకు ఆగిపోయింది...)**

శ్రీమతి పి.యామినీబాల (సింగనమల)ః అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుగారు అభివృద్ధికి ఎంత ప్రాధాన్యమిస్తామన్నారో, అవినీతిపై అంతే

కఠినంగా వ్యవవహరిస్తామన్నందుకు వాళ్ల ప్రభుత్వాలలో చేసిన అవినీతి కార్యక్రమాల పైన ఉక్కుపాదం మోపుతామన్నందుకు ఇక్కడున్న ప్రతిపక్ష సభ్యుల గుండెల్లో అప్పుడే రైళ్లు పరుగెడుతున్నాయి. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గానికి సంబంధించిన చిన్న ఉదాహరణ చెబుతాను. గత పది సంవత్సరాలుగా రైతులెదుర్కొంటున్న సమస్యలు, చేసిన ధర్నాలు, కన్నీటి వ్యథ. ఏ చెరువుకూ చారెడు నీళ్లు లేవు. గతంలో కృత్రిమ వర్షాలు. వీరి జల యజ్ఞం గురించి ఒకే ఒక ఉదాహరణ వివరిస్తాను.

...

జలయజ్ఞంలో మరొక అవినీతి కోణం కృత్రిమ వర్షాలు. ఉదయం వేళ, కనిపించే వేళ మేఘాలపైన వర్షం కురిపిస్తామని రెండు మార్లు విమానాల ద్వారా ప్రయత్నాలు చేశారు. అది కూడా రాత్రి చీకటి పడిన తరువాత విమానం వచ్చింది. వర్షం కురుస్తుందని ఎదురు చూసిన మాకు విమానాలు అలా వచ్చి ఇలా వెళ్లినందుకే వేల కోట్ల రూపాయలు ఎవరి చేతుల నుండి ఎవరి చేతులకు మారాయన్నది గత ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఇక్కడ కూర్చున్న ప్రతిపక్ష సభ్యులు అధైర్యపడి ఏకంగా వాకౌట్, జాకౌట్ అనే విధంగా వ్యవహరిస్తున్నారు.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి (కొత్తపేట)ః అధ్యక్షా, శ్రీనివాస్ గారు మాట్లాడుతూ రాయలసీమలో ఒక్క ఎకరానికైనా నీరిచ్చారా అని అడిగారు. రాయలసీమలోని హంద్రీ-నీవాకు రూ.4,200 కోట్లు రాజశేఖర్ రెడ్డి గారు కేటాయించి పాక్షికంగా నీటినందిస్తున్న మాట వాస్తవమా, కాదా అని ఒకసారి ఆలోచించమని వారిని కోరుతున్నాను. గతంలో రెండు సార్లు శంకుస్థాపన చేసి కనీసం రూ.200 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఘనత చంద్రబాబునాయుడుగారికే దక్కింది. శిలాఫలకాలు వేసిన వారికి వాటికైన ఖర్చు కూడా ఇవ్వని ఘనత చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుందని మనవి చేస్తున్నాను. ప్రస్తుతం హంద్రీ-నీవా ద్వారా పది టిఎంసీల నీరు సద్వినియోగం అవుతున్న సంగతి గౌరవ సభ్యులు శ్రీనివాస్ గారు తెలుసుకోవాలి.

గోదావరి డెల్టాకు అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు రూ. 3,300 కోట్లు మంజూరు చేశారు. అవి పూర్తి కావాలంటే ఇంకా నిధులు మంజూరు చేయాలని చెబుతున్నారు, వాటి మీద కూడా శ్రద్ధ వహించాలి. గోదావరి లంక భూములు వర్షాకాలంలో కోతకు గురవుతున్నాయని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. ప్రతి సంవత్సరం గోదావరి వరద వచ్చినప్పుడు ఇక్కడున్న రైతుకు పట్టా భూమి గత సంవత్సరం అయిదెకరాలుంటే వచ్చే సంవత్సరానికి నాలుగెకరాలే ఉంటుంది. నదీ కోతవల్ల భూమి నదీగర్భంలో కలిసిపోతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః ఇప్పటికే చాలా మాట్లాడారు. ఒక్క నిమిషంలో పూర్తి చేయండి. ఇంకా మాట్లాడవలసినవారు చాలా మంది ఉన్నారు.

శ్రీ చిర్ల జగ్గిరెడ్డి (కొత్తపేట)ః అధ్యక్షా, గత పదవ తేదీ నుంచి జరుగుతున్న ఈ బడ్జెట్ సమావేశాలలో అనేక విషయాలు ప్రస్తావనకొచ్చాయి. జలయజ్ఞం-ధనయజ్ఞం అని చెబుతున్న మీరు ప్రాజెక్టుల అంచనాలు పెరిగాయని చెబుతున్నారు. గతంలో కూడా సర్ ఆర్థర్ కాటన్ గారు కాటన్ బ్యారేజీని రూ.4 లక్షలతో ఆనకట్ట పూర్తి చేశారు. ప్రకాశం బ్యారేజీ నిర్మాణం చేపట్టినప్పుడు అంచనా రూ.26 కోట్లు కాగా ఆ బ్యారేజీ పూర్తి అయ్యే నాటికి రూ.70 కోట్లు అయింది. అలాగే వంశధార ప్రాజెక్టుకు మొదటి అంచనా వ్యయం రూ.8.78 కోట్లు అయితే అది 2004-05కు పూర్తి అయ్యే నాటికి రూ.113 కోట్లు అయింది. కాలం గడిచే కొద్దీ ధరలు పెరుగుతాయి. మీరు 2004 సంవత్సరం ప్రకారమే ఏ ప్రాజెక్టులు నిర్మాణం చేపట్టినా ఉన్నటువంటి అంచనాలను పెంచకుండానే మీరు 2004 సంవత్సరం ధరలకే పూర్తిచేసే శక్తి మీకు ఉన్నదా అని అడుగుతున్నాను. తెలుగు తమ్ముళ్ల మీద ఉన్న విశ్వాసంతో నారా చంద్రబాబు నాయుడు గారు మొన్న గవర్నర్‌గారి పాలనలో కేవలం రూ.లక్షతో నామినేషన్ వేసుకోవచ్చుననే జి.ఓను మారుస్తూ దానిని రూ.5 లక్షల వరకు నామినేషన్ మీద ఇవ్వొచ్చునని నారా చంద్రబాబునాయుడుగారు స్వయంగా ప్రకటించి కొత్త జి.ఓను విడుదల చేశారనే విషయాన్ని సగౌరవంగా మనవి చేస్తున్నాను. వాస్తవానికి ప్రకాశం బ్యారేజీ గాని ఇంకొకటి గాని అప్పట్లో కాలాన్ని బట్టి వ్యయం పెరగడం జరిగింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కూడా 1960లో రూ.91.12 అంచనాలు వేసినప్పటికీ అది పూర్తయ్యే నాటికి రూ.1300 కోట్లు అయింది. సాగునీటి కార్యక్రమాలకు సంబంధించిన అభివృద్ధిని చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు గారి పాలనా సమయంలో ఏం చేశారన్నది చెప్పమంటే వారి దగ్గర చెప్పడానికి సమాధానం లేదు కనుక కేవలం జలయజ్ఞం-ధనయజ్ఞం అనే మాటలు చెబుతూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

శ్రీ పులపర్తి నారాయణమూర్తి (గన్నవరం)ః అధ్యక్షా, ముందుగా మీకు నా నమస్కారాలు. మాది తూర్పు గోదావరి జిల్లాలోని గన్నవరం నియోజకవర్గం. మా నియోజకవర్గంలో క్రాప్ హాలిడే కింద రైతులందరూ సుమారు 200 ఎకరాలలో పంట వేయకుండా వదలిచేయవలసి వచ్చింది. క్రాప్ హాలీడే ప్రకటించినందున అప్పుడున్న ముఖ్యమంత్రి కూడా ఏ విధమైనటువంటి నష్టపరిహారం ఇస్తామని చెప్పలేదు. 100 మంది రైతులు అకాల మరణం చెందారన్న విషయం ప్రభుత్వానికి తెలుసు. కాబట్టి క్రాప్ హాలీడే ప్రకటించినందున చనిపోయిన 100 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను. గత ప్రభుత్వం హయాంలో కాలువలపై లస్కర్లను పెట్టాం, ఇప్పుడు వారందరినీ తీసేసి రైతులు ఇష్టముంటే వ్యవసాయం చేసుకోండి, లేదంటే మానేయండి అన్నట్లుగా వ్యవహరించడం వలన మురుగునీటి కాల్వలలో మురుగునీరు పోవడానికి కూడా అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. లస్కర్లను తిరిగి నియమించాలని ప్రభుత్వాన్ని మీ ద్వారా కోరుతున్నాను. క్రాప్ హాలీడే ప్రకటించినందున మా నియోజకవర్గంలో చనిపోయిన 100 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించాలని గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

శ్రీ వి.వి.శివరామరాజు(ఉండి): అధ్యక్షా, 2014-15 సంవత్సరానికి భారీ మరియు మధ్య తరహా చిన్న తరహా సాగునీటి, మురుగునీటి ద్వారా ప్రకృతి వరద నియంత్రణ ఉన్న ప్రాజెక్టులకున్న డిమాండ్ సుమారు రూ.7913,94,13,000/-లను నేను బలపరుస్తున్నాను. ముఖ్యంగా మన రాష్ట్రం వ్యవసాయం మీద ఆధారపడిన ప్రాంతం. వ్యవసాయ రంగం ద్వారానే కచ్చితంగా పేదరికాన్ని నిర్మూలించుకోవలసిన ఆవశ్యకత ఉన్నది. మనకు స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సలు అయినప్పటికీ ఇప్పటికి కూడా కొన్ని ప్రాంతాలకు నీరు అందని పరిస్థితులలో అతివృ ష్టి, అనావృష్టితో బాధపడే పరిస్థితులున్నాయి. దీనిని అధిగమించడానికి సైంటిఫిక్‌గా ఆలోచించి మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దగల సామర్థ్యం మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ఉన్నది. కచ్చితంగా వ్యవసాయ రంగంలో ప్రతి నీటిబొట్టును వినియోగం చేసుకోవడానికి మన గౌరవ మంత్రివర్యులు దేవినేని ఉమామహేశ్వరరావు గారికి పూర్తి అవగాహన, సమర్థత ఉన్నది కాబట్టి వ్యవసాయరంగంలో ప్రతి ఎకరానికి నీరు అందించేవిధంగా చర్యలు తీసుకుంటారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఉత్తరాంధ్రకు, రాయలసీమకు నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నది. కృష్ణాడెల్టాలో నీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి ఉన్నది. ప్రస్తుతం మనకు పోలవరం ఒక వరంలాగా ఉన్నది. పోలవరం ఆర్డినెన్స్ తీసుకొచ్చినందువల్ల మనమందరం ధైర్యంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీగారికి, కేంద్రమంత్రి, పెద్దలు వెంకయ్యనాయుడు గారికి మరియు నారా చంద్రబాబునాయుడుగారికి ఈసభ ద్వారా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పోవలవరం ఆర్డినెన్స్ రాకపోతే మనప్రాంతం ఎడారి అయ్యే ప్రమాదంతోబాటు మనరాష్ట్ర పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. పోలవరం ద్వారా సుమారు 7 లక్షల 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుంది.

...

పోలవరం ద్వారా సుమారు 7,20,000 ఎకరాలకు నీరందుతుంది. 960 మెగావాట్ల విద్యుత్‌ని ప్రొడ్యూస్ చేసుకోగలుగుతాం. పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ని ఏర్పాటు చేసుకోవడం వలన సుమారు 40 టిఎంసీల నీటిని నిలువ చేసుకునే పరిస్థితి ఉంది. 80 మెగావాట్ల విద్యుత్‌ని ప్రొడ్యూస్ చేసుకునే పరిస్థితి ఉంది. గతంలో మనకున్న వనరులను సక్రమంగా వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఈరోజు అనావృష్టితో బాధపడే పరిస్థితి ఉంది. మన నేత నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో మనమందరం పట్టుదలతో పనిచేసి ప్రతీ నీటి బొట్టుని మనం ఉపయోగించుకుని, ఈ బడ్జెట్‌లో కేటాయించిన ప్రతీ రూపాయి సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో రైతాంగానికి మేలు జరిగేలా చూడాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, వంశధార, పెన్నా, నాగావళితో బాటు మధ్య తరహా, చిన్న తరహా నదులు సుమారు నలభై ఉన్నాయి. వాటి ద్వారా తాగునీటి అవసరాలు గానీ, సాగునీటి అవసరాలు గాని తీర్చడానికి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఈరోజు మనం అభివృద్ధి పథంలో

ముందుకు వెళుతున్న తరుణంలో ఆధునీకరణ పనులను త్వరితగతిన చేయాల్సిన అవసరం ఉంది. గతంలో ఆధునీకరణ పనుల విషయంలో కాంట్రాక్టర్లందరూ స్వార్ధపూరితంగా ఆలోచిస్తూ డబ్బులు ఎక్కువ ఉండే చోట పనులు చేసి మిగిలిన చోట్ల పనులు చేయకపోవడం వలన రైతాంగానికి మేలు జరిగే విధంగా ఆధునీకరణ పనులు జరగడం లేదు. కృష్ణా, గోదావరి, ఏలేరు, పెన్నా, నాగార్జునసాగర్, టిబిబిపి, హెచ్ఎల్‌సీ మరియు ఎల్ఎల్‌సీల వద్ద ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నింటినీ సక్రమంగా మానిటర్ చేసి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనులన్నీ ప్లానింగ్ ప్రకారం సిస్టమేటిక్‌గా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

కొన్ని నదుల మీద మనం వరద గట్టులు నిర్మించుకోవాలి. దాంట్లో కృష్ణా, గోదావరి, పెన్నా, కండలేరు, కళంగి, స్వర్ణముఖి, హంద్రీ, కుందు, వంశధార, నాగావళి ఉన్నాయి. గట్లు నిర్మించినప్పుడు గతంలో ఎక్కడా మానిటరింగ్ లేదు. దీంట్లో ఎక్కువ మంది అధికారులను నియమించుకుని, డిపార్ట్‌మెంటుని అలర్ట్ చేసి, ఎక్కడెక్కడ డ్యామేజీ జరుగుతుందో అక్కడ డ్యామేజీ జరగకుండా చూసుకొని డ్యామేజీ జరిగిన వెంటనే రెక్టిఫై చేసుకోవాలి. నదులు మనకు ప్రకృతి ఇచ్చిన వరాలు. వాటిని ప్రొటెక్ట్ చేసుకోవలసిన బాధ్యత మనకుంది. పంట కాలువలన్నింటినీ నిర్వీర్యం చేసుకునే పరిస్థితి ఉంది. మనం ఇండస్ట్రియల్ పొల్యూషన్ గురించి మాట్లాడుతున్నాం. గ్రామాల్లో, కార్పోరేషన్లలో, మునిసిపాలిటీల్లో పొల్యూషన్ కూడా కెనాల్‌లోకి వెళ్లిపోవడంతో మంచినీళ్లు అందించే పంట కాలువలన్నీ రానున్న రోజుల్లో నిర్వీర్యమయ్యే ప్రమాదముంది. దీనిమీద కూడా ప్రత్యేకమైన దృష్టి పెట్టాలి. మనం ప్రకాశం బ్యారేజీ ద్వారా 180 టిఎంసీలు వాడుకుంటున్నాం. దానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీమాంధ్రకు అన్యాయం జరిగి మనం అనాధలుగా ఉన్న పరిస్థితుల్లో మనం ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. కృష్ణా డెల్టా మొత్తం ఎడారిగా మారిపోయే పరిస్థితి వలన రైతాంగం ఆందోళనలో ఉన్నారు. ప్రకృతి మీద ఆధారపడే పరిస్థితి వలన ఈరోజు కృష్ణా డెల్టాకు ఇబ్బంది ఎదుర్కొనే పరిస్థితి ఉంది. మనకున్న హక్కులను ఖచ్చితంగా పరిరక్షించుకుని, లీగల్‌గా మనకున్న అన్ని ఒడిదుడుకులను అధిగమించి మన హక్కులను మనం ప్రొటెక్ట్ చేసుకునే విధంగా ప్రభుత్వం కార్యాచరణ చేయాలని కోరుతున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కన్‌క్లూడ్ చేయండి.

శ్రీ వి.వి.శివరామరాజు(ఉండి)ః కాటన్‌దొర దయవలన మనం గోదావరిబ్యారేజీ నిర్మించుకోవడం జరిగింది. ధవళేశ్వరం బ్యారేజీ ద్వారా మాకు సుమారు 8 టిఎంసీల ఫ్లోయింగ్ ఉండి దానిద్వారా కృష్ణాడెల్టాకు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి సుమారు 13 లక్షల ఎకరాల ఆయకట్టుకి మనం నీరందించుకుంటున్నాం. దాంట్లో బాగా ఇసుక మేట వేయడం వలన స్టోరేజీ కెపాసిటీ తగ్గిపోయింది. కాబట్టి స్టోరేజీ కెపాసిటీ పెంచాలి. ధవళేశ్వరం

బ్యారేజీ దిగువ భాగంలో మనకు ఏరియా ఉంది. అందులో  వాటర్ స్టోరేజీని పెంచుకునే విధంగా కార్యాచరణ చేపట్టినట్లైతే భవిష్యత్తులో అది మనకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ఉపయోగపడే పరిస్థితి ఉంది. దానిని కూడా మన పెద్దలు ఆలోచన చేయాలని కోరుతున్నాను.

రాయలసీమ అభివృద్ధి చెందాల్సిన అవసరముంది. అందు నిమిత్తం సోమశిల, వెలిగొండ, గుండ్లకమ్మ, తెలుగుగంగని స్థిరీకరించుకోవడం, గాలేరు-నగరి, పులిచింతల ఎస్ఆర్బీసీ, సంజీవ్‌సాగర్ వీటన్నింటినీ మనం రెన్నోవేషన్ పూర్తి చేసుకుని వాటన్నింటినీ పూర్తిగా యుటిలిటీలోకి తీసుకు వచ్చి రాయలసీమని కూడా మనం సస్యశ్యామలం చేయాల్సిన పరిస్థితి ఉంది. ఉత్తరాంధ్రలో కూడా నాగావళి గానీ, బాబూ జగజ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఝంఝావతి, వెంగళరాయసాగర్, నాగావళి లాంటి ప్రాజెక్టులని స్థిరీకరించుకుని పూర్తిగా ఉపయోగంలోకి తీసుకోవాలి.

నిన్న ముఖ్యమంత్రి గారు నాగావళిని గానీ హంద్రీనీవాని గానీ ఈ సంవత్సరం పూర్తి చేసి రైతాంగానికి నీరు అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ప్రకాశం జిల్లాలో ఇప్పటికీ కూడా ఫ్లోరైడ్ ఉన్న పరిస్థితి ఉంది. కనీసం త్రాగునీరు కూడా అందించుకోలేని పరిస్థితి ఉంది. దీనికి ఖచ్చితంగా ముఖ్యమంత్రి గారు వాటర్ గ్రిడ్‌ని ఏర్పాటు చేసి ప్రతీ గ్రామానికి ప్రతీ ఇంటికీ నీరందించే విధంగా కార్యాచరణ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలో అంతా సైంటిఫిక్‌గా, సిస్టమేటిక్‌గా నిధులన్నీ సద్వినియోగం చేసుకుని నదుల నీటిని ఉపయోగించుకోవడం ద్వారా సస్యశ్యామలం చేయాలి. చిన్న నీటిపారుదల కూడా మనకు కీలకమైనది. చిన్న నీటి పారుదల ద్వారా సుమారు 25 లక్షల ఎకరాలకు ఆయకట్టు చేసుకునే అవకాశం ఉంది. ఇందుకు గాను నారా చంద్రబాబు నాయుడు గారు నీరు –చెట్టు అనే పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః ముగించండి.

శ్రీ వి.వి.శివరామరాజు(ఉండి)ః చెరువుల వలన మనకు ఎక్కువ మేలు జరగాల్సిన అవసరముంది. ఎందుకంటే ప్రత్యేకించి మన రాయలసీమలో చెరువుల ద్వారా ఎక్కువ సేద్యాన్ని చేసుకునే పరిస్థితి ఉంది. వేలాది చెరువులున్నాయి. వాటన్నింటినీ ఉపయోగించుకోవాలి. వర్షాకాలంలో వచ్చిన నీటిని చైన్‌లింకు ద్వారా అన్ని చెరువులు నింపుకోవాలి. ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా వాటర్‌స్టోరేజీ చేసుకునేలా కట్టలను మనం పునర్‌నిర్మించుకోవాలి. ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు మనకు 9 లక్షల ఎకరాలకు ఆయకట్టు చేసుకునేందుకు అవకాశం ఉంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని వ్యవసాయం లాభసాటిగా ఉండేలా మనమందరం కృషి చేయాలి. సమర్థవంతమైన ముఖ్యమంత్రి నేతృత్వంలో, అవగాహన ఉన్న మంత్రివర్యుల

నేతృత్వంలో నీటిపారుదల పూర్తిగా అభివృద్ధి చెంది మన రాష్ట్రం సస్యశ్యామలం చెందాలని కోరుకుంటున్నాను.

శ్రీ తోట త్రిమూర్తులు(రామచంద్రాపురం): అధ్యక్షా, 2014-15 సంవత్సరానికి నీటిపారుదల శాఖామాత్యులు ప్రవేశపెట్టిన బడ్జెట్‌ని బలపరుస్తున్నాను. ఈ దేశానికి అన్నం పెట్టే రైతు సంతోషంగా, క్షేమంగా ఉండాలి. రైతే ఈ దేశానికి వెన్నెముక. ఈ దేశం ప్రధానంగా వ్యవసాయం మీద ఆధారపడే దేశం. రాష్ట్రం కూడా వ్యవసాయం మీదే ఆధారపడుతోంది. అయితే కొత్తపేట శాసన సభ్యులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి గారిని చూస్తే చంద్రబాబునాయుడుగారికి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి అన్నారు. ఆమాట వాస్తవం. చంద్రబాబునాయుడుగారు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏ మాత్రం అప్రమత్తంగా లేకపోయినా ఈ రాష్ట్ర ప్రజలకి జరిగే అన్యాయం గానీ, ఈ రాష్ట్రాన్ని దోపిడీదారుల బారిన పడనీయకుండా, అటువంటి దోపిడీ వ్యవస్థ నుంచి కాపాడుకోవలసిన బాధ్యత చంద్రబాబునాయుడుగారి మీదుంది. కాబట్టి ఆయన విషయంలో అప్రమత్తంగా ఉంటున్నారు. దాంట్లో ఎలాంటి అనుమానం లేదు. కాంట్రాక్టర్ల వ్యవస్థ గురించి మాట్లాడారు. ఈ నవరత్నాలనే 8 కంపెనీలను సృష్టించిన ఘనత కూడా వారిదే.

...

2004వ సంవత్సరంలో ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఈ కంపెనీలను సృష్టించి ఏ విధంగా రూ.1,90,000 కోట్ల నిధులను, నీటిపారుదల రంగాన్ని అభివృద్ధి చేస్తానని ఏ విధంగా దోపిడీ జరిగిందనే విషయం మీద, అప్పటి ప్రభుత్వంలో ఉన్న కాగ్ రిపోర్టులు కూడా వెల్లడించాయి. ఆ రోజు చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్ష నాయకుడిగా ఉండి, అనేక ప్రాజెక్టులకు సంబంధించిన విషయంలో వీళ్లు చేస్తున్న అవినీతి గురించి, ధర్నాలు, రాస్తారోకోలు, ఇక్కడ సభలో గొంతు చించుకొని గోలపెట్టినప్పటికీ దున్నపోతు మీద వాన కురిసినట్లు ఆనాటి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోని పరిస్థితిని ఈ రాష్ట్ర ప్రజలు చూశారు.

అదే విధంగా ఈరోజు రూ.3,300 కోట్లను గోదావరి ఆధునికీకరణకు కేటాయించారని చెప్పారు. నిజమే అధ్యక్షా, రూ.3,300 కోట్లను కేటాయించిన దానిని, ఎంత వరకు పనులు జరిగాయనేది గానీ, ఆ కంపెనీల్లో అప్పట్లో కాంట్రాక్ట్‌కు తీసుకున్న కాంట్రాక్టర్లు ఏ విధంగా పనులు చేశారనేది గానీ, మీ కోసం, మీ కిట్ బ్యాగుల కోసం, మీ పర్సెంటేజ్‌ల కోసం చేసింది తప్ప వాస్తవంగా అక్కడ పనులు జరిగాయా లేదా అనేది చూస్తే, ఈరోజుకు కూడా అక్కడ పనులు జరగని పరిస్థితి ఉంది. ఈ రూ.3,300 కోట్లను ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించిన ఆధునికీకరణ కోసం అన్నారు, దాంట్లో రూ.1,197 కోట్లను తూర్పు గోదావరిలో ఉన్న ఏటుగట్లు గానీ, కాలువలుగానీ, డ్రైనేజీ వ్యవస్థలకు సంబంధించిన పనుల నిమిత్తం కేటాయించారు. అప్పుడు ఎక్కడ నుంచో కాంట్రాక్టర్లను తీసుకొచ్చి ఆ కాంట్రాక్టర్లు మళ్లీ సబ్

కాంట్రాక్టర్లకు ఇచ్చి, కేవలం వాళ్లకు డబ్బులు మిగిలే పనులు ఏవైతే ఉన్నాయో వాటన్నింటినీ దోచుకున్నారు. 2007లో ఒప్పందం జరిగినప్పటికీ ఈరోజు వరకు ఎక్కడా పనులు జరగలేదు. నేటికి ఏడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఎక్కడికక్కడ వాళ్లు చేసిన పనులు డబ్బులు ఏవైతే వస్తాయో ఎర్త్ వర్కులు ఏవైతే ఉన్నాయో, ఆ పనులను మాత్రమే చేసి డబ్బులు తీసుకున్నారు తప్ప పూర్తి స్థాయిలో అక్కడ పనులు జరగలేదు.

రైతాంగమంతా చాలా ఇబ్బందిపడే పరిస్థితి ఉంది. అలాగే అక్కడ ఏటిగట్లను వేస్తామని చెప్పి, అంటే 86 ఫ్లడ్ బ్యాంకులకు సంబంధించిన ఏటిగట్లు, ఆరోజు ఉండే వరదనీటి మట్టానికి అనుగుణంగా ఏటిగట్లను ఆధునికీకరణ చేయాలని ఆ రోజు నిర్ణయం తీసుకున్నారు. ఈరోజు వరకు కూడా ఆ ఏటిగట్లకు సంబంధించిన కాంట్రాక్టర్లు ఎవరు కనిపించడం లేదు, పనులు చేయడం లేదు. మంత్రిగారికి తమరి ద్వారా నేను మనవి చేసేదేమంటే, ఆ కాంట్రాక్టర్లను రద్దు చేసి క్రొత్తగా కాంట్రాక్టర్లను పిలిపించి, ఆ పనులన్నింటినీ పూర్తి చేయాల్సిందిగా కోరుతున్నాను.

పోలవరం ప్రాజెక్ట్ అనేది ఒక బహుళార్థ సాధకమైన ప్రాజెక్టు, మనకు ఒక అద్భుతమైన ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీరందటమే కాకుండా, విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేసుకోవచ్చు. విశాఖపట్నానికి సంబంధించిన త్రాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు కూడా నీళ్లిచ్చే ప్రాజెక్ట్ ఆ ప్రాజెక్టు. అటువంటి ప్రాజెక్టుకు తెలంగాణ ఆంధ్రా విభజన జరిగినప్పుడు, తెలంగాణాలో ఉన్న ఏడు మండలాలను, మరలా ఆ ప్రాజెక్టును నిర్మించడానికి కావాల్సిన ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చిన మన ముఖ్యమంత్రి గారికి, సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి రైతాంగం తరపున హృదయపూర్వకమైన కృతజ్ఞతలను తెలుపుతున్నాను. ఎందుకంటే అది జరగకపోతే ఆ ప్రాజెక్టుకు చాలా నష్టం జరిగి ఉండేది. ఎప్పుడూ కోర్టుల్లో కొట్లాటలు జరిగే పరిస్థితి ఉండేది. మా జిల్లాకు సంబంధించిన పలు డ్రైనేజీ వ్యవస్థల పైన, నీటి పారుదలకు సంబంధించిన ప్రాజెక్టులపైన ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరించాల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

ఎందుకంటే, గోదావరి వచ్చినప్పుడు మా ప్రాంతంలోని ఏటిగట్లు బలహీనంగా ఉన్నాయి. కోనసీమ ప్రాంతానికి చుట్టూ ఉన్న, గోదావరి మధ్యలో ఉన్న ప్రాంతం అది. ఫ్లడ్ వచ్చిన సమయంలో ఆ ఏటిగట్లకు ఎక్కడ బ్రీచెస్ పడ్డా కొన్ని వేల ఎకరాల పంట నష్టపోయే పరిస్థితి ఉంది. వందల వేల సంఖ్యలో గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కాబట్టి కొన్ని చోట్ల వాటికి గ్రోయర్స్‌ని నిర్మించాలని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. మా నియోజక వర్గానికి సంబంధించిన ఏటిగట్ల విషయంలో కూళ్ల, సుందరపల్లి, సేరులంక, పిల్లెంక దగ్గర ఉన్న గ్రోయర్స్‌కు సంబంధించిన ఎస్టిమేట్స్‌ని కూడా వెంటనే తెప్పించాము. గత ప్రభుత్వంలో నేను శాసనసభ్యుడిగా ఉండి, ప్రభుత్వానికి ఆ ప్రతిపాదనలను సమర్పించడం జరిగింది. వాటన్నింటికీ సంబంధించిన అంచనాలు కూడా ఇక్కడ ఉన్నాయి. తొందరలో వాటికి నిధులను

మంజూరు చేసి, ఆ పనులను పూర్తి చేసినట్లయితే చాలా గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం నుంచి రక్షణ కల్పించినట్లు అవుతుంది. ఎక్కడ బ్రీచెస్ పడినప్పటికీ ఆ ప్రాంతంలో ఉన్న గ్రామాలన్నీ ముంపుకు గురవుతాయి. అటువంటప్పుడు చాలా సంవత్సరాల పాటు పంటలకు కూడా నోచుకోని పరిస్థితి ఆ గ్రామల్లో ఉంటుంది. తప్పనిసరిగా ఆ పనులను పూర్తి చేయాలని మనవి చేస్తున్నాను. ఈరోజు మా జిల్లాలో ఉన్న చాగల్‌నాడ్ ఎత్తిపోతల పథకం, పుష్కర ఎత్తిపోతల పథకం మరి ఆనాడు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా మేమందరం శాసనసభ్యులంగా ఉండి, వెళ్లి మాట్లాడి తీసుకున్నటువంటివి. నిన్న మా నెహ్రూ గారు మాట్లాడుతూ ఎక్కడ జరిగింది అభివృద్ధి అన్నారు. మేమందరం వెళ్లి అడిగి నాకు మంత్రి పదవి ఇవ్వకపోయినా పర్వాలేదు చాగల్‌నాడ్ ప్రాజెక్టు మాకు కావాలని అడిగిన సందర్భం.

శంఖుస్థాపన చేసి ప్రారంభించింది, నీరిచ్చిన తర్వాత ఓపెన్ చేసింది కూడా చంద్రబాబు నాయుడు గారేననే విషయం ఆ జిల్లా ప్రజాప్రతినిధులందరికీ తెలుసని మనవిచేస్తున్నాను. ఈ ఏటిగట్ల ఆధునికీకరణ కొరకు ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరించాలి. రావులపాలెం నుంచి ఉన్న ఏటిగట్టు యానం వరకు ఉన్నది. ఆ గొదావరి గట్టంబడే సుమారు 35 కిలో మీటర్ల వరకు కుడి వైపున గోదావరి ఉంటుంది. ఆ గోదావరికి, నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రావులపాలెం నుంచి బస్సులను కూడా నడిపించిన పరిస్థితి ఉంది. ఈరోజ ఈ కాంట్రాక్టర్లందరూ డబ్బుల కోసం ఆలోచించి ఆ రోడ్లను త్రవ్వేసి ఆధునికీకరణ అనే పేరుతో పూర్తిగా పాడుచేసిన పరిస్థితి ఉంది. ఎందుకు ఈ విషయం చెబుతున్నానంటే రేపు రాబోయే పుష్కరాల్లో ఆ ఏటిగట్టు మీద రహదార్లు జరిగే పరిస్థితి ఉంది. ఎందుకంటే ఆ కట్టంబడి ఉన్న పుష్కరగాట్లన్నీ ఒక ఎనిమిది పుష్కర గాట్లు చాలా పవిత్రమైన ముఖ్యమైన పుష్కర ఘాట్లు ఉన్నాయి. వాటికి రవాణా కూడా ఈ ఏటిగట్ల వెంబడే జరిగే పరిస్థితి ఉంది. దానిని తొందరలోనే పూర్తి చేసే విధంగా, గతంలో మాదిరిగా యానం వరకు బస్సులు నడిచే విధంగా ఆ బండను నిర్మించే కార్యక్రమాలను చేపట్టాలని మనవిచేస్తూ, ఈరోజు మంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ని మనస్ఫూర్తిగా సమర్థిస్తూ మీ దగ్గర సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ ఏ.చంద్‌బాషా(కదిరి) : అధ్యక్షా, ఈరోజు రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారు. జలయజ్ఞం ద్వారా గతంలో ఎన్ని లక్షల ఎకరాలు ఆయకట్టులోకి వచ్చింది, తద్వారా రైతులందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు. అది ధనయజ్ఞమని మీరనుకొంటున్నారు, కానీ అది ఏ విధంగా జరిగిందనేది రాష్ట్ర ప్రజలకు తెలుసు, మీరు చెప్పే అవసరం లేదు. కానీ ఈరోజు ఒకటి చెప్పదల్చుకున్నాను. గతంలో ఎవరు ఏమి చేశారు, ఏ విధంగా వ్యవసాయం దండగ అన్నారు, రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయకట్టుకు నీరు రావడానికి ఏవిధంగా జలయజ్ఞం కార్యక్రమాన్ని అమలు చేశారు, ఎన్ని వేల కోట్లను వెచ్చించి రైతుల పక్షంగా నిలిచారనే విషయం ప్రజలందరికీ తెలుసు. ఏదిఏమైనప్పటికీ ఈ రాష్ట్రంలో అధికారం మీకొచ్చింది, కాబట్టి మేము ఒక్కటే కోరుతున్నాము, ఏవైతే పెండిగ్ ప్రాజెక్టులు ఉన్నాయో వాటికి

తక్కువ డబ్బును ఖర్చు పెట్టినట్లయితే లక్షలాది ఎకరాలు ఆయకట్టులోకి వచ్చే ప్రాజెక్టులు ఉన్నాయి. దానిని త్వరితగతిన పూర్తి చేసినట్లయితే రాష్ట్ర రైతాంగం, ప్రజలు హర్షిస్తారు, సంతోషపడతారని తమరి ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ రాష్ట్రంలోని రైతన్నలు ముఖ్యంగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో గండిపడి మునిగే గ్రామాల్లో దాదాపు రూ.70 కోట్లను ఖర్చు పెట్టినట్లయితే చాలా వరకు నదులకు వాటర్ స్కేర్‌సిటీ లేకుండా, మైలవరం, చిత్రావతి, వెలిగొండ వంటి ఎన్నో ప్రాజెక్టులకు నీరు అంది లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తుంది.

అనంతపురం జిల్లాలో ప్రవహించే మైలవరం, చిత్రావతి, పెనుగొండ తదితర ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అంది లక్షలాది ఎకరాల భూమి సాగులోకి రావడం జరుగుతుంది. అదే విధంగా ప్రజానీకానికి త్రాగునీరు కూడా అందే అవకాశం ఉంది. కాబట్టి నేను ఒకటే విషయాన్ని సభ దృష్టికి తీసుకురాదలిచాను. రాష్ట్రంలో ఇప్పుడుండే క్లిష్ట పరిస్థితుల్లో రైతాంగం కూడా చాలా కష్టాల్లో ఉన్నారు. కాబట్టి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయాల్సిన అవసరముంది.

అధ్యక్షా, అనంతపురం జిల్లా ఎడారి జిల్లా. అట్లాంటి ఎడారి జిల్లాలో హంద్రి- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఉంది. ఆ ప్రాజెక్టు పరిధిలోని ఆర్ అండ్ ఆర్ క్రింద 16, 19, 24, 25, 26 ప్యాకేజీల్లో ఏవైతే పనులను 2007వ సంవత్సరంలో ప్రారంభించారో, ఇంతవరకు పనులు పూర్తికాకపోవడం వల్ల ముఖ్యంగా పుట్టపర్తి, అనంతపురం, కదిరి ప్రాంతంలోని ప్రజానీకానికి త్రాగునీరు అందకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా బాధాకరమైన విషయం.

అధ్యక్షా, అనంతపురం జిల్లాలోని మరొక ప్రాజెక్టు అయినటువంటి జీడిపల్లి ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసిన కారణంగానే ఆనాడు అనంతపురంతో పాటు మరి కొన్ని ప్రాంతాలకు త్రాగునీరు వచ్చింది. కానీ కదిరి పట్టణానికి త్రాగునీరు అందలేదు. హంద్రి- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు నందలి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీల్లో పనులు త్వరితగతిన పూర్తికాకపోవడం వల్ల ఇబ్బందులు కల్గిన మాట వాస్తవం. అదే విధంగా అటవీ అనుమతులు నిరాకరించిన కారణంగా చర్లపల్లి రిజర్వాయర్ పనులు నత్తనడకన నడవడం వల్ల సకాలంలో హంద్రి- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు నీరు రాలేదు. బడ్జెట్ కేటాయింపుల్లో అనంతపురం జిల్లాలోని హంద్రి- నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు, చర్లపల్లి రిజర్వాయర్‌కు ప్రాధాన్యతనివ్వాలని సభాముఖంగా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, అనంతపురం జిల్లా కదిరి నియోజకవర్గపరిధిలోని తలుపుల మండలంలోని మైరాడ గ్రామానికి చెందిన భూములను ప్రభుత్వం సేకరించి మైరాడ రిజర్వాయర్ పనులను చేపట్టింది. కానీ, దాదాపు 43 మంది రైతులకు ఇంతవరకు రూ.1.93 కోట్ల నష్టపరిహారం ఇంకా

చెల్లించలేదు. ఆ పరిహారాన్ని సత్వరమే ప్రభుత్వం చెల్లించాలని కోరుతున్నాను. అదే విధంగా గాండ్లపెంట మండలంలోని గండిచెరువు రిజర్వాయర్ కూడా ఉంది. అక్కడి రైతులకు కూడా ప్రభుత్వం పరిహారాన్ని ఇంకా చెల్లించలేదు కాబట్టి సత్వరమే చెల్లించాల్సిన దాదాపు రూ.2.00 కోట్ల నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని సభాముఖంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. అదే విధంగా ఎం.పి.గుండ్ల మండలంలోని పెడవల్లి చెరువు క్రింద అప్పలచెరువు ఉంది. అక్కడి ముంపు బాధితులకు కూడా ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాల్సి ఉంది.

అధ్యక్షా, అనంతపురం జిల్లాలోని ప్రాజెక్టుల వల్ల ముంపుకుగురైన బాధిత రైతాంగానికి సత్వరమే నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించేదిశగా చర్యలు చేపట్టి, జిల్లాలోని హంద్రి-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా కదిరి నియోజకవర్గ ప్రజానీకానికి తాగునీరు, రైతాంగానికి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని తమరి ద్వారా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వి.ప్రభాకర్ చౌదరి(అనంతపూర్ అర్బన్): అధ్యక్షా, మేం అసెంబ్లీకి కొత్తగా ఎన్నికైనాం. నాకంటే చిన్న వయస్సు గల్గిన వాళ్లు చాలామంది శాసనసభకు ఎన్నికైనారు. అదే విధంగా అపారమైనటువంటి అనుభవం కల్గిన గౌరవసభ్యులు కూడా సభలో ఉన్నారు. గత కొద్దిరోజులుగా శాసనసభ జరిగే తీరును క్షుణ్ణంగా మేం పరిశీలిస్తున్నాం. మా నియోజకవర్గాల నుంచి కూడా మిత్రులు, ప్రజలు చాలా మంది అదే విషయమై ఫోన్ చేసి అడుగుతున్నారు. ఈ శాసనసభ సమావేశాలు, వ్యవహారాలు సద్వినియోగ మవుతున్నాయా, దుర్వినియోగ మవుతున్నాయా అనే బాధ, భావన, ఆవేదన చాలా మందిలో ఉంది. ఎందుకంటే ప్రజల సొమ్ము దుర్వినియోగమవుతోంది. అధికారపక్షం ఏ బిల్లును సభకు ముందుకు తీసుకువచ్చినా, ఏ అంశాన్ని చర్చ నిమిత్తం సభ ముందుకు తీసుకువచ్చినా, ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిపక్ష సభ్యులు "దివంగత నేత" "జలయజ్ఞం" మాటను ఉచ్చరిస్తారు. ఆ విధంగా "జలయజ్ఞం" అనే పదాన్ని ప్రతిపక్షం ఉచ్చరించినప్పుడు అధికారపక్షం నుంచి "ధనయజ్ఞం", ప్రతిపక్ష సభ్యులు "కాంట్రాక్టర్ల" గురించి మాట్లాడితే అధికారపక్ష సభ్యుల వైపు నుంచి "కమీషన్ల" గురించిన మాటలు వినబడుతున్నాయి. అదే విధంగా అక్కడ "ప్రాజెక్టుల" గురించి సభ్యులు ప్రస్తావిస్తుంటే, ఇక్కడి సభ్యులు "పర్సెంటేజీ" ల గురించి మాట్లాడుతున్నారు. అక్కడ "భగీరథుడు" అంటుంటే, ఇక్కడ "భస్మాసురుడు" అని అంటున్నారు. నేను కొత్తగా సభకు వచ్చిన ఒక శాసనసభ్యుడిగా, పౌరుడుగా సభలోని సభ్యులందరినీ తమరిద్వారా అర్థిస్తున్నాను. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి నేటికి వంద రోజులైనా పూర్తికాలేదు. కొంత సమయం ఇచ్చి అవకాశం చూడండి. ఆ తరువాత తప్పులు చేస్తే ప్రభుత్వాన్ని విమర్శించండి. ఆ తప్పులను ప్రజల్లోకి తీసుకుపోవడానికి, శాసనసభలో మాట్లాడడానికి ప్రతిపక్షానికి అవకాశం ఉంటుంది. ఆ తరువాత జనాల దగ్గరకు వెళ్లి ప్రభుత్వ తీరును ఎండగట్టండి. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి మీరే రండి. మాకెలాంటి అభ్యంతరం లేదు. కాకపోతే అనునిత్యం దుమ్మెత్తిపోసుకోవడం వల్ల ఎవరికి ప్రయోజనం ఉండదు. గౌరవ సభాపతి గారి నేతృత్వంలో ఇటీవల ఒక హోటల్‌లో

నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్ సందర్భంగా గౌరవ సభాపతి గారు మాట్లాడుతూ, నిమిషం సభ నిర్వాహణకు ఆరులక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నట్టుగా చెప్పడం జరిగింది. నిజానికి అది చాలా బాధాకరం. మనమంతా ప్రజలకు జవాబుదారీగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరముంది. అందుకనే ఒక శాసనసభ్యుడిగా చేతులు జోడించి సభాముఖంగా అర్ధిస్తున్నాను. సభ సమయం వృధా కాకుండా చూడవల్సిందిగా అటు ప్రతిపక్షం గానీ, ఇటు అధికారపక్షం గానీ ఇరుపక్షాలను వేడుకుంటున్నాను. కాబట్టి ప్రధాన ప్రతిపక్ష సభ్యులు సద్విమర్శలు చేయండి, సలహాలు, సూచనలివ్వండి. ఈ రాష్ట్రాభివృద్ధికి దోహదపడండి. రైతాంగం కొరకు, ప్రజాహిత కార్యక్రమాల కోసం ప్రతిపక్షం చేయూతనివ్వాల్సిన అవసరముంది. మీకున్నటువంటి అపారమైన అనుభవాలను అటు ప్రైవేట్‌పరంగా గానీ, ఇటు రాజకీయంగా గానీ అన్నింటిని క్రోడీకరించి అధికారపక్షానికి సముచితమైన సలహాలను, సూచనలిస్తే తప్పకుండా వాటిని స్వీకరించడానికి వీలుంటుంది. దయచేసి సభా సమయం వృ ధా కాకుండా సబ్జక్ట్ వరకే కన్‌ఫైన్ అయితే బాగుంటుంది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ఇరిగేషన్ సబ్జక్ట్‌కు సంబంధించిన డిమాండ్స్‌పైన చర్చ ముగిసింది. గౌరవసభ్యులు మిగిలిన డిమాండ్లపైన క్లుప్తంగా మాట్లాడవల్సిందిగా కోరుతున్నాను. శ్రీ ఆర్. వెంకట సుజయ్ కృష్ణ రంగారావు గారు మాట్లాడతారు............

శ్రీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి: అధ్యక్షా............

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: మంత్రి గారి క్లారిఫికేషన్‌లో మాట్లాడండి. దయచేసి కూర్చోండి. శ్రీ ఆర్. వెంకట సుజయ్ కృష్ణ రంగారావు గారు మాట్లాడండి...............

శ్రీ ఆర్.వెంకటసుజయ్‌కృష్ణరంగారావు(బొబ్బిలి): అధ్యక్షా, విద్యాశాఖకు సంబంధించిన డిమాండ్స్‌పైన మాట్లాడే అవకాశాన్ని నాకు కల్పించినందుకు హృదయపూర్వకమైన నమస్కారాలు తెలియజేసుకుంటున్నాను. విద్యార్థులు పాఠశాలల్లో చేరిన తరువాత పాఠశాల విద్యను, ఉన్నత పాఠశాల విద్యను ముగించిన తరువాత కళాశాలల్లో చేరి ఉన్నత విద్యనభ్యశించిన తరువాత డిగ్రీ పట్టాలందుకున్నాక, వాళ్ల చదువు పూర్తయ్యే సమయానికి ఏం కోరుకుంటున్నారనేది ప్రధానం.

అధ్యక్షా, విద్యాశాఖామంత్రి గారు సభలో లేరు.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: పర్వాలేదు. మీరు చెప్పేది క్లుప్తంగా చెప్పండి. మంత్రి గారు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు వెళ్లడం జరిగింది.

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా...........

మిస్టర్ డిఫ్యూటీ స్పీకర్: సుజయ్ కృష్ణ రంగారావు గారు దయచేసి కూర్చోండి. అయ్యన్న పాత్రుడు గారు మాట్లాడతారు.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు: అధ్యక్షా, గౌరవ విద్యాశాఖామాత్యులు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరుకు వెళ్లడం జరిగింది. వారి తరఫున నేను గౌరవ సభ్యులు చెప్పే విషయాలను నోట్ చేసుకుంటాను. తదువారి సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుంది.

మిస్టర్ డిఫ్యూటీ స్పీకర్: సుజయ్ కృష్ణ రంగారావు గారు మాట్లాడండి.

శ్రీ ఆర్.వెంకటసుజయ్‌కృష్ణరంగారావు(బొబ్బిలి): అధ్యక్షా, విద్యార్థుల చదువులు పూర్తయ్యేనాటికి వాళ్లేమి కోరుకుంటున్నారో, వారి తల్లిదండ్రులేమి కోరుకుంటున్నారో, అదే విధంగా ప్రభుత్వం తరఫునుంచి వాళ్లకేమివ్వగలమనే దాంట్లో స్పష్టమైన అవగాహన ప్రభుత్వానికి ఉంటే ప్రధాన ధ్యేయాన్ని సాధించుకునే అవకాశం కల్గుతుంది. ముఖ్యంగా విద్యార్థులకు గానీ, వారి తల్లిదండ్రులకు గానీ చదువు పూర్తయిన తరువాత మంచి ఉద్యోగాన్ని సాధించాలనే ఆశ ఉంటుంది. తద్వారా తమ, తమ ఆర్థిక స్థితిగతులు బాగుపడతాయని ఆశిస్తారు. అలా ఆశించడం సర్వసాధారణం. వాళ్లు కోరుకున్నట్టుగానే ప్రభుత్వం వైపు నుంచి కూడా సహకారం ఉండాలి. చదువుకున్న యువతకు ఉపాధికల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంటుంది. ప్రస్తుత సమాజంలో విలువలు తగ్గిపోయిన పరిస్థితి కనబడుతోంది కాబట్టి, చదువు పూర్తిచేసుకుని వచ్చిన వారికి విలువలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దవల్సిన అవసరం కూడా ప్రభుత్వం పైన ఉంది. బాల్యంలో మూడు రకాల పాఠశాలల్లో విద్యనభ్యశించడానికి అవకాశం కల్గుతుంది. అందులో మొదటిది ప్రభుత్వ పాఠశాలలు, రెండవది ప్రైవేట్ పాఠశాలలు మరియు మూడవది ఎయిడెడ్ పాఠశాలలు.

ప్రభుత్వ పాఠశాలల విషయానికొస్తే రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఎక్కువ శ్రద్ధకనబరుస్తున్నారు.

...

ప్రైవేట్ స్కూల్స్‌పై ఎక్కువుగా ఇంట్రస్ట్ చూపుతున్నారు ఏ కారణాల వల్ల చూపుతున్నారో, ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజులు ఎక్కువుగా తీసుకున్నప్పటికీ కూడా అక్కడే చేరడానికి తల్లిదండ్రులు వారి పిల్లలను చేర్చడానికి ఎందుకు ఇష్ట పడుతున్నారో మనం ఆలోచించ వలసిన అవసరం ఉంది. గవర్నమెంట్ స్కూల్స్‌లో ముందుగా మనం చేయవల్సింది.

టీచర్స్‌ను పూర్తి సంఖ్యలో ఉంచవలసిన అవసరం ఉంది. ఏ ఒక్క ఖాళీ లేకుండా నూటికి నూరు శాతం టీచర్స్‌ను ఉంచ గలిగితే కొంత నమ్మకం తల్లిదండ్రులకు కలుగుతుంది. మనం ఏదో ఒక టీచర్స్ స్కూల్స్ అని, ఏదో నడిపితే, తప్పుడు ఉదాహరణగా పిల్లలు, తల్లిదండ్రులు తీసుకునే ప్రమాదం ఉంది. నూటికి నూరు శాతం టీచర్స్ ఉండవలసిన అవసరం ఉంది. అదే విధంగా స్కూల్ వాతావరణం కూడా ఒక ప్రైవేట్ స్కూల్‌లో పెయింట్స్ వేసి శుభ్రతగా ఉంటుందో అదే విధంగా మన ప్రభుత్వ పాఠశాలలను కూడా మెయింటెనెన్స్ చేయగలిగితే బాగుంటుంది. అలాగే సర్వశిక్షాభియాన్ ఇతర కార్యక్రమాలు ద్వారా, స్కూల్ బిల్డింగ్స్ వస్తున్నాయి కానీ కాంపౌండ్ వాల్స్ రావడం లేదు. కాంపౌండ్ వాల్స్ లేని కారణంగా అక్కడ వాతావరణం గలీసుగా ఉండటం వలన పిల్లలు గవర్నమెంట్ స్కూల్‌లో చదువుకోడానికి ఇష్ట పడటం లేదు.

అలగే టీచర్స్ ఎవరైతే గవర్నమెంట్ స్కూల్స్‌లో పనిచేస్తున్నారో వారికి కల్పించవలసిన సదుపాయాలన్నీ ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా మున్సిపల్ స్కూల్స్‌కు సంబంధించి టీచర్స్ నియమావళి ఏదైతే ఉందో అది ఇంకా నిర్ణయించక పోవడం వల్ల వారికి ప్రత్యేకమైన ఇబ్బందులు ఉన్నాయి. తప్పనిసరిగా మనం ఆ ఇబ్బదుల్ని తొలగించేందుకు ప్రభుతం చర్యలు తీసుకోవాలి. కనీసం వాళ్లకు జీపిఎఫ్. అకౌంట్ లేదు. సర్వీసు రూల్స్ లేకపోవడం వలన ఈ అకౌంట్ లేదు. ఈ అకౌంట్ లేకపోవడం వలన వారికి చెందాల్సిన లక్షలాది రూపాయలు అకౌంట్‌లో పడటం లేదు. కేవలం ఒక సస్పెన్స్ అంకౌంట్ మెయింటెన్స్ చేస్తున్నారు. ఈ సస్పెన్స్ అకౌంట్ మెయిటెన్స్ చేయడం వలన వారు ఏదైతే ప్రావిడెంట్ ఫండ్‌లో దాచుకుంటే తక్కువ ఇంట్రస్ట్‌కు వారికి రుణ సదుపాయం దొరుకుతుంది. ఆ సదుపాయం వారు కోల్పోతున్నారు. అదిలేకుండా సస్పెన్స్ అకౌంట్‌లో ఏమవుతుందో తెలియని పరిస్థితి టీచర్స్‌కు ఉంది. కాబట్టి మున్సిపల్ టీచర్స్‌కు సర్వీసు రూల్స్ వెంటనే ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను.

ఎయిడెడ్ స్కూల్స్‌కు వస్తే చాలా ఇబ్బంది కరమైన పరిస్థితి ఉంది. ఎందుకంటే అక్కడ ఏవైతే గత 20 సంవత్సరాలుగా పోస్టులు ఉన్నాయో ఆపోస్టులు భర్తీ చేయని పరిస్థితి ఉంది. ఆవిధంగా 90 శాతం మంది టీచర్స్ ఖాళీ టీచర్స్ పోస్టులు ఉండటం వలన, టెంపరరీ టీచర్స్‌ను ఏర్పాటు చేసుకోవడం వలన ఎయిడెడ్ స్కూల్స్ యాజమాన్యం ఏదైతే ఉందో ఆ యాజమాన్యం ఈ టెంపరరీ పోస్టులన్నింటికీ ప్రభుత్వం సహకరించని కారణంగా యాజమాన్యం టీచర్స్‌ను నియమించుకోవల్సిన పరిస్థితి ఉంది. పిల్లలు దగ్గర నుండి ఫీజులు వసూలు చెయ్యాలంటే ఎయిడెడ్ స్కూల్స్ రూల్స్ ప్రకారంగా రూ.10,15,20 లగా ఉంది. కాబట్టి ఎయిడెడ్ స్కూల్స్ యాజమాన్యానికి ఫీజు తీసుకునే పరిస్థితి లేదు. మరోపక్క టీచర్స్‌ను నియమించుకునేందుకు ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వనప్పుడు ఏ విధంగా అక్కడ స్టాండర్డ్స్ ఉంటాయో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. అలాగే ప్రైవేట్ స్కూల్స్‌కు వస్తే ఏదైతే ఫీజు వసూలు చేస్తున్నారో ఆఫీజు ఎంత, ఏమిటి అనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

లక్షలాది రూపాయలు ప్రైవేట్ స్కూల్స్ ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఎక్కువ ఫీజులు వసూలు చేయడానికి వాళ్ల స్కూల్ పేరు వెనుక తోకగా, ఇంటర్ నేషనల్ స్కూల్ అనో టెక్నో స్కూల్ అనో పెట్టి కోట్లాది రూపాయలు వసూలు చేసే పరిస్థితి ఉంది. ఖచ్చితంగా ప్రభుత్వం టెక్నో స్కూల్ అని పెడితే పలానా రూల్స్ ఉండాలి, వాళ్ల ఇంత ఫీజు వసూలు చేయవచ్చు. అదే విధంగా ఇంటర్ నేషనల్ స్కూల్స్ అంటే ఈ స్టాండర్స్ ఉండాలి. వాళ్లు ఇంత ఫీజు వసూలు చేయవచ్చు అనే ఖచ్చితమైన రూల్స్ పెట్టవలసిన అవసరం ఉంది. అలా కాకుండా పేర్లు పెట్టుకొని పిల్లలను ఆకర్షించి లక్షలాది రూపాయలు ఫీజు వసూలు చేయడం పిల్లలకు పెద్ద భారంగా తయారు అవుతుంది. కాబట్టి దీనిపై ఖచ్చితమైన రూల్స్ తీసుకు రావల్సిన అవసరం ఉందని కూడా తెలియజేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః కంక్లూడ్ చెయ్యండి.

శ్రీ వెంకటసుజయ్‌కృష్ణారంగారావు(బొబ్బిలి) ః అధ్యక్షా, ఇంకా హయ్యర్ ఎడ్యుకేషన్, ఇంటర్ మీడియట్ ఎడ్యుకేషన్‌పై మాట్లాడాల్సి ఉంది. కాబట్టి ఈ ప్రైవేట్ స్కూల్స్‌లో ఏదైతే ఫీజు వసూలు చేస్తున్నారో ఆ ఫీజు అందుబాటులో ఉండే విధంగా, కనీసం కొన్ని సీట్లన్నా ప్రతి స్కూల్‌లో కేటాయించుకో గలిగితే, బాగుంటుందనే అభిప్రాయం. అదే విధంగా గవర్నమెంట్ స్కూల్స్‌లో చూస్తే చాలా స్కూల్స్‌లో ముఖ్యంగా ఆడపిల్లలు చదివే స్కూల్స్‌లో బాత్ రూమ్స్ లేని పరిస్థితి ఉంది. బాత్ రూమ్స్ లేక వారు బయట గ్రౌండ్‌కు వెళ్లడం అక్కడ అనేకమైన ఇబ్బందులు వారు ఎదుర్కోవడం జరుగుతోంది. ఇలాంటి మినిమమ్ ఫెసిలిటీస్‌ను ఖచ్చితంగా స్కూల్స్‌లో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఒక డ్రైవ్ కింద పెట్టుకొని ఖచ్చితంగా బాత్‌రూమ్స్, రన్నింగ్ వాటర్, అదే విధంగా కిచన్ షెడ్స్‌ను అలాంటివి ఖచ్చితంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది.

ప్రభుత్వం చేయవలసిన కార్యక్రమాలు సక్రమంగా చేయడం లేదని సుప్రీంకోర్టు ఒక కమిటీ ఏర్పాటు చెసి ఈ సదుపాయలన్నీ ఉన్నయా లేదా అని పర్యటించే పరిస్థితికి వచ్చింది. ముఖ్యంగా ఆడపిల్లలకు సంబంధించి ఏవైతే సదుపాయాలు కల్పించాలో, ఆ సదుపాయాలన్నీ కూడా కల్పించి, అందుకు ఒక డ్రైవ్ కింద పెట్టుకొని ప్రభుత్వం ముందుకు వెళ్లాలని తెలియజేస్తున్నాను.

నేను చూసిన గవర్నమెంట్ స్కూల్స్‌కు ప్రైవేట్ స్కూల్స్‌కు మరొక ముఖ్య వ్యత్యాసం ఏమంటే, గవర్నమెంట్ స్కూల్స్‌లో ప్రైవేట్ స్కూల్స్ కన్నా ఎక్కువ జీతాలు ఇచ్చి మంచి టీచర్స్‌ను నియమించుకున్నా, ఎక్కువ జీతాలు ఇచ్చి పనిచేయించుకున్నా కూడా ప్రైవేట్ స్కూల్స్‌లో ఉన్న డిసిప్లెన్ గవర్నమెంట్ స్కూల్స్‌లో లేకపోవడానికి కారణం యాజమాన్యం. ప్రైవేట్ స్కూల్స్‌లో

ఎవరైతే స్కూల్ స్థాపించారో వారు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతోంది. ప్రైవేట్ స్కూల్స్‌లో అక్కడున్న హెడ్ మాస్టర్ గారు బాధ్యత తీసుకోవాలి. హెడ్ మాష్టర్ కొంతవరకే బాధ్యత తీసుకోవడం జరుగుతోంది. అనాధగా గవర్నమెంట్ స్కూల్స్ ఉంటున్నాయి. దీనిని గురించి ఒక సూచన ఏమిటంటే ఎవరైతే వాలంటరీగా సర్వీసు మోటివ్‌తో ఉండి, చదువుకున్న వ్యక్తులు సమాజంలో ఉన్నారో వాళ్లను ఒక కమిటీగా ఏర్పాటు చేసి ఈ స్కూల్స్ యాజమాన్యం కింద కమిటీ సభ్యులను పెట్ట గలిగితే బాగుంటుంది. బాధ్యత తీసుకొని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్య ఎలా నడుపుతారో అలా నడిపితే, కొంత మెరుగైన పద్ధతిలో నడిచే అవకాశం ఉంటుందని తెలియపరుస్తున్నాను.

అదే విధంగా అంగన్ వాడీ స్కూల్స్ ఏవైతే ఉన్నయో మంచి పౌష్టికాహారం పెట్టడం ద్వారా స్కూల్స్‌లో చేరకు ముందుగా ఏవైతే నేర్చుకోవాలో అవన్నీ కూడా నేర్పేందుకు అంగన్‌వాడీ సెంటర్స్ పనిచేస్తున్నాయి. ఈ అంగన్‌వాడీ సెంటర్స్‌లో ఎవరైతే రెగ్యులర్ పనిచేస్తున్నారో వారికి ట్రైనింగ్ ఇవ్వ వలసిన అవసరం ఉంది. అపాయింట్‌మెంట్ ఇచ్చిన వెంటనే ట్రైనింగ్ ఇచ్చి వదిలేస్తే కాదు. పూర్తిగా బేసిక్స్ పిల్లలకు నేర్పవలసిన అవసరం ఉంది కాబట్టి ఎప్పటికప్పుడు వాళ్లకు ట్రైనింగ్ ఇస్తూ, అదే విధంగా వారికి ఇస్తున్న వేతనం పెంచాల్సిందిగా కోరుతున్నాను.

వారు ఎన్నో సార్లు పెంచమని కోరారు. కాబట్టి అంగన్ వాడీ వర్కర్స్ వేతనాలు పెంచవల్సిందిగా కోరుతున్నాను. అదే విధంగా ఏదైతే మిడ్‌డే మీల్స్ ఇంప్లిమెంట్ అవుతుందో ఆ మిడ్‌డే మీల్స్ స్కీమ్ స్టాండర్డ్స్ మెయింటేన్ చేయాలి. మనం రేషన్స్‌కు ఇచ్చే మొత్తాలు చాలడం లేదు. తప్పని సరిగా కిచన్ షెడ్స్ ఏర్పాటు చేసి వారికి ఇచ్చే మొత్తాలు కూడా పెంచ గలిగితే మంచి నాణ్యత కలిగిన భోజనం పెట్టే అవకాశం ఉంటుందని మీకు మని చేస్తున్నాను.

...

ప్రైవేటు స్కూల్స్‌లో ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి, బస్సులు తిప్పుతున్నారో, అది కూడా పిల్లల ప్రాణాలకు సంబంధించిన విషయం కాబట్టి, దానిమీద కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసిన అవసరం ఉంది. ఆ బస్సుల కండిషన్ ఏవిధంగా ఉంది, డ్రైవర్స్ లైసెన్స్ పొందినప్పటికీ కూడా వాళ్లు ఎంత జాగ్రత్తగా నడుపుతున్నారన్నది ఎప్పటికప్పుడు చెక్‌చేసి, ఏ తప్పూ జరగకుండా, పిల్లల ప్రాణాలకు నష్టం జరగకుండా, ఈ బస్సులు తిప్పే ఏర్పాటు ప్రభుత్వం చేయాలని కోరుతున్నాను.

అదేవిధంగా కెజి టు పిజి అని తెలుగుదేశం పార్టీ మానిఫెస్టోలో పెట్టారు. దానిమీద కూడా కొంత క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే కింద స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఎలాగూ ప్రభుత్వ స్కూల్స్‌లో చదువుతున్నారు కాబట్టి, ఫీజు భారం వాళ్లమీద ఉండదు. హైయ్యర్ ఎడ్యుకేషన్‌లో మనం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను సక్రమంగా ఇవ్వగలిగితే, వాళ్ల ఫీజలు చెల్లిస్తున్నాం కాబట్టి, ప్రత్యేకంగా మానిఫెస్టోలో పెట్టారు కాబట్టి, పిల్లలు ప్రైవేటు స్కూల్స్‌కి

వెళ్లినప్పటికీ కూడా వాళ్లు పేదరికంలో ఉంటే, ప్రైవేటు స్కూల్స్‌కి వెళ్లే వాళ్లకి కూడా ఈ ఫీజలు చెల్లిస్తే ఈ కెజి టు పిజి తెలుగుదేశం పార్టీ మానిఫెస్టోలో పెట్టినదానికి ఉపయోగం ఉంటుంది. దానికి కూడా గౌరవ మంత్రిగారు స్పష్టతనిస్తే బాగుంటుంది.

అదేవిధంగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్. ఈ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి కొన్ని నిబంధనలు పెట్టడం జరిగింది. 2 ఎకరాలు భూమి ఉండాలి, 8,000 ఎస్ఎఫ్‌టి సొంత భవనాలుండాలి. మరి ఆ విధంగా ఉండాలంటే 4 సెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పటం జరిగింది. ఈ రూల్స్ పాటించేవిధంగా కొన్ని కాలేజీలుంటే, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌ను పూర్తిగా ఈ కార్పోరేటు కాలేజీలు టేకోవర్ చేశాయన్న విషయం మనందరకు తెలిసినదే. ఈ కార్పోరేటు కాలేజీలు నడిపే విధానం, మరి ఖచ్చితంగా 8,000 ఎస్ఎఫ్‌టి సొంత భవనాలు, 2 ఎకరాలు భూమి ఉండేవిధంగా ఉంటే 4 సెక్షన్లు మంజూరు చేస్తే, మరి ఏవిధంగా ఈ కార్పోరేట్ కాలేజీలలో వేలాది స్టూడెంట్స్ చేరుతున్నారు? మరి ఈ నిబంధనలను పాటిస్తున్నారా అనేది ఖచ్చితంగా ప్రభుత్వం చూడవలసిన అవసరం ఉంది. మరి కార్పోరేట్ కాలేజీల్లో చేరిన పిల్లలకు వసూలు చేస్తున్న ఫీజులను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే వసూలు చేస్తున్నారా? అలాగే, వాళ్లని చదివించే తీరును, ఎందుకంటే సుమారు 16 నుంచి 18 గంటలవరకు పిల్లలను కోచింగ్ ద్వారా కార్పోరేట్ కాలేజీలు చదివించిన విషయం వాస్తవం. మరి అంత ఒత్తిడి పిల్లల మీద పెడితే, వాళ్లు అంగీకారం తెలిపినా సరే, తల్లిదండ్రులు అంగీకారం తెలిపినా సరే అది మంచి పద్దతా, కాదా అనేది మనం ఆలోచించవలసిన అవసరం ఉంది. ఆలోచించి మంచి పద్ధతి కాదనుకొంటే దానినెలా అరికడతారనే విషయమై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

అదేవిధంగా, గేమ్స్, లైబ్రరీ, లాబ్ వీటిన్నిటినీ కూడా ఈ కాలేజీలలో పిల్లలు ఎంత సమయం ఆ సౌకర్యాలను వినియోగించుకుంటున్నారనేది చూడవలసిన అవసరం ఉంది. 10వ తరగతి పిల్లలకు ఇప్పుడు ఏవిధంగా అయితే గ్రేడింగ్ సిస్టం పెట్టటం జరిగిందో, ఆ విధంగా ఇంటర్మీడియట్‌లో కూడా గ్రేడింగ్ సిస్టంను పెట్టగలిగితే, చాలావరకు ఈ ఒత్తిడి అనేది పిల్లల మీద హయ్యస్ట్ మార్కులు రావాలని...

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః పూర్తి చేయండి, 3 గంటలకు మంత్రిగారి ప్రసంగాలు ప్రారంభమవుతాయి.

శ్రీ వెంకటసుజయ్‌కృష్ణరంగారావు రావు(బొబ్బిలి)ః ఇన్‌స్టిట్యూట్ అడ్వర్టైజ్‌మెంట్స్‌కిగానీ, తల్లిదండ్రుల ఒత్తిడికి గానీ... గ్రేడింగ్ సిస్టం పెడితే ఈ ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. దానిని కూడా ఆలోచించమని కోరుతున్నాను. మరి ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విపరీతంగా స్టాఫ్ కొరత ఉంది. ఈ స్టాఫ్ కొరతను తగ్గించేందకు తప్పకుండా పర్మినెంట్ జూనియర్ లెక్చరర్స్‌ను

నియమించవలసిన అవసరం ఉంది. అలా కాకుండా మనం టెంపరరీ లెక్చరర్స్‌ను నియమిస్తే, కనీసం, అకడమిక్ ఇయర్‌కు ముందు నియమించుకోగలిగితే పూర్తిగా పాఠాలు చెప్పే అవకాశం ఉంటుంది. మనం ఈ టెంపరరీ లెక్చరర్స్‌ని నియమించేటప్పటికే రెండు నెలలు అకడమిక్ కాలెండర్ అయిపోతుంది. అక్కడున్న ప్రిన్సిపల్ ఇంత శాతం ఫలితాలు రావాలని ఈ టెంపరరీ లెక్చరర్స్‌కి టార్గెట్స్ ఇవ్వడం వలన, ఆ లక్ష్యాలను అందుకోవడానికి అనేక పద్ధతుల్లో పిల్లల్ని పాస్ చేయటానికి ప్రయత్నిస్తున్నారు.

అలాగే డిగ్రీ కాలేజీలకు సంబంధించి, డిగ్రీ కాలేజీలు మీకు తెలిసినట్లుగా ఒకవైపు ఇంజనీరింగు కాలేజీ ఉంటే, మరోవైపు ఆర్ట్స్, సైన్సెస్, కామర్స్ కాలేజీలున్నాయి. వీటన్నిటిలో కూడా ప్రస్తుతం అడ్మిషన్లు తగ్గుతూ వస్తున్నాయి. ముఖ్యంగా సైన్స్, ఆర్ట్స్ డిగ్రీ కాలేజీల్లో స్ట్రెంగ్త్ గణనీయంగా పడిపోతుంది. మరి, ఆ సైన్స్ స్టూడెంట్స్ ఇంజనీరింగ్‌కు వెళ్తున్నారా, అంటే ఇంజనీరింగు కాలేజీల్లో కూడా వేలాది సీట్లు మిగిలిపోతున్నాయి. దీనికి ముఖ్యంగా ఏమిటి కారణం అని మనం ఒకసారి చూస్తే, వాళ్లు ఇంజనీరింగు గాని, ఆర్ట్స్ గాని, సైన్స్ గాని ఏ డిగ్రీ అయినా కానివ్వండి. ఈ డిగ్రీ పాసయ్యాక, కనీసం 25 శాతం మందికి కూడా ఉద్యోగాలు రాని పరిస్థితి. మరి ఉద్యోగాలు రానప్పుడు, అంత డబ్బు ఖర్చుపెట్టి, ఏంటి లాభం అని తల్లిదండ్రులు, పిల్లలు ఆలోచించి, ఏదైనా టెక్నికల్‌గా పని నేర్చుకుంటే ఉద్యోగం వచ్చే పరిస్థితి ఉంటుంది. మరి అలా కాకుండా ఇంత పెద్ద చదువు చదవీ కూడా ఉపయోగం లేకుండా పోతుందనే ఒక ఆలోచన వస్తుంది. కాబట్టి దీనిగురించి ప్రత్యేకంగా మనం ఆలోచన చేయవలసిన అవసరం ఉంది. చదువు పూర్తయ్యేసరికి, ఉద్యోగం వచ్చే విధంగా, పిల్లలను తయారుచేయవలసిన అవసరం ఉంది. మరి ఆ విధంగా తయారుచేయాలంటే, ఒక ఇంజనీరింగు చదివిన తర్వాత, ఏయే పరిశ్రమలు పెట్టుకుంటారో, వారికి ఎంప్లాయిమెంట్ ఇస్తారో, ఆ పరిశ్రమల అవసరాలు తెలుసుకుని, మీకెలాంటి ఇంజనీరు కావాలి, ఇంజనీరింగు క్వాలిఫికేషన్‌తోపాటు ఇంకా ఇతర క్వాలిఫికేషన్స్ ఏమి కావాలో తెలుసుకునే విధంగా, ఇండస్ట్రీకి, ఇనిస్టిట్యూషన్‌కి tie-up పెట్టుకోగలిగితే, అవసరాలకు తగినట్లుగా మన విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. పారిశ్రామికవేత్తలు కూడా వాళ్లని తీసుకునే పరిస్థితి ఉంటుంది.

అదేవిధంగా ఈరోజు ఇంజనీరింగ్ కాలేజీల్లో వేల సంఖ్యలో సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉంది. ఈ సీట్లు మిగిలిపోతున్నాయంటే అక్కడ ఖచ్చితంగా మనం స్టాండర్డ్స్ మెయింటెన్ చేయాల్సిన అవసరం ఉంది. స్టాండర్డ్స్ మెయింటెన్ చేయాలంటే ముఖ్యంగా ఫ్యాకల్టీ కొరత విపరీతంగా ఉంది. అఫిలియేటెడ్ కాలేజీల్లో ఈ ఫ్యాకల్టీ కొరత తీరాలంటే, మంచి స్టాండర్డ్ క్వాలిటీ లెక్చరర్స్ ఉండాలంటే, ఖచ్చితంగా అఫిలియేషన్ ఇచ్చే యూనివర్సిటీకి, ఈ కాలేజీల్లో లెక్చరర్స్‌ని నియమించే విషయమై ప్రముఖ పాత్ర ఇవ్వగలిగితే, ఖచ్చితంగా కొంతవరకు మంచి లెక్చరర్స్‌ని నియమించే అవకాశం ఉంటుందని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, స్కూల్స్ ఏ పరిస్థితిలో ఉన్నాయో, ఎయిడెడ్ కాలేజీలు కూడా అదే పరిస్థితిలో ఉన్నాయి. ఈరోజు సుమారు 90,000 మంది ప్రభుత్వ కాలేజీల్లో చదువుతుంటే, ఎయిడెడ్ కాలేజీల్లో 1,33,000 మంది చదువుతున్నారని మినిష్టరుగారిచ్చిన బుక్‌లెట్‌లో ఉంది. కాబట్టి ఇంత సంఖ్యలో పిల్లలు చదువుతున్నప్పుడు, ఎందుకు ఎయిడెడ్ కాలేజీలను పూర్తిగా పట్టించుకోకుండా వదిలేశారో ప్రభుత్వం చెప్పవలసిన అవసరం ఉంది. సంవత్సరాల తరబడి పోస్టులు నిండకుండా ఉన్నాయో, ఆ పోస్టులన్నిటినీ కూడా ఖచ్చితంగా నింపి, ఎయిడెడ్ కాలేజీల్లో చదువుకుంటున్న సుమారు 1,33,000 మంది విద్యార్థులందరికీ న్యాయం చేయాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా యూనివర్సిటీల పరిస్థితి కూడా అలాగే ఉంది. యూనివర్సిటీలు చాలా ఆర్థికపరమైన ఇబ్బందుల్లో ఉన్నాయి. యూనివర్సిటీలకు మించి ఎక్కడా మనకు ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ ఉండవు. కాబట్టి వాటిని మోడల్‌గా ఉంచవలసిన అవసరం ఉంది. అక్కడ రీసెర్చ్ జరిగే అవకాశం ఉంటుంది. మరి రీసెర్చ్ జరిగినదగ్గరే అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది కాబట్టి, యూనివర్సిటీల గురించి ప్రత్యేకంగా ఏదైతే ప్రస్తుతం ప్రభుత్వం నాన్‌ప్లాన్ ఖర్చే ఇవ్వటం జరగుతుంది. ప్లాన్‌లో యుజిసి గ్రాంట్ల ద్వారా కొంచెం వస్తుంది. అలాకాకుండా, నాన్ ప్లాన్ గాని, ప్లాన్ గానీ ఏదైనా యూనివర్సిటీకి పూర్తి స్థాయిలో ప్రభుత్వం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆవిధంగా ఇస్తే, యూనివర్సిటీలకు చాలావరకు ఈ అఫిలియేటెడ్ కాలేజీలను నడపటానికి, అదేవిధంగా హయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్‌కు వాళ్లు ప్రాధాన్యత ఇచ్చి ముందుకెళ్లే అవకాశం ఉంటుంది. అలాగే అక్కడ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్, అకడమిక్ సెనైట్స్‌లలో సంవత్సరాల తరబడి మెంబర్స్‌ను నియమించడంలేదు. వాళ్లందరీ కూడా నింపితే, వాళ్లు సలహాలు, సూచనలు ఇచ్చి, ఆ యూనివర్సిటీలను చక్కగా నడపటానికి అవకాశం ఉంటుంది.

అదేవిధంగా, కొన్ని కొత్త యూనివర్సిటీలు పెట్టడం జరిగింది. మనకు "నాలెడ్జ్ కమీషన్'' ఇండియాలో ఉన్న జనాభా ప్రకారంగా, 1500 పైగా యూనివర్సిటీలు ఉండవలసిన అవసరం ఉందని చెప్పడం జరిగింది.

...

అధ్యక్షా, దివంగత నేత శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు చాలా కొత్త యూనివర్శిటీలు మన రాష్ట్రంలో ప్రారంభించడం జరిగింది. ఆ తరువాత ఆ యూనివర్శిటీలను అభివృద్ధి చేయలేదు. దానివల్ల ఆయా యూనివర్శిటీల కింద అప్లియేటెడ్ కాలేజీలు వంద నుండి రెండు వందల దాకా ఉన్నప్పటికీ, అ అప్లియేటెడ్ కాలేజీలకు ఉన్న సౌకర్యాలు కూడా ఈ యూనివర్శిటీలకు లేకపోవడం చాలా దురదృష్టకరం. ఉదాహరణకు రాజమండ్రిలో ఉన్న ఆదికవి నన్నయ్య యూనివర్శిటీలో టీచింగ్ పోస్టులు 25 కాగా, నాన్‌టీచింగ్ పోస్టులు 5 ఉన్నాయి. సొంత బిల్డింగ్‌లు కూడా లేవు. అటువంటి పరిస్థితుల్లో, వాళ్ళ అప్లియేటెడ్ కాలేజీలకు మాత్రం స్వంత బిల్డింగ్‌లు ఉండాలి, మీకు 50 మంది లెక్చరర్స్ ఉండాలి అని చెప్పడం ఎలా

ఉంటుందో ఒకసారి ఆలోచించాలి. కొత్త యూనివర్శిటీలకు గత సంవత్సరం కన్నాకూడా ఈ ప్రభుత్వం బడ్జెట్‌లో తక్కువగా కేటాయించింది.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ః త్వరగా ముగించండి.

శ్రీ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు రావు (బొబ్బిలి)ః అయిపోవచ్చింది సర్. కాబట్టి, తప్పనిసరిగా మంత్రిగారు ఈవిషయమై ఆలోచన చేయాలి. కొత్త యూనివర్శిటీలు అభివృద్ధి చెందాలంటే అదనంగా నిధులు మంజూరు చేయాలి.

అదేవిధంగా, హయ్యర్ ఎడ్యుకేషన్‌కు సంబంధించినంతవరకూ ఫీ-రీఇంబర్స్‌మెంట్ కంటే కూడా గొప్ప చర్య ఏదీ ఉండదని నేను భావిస్తున్నాను. దివంగత నేత శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ఫీ-రీఇంబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు కూడా చదువుకునే అవకాశం కల్పించారు. అటువంటి పథకాన్ని కొనసాగించే అవసరం ఈ ప్రభుత్వానికి కూడా ఉంది. కాబట్టి, విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే, ఈ ఫీ-రీఇంబర్స్‌మెంట్ మీద పూర్తి స్పష్టతను ఇవ్వాల్సిందిగా నేను కోరుతున్నాను. ఎందుకంటే, పేద విద్యార్థుల ఆర్థికస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది కాబట్టి, ముందే స్పష్టత ఇస్తే, ఇంజనీరింగ్‌లో చేరాలనుకునే విద్యార్థులు వారికి ఎలిజిబిలిటీ ఉంటే, వాళ్ళు కోర్సుల్లో చేరడానికి నిర్ణయం తీసుకోగలుగుతారు. కాబట్టి ఈ విషయంలో విద్యా సంవత్సరం ప్రారంభం కాక మునుపే ఫీ-రీఇంబర్స్‌మెంట్ విషయమై పూర్తి స్పష్టతనీయాలి.

**(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)**

ఈ సంవత్సరం బడ్జెట్ కేటాయింపుల్లో ఫీ-రీఇంబర్స్‌మెంట్‌కు రూ.2100 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. గత సంవత్సరం బకాయిలు రూ.900కోట్లు ఉన్నాయని చెప్తున్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.3000కోట్లు ఫీ-రీఇంబర్స్‌మెంట్‌కు అవసరం కాగా, గత సంవత్సరం బకాయిలు కూడా కలుపుకుంటే మొత్తం రూ.3900కోట్లను బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.2100 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇంకా రూ.1800 కోట్లు కూడా అదనంగా కేటాయిస్తారని ఆశిస్తున్నాను.

ఫీ-రీఇంబర్స్‌మెంట్‌కు సంబంధించి హైదరాబాద్‌లో చదువుతున్న ఆంధ్రా విద్యార్థులకు కూడా పూర్తి స్పష్టతనివ్వాల్సిన అవసరముంది. అంతేగాక వాళ్ళకి తెలంగాణ ప్రభుత్వం ఫీ-రీఇంబర్స్‌మెంట్ ఇవ్వడానికి ముందుకు రాకపోతే, ఖచ్చితంగా మన పిల్లలు కాబట్టి, మనం వాళ్ళందరికీ ఫీ-రీఇంబర్స్‌మెంట్ చేయాల్సిన అవసరముంది. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య.3 ద్వారా, 21 బి.సి.కులాలను బి.సి.లుగా గుర్తించట్లేదని చెప్పడం జరిగింది. ఈ 21 కులాల్లో ఎక్కువగా మా ఉత్తరాంధ్రకు చెందిన వారున్నారు. ఖచ్చితంగా మన ప్రభుత్వం

చొరవ తీసుకొని, తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి, ఆ 21 కులాలను కూడా బి.సి.లుగా గుర్తించేవిధంగా చర్యలు తీసుకోవలసిన అవసరముంది. ఇప్పటికే ఎంసెట్ కౌన్సిలింగ్ ఫస్ట్ ఫేజ్ పూర్తయ్యింది. ఇసెట్ కౌన్సిలింగ్ పూర్తయ్యింది. బిఇడి కి ఇప్పటికే షెడ్యూల్ కుడా ఇవ్వడం జరిగింది. మరి ఫస్ట్‌ఫేజ్‌లో అన్యాయం జరిగిన బి.సి.లకు ఏవిధంగా న్యాయం చేస్తారు? సెకండ్‌ఫేజ్‌లోనైనా ఎంసెట్, ఇసెట్ , బిఇడి కౌన్సిలింగ్ లలో బి.సి.లకు అన్యాయం జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవలిందిగా, విద్యకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుకుంటూ, నేను ఇచ్చిన సలహాలను, సూచనలనూ ఉపయోగాపడితే వాటిని పరిగణనలోనికి తీసుకోవాలని గౌరవ మంత్రిగారిని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ః విష్ణుకుమార్ రాజు గారు.

శ్రీ పి.విష్ణుకుమార్‌రాజు(విశాఖపట్నం-నార్త్)ః అధ్యక్షా, నేను ఏదైతే మాట్లాడాలనుకున్నానో అవన్నీ ఆయన మాట్లాడేశారు. ( సభలో నవ్వులు ). నేను నిజం చెబుతున్నాను. నేనేదైతే మాట్లాడాలనుకున్నానో, అవన్నీ ఆయన మాట్లాడేశారు. కాబట్టి, వారు మాట్లాడిందే, నేను మాట్లాడినట్లుగా రికార్డు చేసుకోండి.

మిస్టర్ స్పీకర్ః మీ సమయంలో, మీ పరిధిలో మాట్లాడండి..

(కొందరు సభ్యులు అలా మీరు మాట్లాడినట్లుగా రికార్డు కాదు, అని చెప్పగా)

శ్రీ పి. విష్ణుకుమార్ రాజుః అధ్యక్షా, అలా ఐతే, నేను క్లుప్తంగా మాట్లాడతాను. పేరుకి కార్పొరేట్ కాలేజెస్ అధ్యక్షా. వాటిని ప్రాక్టికల్‌గా చూస్తే, కోళ్ళ పెంపకం ఎలా ఉందో అలా ఉంది. పౌల్ట్రీస్ కంటే అన్యాయంగా ఉంది. పక్కపక్కన కూర్చోబెట్టేస్తున్నారు. ఏ.సీ.రూమ్స్ అంటున్నారు. అది సెంట్రల్ ఏ.సీ.కాదు. ఒక రూమ్‌లో 70 మంది , 80 మందిని కూర్చోబెడుతున్నారు. ఏ.సీ.లు కూడా స్ప్లిట్ ఏ.సీ.లు అధ్యక్షా. వరుసగా రెండు గంటల పాటు కూర్చుంటే, వాళ్ళు పీల్చి వదిలిన గాలినే, మళ్ళీ వాళ్ళే పీల్చాల్సి వస్తుంది. రెండు మూడు గంటలకి తలనొప్పి వచ్చేస్తుంది.

కార్పొరేట్ కాలేజీకు, స్కూల్స్‌కు ఫీజుల విషయమై కంట్రోల్ లేదు. ఎల్.కే.జీ.కి కూడా ఫీజలు రూ.10,000/- నుండి రూ.12,000/-గా ఉంటోంది. ఇది చాలా విచిత్రం. నేను ఆంధ్రాయూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదివినప్పుడు నేను కట్టిన ఫీజు సంవత్సరానికి రూ.2,300/-. ఎవరిష్టమొచ్చినట్లు వాళ్ళు ఫీజులు పెంచేస్తున్నారు. దీనికి కూడా ప్రభుత్వం తప్పనిసరిగా ఏదోఒక లిమిట్ పెట్టవలసిన అవసరముంది. ఎందుకంటే మంచి చదువు వస్తుందని కానీ, సోషల్ స్టేటస్ కోసమో గానీ సామాన్యులు కూడా వారి పిల్లల్ని ప్రైవేట్ స్కూల్స్‌లో

చేర్పించడం జరుగుతోంది. కాబట్టి ప్రభుత్వం ఫీజ్ కంట్రోల్‌ను తప్పనిసరిగా పెట్టాలి. లేకపోతే ఫీజులను విచ్చలవిడితనంగా పెంచేస్తారు.

అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయి. బెంచ్‌లు ఉండవు. త్రాగడానికి మంచినీళ్ళు కూడా సరైన విధంగా ఉండవు. టాయ్‌లెట్స్ మరీ ఘోరాతిఘోరంగా ఉంటున్నాయి. రన్నింగ్ వాటర్ ఉండదు. కాబట్టి, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి విద్యకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలి.

అధ్యక్షా, ఎక్కువ సమయం లేదంటున్నారు కాబట్టి, విద్య, వైద్యం గురించి కలిపి మాట్లాడుతున్నాను. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫామిలీ వెల్ఫేర్, National Programme for Prevention & Control of Diabetics, Cancer, Cardio Vascular Diseases and Stroke.. అని వారు ఒక కార్యక్రమాన్ని ఇచ్చారు. వారి లక్ష్యాలు చాలా బాగున్నాయి. ఇవన్నీ to prevent and control common ncd through behaviour and life style controls, provide early diagnosis and management of common diseases అని వీరు చెప్పడం జరిగింది. కానీ, నా ఉద్దేశంలో ఈ అనారోగ్యాలకు మూలకారణం గురించి, ప్రాథమిక విద్యాస్థాయిలో కాకపోయినా, మాధ్యమిక విద్యాస్థాయిలోనైనా, ఈ అనారోగ్య లక్షణాలు ఎలా ఉంటాయి? ఎలాంటి లక్షణాలు కనబడితే, ఎటువంటి అనారోగ్యానికి దారితీస్తుంది, అనేటువంటి హెల్త్ ఎడ్యుకేషన్ తప్పనిసరిగా ఉండాల్సిన అవసరముంది. ఈ సభలో ఇంతమంది సభ్యులున్నారు. ఎంతమందికి హార్ట్‌ఎటాక్ వచ్చేముందు లక్షణాలు ఎలా ఉంటాయో తెలిసి ఉంటుంది చెప్పమనండి. చాలా మందికి తెలిసుండదు.

నాకు మూడుసార్లు హార్ట్‌అటాక్ వచ్చింది. హార్ట్‌అటాక్ వచ్చే లక్షణాలు ముందే తెలిసి గంటలో హాస్పిటల్‌కు చేరుకోగలిగితే 99% is the survival rate మీకు తెలుసు. హార్ట్‌అటాక్, క్యాన్సర్ లక్షణాలు సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి ప్రత్యేక సబ్జెక్ట్ క్రింద పెడితే బాగుంటుంది. Coronary heart disease మీద ఒక సంస్థ Health Study Report ఒకటి ఇచ్చింది. ప్రపంచంలో 72 లక్షల మంది హార్ట్‌అటాక్‌తో ప్రతి సంవత్సరం చనిపోతున్నారు. According to the latest trends and estimates మన భారతదేశంలో 2020 సంవత్సరానికి 26 లక్షల మంది చనిపోతారు. Only because of heart attack. ఇది ఆందోళన కలిగించే పరిస్థితి. ప్రస్తుతం భారతదేశంలో 14 లక్షల మంది చనిపోతున్నారు. ప్రతి గంటకు 162 మంది చనిపోతున్నారు. 80-90% deaths can be prevented provided we know what are the symptoms. డాక్టర్ దగ్గరకు వెళితే గాని ఈ లక్షణాలు తెలియవు. డాక్టర్ దగ్గరకు వెళ్ళాలంటే ముందు మనకు హార్ట్‌అటాక్ రావాలి. అప్పటి వరకు డాక్టర్ దగ్గరకు వెళ్ళం. దీని గురించి చాలా మందికి తెలియదు. తప్పనిసరిగా సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి ప్రత్యేక సబ్జెక్ట్‌గా పెట్టవలసిన బాధ్యత ఉంది.

ప్రతి రోగానికి నివారణ ఉంది కాని ఆత్మహత్యకు నివారణ లేదు. ఆత్మహత్య ధోరణిని కూడా మనం ఆలోచించాల్సి ఉంది. First time in the world history. First global report on suicide prevention. This report calls for action to address a large public problem. This was given by World Health Organization Director-General and we have to follow. నిన్ననే 04-09-2014 ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రచురించింది. This is a call. ప్రపంచంలో ప్రతి సంవత్సరం ఎనిమిది లక్షల మంది ఆత్మహత్యలతో చనిపోతున్నారు. ప్రతి 40 సెకన్లకు ఒక వ్యక్తి చనిపోతున్నాడు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు ఉన్న వారిలో జరుగుతున్నాయి. Men above 50 years and women over 70 years ఆత్మహత్య ధోరణి ఎక్కువగా ఉన్నాయి. 70% suicides occur in the upper and middle income group people. అంటే మన భారతదేశం లాంటి దేశాలలో జరుగుతున్నాయి. మన భారతదేశంలో 2012వ సంవత్సరంలో 2,58,075 మంది ఆత్మహత్యలతో చనిపోయారు. జనాభాలో 21.1 శాతం మంది అంటే లక్ష మందిలో 21 మంది చనిపోతున్నారు. Prevention is the need of the hour. To reduce these suicide tendencies the Government has to take some precautionary measures. ప్రజలలో అవగాహన, నిరాశా, నిస్పృహల నుంచి బయటపడే కార్యక్రమాలు స్కూల్ లెవెల్ నుంచి తెలుసుకొనే విధంగా ఉండాలి.

...

కేన్సర్ కూడా చాలా విపరీతంగా పాకిపోతుంది. భారతదేశంలో 2010వ సంవత్సరంలో 5,56,000 మంది క్యాన్సర్‌తో చనిపోయారు. ఇప్పుడు 25 లక్షల మంది క్యాన్సర్ రోగులున్నారు. ప్రతిరోజు 1544 మంది క్యాన్సర్‌తో చనిపోతున్నారు. క్యాన్సర్, హార్ట్‌అటాక్ డయాబెటిక్, బీపీ ఎందుకు వస్తుందో తెలిపే ఒక చిన్న పుస్తకాన్ని తయారు చేసి స్కూల్ లెవెల్ నుంచి ఒక సబ్జెక్ట్ క్రింద పెడితే బాగుంటుంది. This is a necessity and we have to act in that direction. Sir, I thank you for giving me this opportunity.

శ్రీ బోండా ఉమమహేశ్వరరావు (విజయవాడ-సెంట్రల్): అధ్యక్షా, ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో, దానికి ముందు శ్రీ నందమూరి తారక రామారావు గారి పరిపాలనలో పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి ఒక స్వర్ణయుగంగా ఉండింది. స్థానిక సంస్థలు వాటి నిర్వహణ మీద ఒక స్పష్టమైన విధానముంది. సమితీల స్థానంలో మండలాలను ప్రవేశపెట్టి వాటి ద్వారా పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేసిన ఘనత ఆనాటి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు శ్రీ నందమూరి తారక రామారావు గారికి చెందుతుంది.

(అధికారపక్షం పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

2004వ సంవత్సరం తరువాత వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించినట్లే, స్థానిక సంస్థలను కూడా నిర్వీర్యం చేశారు. రాజ్యాంగపరంగా వచ్చిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కాకుండా దేశంలోనే మొట్టమొదటిసారిగా స్థానిక సంస్థలలో 9 శాతం బీసీలకు, 20 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే. పంచాయితీ సంస్థలలో మహిళలకు 33 శాతం, బీసీలకు 34 శాతం, ఎస్సీలకు 17.5 శాతం ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం జరిగింది. ప్రతి కార్పోరేషన్‌ను, మునిసిపాలిటీలను, గ్రామాల వ్యవస్థను పటిష్టపరిచే విధంగా మౌలిక సదుపాయాలు త్రాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలకు పూర్తిగా మెరుగుపరిచి వాటిని అన్ని రకాలుగా ఆధునీకరించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిదే. ఆనాడు భారతదేశంలోనే అత్యంత పటిష్టమైన వ్యవస్థను తీసుకొని వచ్చి సుందర నగరంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకొని వస్తే ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని నగరాలల్లో 88వ స్థానానికి దిగజార్చి ఇష్టారాజ్యంగా చేశారు. కార్పోరేషన్లను, మున్సిపాలిటీలను, గ్రామాలను మురికికూపాలుగా మార్చిన ఘనత 10 సంవత్సరాల కాంగ్రెస్ పాలనకు చెల్లుతుంది. కనీసం కార్పోరేషన్లలో స్థానిక సంస్థలకు ఎన్నికలు సరైన సమయంలో పెట్టకుండా ఇష్టారీతిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు వల్ల కేంద్రం నుంచి మన రాష్ట్రానికి రావలసిన వేల కోట్ల రూపాయల నిధులు రాకుండా ఈ రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. ఆ కారణంగా మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. మున్సిపాలిటీలకు 29-09-2010తో గడువు ముగిస్తే ఎన్నికలు నిర్వహించడానికి ధైర్యం లేని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల పూర్తిగా మూడున్నర సంవత్సరాలపాటు ప్రత్యేక అధికారుల పరిపాలనలో ఇష్టారీతిన, ఎవరికి అందింది వాళ్లు దోచుకొని రాష్ట్రంలోని స్థానిక సంస్థలను, కార్పోరేషన్లను, మున్సిపాలిటీలను అడ్డగోలుగా దోచుకొన్నందున ఈ రోజు ఈ నూతన రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీకి, కార్పోరేషన్‌కు వెళ్లి చూస్తే జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులలో అవి ఉన్నాయి. ఇవి మేము చెబుతున్న విషయాలు కావు, కాగ్ నిర్ధారించింది.

...

జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎమ్. అనే ఒక పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దానికి సంబంధించి 251 పథకాలకు గాను రూ.11,907 కోట్లు మంజూరు చేస్తే అందులో 28 పథకాలను మాత్రమే పూర్తి చేసి రూ. 2014 కోట్లతో చేపట్టిన 17 మురుగునీటి పథకాలకు గాను ఒక్క దానిని కూడా పూర్తి చేయలేని ఘనత ఆనాటి కాంగ్రెస్ పాలకులది. దానివల్ల అనేక ఇబ్బందులొచ్చాయి. ఇవ్వాళ నూతన రాష్ట్రంలో చెప్పుకోలేని పరిస్థితులున్నాయి. విజయవాడ మునిసిపల్ కార్పోరేషన్‌లో సిబ్బందికి కనీసం ఇవ్వాళ జీతాలివ్వలేని రీతిలో స్పెషల్ ఆఫీసర్ల పరిపాలన జరిగింది. జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ నిధులను డైవర్ట్ చేసి ఇష్టారీతిన అడ్డగోలుగా వాడడం వల్ల వడ్డీల భారం పడి కార్పోరేషన్ సర్వనాశనమయ్యింది. రూ.2028 కోట్లతో చేపట్టిన 34 తాగునీటి పథకాల పనులు కూడా ప్రారంభించలేదు. అట్లాగే రూ. 1159 కోట్లతో చేపట్టిన ఐదు హౌసింగ్ పథకాలలో ఏ ఒక్కటి కూడా ఇంకా పూర్తి కాలేదు. అట్లాగే తాగునీటి

పథకాల అమలులో భారీ అవినీతి జరిగిందని సాక్షాత్తూ కాగ్ తప్పు పట్టింది. అంటే అన్నింటిలో అవినీతే....జలయజ్ఞం ధనయజ్ఞం లాగా, గనుల కుంభకోణం లాగా, సెజ్‌ల పేరుతో భూములు కొట్టేసినట్లుగా, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ నిధులను కూడా ఇష్టారీతిన దోచేశారు. అదేదో మేం చెప్పడం లేదు. సాక్షాత్తూ కాగ్ వారి ఆడిట్ నివేదిక చెప్పింది. అంటే గత పది సంవత్సరాల్లో ఈ రాష్ట్రంలో ఇష్టారీతిన జరిగిన అవినీతి గురించి ఆ రిపోర్టులో చెప్పడం జరిగింది.

అలాగే తెలుగు దేశం పాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు పంచాయతిరాజ్ వ్యవస్థను ఏ విధంగా బలోపేతం చేశారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోవలసిన అవసరముంది. తెలుగుదేశం ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణల మేరకు 1999లో స్థానిక సంస్థలకు 23 అధికారాలలో 15 అధికారాలను బదలాయించింది. అదేవిధంగా 1999లో 105 జీవో ద్వారా సర్పంచులు, ఎమ్‌పీపీలు, ఎమ్‌పీటీసీలు, జడ్పీటీసీలు మొదలైన వారికి అధికారాలు బదలాయించి సుమారు రూ.1200 కోట్ల విలువైన శాశ్వత ఆదాయ వనరులను గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు బదలాయించిన ఘనత ఆనాటి తెలుగు దేశం ప్రభుత్వానిది, ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారిది. అలాగే 105 జీవోలో భాగంగా ఇసుక రేవులను, వృత్తిపన్నును, స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవ వేతనాన్ని, ఆర్థిక కమీషన్ నిధులు, నీటితీరువా పన్నును, నేరుగా సర్పంచులకు, ఎమ్‌పీపీలకు, ఎమ్‌పీటీసీలకు, జడ్పీటీసీలకు ఇచ్చిన ఘనత ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వానిదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. అలాగే మహాత్మా గాంధీ ఆశయమైన గ్రామ స్వరాజ్య సాధనకు రాజ్యాంగంలోని 73వ సవరణలకు అనుగుణంగానే స్థానిక సంస్థలను బలోపేతం చేసింది అనాటి తెలుగుదేశం ప్రభుత్వమని గుర్తు చేస్తున్నాను.

అలాగే 2004 నుంచి 2009 వరకు వై.ఎస్. ముఖ్యమంత్రిగా వున్నారు. అయితే 2004 ఎన్నికల ముందు ఆయన తన ఎన్నికల ప్రచారంలో 73వ రాజ్యాంగ సవరణల మేరకు స్థానిక సంస్థలకు అధికారాలిచ్చి వాటిని బలోపేతం చేసే జీవోపై తొలి సంతకం చేస్తానని ప్రకటించారు. కాని ఆ హామీ అట్లాగే గాలిలో కలిసిపోయింది. ఆయన అధికారంలోకి వచ్చాక సర్పంచులను సస్పెండ్ చేయడం, చెక్ పవర్లను రద్దుచేయడం, నిధులు రాకుండా చేయడమనేది జరిగింది. అనాటి ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల స్థానిక సంస్థలు పూర్తిగా నిర్వీర్యమై పోయాయి. ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం అమలు జరగాల్సి వున్నా కాంగ్రెస్ నాయకుల ప్రత్యక్ష జోక్యంతో జిల్లా కలెక్టర్ల ద్వారా మంజూరు చేయించుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇది మేం చెప్పడం కాదు అధ్యక్షా. కాగ్ ఆడిట్ నివేదికల ద్వారా బయటపడిన విషయాన్ని ఈ సందర్భంగా నేను సభకు తెలియజేస్తున్నాను.

అలాగే వై.ఎస్.రాజశేఖర రెడ్డి తరువాత వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కూడా తాగు నీటిని, రోడ్లను పారశుద్ధ్యాన్ని డ్రెయినేజ్ వ్యవస్థను పట్టించుకోకుండా పక్కన పెట్టేసి పూర్తిగా నిర్వీర్యం చేశారు.

ఆనాడు 500 నుంచి 700 జనాభాకలిగిన ఏ చిన్న గ్రామానికి వెళ్లినా అక్కడ సిమెంటు రోడ్లు తారు రోడ్లు, తాగునీటి వసతి, పారిశుధ్యం,మొదలైన మౌలిక వసతులన్నీ కల్పించి గ్రామాలను పటిష్టం చేసినఘనత ఆనాటి తెలుగుదేశం పాలనలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్ర బాబు నాయుడు గారికే దక్కింది. అది ఈనాటికీ ప్రజలు చెప్పుకుంటున్న సత్యమని గుర్తు చేస్తున్నాను.

కాని కాంగ్రెస్ పార్టీ పాలనలో రోడ్లు, తాగునీరు పారిశుధ్యం లాంటి మౌలిక వసతులను పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరించినందువలన అంటువ్యాధులు ప్రబలి పోయి అన్ని వ్యవస్థలు కూడా దెబ్బతిన్నపరిస్థితి వుండేది.

తాగునీటి పథకాల అమలులో భారీ అవినీతి జరిగిందని కాగ్ నిర్ధారించింది. 2007-2012 మధ్య కాలంలో రూ. 4965కోట్లతో మొత్తం 538 పనులు పనులు చేపట్టవలసి వుండగా అందులో 250 పనులు ప్రారంభం కాకుండానే డబ్బులు తినేసిన ఘనత రాజశేఖర రెడ్డి గారి కాంగ్రెస్ పాలనలో జరిగింది. మరి ఈ రోజున ఈ నూతన 13 జిల్లాల రాష్ట్రంలో ఈ నాటి ముఖ్యమంత్రి ఈ నూతన రాష్ట్రం అభివృద్ధి మీద అత్యంత శ్రద్ధ పెట్టడం జరిగింది. ఎందుకంటే పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, నగరాలలోని రోడ్లను బట్టే నాగరికతను అభివృద్ధిని అంచనా వేయవచ్చునన్న పెద్దల సిద్ధాంతాన్ని బట్టి ఈ రోజున ఒక పెద్ద మహా యజ్ఞాన్ని ఈ ప్రభుత్వం చేపట్టడం జరిగింది. అందులో భాగంగానే ఈ ప్రభుత్వం ఏడు మిషన్లను, ఐదు గ్రిడ్లను ఏర్పాటు చేయడుం ద్వారా ఈ రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ఈ ప్రభుత్వం చేపట్టడం జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు తాగునీరు, పారిశుద్ద్యం తదితర మౌలిక వసతులన్నీ కల్పించడం ద్వారా స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే విషయంలో కాని, పట్టణాభి వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో కాని ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేసేవిధంగా ఈ ప్రభుత్వం యొక్క బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్న విషయాన్ని ఈ సందరంగా నేను గుర్తు చేస్తూ నాకు ఈ అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ అయితాబత్తుల ఆనంద రావు (అమలాపురం)ః అధ్యక్షా, పంచాయతిరాజ్ డిమాండ్ల మీద ప్రసంగించడానికి నాకు అవకాశమిచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ రోజు గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, స్వపరిపాలన, అధికార వికేంద్రీకరణ జరగాలని మన పూజ్య బాపూజీ మహాత్మా గాంధీగారు

తెలిపారు. కాని మన దేశంలో 1952 నుంచి ఎక్కువ కాలం అధికారంలో వుండి మన దేశాన్ని ఎక్కువ కాలం పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ అన్ని కోణాల్లోనూ గ్రామ పంచాయతిలను నిర్వీర్యం చేసింది. అదే పార్టీ 2004 ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే స్థానిక సంస్థలకు అధికారాలన్నీ బదలాయిస్తామని ఎన్నికల వాగ్దాన చేసిన వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చాక ఆయన పాలనలో గ్రామ పంచాయతిల పాలన పూర్తిగా చీకటి రాజ్యంగా మారింది.

...

ఎందుకంటే, నారా చంద్రబాబు నాయుడుగారు గంతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జన్మభూమి కార్యక్రమం తీసుకొచ్చారు. అప్పడు రాష్ట్ర బడ్జెట్ చాలా తక్కువ. ఆ కార్యక్రమంలో అప్పుడు సుమారు రూ.1600కోట్ల రూపాయలు వెచ్చించి 70వేల ఆవాసాలలో పది, పదిహేను సార్లు జన్మభూమి జరిపి ఎన్నో పనులు చేపట్టి పూర్తి చేశారు. కానీ దానికి ఇమిటేషన్‌గా ఇందిరమ్మ ఆదర్శ గ్రామాలు అని పేరుపెట్టి రాజశేఖర రెడ్డి గారు గ్రామ పంచాయతీలకు ఫైనాన్స్ నిధులు గానీ, ఎస్‌జీఆర్‌వై నిధులు గానీ, ప్రత్యేక గ్రాంట్లు కూడా ఇవ్వకుండా గ్రామ పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులను ఇందిరమ్మ పథకానికి మళ్లించి గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఆ రోజులలో అనగా 2004-09వరకు గ్రామ పంచాయతీలో చిన్న పనులు కూడా చేసుకోవడానికి నిధులు లేక సర్పంచ్‌లు శాసనసభ్యులు, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితిని రాజశేఖర రెడ్డిగారు కల్పించారు. ఇటువంటి విషయాలలో గ్రామాలలో పరిపాలన బాగుపడాలంటే, రాజకీయ చైతన్యం గ్రామస్థాయికి వెళ్లాలనే ఉద్దేశంతో స్వర్గీయ ఎన్.టి.రామారావు గారు పంచాయతీ సమితులను రద్దుచేసి మండల వ్యవస్థను ప్రవేశపెట్టారు. అంతే కాకుండా కేవలం గ్రామాల అభివృద్ధి అంటే ఆర్థిక వనరులు ఒకటే కాదు, స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. అలాగే వాటిలో రిజర్వేషన్లు కూడా అమలుచేయాలి. సామాజిక సమతుల్యతను, సామాజిక న్యాయాన్ని పాటించాలి.

తెలుగుదేశం పార్టీ 1995లో అధికారంలోకి వచ్చినపుడు ఎస్సీలకు 13శాతం, ఎస్టీలకు 8.23శాతం, బీసీలకు 34శాతం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించినది. ఆ విధానం 2006వరకు కొనసాగింది. కానీ కర్ణాటకకు చెందిన కె.ఇ.కృష్ణమూర్తి అనే ఆయన సుప్రీంకోర్టులో కేసు వేసినపుడు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 60శాతానికి మించరాదని, 50శాతంలోపే ఉండాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన దరిమిలా 2010 వరకు ఆ తీర్పు మీద స్పందించకుండా కేంద్రంలోని యూపీయే అధినేత అయిన సోనియాగాంధీ గారిని కోరకుండా, రాజ్యాంగ సవరణ చేయకుండా, దళిత, గిరిజన, బీసీ వర్గాలకు 60శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేసిన ఘనత వారికే దక్కింది. ఆ విధంగా కుంటిసాకులు చెబుతూ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించలేదు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నంత కాలం స్థానిక సంస్థలకు సక్రమంగా ఎన్నికలు జరిపిన దాఖలాలు లేవు. 1975 నుంచి 1983 వరకు, 1992 నుంచి 1994వరకు, 2011 నుంచి 2013 వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత స్థానికసంస్థలకు ఎన్నికలు జరపకపోవడం వారి లక్షణం, అలవాటుగా మారింది. ఆ తరవాత

అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి గారు కూడా ఆ లక్షణాన్ని తూ.చ. తప్పకుండా పాటించారు. బీసీలకు 20శాతం ఉన్న రిజర్వేషన్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు 33శాతానికి పెరిచారు. తరవాత వచ్చిన ప్రభుత్వాలు వాటిని 50 శాతానికి పెంచారు. అలాగే బీసీలకు 20శాతం రిజర్వేషన్లు ఉండగా ఎన్టీ రామారావు గారు దానిని 33శాతానికి పెంచారు. మొట్టమొదటిసారిగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఈ రాష్ట్రంలో జడ్పీ ఛైర్మన్ల పదవులలో రిజర్వేషన్ కల్పించిన ఘనత ఎన్టీ రామారావు గారికే దక్కింది. ఏ విషయంలో చూసినా వారి పాలన ఆదర్శవంతమైనది.

రాజీవ్ గాంధీ పేరుతో ఒక పథకం, ఇందిరా గాంధీ పేరుతో మరో పథకం కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. ఇందిరాగాంధీ పేరుతో ఇందిరమ్మ ఇళ్ల పథకం, రాజీవ్ గాంధీ పేరుతో పల్లెబాట కార్యక్రమాలు తీసుకొచ్చిన అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారు రాజీవ్ గాంధీ గారు 1992లో చేసిన 73, 74 రాజ్యాంగ సవరణలకు అనుగుణంగా కేంద్రం నుంచి నేరుగా పంచాయతీలకు వచ్చే నిధులను ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం తన వద్దే ఉంచుకొని పూర్తిగా పంచాయతీలను నిర్లక్ష్యం చేసింది. కానీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాత చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో 2002లో గ్రామ పంచాయతీలకు అప్పగించాల్సిన 28, 29 అధికారాలలో 15 అధికారాలను పంచాయతీలకు బదలాయించారు. సుమారు రూ.1200కోట్ల రూపాయల శాశ్వత నిధులను పంచాయతీలకు సమకూర్చారు. 73వ రాజ్యాంగ సవరణ తెచ్చిన రాజీవ్ గాంధీ పేరుతో ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు గానీ ఆ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించాల్సిన అధికారాలను మాత్రం గ్రామ పంచాయతీలకు కల్పించలేదు.

ఇసుక వేలంపాటలు ఇంతకు ముందు గనులు, భూగర్భ శాఖ ఆధ్వర్యంలో ఉండేవి. 1999లో జీవో నం.356ను చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జారీ చేసి ఇసుక వేలంపాటల ద్వారా వచ్చే ఆదాయంలో 25 శాతం ఆ గ్రామ పంచాయతీలకు, 25 శాతం మండలానికి, 50 శాతం జిల్లా పరిషత్‌కు చెందేలా చేసి ఆ నిధులను స్థానికంగా వినియోగించేలా విప్లవాత్మక నిర్ణయం తీసుకొంటే, ఆ తరవాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డిగారి ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు చాలా అన్యాయం చేసింది. స్థానిక సంస్థలకు వచ్చే ఆదాయాన్ని తొలగించి ఇసుక వేలంపాటలపై మరలా గనుల శాఖకు అధికారాన్ని అప్పచెప్పారు. మా గోదావరి జిల్లాలలో ఇసుక వేలంపాట ద్వారా వచ్చే ఆదాయాన్ని హైదరాబాద్ నగరానికి తరలించారు. ఇందిరమ్మ ఆదర్శ గ్రామాల పథకం, రాజీవ్ పల్లెబాట పథకం, ఆ తరవాత ప్రవేశపెట్టిన రచ్చబండ కార్యక్రమం ఎందుకు నిర్వహించారంటే తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులైన సర్పంచులను అణగదొక్కడంకోసం, వారి పదవులు తొలగించడంకోసం, వారికి వేతనం రాకుండా చేయడం కోసం మాత్రమే. ఆదర్శ గ్రామాల పేరుతో పంచాయతీల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీలు వేసి ఆ కమిటీల ద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లా ఇన్‌ఛార్జి

మంత్రులకు, కలెక్టర్లకు అప్పగించిన పాలనా కాలం 2004-09వరకు తెలుగుదేశం సానుభూతిపరులను సంపూర్ణంగా నిర్వీర్యం చేసిన ఘనత రాజశేఖరరెడ్డి గారికి దక్కుతుంది.

రాజశేఖరరెడ్డిగారి పరిపాలనా కాలంలో గ్రామ సర్పంచులకు కనీసం గౌరవవేతనం కూడా ఇవ్వలేదు. గ్రామ పంచాయతీలకు నెలకు రూ.600/-లు, మేజర్ గ్రామపంచాయతీలకు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గౌరవ వేతనం ఇచ్చి అధికారాలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. కానీ రాజశేఖర్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చిన తరవాత వారికి కనీసం గౌరవ వేతనం కూడా ఇవ్వకుండా పూర్తిగా నిర్వీర్యం చేశారు. గ్రామ పంచాయతీలకు స్టాంప్ డ్యూటీ ద్వారా వచ్చే మొత్తం తప్ప ఇతర వనరులేమీ లేవు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు స్టాంప్ డ్యూటీలో మూడు శాతం గ్రామ పంచాయతీలకు వస్తే, రాజశేఖర్‌రెడ్డిగారు అధికారంలోకి వచ్చిన తరవాత దానిని రెండు శాతం తగ్గించి కేవలం ఒక్క శాతం మాత్రమే ఇచ్చారు. ఇది కూడా చాలా అన్యాయం. ఆదాయం తగ్గడంతో గ్రామ పంచాయతీలు నష్టపోయాయి.

అదే విధంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు రాజశేఖర్ రెడ్డి గారు రూ.5లక్షల నుంచి రూ.15లక్షలు ఇస్తామని ప్రకటించారు. 340 గ్రామ పంచాయతీలు ఈ రాష్ట్రంలో ఏకగ్రీవంగా ఎన్నికైతే ఒక్క పైసా కూడా ఆ పంచాయతీలకు ఇవ్వలేదు. ఆ విధంగా ఆయా గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారు, ఆయా గ్రామ ప్రజలను పూర్తిగా మోసం చేశారు. ఈ రాష్ట్రంలో స్థానిక సంస్థల బలోపేతం గానీ, నిధులు అందించడం గానీ, అణగారిన వర్గాలు, బడుగు బలహీనవర్గాలకు సంపూర్ణమైన అధికారం కల్పించింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం, ఎన్టీ రామారావుగారు, చంద్రబాబు నాయుడు గారని తెలియజేస్తున్నాను. అన్ని విషయాలలో కాంగ్రెస్ పార్టీ అమాయకులైన దళితులను మోసం చేసి పూర్తిగా వారి ఓట్లతో అధికారాన్ని పొంది కూడా వారికి అన్యాయం చేసిన విషయం వాస్తవం. సభా ముఖంగా కొన్ని విషయాలు చెబుతాను. నిర్మల్ గ్రామ పురస్కారానికి సంబంధించి సర్పంచులకు, ఎంపీటీసీలకు సరైన శిక్షణ ఇవ్వలేదు. గ్రామ పంచాయతీలకు నిధులను 15 శాతం నుంచి 20శాతానికి పెంచాలి. అలాగే పంచాయతీలలో డంపింగ్ సమస్య తీవ్రంగా ఉంది కాబట్టి రెండు, మూడు గ్రామాలకు ఒకచోట అయినా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఆ డంపింగ్ సమస్య కూడా పరిష్కారమవుతుంది. గ్రామాలలో ప్రస్తుతం శ్మశానవాటికలకు కూడా స్థలం అందుబాటులో లేదు. ఉన్న స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ముఖ్యమంత్రి గారు రోడ్డు గ్రిడ్, వాటర్ గ్రిడ్ లాంటివి ప్రకటించారు, భవిష్యత్తులో గ్రామ పంచాయతీలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే ఈ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సంపూర్ణంగా గ్రామాల అభివృద్ధి చెందుతాయి కావున ప్రభుత్వం ఈ దిశలో చర్యలు తీసుకోవాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

...

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు): అధ్యక్షా నమస్కారం. ఈరోజు రెవెన్యూకి సంబంధించిన డిమాండ్స్ మీద మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు పెద్దలకు నా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. అధ్యక్షా, ఈరోజు సెప్టెంబర్, 5వ తేది. ఈరోజు సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి. ఈరోజుని మనమందరం టీచర్స్‌డే గా జరుపుకుంటాం. ఈ సందర్భంగా అటూ, ఇటూ కూడా అనేక మంది టీచర్ వృత్తి నుంచి ఎంఎల్ఏలుగా వచ్చిన శాసన సభ్యులున్నారు. అందరికీ నా టీచర్స్‌డే శుభాకాంక్షలు.

అధ్యక్షా, రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలో శేషాంధ్రప్రదేశ్‌కి రుణాలు, ఉద్యోగులు, పింఛనుదారులు జనాభా ప్రాతిపదికన కేటాయించడం జరిగింది. అది 58 : 42 గా కేటాయించినందువలన ఉమ్మడి రాష్ట్రంలో వ్యయం కూడా 58 శాతం కన్నా ఎక్కువగా ఉందని మనకు బడ్జెట్ ప్రసంగంలో మంత్రి గారు చెప్పారు. కానీ రాష్ట్రానికి వచ్చిన ఆదాయం సేల్స్‌ట్యాక్సు గానీ, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, మోటార్ వాహనాల పన్ను, ఎక్సైజు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం, మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయం, శేషాంధ్రప్రదేశ్‌లో మొత్తం మీద పన్నుల ద్వారా గానీ ఇతరత్రా వచ్చిన ఆదాయం ఉమ్మడి రాష్ట్రంలోని ఆదాయంలో 47 శాతంగా ఉందని మంత్రి గారు చెప్పారు. ఈ బడ్జెట్‌లో పన్ను వసూళ్లు రూ.37,000 కోట్లుగా 2014–15కి బడ్జెట్ అంచనా చేయడం జరిగింది. అదే విధంగా నాన్‌టాక్స్ రెవెన్యూ రూ.9000 కోట్లుగా ఇవ్వడం జరిగింది. అయితే గత సంవత్సరం బడ్జెట్ ఎస్టిమేషన్, రివైజ్డు ఎస్టిమేషన్ రెండూ కూడా రూ.72442 కోట్లు గా చూపించడం జరిగింది. రెండూ ఒకటే ఫిగర్ ఇవ్వడం వలన కరెక్టుగా అంతే ఖర్చు పెట్టారా లేకపోతే సరైన ఫిగర్స్ ఇవ్వలేక అదే ఫిగర్స్‌ని కంటిన్యూ చేశారా నాకు తెలియడం లేదు. బడ్జెట్ అకౌంటు నుంచి 2012–13వ సంవత్సరంలో చూస్తే మొత్తం ట్యాక్సు, నాన్‌ట్యాక్సు రెవెన్యూ రెండూ కలిపి రూ.75,000 కోట్లు కాగా సంవత్సరాభివృద్ధి 15 శాతం వేసుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో 2014–15కి ఆ ఆదాయం రూ.99,000 కోట్లు అవుతుంది. పాపులేషన్ షేర్ ప్రకారం 58 శాతంగా అంచనా వేస్తే ట్యాక్సు, నాన్‌ట్యాక్సు రెవెన్యూలు కలిపి రూ.57,000 కోట్లవుతుంది. కానీ బడ్జెట్‌లో ఆ రెండూ కలిపి కేవలం రూ.46,000 కోట్లు ఉంది. ఇక్కడ సుమారు రూ.11,000 కోట్ల లోటు బడ్జెట్ చూపిస్తున్నారు. ఈ లోటు బడ్జెట్‌ని ఏ విధంగా భర్తీ చేస్తారో బడ్జెట్‌లో ఎక్కడా చెప్పలేదు. ఈ ప్రభుత్వం పదే పదే లోటు బడ్జెట్ కొరకు కేంద్రం సహాయం చేస్తుందని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఈ రకమైన హామీ ఇచ్చిందా అని అడుగుతున్నాను.

గతంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారు రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెడుతూ ప్రసంగంలో ఆయన మొట్టమొదటి సంవత్సరం లోటు బడ్జెట్‌ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం జరిగింది. అయితే చట్టంలో దీనికి సంబంధించి ఎక్కడా రాయలేదు. అలాంటి హామీ ఏమైనా కేంద్ర ప్రభుత్వం ఇచ్చి ఉంటే శాసన సభలో చెబితే బాగుంటుంది. పోలవరం ప్రాజెక్టులాగే దీనికి కూడా ఒక ఆర్డినెన్స్‌ని ఇచ్చి ఉంటే చట్టబద్ధత

ఉండేదని నేను అభిప్రాయపడుతున్నాను. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి హామీ ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆదాయాన్ని ఎలా పెంచుకుని లోటుని భర్తీ చేస్తుందో మాకు అనుమానంగా ఉంది. వ్యాట్ ట్యాక్సుని పెంచి భర్తీ చేస్తారా లేక రిజిస్ట్రేషన్ ఫీజులని పెంచి భర్తీ చేస్తారా అని అడుగుతున్నాను. ఇప్పటికే గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం అన్ని వస్తువుల మీద 20 శాతం వ్యాట్ ట్యాక్సు విధించడం వలన వస్తువుల ధరలన్నీ ఆకాశాన్ని అంటి పేదవాళ్లకు బ్రతుకు భారంగా మారింది. పన్ను రేట్లు గానీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పన్నుల రేట్లు గానీ, ప్రాపర్టీ వాల్యూస్ గానీ ఎలాంటి పరిస్థితుల్లో పెంచడం ఏమాత్రం సమర్ధనీయం కాదని తెలియచేస్తున్నాను.

గత ప్రభుత్వం ధరలు విపరీతంగా పెంచి ట్యాక్సులు ఎక్కువగా పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టడం వలన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అదే కారణమనే విషయం మనందరికీ తెలుసు. ప్రజల మీద భారం మోపి ధరలు పెంచిన ప్రభుత్వాలు ఎప్పుడూ కూడా మనలేదు. ధరలు ఏ ప్రభుత్వం పెంచినా వాళ్లందరికీ ఇదే గతి పట్టిస్తారని మీద్వారా తెలియచేస్తున్నాను. ఏ పన్నులు పెంచకుండా రెండు సార్లు మంచి మెజారిటీ సీట్లు సంపాదించుకుని అధికారంలోకి వచ్చిన ఘనత దివంగత నేత డా.వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారికే సాధ్యమైందని తెలియచేస్తున్నాను. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్ర పరిధిలో ఉన్న పన్నుల విధానాన్ని సమగ్రంగా పరిశీలిస్తుంది. పన్నుల విధానం చెల్లింపుదారులకు స్నేహపూర్వక వాతావరణంలో ఉంటుందని ప్రకటించారు. గత ప్రభుత్వం పెంచిన వ్యాట్ రేట్లను తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రెవెన్యూ పెరగాలంటే ముఖ్యంగా ట్యాక్సు నిర్వహణ వ్యవస్థని క్రమబద్ధీకరించడం అదే విధంగా రెవెన్యూ లీకేజీలను అరికట్టడం......

శ్రీ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు(నర్సీపట్నం)ః సార్, సభ్యురాలు మాట్లాడుతూ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో రెండు సార్లు బ్రహ్మాండంగా పరిపాలన జరిగిందని చెప్పారు. ఆ టైములో ఆమె తెలుగుదేశం పార్టీలో పొలిట్‌బ్యూరో మెంబరుగా ఉన్నారు. ఆమె ఇప్పుడు మాట మారిస్తే ఎట్లా?

శ్రీమతి ఉప్పులేటి కల్పనః ప్రస్తుతం గురించి మాట్లాడండి.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి (పత్తికొండ)ః అధ్యక్షా, సభ్యురాలు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ గారు ఆరోజుల్లో రెవెన్యూ పెంచినందుకే ప్రభుత్వం పడిపోయిందని చెబుతున్నారు. మరొకవైపు రెవెన్యూ పెంచకుండా మీరు లోటు బడ్జెట్ ఎట్లా పూరిస్తారని స్పీచ్‌లో చెబుతున్నారు. అంటే రెవెన్యూ పెంచమనా, వద్దనా అర్ధమయ్యేలా చెప్పడం లేదని తెలియచేస్తున్నాను.

శ్రీమతి ఉప్పులేటి కల్పనః అధ్యక్షా, ట్యాక్సులు పెంచకుండా ఉన్న ట్యాక్సులని సక్రమంగా వసూలు చేయడం వలన, వ్యవస్థ నిర్వహణని క్రమబద్ధీకరిస్తూ కలెక్షన్లు ఎక్కువ చేయాలని చెబుతున్నాను. ట్యాక్సులు పెంచి భారం మోపకుండా చూడమని వారిని కోరుతున్నాను. రెవెన్యూ లీకేజీలను అరికట్టాలి. అధిక పన్నులు ప్రజల మీద మోపడం సబబు కాదని ప్రభుత్వానికి తెలియచేస్తున్నాను.

...

అయితే మనం పన్నులను పెంచినప్పుడు ఎక్కువ మంది పన్నులను ఎగ్గొట్టడానికి అడ్డదారులు త్రొక్కడానికి ప్రయత్నం చేస్తారు. కాబట్టి గత శతాబ్ద కాలంలో మనం చూస్తే వ్యక్తిగత ఆదాయపు పన్నును ఉదాహరణగా తీసుకుంటే, ఎప్పుడైతే వ్యక్తిగత ఆదాయపు పన్ను రేట్లను తగ్గించారో స్వతహాగా ప్రజలు ముందుకొచ్చి పన్నులను చెల్లించడం, తద్వారా ఆదాయం పెరిగిన దాఖలాలు ఉన్నాయి. 20 సంవత్సరాల క్రింత ఆదాయపు పన్ను వసూళ్లు, సెంట్రల్ ఎక్సైజ్ మరియు కస్టమ్స్ డ్యూటీ కంటే చాలా తక్కువగా ఉండేవి. అయితే అంచెలంచెలుగా ఆదాయపు పన్ను రేట్లను తగ్గించడం వలన సెంట్రల్ ఎక్సైజ్ మరియు కస్టమ్స్ డ్యూటీ కంటే ఎక్కువగా ఆదాయపు పన్నులు జమకావడం మనం చూస్తున్నాం. దానిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే ప్రాపర్టీ ట్రాన్స్‌ఫర్స్ పైన, రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాల్సిన అవసరం ఉంది. ఈ పన్నులు ఎక్కువగా ఉండటం వల్ల నల్లధనం ఎక్కువవుతుంది. దానిని అరికట్టాలంటే చిన్న రైతులకు వెసులుబాటు కలిగించే విధంగా అయిదు నుంచి పది లక్షల లోపు విలువ కలిగిన ప్రాపర్టీ రిజిస్ట్రేషన్‌కి స్టాంపుడ్యూటీ నుండి మినహాయింపునివ్వాలని లేదా రేటు తగ్గించాలని కోరుతున్నాము. అదేవిధంగా రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటులో శ్లాబ్ రేటు విధానాన్ని అమలు చేసినట్లయితే చిన్నకారు రైతులకు వెసులుబాటు ఉంటుందని మేము భావిస్తున్నాము.

ఇకపోతే కాగ్ రిపోర్టులు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిశితంగా విమర్శించిన పరిస్థితిని నూతనంగా చూశాము. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగా రెవెన్యూయేతర ఆదాయ వనరుల మీద ఆధారపడుతుందే తప్ప స్వతహాగా ఆదాయాన్ని పెంచుకునే ప్రయాత్నాలను చేయడం లేదని, చేసిన అప్పులు ప్రభుత్వ సిబ్బంది జీతాలు, వడ్డీలు కట్టడానికే సరిపోవడం లేదని, రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన నిధులను స్వతహాగా రెవెన్యూ మార్గాలను పెంచుకోవడం ద్వారా సమకూర్చుకోవాలని కాగ్ స్పష్టం చేసింది. అయితే బడ్జెట్‌లో పన్నుల విధానాన్ని పటిష్టం చేయడానికి, ఆదాయ మార్గాలను పెంచుకోవడానికి, క్రొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు సంబంధించిన ప్రయత్నాలు ఎక్కడా కనిపించలేదు. అంతేగాక, ఈ బడ్జెట్ అంచనాల్లో కొంత కాలానికి సంబంధించిన, ఉమ్మడి రాష్ట్రానికి సంబంధించిన రెవెన్యూస్‌ని కూడా రిఫ్లెక్ట్ చేశామని చెప్పడం జరిగింది. దానికి సంబంధించి ఎక్కడా కూడా బడ్జెట్లో మెన్షన్ చేయలేదు.

ఇకపోతే, ప్రభుత్వాలు ఎక్సైజ్ రేట్లను పెంచితే మద్యపానం వినియోగం తగ్గుతుందని అపోహలు పడుతున్నారు. కానీ రేట్లు పెరిగినప్పటికీ రేట్లకు సంబంధం లేకుండా ఎప్పటికప్పుడు

వినియోగం కూడా పెరిగిపోతోంది. కాబట్టి ప్రభుత్వాలు కేవలం ఆదాయ వనరుగా మాత్రమే దీనిని చూడకుండా ప్రజల ఆరోగ్యాన్ని, సమాజంలో వారికి ఉన్న భద్రతను కూడా దృష్టిలో పెట్టుకొని, ఎక్సైజ్ రేట్లను తగ్గించాల్సిందిగా కోరుతున్నాము.

అదే విధంగా మద్యపానం వల్ల అనేక కుటుంబాలు విచ్ఛిన్నమైపోతున్నాయి, విచ్ఛిన్నం కావడమే కాకుండా సమాజంలో కూలినాలి చేసుకొని బ్రతికే ప్రజానీకం, వారి సంపాదనలో ఇంతకు ముందు 25 శాతం ఖర్చు చేస్తే, ఇప్పుడు 50 శాతం వరకు ఖర్చు పెట్టడానికి వెనుకాడటం లేదు.  అందువల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. కాబట్టి మేము కోరేదేమంటే, ఈ ప్రభుత్వం వారి ఎన్నికల హామీలో మద్య నియంత్రణ కోసం జిల్లాకొక డి-అడిక్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. మరి బడ్జెట్‌లో చూస్తే ఆ దిశగా ప్రయత్నాలు జరిగినట్లు ఎక్కడా కనిపించడం లేదు. కేవలం పేపర్ల మీద మ్యానిఫెస్టోలోనే ఇవన్నీ కనిపిస్తున్నాయి, ప్రత్యక్షంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. 1983 నుండి 1989 వరకు అమలు చేసిన  వారుణీవాహిని దగ్గర నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలను ఎడ్యుకేట్ చేయడానికి, దాని వల్ల సామాజికంగా ఆర్థికంగా వచ్చే ఇబ్బందులను ప్రచారం చేయడానికి ఎవ్వరూ చిత్తశుద్ధితో పని చేయలేదు. అయితే ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ హామీనిచ్చిన విధంగా మద్యపాన నియంత్రణకు డి-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసి నియంత్రించాల్సిందిగా మేము కోరుతున్నాము.

గతంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్‌టి రామారావు గారు బ్రతకున్నప్పుడు మద్యపానాన్ని పూర్తిగా నిషేధించడం జరిగింది. ఆ సమయంలో పూర్తిగా నిషేధించామని చెబుతూ, పన్నులను విపరీతంగా పెంచడం కూడా జరిగింది. ఆ విధంగా పన్నులను పెంచిన ఒక సంవత్సరంలోపే మద్యాన్ని మరలా ప్రవేశపెట్టారు, కానీ పెరిగిన పన్నులను మాత్రం తగ్గించలేదు. ప్రతి ఒక్కరూ భరించాలని, ఆ భారాన్ని అందరి మీదా వేస్తూ పన్నులను పెంచడం జరిగింది. అంతేకాకుండా టీడీపీ హయాంలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా విద్యుత్ ఛార్జీలను పెంచుతూ వచ్చారు. ఇప్పుడు అదే ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చింది కాబట్టి ప్రజలందరూ భయపడుతున్నారు. చరిత్ర మరలా పునరావృతం అవుతుందేమో మరలా ఛార్జీలను పెంచుతారేమోనని భయపడుతున్నారు. కాబట్టి ఇలాంటి పన్నుల భారాన్ని పెంచే ప్రభుత్వం వద్దు – పన్నుల భారాన్ని మోపకుండా ఎలాంటి క్రొత్త పన్నులను విధించకుండా, పవర్ టారిఫ్ ట్యాక్స్ రేట్లు, మున్సిపల్ పన్నులు, వాటర్ ఛార్జీలు వంటివి పెంచకుండా ఉన్న డా.వైఎస్ రాజశేఖరరెడ్డి గారి పరిపాలన లాంటి పరిపాలన కావాలని ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు. త్వరలో ప్రజల ఆశలు నెరవేరుతాయని ఆశిస్తూ విరమిస్తున్నాను.

MR.SPEAKER: Now reply by the Minister for Agriculture.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, వ్యవసాయం, పశుసంవర్ధకం మరియు మత్స్య పరిశ్రమకు సంబంధించిన డిమాండ్స్ మీద ఏడుగురు సభ్యులు మాట్లాడటం జరిగింది. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గారు, విశ్వేశ్వరరెడ్డి గారు, శ్రీనివాసిరెడ్డి గారు, సుబ్బారావు గారు, రామానాయుడు గారు, రాజా గారు అదే విధంగా వర్మ గారు ఈ విధంగా మొత్తం ఏడుగురు సభ్యులు మాట్లాడటం జరిగింది. ఈ ఏడుగురు గౌరవ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన అంశాలేమంటే, తెలుగుదేశం ప్రభుత్వం వ్యవసాయం పట్ల అత్యధిక ప్రాధాన్యతనివ్వడం, ప్రధానంగా సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ సాయిల్ టెస్ట్ ల్యాబ్స్ కావాలి, వాటి ద్వారా భూసార పోషకాలు ఏ విధంగా డెఫిసిట్ ఉందో తెలుసుకొని అవసరమైన చర్యలను తీసుకోవాలని కోరడం జరిగింది. ఈ సాయిల్ టెస్ట్ ల్యాబ్స్‌ని వీలైనన్ని ఎక్కువ కేంద్రాలను ఏర్పాటు చేసి, సూక్ష్మ పోషకాల లోపం ఉన్న వాటిని సబ్సిడీ మీద ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

అదే విధంగా సీడ్ విలేజ్ ప్రోగ్రామ్స్‌ని ఎక్కువ చేయాలని అడిగారు. సీడ్ విలేజ్ ప్రోగ్రామ్స్‌ని కూడా వీలైనన్ని ఎక్కువ గ్రామాల్లో తీసుకొని ఏ గ్రామానికి ఆ గ్రామంలో విత్తనోత్పత్తి జరిగే విధంగా ప్రభుత్వం ప్రాధాన్యతనివ్వడం జరుగుతోంది. అదేవిధంగా గౌరవ సభ్యులు మాట్లాడుతూ, గ్రీన్ హౌసు, పాలిహౌస్, షేడ్‌నెట్ హౌసు వంటి వాటిని ఎక్కువగా ప్రోత్సహించాలని కోరడం జరిగింది. వీటన్నింటికీ ప్రభుత్వం ఎకరానికి రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల వరకు సబ్సిడీనిచ్చి ప్రోత్సహించడం జరుగుతుంది. పండ్ల సాగు, పూల తోటల సాగు, కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తోంది.

అదేవిధంగా, కాటన్, చిల్లీస్, ప్యాడీ వంటి పంటలను తక్కువ పెట్టుబడితో ఎక్కువ పంట వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతోంది. దానికోసం ఇక్రిశాట్‌ని అనుసంధానం చేసుకొని, రైతులకు 10 శాతం నుండి 30 శాతం వరకు పెట్టుబడి తగ్గే విధంగా, అదనంగా 10 శాతం దిగుబడి పెరిగే విధంగా ప్రయత్నం చేస్తూ ఇక్రిశాట్‌తో ఒక ఎంఓయుతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. తద్వారా రైతుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను చేకూర్చే విధంగా నిర్ణయం తీసుకొని ముందుకు వెళ్లడం జరుగుతోంది. ఆ విధంగా ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్‌ని ప్రోత్సహించాలనే దృక్పథంతో ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం కోసం, ఏ జిల్లాలో ఏ పంటకు అనుకూలంగా అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందో ఆ రకమైన చర్యలను కూడా తీసుకోవడం జరుగుతోంది.

…

ఆ విధంగా ప్రభుత్వం వ్యవసాయానికి, వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలైన హార్టికల్చర్, సెరికల్చర్ మరియు లైవ్‌స్టాక్, ఫిషరీస్ అదే విధంగా ప్రాన్స్‌కల్చర్‌ను కూడా ప్రభుత్వం ప్రోత్సహించడం జరుగుతోంది. వ్యవసాయంతో పాటు వ్యవసాయ

అనుబంధరంగాల వైపు రైతులను ప్రోత్సహించి లాభదాయకమైన రంగాల వైపుకు కూడా రైతుల్లో ఒక అవేర్‌నెస్‌ను తీసుకువచ్చి, స్కిల్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ క్రింద అవగాహన కల్పించే దిశగా రైతులను పయనింపజేసి వ్యవసాయంలో లాభసాటి మెళకువలను, ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తోంది. ఆ విధంగా వ్యవసాయరంగాంలో 2000-2001 వ సంవత్సరంలో మొత్తం జి.డి.పి.లో వ్యవసాయరంగానికి 18.76 శాతం ఉంటే అది 2012-2013 వ సంవత్సరానికి వ్యవసాయరంగంలో 11.65 శాతానికి జి.డి.పి. పడిపోయింది. అందుకు కారణం రైతు వ్యతిరేక విధానలే. తద్వారా దేశంలో మరియు మన రాష్ట్రంలో వ్యవసాయ రంగం నష్టాల్లో కూరుకుపోయింది. ఆ విధంగా 1994వ సంవత్సరంలో మన రాష్ట్రంలో హెక్టారుకు 26 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే ఉండగా, 2004వ సంవత్సరంలో హెక్టారుకు 31.11 క్వింటాళ్లకు దిగుబడిని సాధించడం తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగింది. ఆ విధంగా వ్యవసాయరంగానికి 2003-04 వ సంవత్సరంలో 9.42 శాతం బడ్జెట్‌ను కేటాయిస్తే, ఆ తరువాత అధికారాన్ని చేపట్టిన ప్రభుత్వాలు కేవలం 4.60 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. క్రమంగా వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ను కూడా తగ్గించడం జరిగింది. ఆనాటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో మన రాష్ట్రంలో 20 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములను ఏర్పాటుచేస్తే, ఆ తరువాత అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు కేవలం 5 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములను మాత్రమే నిర్మాణం చేయడం జరిగింది. ఆ తరువాత రాజశేఖరరెడ్డి గారి హయాంలో ఉచిత కరెంటు సరఫరా నెపంతో వ్యవసాయానికి సకాలంలో నాలుగైదు గంటలు కూడా విద్యుత్ సరఫరా చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పైర్లు నీరు అందక ఎండిపోవడం జరిగింది. మేం ఉచిత విద్యుత్ సరఫరా చేశామని, రైతులకు ఆదర్శంగా ఉన్నామని, గత ప్రభుత్వం రైతులకు మేలు చేసిందని కొంత మంది సభ్యులు చెప్పడం జరిగింది. కరెంటు సరఫరా కోసం రైతులు రోడెక్కితే జైళ్లల్లో పెట్టిన సంఘటనలున్నాయి. కరెంటు కోసం రైతులు ధర్నాలు చేస్తే, బట్టలూడదీసి డ్రాయర్లతో జైళ్లల్లో కూర్చోబెట్టిన దృశ్యాలు కూడా ఉన్నాయి. ఆ విధంగా మొదట్లో ఏడు గంటల ఉచిత విద్యుత్ అన్నారు, కనీసం రోజుకు నాలుగైదు గంటలు కూడా విద్యుత్ సరఫరా కాలేదు, తద్వారా లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోవడానికి గత ప్రభుత్వాలు కారణమయ్యాయి.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

అధ్యక్షా, ఆనాడు టి.డి.పి. ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టభద్రులైనటువంటి ఏడు వేల మంది నిరుద్యోగ యువతను వ్యవసాయ విస్తరణాధికారులుగా నియమిస్తే, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, వై.ఎస్.ఆర్. ప్రభుత్వం 2007వ సంవత్సరంలో ఆదర్శ రైతుల పేరుతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నియమించింది. ఆ ప్రకారంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఆదర్శ రైతులుగా నియమించి రూ. 168.00 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం జరిగింది. అదే విధంగా మేథోమధనం పేరుతో మరో రూ.127.00 కోట్ల ప్రజాధనాన్ని

ఆనాటి వై.ఎస్.ఆర్. ప్రభుత్వం దుర్వినియోగం చేసింది. అంటే అటువంటి మేథోమథనం పద్ధతులను మేం అనుసరించాలా? మీ సభ్యులే ప్రస్తావించారు కాబట్టి నేను చెబుతున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

మేథోమథనం నిర్వహించామని, ఆదర్శ రైతులను నియమించామని మీ సభ్యులే చెప్పారు. మేథోమథనం చేస్తే రూ. 127.00 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. ఫెయిలూర్ మిషన్స్ తీసుకువచ్చి ఆనాటి ప్రభుత్వం ప్రజాధనాన్ని కొల్లగొట్టడం జరిగింది. మీ సభ్యులే మాట్లాడారు కాబట్టి నేను గుర్తుచేస్తున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

ఆ విధంగా కేంద్రంలో ఎన్.డి.ఏ. ప్రభుత్వం రాష్ట్రంలో టి.డి.పి. ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో రూ. 500.00 కోట్ల విలువైన 50 లక్షల టన్నుల బియ్యాన్ని తీసుకుని వచ్చి గ్రామాల్లో రోడ్లను, డ్రైన్లను నిర్మించడం జరిగింది. మీరొచ్చిన గత పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ గానీ, వై.ఎస్.ఆర్. గానీ రూ. 54 వేల కోట్ల విపత్తు సహాయం క్రింద రాష్ట్రానికి ఇవ్వమని కేంద్రాన్ని కోరితే కేవలం రూ.4.00 కోట్ల విపత్తు సహాయాన్ని కూడా పొందలేకపోయారు. అదే మీ ప్రభుత్వానికి మా ప్రభుత్వానికి ఉన్న తేడా. మీ సభ్యులే గుర్తు చేశారు కాబట్టి నేను మాట్లాడుతున్నాను.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది రైతులు సుమారు 35 లక్షల ఎకరాల్లో క్రాప్ హాలిడేని ప్రకటించారు. ధాన్యాగారంగా, భాండాగారంగా పిలువబడే గోదావరి జిల్లాల్లోనే రైతులు సమిష్టిగా క్రాప్ హాలిడేని ప్రకటించడం జరిగింది.

అధ్యక్షా, 2004వ సంవత్సరంలో వరి సాగు హెక్టారుకు రూ.23,000/- లు రైతకు ఖర్చు అయ్యేది. అదే హెక్టారు వరి సాగుకు ఈరోజున రూ.65,000/- లు ఖర్చుఅవుతోంది. ఎవరు దీనికి బాధ్యులు? కేంద్రంలో ఉన్న యు.పి.ఏ. ప్రభుత్వం సబ్సిడీలు తగ్గించి, ఇన్‌ఫుట్ కాస్ట్ పెంచడం జరిగింది. ఆనాడు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకున్న అస్తవ్యస్త విధానలవల్లే హెక్టరు వరి సాగుకు రూ.65,000/- లు ఖర్చు చేయాల్సివస్తోందంటే వ్యవసాయరంగం ఈనాడు నష్టాల్లో కూరుకుపోవడానికి కారణం అయింది. తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతుబంధు, రైతు మిత్ర, రైతు బజార్ల ద్వారా రైతాంగానికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చే నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. ఆ తరవాత అధికారం

చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేయడం జరిగింది. రైతుకు మేలు చేకూరే ప్రతి ప్రయోజనాన్ని గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడం జరిగింది. అన్నింటిని ప్రతిపక్షపార్టీ సభ్యులు ప్రస్తావించారు కాబట్టే నేను గుర్తు చేస్తున్నాను.

గత ప్రభుత్వాలు ఎరువుల ధరలను పద్నాలుగు పర్యాయాలు, పెట్రోల్ ధరలను 35 పర్యాయాలు, డీజెల్ ధరలను 29 పర్యాయాలు పెంచారు. తద్వారా రైతులపైన తీవ్రమైన భారాన్ని మోపిందెవరు? మీరు కాదా? ఆనాడు బ్రహ్మాండంగా చేశాం, రైతుకు మేలు చేశామని ఈనాడు మాట్లాడుతున్నారు. ఎక్కడ రైతుకు మేలు చేశారని నేను సభాముఖంగా అడుగుతున్నాను. మేథోమథనం కార్యక్రమంలో గానీ, బయోడీజెల్ మొక్కల కుంభకోణంలో గానీ, ఇన్‌పుట్ సబ్సిడి స్వాహాలో గానీ, ఎరువుల మిక్సింగ్ ప్లాంట్లు ఎవరికి ఉన్నాయి? ఆ విషయం మీకు తెలుసు. చివరకు వ్యవసాయరంగాన్ని కూడా అవినీతిమయం చేసిన చరిత్ర గత ప్రభుత్వానిది. అదే విధంగా రైతుల ఆత్యహత్యలు, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టినట్లైతే రైతు ఆత్మహత్యలు ఉండవని చెప్పారు. రైతే రాజన్నారు.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

అధ్యక్షా, రైతే రాజన్నారు. రైతును ప్రతి విషయానికి రోడ్ మీదకు లాగారు. రైతే దేశానికి వెన్నముక అని అన్నారు. చివరకు రైతు వెన్ను విడిచారు. 2004వ సంవత్సరంలో వై.ఎస్.ఆర్. అధికారాన్ని చేపట్టిన నాడు రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలుండవని చెప్పారు. కానీ, రైతు ఆత్యహత్యల పరంపర ఆనాటి నుంచే మొదలైంది. ఎన్.సి.ఆర్.బి. లెక్కల ప్రకారం రాష్ట్రంలో 2004వ సంవత్సరంలో 2,646 మంది రైతులు అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకున్నారు. అదే విధంగా 2005లో 2,490 మంది, 2006లో 2,607 మంది రైతులు, 2007లో 1,790 మంది, 2008లో 2,105 మంది, 2009లో 2,414 మంది, 2010లో 2,520 మంది, 2011లో 2,206 మంది, 2012లో 2,572 మంది, 2013లో 2,630 మంది రైతులు మొత్తం కలిపి రాష్ట్రవ్యాప్తంగా 24,012 మంద రైతులు ఈ పది సంవత్సరాల కాలంలో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆనాడు మా పాలన స్వర్ణయుగంలాగా జరిగిందని మీ సభ్యులే మాట్లాడుతున్నారు. ప్రతిపక్షసభ్యులు మాట్లాడుతున్నారు కాబట్టే నేను మరొకసారి గుర్తుచేస్తున్నాను.

అధ్యక్షా, గత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జయతీఘోష్ కమిటీ, స్వామినాథన్ కమిటీ వేశామని ప్రతిపక్షపార్టీ సభ్యులు చెప్పారు. నేనూ చెబుతున్నాను. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గత పది సంవత్సరాల కాలంలో 18 కమీషన్లను ఏర్పాటుచేశారు. స్వామినాథన్ కమిటీ, హుడా కమిటి, వైద్యనాథన్ కమిటీ, జయతీఘోష్ కమిటీ, సేన్ గుప్తా కమీషన్, మెహతా కమీషన్, సి.హెచ్. హనుమంతరావు కమీషన్‌ను, ఎల్.కె.జా కమీషన్, అశోక్ మిత్రా కమిటీ,

ఎస్.ఆర్.సేన్ కమిటీ, అలోక్ కమిటీ, రాధాకృష్ణ కమిటీ, మోహన్‌కందా కమిటీ, రామచెన్నారెడ్డి కమీషన్, కోనేరు రంగారావు కమిటీ తదితర కమిటీలను, కమీషన్లను ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ ఏ ఒక్క కమిటీ సిఫారస్‌లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. సాక్షాత్తు జయతీఘోష్ గారే స్వయంగా మీడియా ముందుకు వచ్చి కమిటీ సూచనలను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని చెప్పడం జరిగింది.

(ప్రతిపక్షపార్టీ సభ్యుల చేత సభకు అంతరాయం)

మీ సభ్యులే జయతీఘోష్ కమిటీ, స్వామినాథన్ కమిటీ గురించి ప్రస్తావించారు. అందుకే నేను వాటిని ప్రస్తావించాను. రైతులను మోసం చేయడానికే కమిటీలను వేశారు తప్ప రైతు ప్రయోజనాలను కాపాడడం కోసం మీరెక్కడైనా కమిటీ సూచనలను అమలుచేశారా అని నేను అడుగుతున్నాను. ఎక్కడా అమలుచేయలేదు. అందుకనే ఈనాడు తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం జరిగింది.

...

ఎక్కడన్నా అమలు చేశారా అని నేను అడుగుతున్నాను. ఎక్కడా అమలు చేయలేదు కనుకనే ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ 10 సంవత్సరాలలో ఏవిధంగా అస్తవ్యస్త విధానాలుతోటి, వ్యవసాయం అంటే రైతు భయపడే విధానాలు ఏవైతే చేసిందో ఆ విధానాలన్నింటికి స్వస్తి చెప్పి సమగ్రమైన వ్యవసాయ విధానాలు అమలు చేయడానికి అన్నీ రకాలుగా ప్రయత్నం చేస్తున్నాం. ఈరోజు రైతు సంక్షేమం కోసం చంద్రబాబు నాయుడు గారు పాదయాత్ర చేసి రైతుల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. వ్యవసాయ మిషన్స్ పెట్టాము. ఈరోజు ఒక విజన్‌తో, మిషన్‌తో రైతుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపడం కోసం ఈ నాడు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తీసుకున్నాం. ప్రతి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని తీసుకున్నాం. అదే విధంగా ఈనాడు ప్రాణాలకు తెగించి రైతుల కోసం నిరాహార దీక్ష కూడా చేశారు. చంద్రబాబు నాయుడు గారు ఇంకుడు గుంతలు తీయించారు అని అపహాస్యం చేశారు మీ సభ్యులు. అంటే ఇంకుడు గుంతలు తీస్తే ఏ కమీషన్స్ రావని మీరు ఆ పని చేయలేదు. ఇంకుడు గుంతలు తీస్తే ఎక్కడా కమీషన్స్ రావు అందుకనే మీరు చేయలేదు.

(ప్రతిపక్ష పార్టీ సభ్యులచే సభకు అంతరాయం.)

గత 10 సంవత్సరాల మీ ప్రభుత్వ పరిపాలనలో మీరు సక్రమంగా పనిచేసి ఉంటే రుణ మాఫీ ఎందుకు ప్రకటించాల్సి వచ్చేది. కనుకనే రాజశేఖర రెడ్డి గారు అనుసరించినవే ఈనాడు కూడా అనుసరించాలని అంటున్నారు. అంటే దోపిడి విధానం మేము కూడా అనుసరించాలనా, అంటే మీ భావన ఏమిటి, మీ భావన ఒక్కసారి చెప్పండి. రైతులను చొక్కాలు విడదీసి పోలీసు స్టేషన్‌లో ఉంచిన విధానాలను మేము అనుసరించాలనా, మీరుచెప్పండి. ఈ విధంగా అనేక

నిర్ణయాలను 10 సంవత్సరాల కాలంలో అనేక రకాలుగా రైతుల్ని మోసం చేసే విధానాలు చేశారు. రైతుకు నష్టం చేసే విధానాలను అవలంబించారు ఈనాడు వ్యవసాయం అంటే భయపడే పరిస్థితికి తీసుకు వచ్చారు. సెజ్‌లు, థర్మల్ ప్లాంట్స్ , ఓడ రేవులు. కోస్టల్ కారిడార్ పేరుతో లక్షలాది ఎకరాలు రైతుల నుండి లాక్కొని పారిశ్రామిక వేత్తలకు కేటాయించారు. కర్నూలు జిల్లాలో రైతులకు తెలియకుండా వారి భూములను వైఎస్.విజయలక్ష్మి డైరెక్టరుగా ఉన్నటువంటి, విజయలక్ష్మి ఇండస్ట్రీస్‌కు కేటాయించారు. రైతుల భూములన్నీ సెజ్‌ల పేరిట మాయం చేశారు అధ్యక్షా. అటువంటి వారు రైతాంగానికి సూచనలు చేసేటువంటి పరిస్థితి ఉందంటే, ఏవిధంగా ఆలోచన చేయాలో ఒక సారి ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది.

కనుకనే ఈ నాడు 2008లో రైతు రుణమాఫీ చేయవద్దు అని ఆనాడు రాజశేఖర రెడ్డి గారు చెప్పారు. ఆనాడు కేంద్రప్రభుత్వం దేశం మొత్తం కలిపితేనే రూ. 60వేలకోట్లు చేయలేదు. ఈనాడు తెలుగుదేశం ప్రభుత్వం చంద్రబాబు నాయుడు గారు ఈ రాష్ట్రంలో డ్వాక్రా రుణాలు రైతు రుణాలు రూ.50 వేలకోట్లు వరకు ఈ నాడు రుణమాఫీ చేస్తున్నాం.

(ఈ సందర్భంలో అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు.)

(ఈ సందర్భంలో ప్రతిపక్ష పార్టీ సభ్యులచే చేసి చెప్పండి అంటూ అంతరాయం)

రుణమాఫీ చేసి చూపెట్టబోతున్నాం. రూ1.50 వేల లోపు రుణాలు ఒక్కొక్క డ్వాక్రా గ్రూపుకు రూ. 1.00 లక్ష రూపాయలు ఎస్సీ, ఎస్టీలకు, చేనేతలకు, మొత్తం కలిపి సుమారు రూ.50 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసినటువంటి ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిది.

(ఈ సందర్భంలో ప్రతిపక్ష పార్టీ సభ్యులచే చేసి చెప్పండి అంటూ అంతరాయం.)

బంగారు రుణాలు మాఫీ చేశాం, కట్టినటువంటి వారికి కూడా మాఫీ చేస్తాం. ఈ విధంగా కష్టాల్లో ఉన్న రైతును బయటకు తీసుకు వచ్చి వ్యవసాయాన్ని పండుగ చేసే వరకు తెలుగుదేశం ప్రభుత్వం నిరంతరం కృషిచేసే ప్రయత్నం చేస్తుంది. ఈనాడు గౌరవ సభ్యులు అడిగారు వ్యవసాయాన్ని ఏవిధంగా లాభసాటిగా చేస్తారు అని, వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడం కోసం అన్నీ విధాల ప్రయత్నం చేస్తాం. ఈ రాష్ట్రంలో సమగ్రమైన అభివృద్ధి కోసం 7 మిషన్స్ ఏర్పాటు చేస్తే, 7 మిషన్లలో ఒకటి వ్యవసాయ రంగం. ఈ 7 మిషన్స్ ద్వారా సమగ్రమైన అభివృద్ధి జరగాలి. పేదరికం పోవాలి. వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలి. వ్యవసాయాన్ని పండుగ చేయాలి. రైతు సంక్షేమం కోసం, రైతు పక్షపాతిగా ఈ ప్రభుత్వం ఉండాలనే పట్టుదల, దీక్షతోటి మా ప్రియతమ ముఖ్యమంత్రి గారు ఈ రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటిగా చేసేంత వరకు అత్యధిక

ప్రాధాన్యతను ఇచ్చి వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. అందులో 13 శాతం వరకు ఈనాడు వ్యవసాయ బడ్జెట్‌కు కేటాయించడం జరిగింది.

లోటు బడ్జెట్ ఉంది, అనేక సమస్యలున్నాయి, కష్టాల్లో ఉన్నాం, ఇచ్చిన మాటకోసం రైతులు కష్టాల్లో ఉన్నారు కాబట్టి ఆ కష్టాల్లో నుండి రైతులు రుణ విముక్తి పొందే వరకు కూడా రైతు రుణమాఫీకి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆ విధంగా ఈనాడు వ్యవసాయదారుడు అంటే పట్టు విడవని వాడు, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎన్ని ఆటు పోట్లు తగిలినా కురుక్షేత్రంలో అభిమన్యుడిగా పోరాడిన వాడు రైతు అధ్యక్షా. అ విధంగా రైతు కోసం, వ్యవసాయాన్ని సగర్వంగా చేయడం కోసం, సగర్వంగా సమాజంలో తలెత్తుకొని టివీగా నిలబడటానికి రాబోయో తరం ఉత్సాహంగా, ఉల్లాసంగా వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా స్వీకరించడానికి తెలుగుదేశం ప్రభుత్వం కృషిచేస్తుంది. ఆ విధంగా ఈనాడు నవ్యాంధ్రప్రదేశ్ రూప శిల్ప చంద్రబాబు నాయుడు గారి ఆలోచనా ఆచరణం, అభ్యుదయం, సంపూర్ణ వ్యవసాయం అధ్యక్షా. దానికోసం ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రతి జిల్లాలో మెగా ఫుడ్ పోర్ట్‌లు ఏర్పాటు చేయబోతున్నాం.

ఆ విధంగానే డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రమోట్ చేయబోతున్నాం. ఏదైతే 13,50,000 ఎగ్జిస్టింగ్ పంప్‌సెట్స్ ఉన్నాయో, ఆ పంప్‌సెట్స్ అన్నీ రీప్లేస్ చేసి, సోలార్ పంప్‌సెట్స్‌తో రైతుకు 9 గంటలు విద్యుత్ కూడా ఇవ్వబోతున్నాం. మీరు 7 గంటలు ఇస్తామని 4 గంటలు ఇవ్వబట్టే రైతులు కరెంట్ అడిగితే జైళ్లలో పెట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన తరువాత అక్టోబర్ 2 వ తేదీ నుండి 9 గంటలు విద్యుత్‌ను అందించి రైతును ఆదుకోబోతుంది ఈ ప్రభుత్వం. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కానీ, భూసార పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు జారీ చేయబోతున్నాం. మనిషికి ఏ విధంగా హెల్త్ కార్డు తీసుకోబోతున్నారో ఈనాడు సాయిల్ టెస్ట్ ద్వారా భూమికి కూడా హెల్త్ కార్డులు జారీ చేయబోతున్నటువంటి ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిది.

(ఈ దశలో అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు.)

అన్నీ రకాలుగా ఈ నాడు ప్రభుత్వం, ఫిషరీస్‌లో చూసుకుంటే లాభదాయకమైన సెక్టారుగా ఈరోజు ఉంది. చాపల ఉత్పత్తి దార్లు కానీ, రొయ్యల ఉత్పత్తి దార్లు కానీ, ఎకరాకు రూ.1.50 వేలు నుండి రూ.4.00 లక్షలు ఆదాయం వస్తోంది కాబట్టి ఆ రంగాన్ని ప్రోత్సహించి రాబోయో 5 సంవత్సరాల కాలంలో ఆ రంగాన్ని రూ.60.00 వేల కోట్ల వాల్యూంకి తీసుకు వెళ్లడానికి అన్నీ రకాల ప్రయత్నం ప్రభుత్వం చేస్తుంది. కనుక గత 10 సంవత్సరాల్లో వ్యవసాయాన్ని మరియు వ్యవసాయ అనుబంధ రంగాలను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేసినయో, ఆ యెక్క అస్తవ్యస్త విధానాలకు స్వస్తి పలుకు తుంది ఈ ప్రభుత్వం. సమగ్ర వ్యవసాయాభివృద్ధికి తెలుగుదేశం

ప్రభుత్వం అన్నీ రకాల ప్రణాళికలతో ఒక విజన్‌తో వ్యవసాయాన్ని రాబోయో కాలాల్లో వ్యవసాయాన్ని లాబసాటిగా చేస్తుంది.

అందుకు కావల్సిన అన్నీ రకాలుగా ప్రయత్నాల్ని ఈ ప్రభుత్వ చేస్తుంది. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్ ఇసాం. మీరు చేయలేనటువంటి పనిని తెలుగుదేశం ప్రభుత్వం చేస్తుంది. రైతు పక్షపాతిగా, రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందనే విధంగా రైతులందరిచేత ఈ ప్రభుత్వం మా కోసం పనిచేస్తుందనే నమ్మకాన్ని, విశ్వాసాన్ని చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వం చేయబోతుంది, చేసి చూపెడతాము. రాబోయె 5 సంవత్సరాల కాలంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించి వ్యవసాయాన్ని పండుగ చేసేంత వరకు కూడా యువతను, మహిళలను వ్యవసాయం వైపు ఆసక్తి కనపరిచే విధంగా ఈ ప్రభుత్వం ముందుకు పోతుందని మీకు తెలియజేస్తు, సభ్యులు ఇచ్చిన సూచనలను తప్పకుండా పరిగణన లోకి తీసుకొని వ్యవసాయ అభివృద్ధి కోసం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతగా ఉపయోగపడే సలహాలన్నీ కూడా పరిగణన లోకి తీసుకోవడం జరుగుతుందని గౌరవ సభ్యులందరికీ తెలియజేస్తూ, గౌరవ సభ్యుల సూచనలను తప్పకుండా పరిగణన లోకి తీసుకుంటామని, మంచి సలహాలన్నీ కూడా ఆచరణలో పెడతామని తెలియజేస్తు ఈ డిమాండ్స్‌ను ఆమోదించవలసిందిగా గౌరవ సభ్యులందరినీ కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

...

శ్రీ రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు రావు (బొబ్బిలి): అధ్యక్షా, వ్యవసాయశాఖామాత్యులు మాట్లాడుతూ, రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వం తరపున చెప్పడం జరిగింది. మరి ఒక ముఖ్యమైన విషయాన్ని గౌరవమంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను. ఎందుకంటే రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. విజయనగరం జిల్లాలోని లచ్చయ్యపేట గ్రామంలో ఎన్‌సిఎ పేరుతో ఒక ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీ ఉంది. ఆ షుగర్ ఫ్యాక్టరీలో గత సీజన్‌లో రైతులు సరఫరా చేసిన చెరుకుకి సంబంధించి బకాయి రూ.25 కోట్లు పైగా ఉండిపోయింది. అదేకాకుండా రైతుల పేరు మీద రూ.50 కోట్లుకు పైగా బినామీ లోన్లు కుడా ఎన్‌సిఎ షుగర్స్ యాజమాన్యం తీసుకోవడం జరిగింది. రోజూ ఆ ఫ్యాక్టరీవద్ద రైతులు రోడ్డెక్కి, ధర్నాలు నిర్వహించి, సెక్షన్ 144 ను కూడా విధించడం జరిగింది. రైతులు 3,00,000 టన్నులను షుగర్‌కేన్ వేసి ఉన్నారు. ఆ యాజమాన్యం మీద ఎవరికీ నమ్మకం లేదు. ఆ మేనేజింగ్ డైరెక్టర్‌ని కూడా ముంబయిలో ఎకనామిక్ అఫెన్సెస్ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయడం జరిగింది. మరి నవంబరు నుంచి కొత్త సీజను వస్తుంది. కాబట్టి దయచేసి, ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు తీసుకుని, Industrial Development and Regulation Act, 1951 ప్రకారం యాజమాన్యాన్ని ప్రభుత్వమే తీసుకొని రాబోయే సీజన్లో 6 నెలల పాటు ఫ్యాక్టరీని నడిపి, రైతులను రక్షించి, వాళ్లకి రావలసిన నిధలను అన్నీ ఇప్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఈ

విషయమై తప్పనిసరిగా రైతులకు ఒక స్పష్టమైన హామీని ఇచ్చి, ఆదుకోవాలని మీద్వారా నేను మంత్రిగారిని, ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ తోట త్రిమూర్తులు (రామచంద్రాపురం): అధ్యక్షా, వ్యవసాయశాఖా మంత్రిగారు ప్రవేశపెట్టిన 2014-15వ సంవత్సరపు బడ్జెట్‌కి మనస్ఫూర్తిగా మద్ధతు పలుకుతూ, ఈరోజు వ్యవసాయం గురించి గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ, ఒకనాడు వ్యవసాయాన్ని వదిలేసి, పట్టణాలకు వెళ్లిపోయిన రైతులందరూ మళ్లీ తిరిగి పల్లెలకు వచ్చి, వ్యవసాయం చెయ్యాలి అనే విధంగా, వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. అదేవిధంగా ఈరోజు వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న సంస్థల్లో, మత్స్యశాఖకు సంబంధించిన కొన్ని సూచనలను తెలియజేస్తాను. వ్యవసాయంతోపాటు మత్స్యశాఖను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. ఈ మత్స్యశాఖకు సంబంధించిన సుదీర్ఘమైన తీరప్రాంతం అంతా కుడా...

మన రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలకి సంబంధించి శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న తీర ప్రాంతాన్ని, మత్స్య శాఖకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి. మత్స్యశాఖతోపాటు, లక్షలాది ఎకరాల వ్యవసాయ భూములు చెరువులుగా మారిన సందర్భముంది. ఈ వ్యవసాయ భూములు చెరువులుగా మారినందున, ఈ రాష్ట్రానికి, ఈ దేశానికి, ఇతర దేశాలకు వెళ్లటం వలన కరెన్సీ రూపంలోగాని, మన దేశానికి గాని, రాష్ట్రానికి గాని, రైతాంగానికి గాని, మత్స్యకార్మికులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలు ఈ రోజున ప్రభుత్వం చేపట్టవలసిన అవసరం ఉంది. దాంట్లో భాగంగానే, మన రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ 13 జిల్లాలలో ఏయే ప్రాంతాల్లో ఏమేమి కావాలో నిన్న గౌరవ ముఖ్యమంత్రిగారు చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. దాంట్లో National Fisheries Development Board (NFDB) అనే సంస్థ ఈ దేశానికి సంబందించింది హైదరాబాదులో ఉంది. హైదరాబాదులో ఉండటానికి గల కారణం ఏమంటే 23 జిల్లాలుగా తెలంగాణతో కలిపి ఉన్నప్పుడు ఉంది. ఇప్పుడు విడిపోయాం కాబట్టి, Regional Office ని కాకినాడ ప్రాంతానికి తీసుకురావాలని కోరుతున్నాను. ఎందుకు చెబుతున్నానంటే, 13 జిల్లాలలో తీర ప్రాంతంగా, మధ్యస్తంగా ఉన్న ప్రాంతం కాకినాడ. కాకినాడలో రీజనల్ ఆఫీస్ ఏర్పాటుకి అనువైన అవకాశాలున్నాయి. ఎందుకంటే కాకినాడలో ఈ రీజనల్ ఆఫీసుకి సంబంధించి ఇప్పటికే Central Institute of Education ఉంది. **(బెల్)** అలాగే Fisheries Research Station కూడా ఉంది. National Fisheries Board Development (NFDB) కావల్సిన అన్ని అవకాశాలు ఇక్కడున్నాయి.

పైన చెప్పిన అంశాలతోపాటు, అక్కడ ఫిషరీస్‌కి సంబంధించిన స్థలాలు కూడా ఉన్నాయి. కొత్తగా కొనవలసిన అవసరం లేదు. ఈ శాఖ దగ్గర రూ.10 కోట్లు నిధులు కూడా ఉన్నాయి. చేపల చెరువులు, రొయ్యలు చెరువులు తవ్వుకున్న రైతుల దగ్గర నుంచి సెస్ రూపంలో వసూలు

చేసిన నిధులతో ప్రభుత్వం అనుమతిస్తే.. స్థలాలు కూడా రెడీగా ఉన్నాయి. భవనాలు కట్టుకోటానికి నిధులు కూడా ఉన్నాయి. కాబట్టి మా ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు గాని, రైతులకు గాని ఉపయోగపడే విధంగా రీజనల్ ఆఫీస్ నిర్మాణాన్ని తప్పనిసరిగా చేపట్టవలసిందిగా రైతాంగం తరపున మరియు మత్స్యకారుల సోదరుల తరపున కోరుతున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డిగారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ః మినిష్టరు గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ వెంకట సుజయ కృష్ణ రంగారావుగారు షుగర్‌కేన్ రైతుల గురించి సభ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో ఈ షుగర్‌కేన్ రైతులకు బకాయిలు ఉన్నమాట వాస్తవం. తప్పకుండా వీటికి పరిష్కారం కనుగొని రైతుల బకాయిలను క్లియర్‌చేయవలసిన అవసరం ఉంది. షుగర్‌కేన్ రైతుల బకాయిలను క్లియర్ చేసేందుకు, ఈ ఫ్యాక్టరీస్‌ను ఏవిధంగా రన్ చేయాలి అనేది ప్రభుత్వం ఆలోచిస్తుంది. షుగర్ ఫ్యాక్టరీలున్న ప్రతీ జిల్లాలో కూడా బకాయిలున్నాయి. చిత్తూరు, గుంటూరు, విజయనగం జిల్లాలలో కూడా ఉంది. తప్పకుండా గౌరవ ముఖ్యమంత్రితో చర్చించి, బకాయిలను క్లియర్ చేయటం జరుగుతుంది.

సభ్యులు తోట త్రిమూర్తులుగారు మత్స్యశాఖ గురించి చెప్పారు. నేను ఉదయం ప్రశ్న వచ్చినప్పుడు గౌరవ సభ్యులకు కూడా తెలియజేశాను. కోస్తా తీర ప్రాంతంలో National Fisheries Board Development (NFDB) Regional Office ని ఏర్పాటుచేయాలని గత రెండు నెలల క్రితం కేంద్రమంత్రివర్యులు రాధామోహన్‌సింగ్ గారిని కలిసి, Regional Office ఒకటి ఇవ్వమని మేం కోరడం జరిగింది. తప్పకుండా రీజనల్ ఆఫీస్‌ని ఏర్పాటుచేస్తామని కూడా చెప్పారు. తప్పకుండా రీజనల్ ఆఫీస్‌ని కోస్తా ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ విధంగా కమీషనరేట్‌ని కూడా ఏర్పాటుచేయాలి. ఎందుకంటే ఈనాడు భారతదేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యశాఖ అగ్ర స్థానంలో ఉంది. After Bifurcation కూడా చేపల ఉత్పత్తిలో, రొయ్యల ఉత్పత్తిలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అగ్ర స్థానంలో ఉంది. కాబట్టి, కమీషనరేట్ మరియు రీజనల్ ఆఫీసు రెండూ కూడా కోస్తా ప్రాంతంలోనే ఏర్పాటుచేయడం జరుగుతుందని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు జి. శ్రీకాంత్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి గారు మైకు ఇవ్వమని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్‌: విశ్వేశ్వరరెడ్డిగారూ దయచేసి కూర్చోండి. శ్రీకాంత్‌రెడ్డిగారు మాట్లాడండి.

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి): అధ్యక్షా, మంత్రిగారు ఆ రకమైన ఆవేశంతో, మాట్లాడటం సహజం. ఆయనకు మంత్రిపదవి ఇచ్చారు కాబట్టి, ఆవిధంగా మాట్లాడి ఉండొచ్చు. కరవు ప్రాంతాల్లో వర్షాభావం నెలకొన్న పరిస్థితులవల్ల మామిడితోటలు, అరిటితోటలు చాలా దారుణంగా ఎండిపోతున్నాయి. కన్నబిడ్డల్లాగ పెంచుకున్న చెట్లు కళ్లముందు ఎండిపోతున్నాయి. పూర్తిగా తోటలు ఎండిపోయే పరిస్థితి వస్తోంది. ఎండిపోయిన తోటలకు ఒక పాలసీని తీసుకొస్తే బాగుంటుంది. మంత్రిగారికి ఒక సూచన. పూర్తిగా తోటలను కోల్పోతున్నారు కాబట్టి, ల్యాండ్ అక్విజిషన్‌లో రైతుకు ఏవిధంగా అయితే చెల్లిస్తున్నామో, ఆవిధంగా చెల్లించటానికి ఏమైనా అవకాశం ఉంటుందా? లేదా, ఎండిపోయిన చెట్లకు పూర్తి స్థాయిలో ఇంత అమౌంట్ అని ఫిక్స్ చేసి, నష్టపరిహారంగా ఇస్తే బాగుంటుందని ఒక సూచన.

...

గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ, రైతుల ఆత్మహత్యల గురించి చెప్పారు. ఇదే ప్రభుత్వం గతంలో ఉన్నప్పుడు 'రైతులు తినింది అరగకుండా, నష్టపరిహారం కోసం చస్తున్నారు' అని అనిన మాట వాస్తవమా కాదా, అని మంత్రిగారు తెలుసుకోవాల్సి ఉంది. అంత ఘోరంగా రైతులను అవమానించిన మీరు రైతుల గురించి మాట్లాడితే ఎలా? కమిటీలు వేశామని చెప్తున్నారు. మా సభ్యులు విశ్వేశ్వర రెడ్డి గారు చాలా బ్రహ్మాండంగా చెప్పారు. ( అధికార పక్షం నుండి అభ్యంతరం ) ఆయనొక్కడికే కాదు, మా అందరికీ కూడా తెలుసు. జయంతి ఘోష్ కమిటీ వేసిన తరువాత, ఆ కమిటీ రిపోర్టు చూసిన తరువాతనే రైతులకు ఉపయోగపడే విధంగా..., ( అధికార పక్షం నుండి అభ్యంతరం ) వినే ధైర్యం ఉండదు అధ్యక్షా వీళ్ళకి (అధికారపక్ష సభ్యులనుద్దేశించి)....ఆ కమిటీ రిపోర్టు చూసిన తరువాతనే రైతులకు ఉపయోగపడేవిధంగా ఆరోగ్యశ్రీ, ఫీ-రీఇంబర్స్‌మెంట్ పెట్టారు. ఈరోజు వీళ్ళు రూ.50,000 కోట్లు రుణమాఫీ చేస్తున్నాము అంటున్నారు. కానీ, బడ్జెట్‌లో రూ.4000కోట్లు మాత్రమే చూపించారు. 'వాళ్ళ పాస్‌బుక్కులు రైతులు వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళవచ్చు' అని వీళ్ళు స్పష్టంగా చెప్పగలుగుతారా? రైతులకు మీకు పూర్తిగా రుణమాఫీ అయ్యింది అని చెప్పే ధైర్యం వీళ్ళకి ఉందా? చెప్పమనండి. ఈనెలలో కాకపోతే, రేపు నెలలో చేయగలుగుతామని చెప్పమనండి. ఏ తేదీకి ఈ రుణమాఫీ పూర్తి చేస్తారోనని చెప్పే ధైర్యం కూడా వీళ్ళకి లేదు.

రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తరువాత ఏ రకంగా వారి జీవనశైలిలే మారిపోయింది. వ్యవసాయపరంగా వాళ్ళు ఏరకంగా అభివృద్ధి చెందారో, వీళ్ళు తెలుసుకోలేకపోయారు. ఉచిత విద్యుత్‌ను ఇస్తే బట్టలు ఆరేసుకోవాలి, అని రైతుని అవమానించిన వారు అధ్యక్షా, వీళ్ళు. మా పార్టీ పేరులోనే యువజన శ్రామిక రైతు అని ఉంది అధ్యక్షా. మీపార్టీలో మీరూ ఉన్నారు. రైతుల్ని ఏవిధంగా నిర్లక్ష్యం చేశారో గుర్తు తెచ్చుకోమంటున్నాను.

పద్మవ్యూహంలో అభిమన్యుడు ఏరకంగా చిక్కుకున్నాడో, ఆరకంగా ఈరోజు రైతు చిక్కుకున్నాడని చెప్పారు. ఆ పద్మవ్యూహం వేసింది వీళ్ళే (అధికారపక్ష సభ్యులనుద్దేశించి) అధ్యక్షా. అది మరచిపోయి ఏదేదో చెప్తుంటే ఎలా అధ్యక్షా. ఈరోజు రైతులు కష్టాల్లో ఉన్నారంటే, తెలుగుదేశం అనుసరించినటువంటి విధానాలు ఏవైతే ఉన్నాయో, ఆ కారణాలు చెప్పుకోకుండా..., మరొక విషయం అధ్యక్షా, పది సంవత్సరాలు పాటు మా ప్రభుత్వం ఉంది అంటున్నారు. దయవుంచి, సభాముఖంగా ఒక విషయం చెబుతున్నాం. 2004 నుంచి 2009 వరకు మా ప్రభుత్వం. అవును, మేము రాజశేఖర రెడ్డిగారి మనుషులం. 2009 నుంచి 2014 వరకు మీ అలయన్స్ ప్రభుత్వం ఉన్నది అనే మాట మర్చిపోకండి. ఆ ఐదు సంవత్సరాలు మీ సహకారంతో ఆనాటి ప్రభుత్వం పరిపాలన సాగించిన మాట మరచిపోయి, మొత్తం పది సంవత్సరాల పాలనను మాకు అంటగట్టడమేమిటి? గౌరవ మంత్రిగారు ఆలోచన చేయాలి. ప్రతి ఒక్క విషయానికి పది సంవత్సరాలు, పది సంవత్సరాలు అంటారు. మేము చెప్తున్నాం. 2004 నుండి 2009 వరకు స్వర్ణయుగం. రైతులకు మేలు జరిగింది. అన్ని తరగతుల ప్రజలు సంతోషంగా ఉన్నారనే మాట మర్చిపోయి మాట్లాడుతున్నారు. ఇప్పటికైనా రాజకీయాలు మానేసి, రైతుకు మంచి చేయడానికి ప్రయత్నం చేయమనండి. బడ్జెట్ కేటాయింపుల్లో ఫామ్ మెకనైజేషన్‌కు రూ.90కోట్లు కేటాయించారు. ఈ రూ.90 కోట్లతో ఏరకంగా యాంత్రీకరణ చేస్తారు? డ్రిప్ ఇరిగేషన్‌లో 90 శాతం సబ్సిడీ ఇచ్చి, ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీగా ఇచ్చినటువంటి ఘనత రాజశేఖర రెడ్డి గారిది. వీళ్ళ బడ్జెట్ కేటాయింపుల్లో అవి చేయగలుగుతారన్న నమ్మకం కనబడడం లేదు. వాటిపైన దృష్టిపెట్టండి. అంతేకానీ పది సంవత్సరాలు, పది సంవత్సరాలంటూ విమర్శలుచేస్తూ, ఐదు సంవత్సరాల మీ అలెయన్స్ పాలన గురించి మరచిపోయి మాట్లాడడం శ్రేయస్కరం కాదని తెలుసుకోవాల్సిందిగా గౌరవ సభ్యులను కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః శ్రీనివాసులు గారు.

శ్రీ కాలువ శ్రీనివాసులు (రాయదుర్గం)ః సార్, నేను శ్రీకాంత్‌రెడ్డి గారిని ఒక్కటే అడుగుతున్నాను. మీది యువజన శ్రామిక రైతు పార్టీ అయితే, గత ఎన్నికల్లో 60 మందికి పైగా మీరు గెలిచి వచ్చారు. ఎన్నికల్లో ఏ ఒక్క ఓటరుకైనా యువజన శ్రామిక రైతు పార్టీ నుంచి మేము నిలబడ్డామని చెప్పారా? (మేము చెప్పే గెలిచాము అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులంతా ముక్త కంఠంతో బదులివ్వసాగారు.) మీ మేనిఫెస్టోలో మీ పార్టీ యువజన శ్రామిక రైతు పార్టీ అనే పేరే పేర్కొనలేదు. మీరు మా వ్యవసాయం గురించి మాట్లాడితే ఎలా? శ్రీ రాజశేఖరరెడ్డిగారి హయాములో దళారులకు, దోపిడీదారులకు, దౌర్జన్యకారులకు వ్యవసాయం పండగైంది. రాజ్యం దళారుల భోజ్యం అయ్యింది.

మిస్టర్ స్పీకర్ః సూర్యారావు గారు.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోల్) ః అధ్యక్షా,

మిస్టర్ స్పీకర్ః సూర్యారావు గారు. Please be brief.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోల్) ః అధ్యక్షా, మంత్రిగారు వ్యవసాయం గురించి చాలా విపులంగా వివరణ ఇవ్వడమే కాకుండా, రాబోయే రోజుల్లో రైతులకు ఆశాజనకమైన పరిస్థితులుంటాయన్న భరోసా ఇవ్వడంజరిగింది. పూర్వంలో వ్యవసాయం అనేమాట పలికేముందు పాడి-పంటలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. తండ్రి-కుమారుడు, భార్య-భర్త, లేదా అన్నా-చెల్లి వంటి మానవసంబంధాల వలె ఈ పాడి-పంట అనుబంధం కలిగివుంటాయి. ఎప్పుడైనా ప్రకృతి వైపరీత్యాల వల్లనో, మన అజాగ్రత్తవల్లనో వ్యవసాయం దెబ్బతిన్నప్పుడు, ఆ రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, ప్రతీ ఇంటా పాడి కూడా ఉండాలని, అంటే ఒక ఆవు ఉండాలని పూర్వకాలంలో ఈ పద్ధతిని పెట్టారు.

పశువైద్య విద్య విశ్వ విద్యాలయం , శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ అనేది ఒక గొప్ప సంస్థ. బహుశా మన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన మొట్టమొదటి యూనివర్శిటీ ఇది. పశుసంపద, మత్స్యసంపద, హార్టికల్చర్... ఇవన్నీ కలుపుకొని ఒక యూనివర్శిటీని పెట్టుకున్నాం. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఈవిధమైన ప్రత్యేకమైన విద్యావకాశాలు లేవు. కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రమే ఈ విద్యను అందిస్తున్నాయి. అందులో కేవలం 513 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. సరైన విద్యా సౌకర్యాలు లేక ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను బయటకు తీసుకురాలేకపోతున్నాం. పశుసంపదకు అనుబంధమైనటువంటి ఉద్యోగస్తులు బాగా తక్కువైపోయారు. కాబట్టి, పాడిపరిశ్రమకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నాను. ప్రపంచంలో ఈ పరిశ్రమ మీద ఆధారపడి ప్రపంచంలో పోటీగా నిలబడిన దేశాలు చాలా ఉన్నాయి. కాబట్టి, పాడిపరిశ్రమకు ప్రాధాన్యతనిచ్చి, వెటర్నరీ యూనివర్శిటీలకు సౌకర్యాలు మెరుగుపరచి, ఇంకా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను తయారుచేసే ఆలోచన ఏమైనా ప్రభుత్వానికి ఉందా అని నేను గౌరవ మంత్రిగారిని అడుగుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ ఫర్ అగ్రికల్చర్.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ః అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీ శ్రీకాంత్ రెడ్డి గారు నేను ఆవేశంగా మాట్లాడానని అంటున్నారు. అది ఆవేశం కాదు అధ్యక్షా, రైతులను కష్టాల్లోకి నెట్టారనే బాధ మాత్రమే. శ్రీకాంత్‌రెడ్డి గారికి ఆవేశంలా కనపడివుండొచ్చు. శ్రీకాంత్‌రెడ్డి గారు కొన్ని సూచనలు చేశారు. మా నాయకుడు చంద్రబాబునాయుడు గారు 'వ్యవసాయం శుద్ధ దండగ' అని అన్నారంటూ, వారు అనని మాటని వక్రీకరించి, ప్రచారం చేసి, 2004లో ఏవిధంగా మీరు అధికారంలోకి వచ్చారో... అది అసత్య ప్రచారం, గ్లోబల్ ప్రచారం. ఆ సంస్కృతి, ఆ అలవాటు

మీకుంది. యువజన, శ్రామిక, రైతు అని పార్టీ పేరులో పెట్టుకున్న మీరు ఎప్పుడైనా ఆ పదాలను మీ ప్రచారంలో చెప్పారా? మీరు గుండె మీద చేయ్యేసుకుని చెప్పండి. వైఎస్సార్‌సీపీ అంటారు గానీ, యువజల శ్రామిక రైతు పార్టీ అని, మీ నాయకుడి నోటే కాదు, కనీసం మీ నోట అయినా వచ్చిందా? ఆ పేరు చెప్పడానికి కూడా మీరు అవమానకరంగా భావిస్తున్నారు. అధ్యక్షా, యువజన శ్రామిక రైతు అని చెప్పుకునే అర్హత ఆ పార్టీ సభ్యులకు లేదు అని తెలియజేస్తున్నాను. (వైఎస్సార్‌సీపీ సభ్యులచే తీవ్ర అభ్యంతరం) యువజన శ్రామిక రైతు అని మీరు ఎక్కడైనా అన్నారా? మీరు ఎక్కడా అనలేదు. అదేవిధంగా, బట్టలు ఆరేసుకోవడానికి కరెంటు తీగలు అని మేము అన్నామంటున్నారు. అలా మేమెక్కడా అనలేదు. ఏడు గంటలు ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి, నాలుగు గంటలే కరెంటు ఇచ్చి, రైతులను పోలీస్ స్టేషన్‌లో పెట్టిన చరిత్ర మీపార్టీది. అలాగే అలయన్స్ అంటున్నారు అధ్యక్షా, అలయన్స్ ఎవరిది అధ్యక్షా.

...

ఐదు సంవత్సరాలు శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తరువాత మీ (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి) పార్టీ కార్యకర్తలకు పగలు ఒక జెండా, రాత్రికి ఒక జెండా ఉంటుంది. తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్ కూటమి మీది. ఇది వాస్తవమా కాదా? రాష్ట్ర ప్రజలను అడగండి. (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అభ్యంతరాలు) కూటమి తెలుగుదేశం పార్టీది కాదు. కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే కూటమి. గౌరవసభ్యులు శ్రీ గొల్లపల్లి సూర్యారావు గారు పాడిపరిశ్రమ గురించి మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం సమగ్రమైన ప్రణాళికలు రూపొందించింది. ప్రతి రైతు కుటుంబానికి పాడిపశువుల పోషణ అవసరం. పాడిపరిశ్రమను ఏ విధంగా అభివృద్ధి చేయాలో అన్ని రకాల చర్యలను ఈ ప్రభుత్వం తీసుకుంటుంది.

అలాగే పశుసంవర్ధక శాఖలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సదరు కోర్సును చదివిన విద్యార్థులకు మంచి ఉద్యోగావకాశాలున్నాయి. ఆ కోర్సులో విద్యార్థులు చేరేందుకు ప్రోత్సహించే చర్యలు తీసుకుంటాం. గౌరవసభ్యులు శ్రీ గొల్లపల్లి సూర్యారావు గారు మంచి సూచన ఇచ్చారు. ఆ కళాశాలల సంఖ్యను ఇంకా పెంచి ఆ రంగంలో ఎక్కువ ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు (మైలవరం) ః అధ్యక్షా, నీటిపారుదల డిమాండ్‌పై చాలా మంది గౌరవసభ్యులు శ్రీ రఘురామి రెడ్డిగారు, శ్రీ కాలువ శ్రీనివాసులు గారు, శ్రీ ఎస్.వి.మోహన్ రెడ్డి గారు, శ్రీ జి.వి.అంజనేయులు గారు, శ్రీ చిర్ల జగ్గిరెడ్డి గారు, శ్రీ నారాయణ మూర్తి గారు, శ్రీ శివరామ రాజు గారు, శ్రీ వి.ప్రభాకర్ చౌదరి గారు, శ్రీ తోట త్రిమూర్తులు గారు, శ్రీ చాంద్ బాషా గారు మాట్లాడారు. అందరికీ ధన్యవాదాలు. వీరిచ్చిన సలహాలు, సూచనలు తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటాం. 13 జిల్లాలతో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3,95,83,000 ఎకరాల భూమి ఉన్నది. ఆందులో సాగు చేయగలిగిన విస్తీర్ణం

1,99,00,000 ఎకరాలు ఉంది. 1956 నుంచి 2014 సంవత్సరం వరకు చూసినట్లైతే 68,90,700 ఎకరాలు మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో సాగవుతుంది. ఇంకా సాగు కావలసింది 97,00,807 ఎకరాలు. చిన్ననీటి పారుదల క్రింద 25,00,604 ఎకరాలుంది. ఎత్తిపోతల పథకాల క్రింద 6,00,720 ఎకరాలు సాగు కావలసి ఉంది. రాష్ట్రం మొత్తం మేజర్, మీడియం, మైనర్, ఎత్తిపోతల పథకం క్రింద 1,01,00,233 ఎకరాలు సాగవుతుంది.

మన రాష్ట్రంలో ప్రధానంగా జీవ నదులైన గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి నుంచి సుమారు 1700 టీఎంసీలు నీరు వస్తుంది. సుమారు 40 నీటి బేసిన్లు, సబ్ బేసిన్లు ఉన్నాయి. ఐదు ప్రధానమైన బేసిన్లు, 35 సబ్ బేసిన్లు ఉన్నాయి. రాష్ట్రంలో నీటి వనరులు బాగా ఉన్నా, మా వెలుగోడు రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండలేదని, తెలుగుగంగకు, పోతిరెడ్డిపాడుకు నీరు రావడంలేదని, హంద్రీ-నీవాకు రెండు టీఎంసీలు రాలేదని గౌరవసభ్యులు హృదయ విదారకంగా మాట్లాడుతున్నారు. గత నెల రోజుల నుంచి చాలా ప్రయత్నం చేస్తున్నాను. శ్రీశైలం రిజర్వాయర్‌కు 885 అడుగుల నీరు ఉంది. కరవుపీడిత, వెనుకబడిన రాయలసీమ ప్రాంతాలైన కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు రూ.90,000 కోట్లు జలయజ్ఞం క్రింద ఖర్చుపెట్టాం. డ్యాముల నిండా నీరు ఉన్నాయని ఆ ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు ఇవ్వాలని నేను చాలా ప్రయత్నం చేశాను. దురదృష్టం హంద్రీ-నీవాకు 700 క్యూసెక్కుల నుంచి 1000 కూసెక్కులు నీరు రాలేదు. గత నెల రోజులుగా ప్రయత్నం చేస్తుంటే రెండు టీఎంసీ నీరు కాలువలకు, చెరువులకు వెళ్ళలేని పరిస్థితి ఉంది.

గాలేరు-నగరికి వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఒక్క చుక్క నీరు కూడా వెళ్ళే పరిస్థితి లేదు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 44,000 క్యూసెక్కులుగా నిర్ధారించి మొదలు పెట్టారు. 10,000 క్యూసెక్కులు కూడా పోవడం లేదు. మొన్న ఎస్ఆర్‌బీసీకి కొద్దిగా నీరు పంపాలని, అవుకు రిజర్వాయర్ నింపాలని 1500 క్యూసెక్కులు దాటగా వర్షం పడి కాలువ తెగిపోయింది. ఆలస్యం అవుతుందని వెంటనే చర్యలు తీసుకొని రైతులకు నిన్నటి నుంచి నీరు వదిలాం. అవుకు రిజర్వాయర్ నుంచి ఆ ప్రాంతానికి నీరు పంపిస్తున్నాం. ఇంత పెద్దఎత్తున నీరు ఉండి కూడా క్రిందకు ఒక బేసిన్ నుంచి మరొక బేసిన్‌కు నీరు తీసుకువెళ్ళలేకపోతున్నాం. శ్రీశైలం ప్రాజెక్ట్ నిండింది. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌లో 590 అడుగుల నీరు ఉంది. 80 టీఎంసీ వస్తే సాగర్ నుంచి పులిచింతల ద్వారా సముద్రంలో కలుస్తుంది. పెన్నానది బేసిన్‌లో సోమశిల, కండలేరులలో, సోమశిల 73 టీఎంసీలకు గాను 16 టీఎంసీ పంపించలేకపోయాం. కండలేరు 68 టీఎంసీలకు గాను 11 టీఎంసీలు పంపించలేకపోయాం. రూ.90,000 కోట్లు ఖర్చు పెట్టి ఒక బేసిన్ నుంచి మరొక బేసిన్‌కు నీరు పంపిచలేకపోయారు. మా శాఖకు సంబంధించిన పనులు జరగాలన్నా రెవెన్యూ శాఖ, అటవీ శాఖల సహకారం అవసరం. 1983లో స్వర్గీయ శ్రీ నందమూరి తారాక రామారావు గారు తెలుగుగంగ ప్రాజెక్టు పనులకు స్వీకారం చుడితే రాయలసీమకు నికర జలాలు ఇవ్వకుండా వరద జలాల పేరుతో ప్రాజెక్టులు

మొదలుపెట్టినందుకు ఆనాటి ముఖ్యమంత్రి గారు సెక్రటేరియట్‌కు వెళుతుంటే శ్రీ రామారావు గారి కారుకు అడ్డంగా నిలుచున్నారు. తెలుగుగంగ రాయలసీమకు జీవనాధారం, ప్రాణాధారం. తెలుగుగంగ ప్రాజెక్టు నిర్మించకపోతే ఈరోజు తిరుమల, తిరుపతికి తాగునీరు దొరికే పరిస్థితి లేదు. గోదావరి ప్రాంతంలో కాటన్‌దొరను, శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను, కెఎల్ రావును ఏ విధంగా గుర్తు చేసుకుంటున్నారో, ఆ విధంగా శ్రీ శివరామకృష్ణయ్య గారు రాయలసీమకు ఆరాధ్యదేవుడు.

...

అధ్యక్షా, ఈ ముఖ్యమంత్రి గారి చిత్తశుద్ధి వల్లనే రాయలసీమలో ఈనాడు రూ.90 వేల కోట్లు ఖర్చు చేసి రాయలసీమ ప్రాంతానికి పోతిరెడ్డిపాడు హెగ్ రెగ్యులేటర్ ద్వారా పది వేల క్యూసెక్కుల నీటిని తీసుకుపోవడం జరుగుతున్నది. అదే విధంగా దశాబ్ధకాలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంది కదా! తల్లి కాంగ్రెస్ గానీ, పిల్ల కాంగ్రెస్ గానీ అధికారంలో ఉన్నప్పుడు గాలేరు- నగరి ప్రాజెక్టుకు ఎందుకు చుక్క నీటిని తీసుకువెళ్లలేకపోయారు? కావాలంటే నాతోపాటు ప్రతిపక్షాన్ని రమ్మనండి. క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి వాస్తవ పరిస్థితిని చూపిస్తాను. పది వేల క్యూసెక్కుల నీటి సామర్ధ్యం దాటితే కాలువ బ్రీచ్ అయ్యే పరిస్థితి ఉంది. ఈనాడు అనంతపురం కన్నీళ్లు పెడుతోంది. అతి తక్కువ వర్షపాతం నమోదవుతుంది. 700 క్యూసెక్కుల నీరు కాదు, ఇవాళ 1,000 క్యూసెక్కుల నీరు దాటితే హంద్రి- నీవా ప్రాజెక్టు పన్నెండు పంపుల్లో రెండు, మూడు పంపులు కూడా పనిచేయలేని పరిస్థితి ఉంది. అదే విధంగా ఈనాడు వెలుగోడు రిజర్వాయర్ నందు 16 టి.ఎం.సి. నీరు నిల్వసామర్థ్యం కల్గి ఉండే పరిస్థితి ఉందని పెద్దలు రఘురామిరెడ్డి గారు సభకు చెప్పడం జరిగింది. కానీ, రఘురామిరెడ్డి గారికి తెలియజేసేదేమిటంటే, వెలుగోడు రిజర్వాయర్ నందు 12, 14 టి.ఎం.సి.ల నీరును ఉంచే అవకాశం లేదనే విషయాన్ని సభాముఖంగా తెలియజేస్తున్నాను. పెద్దలు రఘురామిరెడ్డి గారు ఎంతో బాధతో, ఆవేదనతో చెప్పారు. కానీ, నిల్వ సామర్థ్యాన్ని మించి ఉంచే పరిస్థితి లేదు. అంటే అంత చక్కగా,గొప్పగా పనులు చేశారు. క మీషన్లకు కక్కుర్తి పడి హంద్రి- నీవా ప్రాజెక్టు మోటార్లకు సంబంధించిన పనులు గానీ, గాలేరు- నగరి ప్రాజెక్టు పనులు గానీ సక్రమంగా జరగలేదనే వాస్తవాన్ని గుర్తించాలని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

అదే విధంగా ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రయారిటీ ప్రకారం, ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించుకుని, నిర్మాణ పనులను చేసుకొని ఉంటే ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-I క్రింద త్రాగునీరు అందేది. కానీ, వేల కోట్ల రూపాయలు వెలిగొండ ప్రాజెక్టుకు ఖర్చుచేసినప్పటికి ఇవాళకు కూడా ఫేజ్-I కూడా పూర్తిచేసుకోలేనటువంటి పరిస్థితి కనబడుతోంది. అదే విధంగా తోటపల్లి రిజర్వాయర్ కూడా.

అధ్యక్షా, 1903వ సంవత్సరంలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఆనకట్ట ద్వారా 64 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. వందల కోట్ల రూపాయలు తోటపల్లి

రిజర్వాయర్‌కు ప్రభుత్వం ఖర్చు చేసింది. ఏది ఏమైనప్పటికి తోటపల్లి రిజర్వాయర్ పనులను సత్వరమే పూర్తిచేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. తద్వారా ఒక లక్ష పదహారు వేల ఎకరాల భూమికి సాగునీటిని అందించేందుకు యుద్ధప్రాతిపదికన తోటపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులను పూర్తిచేయాలనే కృత నిశ్చయంతో గౌరవ ముఖ్యమంత్రి గారు ఉన్నారు. ఆ విషయమై గౌరవ ముఖ్యమంత్రి గారు నిన్ననే సభకు హామీ ఇచ్చారు. అదే విధంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో నాగావళి, వంశధార ప్రాజెక్టు క్రింద చేయాల్సిన పనులను, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను, పెండింగ్ ప్రాజెక్టులను, సత్వరమే పూర్తిచేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందనే విషయాన్ని తెలియజేస్తున్నాను. తద్వారా వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం వంటి జిల్లాలు సుభిక్షంగా ఉండే అవకాశం ఉంది. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా అపార్ట్‌మెంట్ పనులకు, బిల్డింగ్ పనుల నిమిత్తం ఆయా జిల్లాల్లో ఉపాధిలేనందున వలస వెళ్తున్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో బిల్డింగ్ కూలినా, అపార్ట్‌మెంట్ కూలినా వలస వెళ్లి అక్కడ పనులు చేసుకుంటున్న విజయనగరం, శ్రీకాకుళం జిల్లా తమ్ముళ్లు ఎక్కువగా ఉంటారు. పొట్టచేత పట్టుకొని కుటుంబాలతో సహా వలస వెళ్తున్న పరిస్థితి నుంచి వారిని నివారించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది.

అధ్యక్షా, ఈనాడు కూడా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోని వంశధార, నాగావళి, జంజావతి రిజర్వాయర్ల ద్వారా సుమారు 59 టి.ఎం.సి.ల నీరు వృధాగా సముద్రంలో కలిశాయి. అదే విధంగా గోదావరి నది ద్వారా సుమారు 800 టి.ఎం.సి.ల నీరు ఇప్పటికే సముద్రంలో కలిసిన పరిస్థితి కనబడింది. రాబోయే వారం రోజుల్లో కృష్ణమ్మ తల్లి కూడా ప్రకాశం బ్యారేజి ద్వారా సముద్రంలోకి వెళ్లే పరిస్థితి దాపురించింది. కానీ, రాయలసీమ ప్రాంతానికి నీరు ఇద్దామనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. ఇప్పటికే వేల కోట్ల రూపాయలను గత ప్రభుత్వాలు ఖర్చు చేశాయి. కానీ రాయలసీమ ప్రాంతానికి నీరు అందించలేకపోయాయి. ఆ విషయమై మళ్లీ నేను "జలయజ్ఞం - ధనయజ్ఞం" అన్నాననంటే, ప్రతిపక్షం మళ్లీ నాపైన దుమ్మెత్తిపోసే అవకాశం ఉంది. ఏ విధంగా రాయలసీమ ప్రాంత ప్రజానీకం కన్నీళ్లను తుడవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆలోచిస్తుంది. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సువర్ణావకాశంగా భావించి రాష్ట్రాభివృద్ధికి దోహదపడేందుకు మామిడిచెట్లను పెట్టిన కారణంగా 2004వ సంవత్సరానికి కాయలు కాశాయి. తరువాత ఆ కాయలను, పండ్లను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు దోచేశాయి.

(ప్రతిపక్షసభ్యుల చేత సభకు అంతరాయం)

2004వ సంవత్సరానికి ముందు రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంది.2004వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు తొమ్మిది సాగునీటి ప్రాజెక్టుల మీద రూ.2,905.00 కోట్లు ఖర్చుచేస్తే ఆ ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం

ఉండేది. తెలుగు గంగ ప్రాజెక్టు గానీ, హంద్రి- నీవా గానీ, గాలేరు- నగరి గానీ, తోటపల్లి రిజర్వాయర్ పనులు గానీ అన్ని పనులు పూర్తయ్యే అవకాశం ఉండేది.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా............

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: ఉండు తమ్ముడూ, నేను చెబుతున్నాను విను.... శ్రీకాంత్ తమ్ముడూ నీవు కొత్తగా వచ్చావు. నేను చెప్పే విషయాలను ఓపిగ్గా విను.

MR SPEAKER: O.K. Minister garu, you continue your reply.

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, నేను చరిత్ర చెబుతున్నాను. 2003వ సంవత్సరం చివరి నాటికి రూ. 2,905.00 కోట్లు ఖర్చు చేసినట్లైతే ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవి. 2004వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం ముందు కూడా పెండింగ్ ప్రాజెక్టులున్నాయనే వాస్తవాన్ని అందరూ గ్రహించాల్సిందే. కానీ, మూడు వేల కోట్ల రూపాయల నిధులను ప్రాజెక్టుల నిర్మాణానికి ఇద్దామనే ఆలోచన చేసి ఉంటే, ఈనాడు రాయలసీమ ప్రాంత కన్నీటి కష్టాలుండేవి కావు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాల పేదరికం తగ్గేది.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా...........

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, శ్రీకాంత్ రెడ్డి తప్పుగా భావిస్తున్నాడు. నేనేమి జగన్మోహన్ రెడ్డి గారిని తిట్టడం లేదు. అదే విధంగా దివంగతనేత రాజశేఖరరెడ్డి గారిని తిట్టడం లేదు. వాస్తవ పరిస్థితిని సభకు వివరిస్తున్నాను.

అధ్యక్షా, మీ ద్వారా రాష్ట్ర ప్రజలకు చెప్పుకుంటున్నాను. ఎందుకంటే, మంత్రిగా ప్రమాణస్వీకారం చేసే ముందు నేను ఒకసారి డాక్టర్ గారిని సంప్రదించాను. 120/80 బి.పి. లెవెల్స్ నాకుండేది. సుగర్ ఉండేది కాదు. కానీ, మూడు నెలలుగా గత ప్రభుత్వ పాలకుల పాపాలు చూసిన తరువాత 140/100కు నా బి.పి. లెవెల్స్ వెళ్లాయి.

అధ్యక్షా, ఆనాడు 2004వ సంవత్సరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం నిమిత్తం రూ.3,000.00 కోట్లు కేటాయించి ఉన్నట్లయితే ఆనాడే బ్రహ్మాండంగా ప్రాజెక్టులన్నీ పూర్తి అయ్యేవి. కానీ ఆ పాలకులేమి చేశారంటే, ఇ.పి.సి. సిస్టమ్ తీసుకువచ్చారు. 'ఇ' అంటే ఇంజనీర్లు, 'పి' అంటే పొలిటీషియన్లు, 'సి' అంటే కాంట్రాక్టర్లు. అంటే ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ అని ఉండే అర్థాన్ని జలయజ్ఞం పేరుతో నవగ్రహాలుగా పుట్టించారు. ఆ నవగ్రహాలు రూ.2,905.00 కోట్లను రూ.6,618.00 కోట్లకు

ఇ.పి.సి. సిస్టమ్ ద్వారా పనులు పెంచాయి. ఈ మధ్యకాలంలో ఆ పెంచిన వ్యత్యాసం రూ.3,713.00 కోట్లకు చేరింది.

అధ్యక్షా, ఈనాడు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను ప్రభుత్వం పూర్తిచేయాలంటే, 2004-2014 మధ్య కాలంలో ఇ.పి.సి. సిస్టమ్ వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగిన దృష్ట్యా పూర్తి వివరాలను తెలియజేయాల్సిన అవసరముంది. ఆనాడు సుమారు 54 ప్రాజెక్టుల క్రింద సుమారు రూ. 55,843.00 కోట్ల అంచనాను, సవరించిన అంచనా వ్యయం రూ.74,323.00 కోట్లకు పెరిగింది. రెండింటి మధ్య వ్యతాసం రూ. 18,480.00 కోట్లు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 54 ప్రాజెక్టు పనులకు గాను సుమారు రూ.47,107.00 కోట్లు ఇప్పటి వరకు గత ప్రభుత్వం ఖర్చుచేసింది. ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేయాలంటే ప్రభుత్వానికి సుమారు రూ.18,000.00 కోట్లు అవసరముంటుంది. నేను ఇందాక చెప్పిన వ్యత్యాసం 2010-11 వ సంవత్సరానికి సంబంధించినదే. ఇ.పి.సి. విధానంలో, ల్యాండ్ అక్విజిషన్‌కు గానీ, ఆర్ అండ్ ఆర్ క్రింద గానీ, రెహాబిలిటేషన్‌కు గాని అనుమతులకు గానీ ఆనాడు మనమే ఖర్చుచేశాం. తీరా వచ్చిన కాంట్రాక్టర్ ఒక ప్రాజెక్టు డిజైన్ తీసుకువచ్చి, ప్లాన్ గీసి డబ్బును వృధాగా ఖర్చుచేయడం జరుగుతోంది. మన దగ్గర సుమారుగా ఐదు వేల మంది ఇంజనీర్లు విధులను నిర్వహిస్తున్నారు. బ్రహ్మాండమైన గోల్డ్ మెడలిస్ట్‌లున్నారు. కానీ, వాళ్ల చెక్ చేసే పరిస్థితి ఆనాడు ఉండేది కాదు. థర్డ్ పార్టీ వచ్చి వాళ్లే చెక్ చేస్తారు. కానీ మన ఇంజనీర్లు కేవలం సంతకం చేయాల్సిన పరిస్థితి ఆనాడు ఉండేది. ఆ విధంగా ఇ.పి.సి. సిస్టాన్ని పెట్టి సర్వనాశం చేసింది గత ప్రభుత్వం. ఈనాడు ఇ.పి.సి. విధానాన్ని అమలుచేసి ప్రాజెక్టు పనులను మొదలుపెట్టి, స్పీడప్ చేయాలంటే పెరిగిన అంచనాల ప్రకారం రూ.4,000.00 కోట్లు అదనంగా అడుగుతున్నారు. ఇందాక చెప్పిన వ్యత్యాసం రూ.18,480.00 కోట్లు మరియు రూ.4,000.00 కోట్లుగా ఈనాడు ఉన్న మొత్తం మళ్లీ ప్రాజెక్టులు పూర్తయ్యే నాటికి మరో నాలుగు వేల కోట్ల రూపాయలకు చేరుతుంది. మొత్తం ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం రూ. 25,368.00 కోట్లకు చేరే అవకాశం ఉంది. ఇవాళ రాష్ట్ర ప్రజలను మీ ద్వారా నేను అడుగుతున్నాను. ఇ.పి.సి. అవసరమా? కాలువ పనులు చేయడానికి ఇ.పి.సి. విధానం అవసరమా? డెల్టా మాడ్రనైజేషన్ పనులకు ఇ.పి.సి. విధానం అవసరమా? కృష్ణా డెల్టా మాడ్రనైజేషన్ పనులకు ఇ.పి.సి. విధానం అవసరమా?

...

రాష్ట్ర ప్రజలను మీ ద్వారా అడుగుతున్నాను. కాలువ పనులు చేయడానికి, డెల్టా ఆధునీకరణకు, కృష్ణా డెల్టా ఆధునీకరణకు ఈపీసీ అవసరమా? ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా 40,000 చెరువుల ద్వారా 25,60,000 ఎకరాలు మైనర్ ఇరిగేషన్ కింద ఉంది. గత దశాబ్దకాలంలో 25,60,000 ఎకరాల ఆయకట్టులో 2004-05లో 6,30,000 ఎకరాలు, 2005-06లో 9,23,000 ఎకరాలు, 2006-07లో 9,32,000 ఎకరాలు, 2007-08లో 9,03,000 ఎకరాలు, 2009-10లో 6,81,000 ఎకరాలు, 2010-11లో 9,97,000

ఎకరాలు, 2011-12లో 11,27,000 ఎకరాలు, 2012-13లో 13,43,000 ఎకరాలు, 2013-14లో 11,56,000 ఎకరాలకు పడిపోయింది. అంటే మన రాష్ట్రంలో రూ.45వేల కోట్లు ఖర్చు పెట్టినది మైనర్ ఇరిగేషన్ కింద ఖర్చుపెట్టినా బాగుండేది. ఉదయం వారి నియోజకవర్గంలోని చెరువులు బాగుచేయమని మిత్రులు గిద్దలూరు శాసనసభ్యులు శ్రీ అశోక్‌రెడ్డి గారు అడిగారు. ఈ విధంగా వేల కోట్ల రూపాయలు వెచ్చించి మైనర్ ఇరిగేషన్‌లో చెరువులను బాగుచేసినట్లయితే ఒక్కొక్క చెరువుకు పది, పదకొండు, పన్నెండు లక్షల రూపాయల చొప్పున మరమ్మత్తులకు ఇచ్చినట్లయితే, ఒక ప్రణాళిక ప్రకారం బాగుచేసినట్లయితే, ఫీడర్ ఛానళ్లు బాగుచేసుకున్నా, చెక్‌డ్యాములు నిర్మించుకున్నా బాగుండేది.

నీరు-మీరు పథకం గురించి, ఇంకుడు గుంతల పథకం గురించి మమ్మల్ని ఎగతాళి చేసి మీరు చేసిన ఘనకార్యం ఏమిటి? జలయజ్ఞం ద్వారా ఇన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చించి ఒక్క చెరువును కూడా బాగుచేయలేదు. అప్పట్లో అనగా స్వాతంత్ర్యం రాకముందు అప్పటి జమీందారులు తవ్వించిన చెరువుల కింద సాగవుతున్న వ్యవసాయాన్ని దెబ్బతీసే అధికారం మీకెవరు ఇచ్చారు? నికర జలాలు కావాలి, మాకు అన్యాయం చేయవద్దని రాయలసీమలో ఉద్యమాలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారిని సెక్రటేరియట్‌లోకి వెళ్లనీయకుండా అడ్డంగా నిలబడితే ఆయన బాధతో, కోపంతో ముఖ్యమంత్రిగా ఉండి కూడా రోడ్డు మీద పడుకుని తన బాధను, ఆవేదనను, నిరసను వ్యక్తం చేశారు. తెలుగుగంగ పథకం ద్వారా అప్పటి మద్రాసు నగరానికి తాగునీరు అందించడంతోబాటు వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు ఇవ్వాలని ఆ మహానాయకుడు దూరదృష్టితో మూడు దశాబ్దాల క్రితం చేపట్టిన తెలుగుగంగ పథకంతోబాటు, రకరకాల ఆలోచనలతో హంద్రీ-నీవా, గాలేరు-నగరి పథకాలు చేపట్టారు. అప్పుడు ఆ పథకాలకు మంచి పేర్లు పెట్టే అదృష్టం మా సీనియర్ నాయకులు శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి గారికి దక్కింది. ఆ రోజు ముఖ్యమంత్రిగా ఎన్టీ రామారావు గారు, ఇరిగేషన్ మంత్రిగా కె.ఇ.కృష్ణమూర్తి గారు ఉన్నారు. కానీ కొందరు రాయలసీమ నాయకులు ఉద్యమాలు చేసి, అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గారి కారుకు అడ్డం పడుకున్నారు. తరవాత ఎన్టీ రామారావు గారి ఇంటివద్దకు వెళ్లి కూడా ధర్నా చేశారు.

ఎవరికీ రాని సువర్ణావకాశం బచావత్ ట్రిబ్యునల్ రూపంలో రాజశేఖరరెడ్డిగారికి వచ్చింది. గతంలో ఎపుడో 1972లో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లకు నదీ జలాల పంపకానికి కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళితే కేంద్ర ప్రభుత్వం కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్ 2000 సంవత్సరం వరకు నీటి కేటాయింపులు చేస్తూ తీర్పు ఇచ్చింది. అప్పుడు శ్రీ కె.ఎల్.రావు వంటి నీటిపారుదల రంగ నిపుణులు కేంద్ర ప్రభుత్వం ముందు మన రాష్ట్రం తరపున వాదనలు వినిపించి నీటి పంపకాలు పొందారు. 2000వ సంవత్సరం వరకు ఆ తీర్పు అమలులో ఉంది. ఆ తరవాత ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు సమయంలో శ్రీ దేవెగౌడ గారు ప్రధానమంత్రిగా

ఉన్నారు. అయినా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అడ్డుపడి ఆ డ్యాం ఎత్తును 517 మీటర్లకు తగ్గించడం జరిగింది. ఆ తరవాత 512 నుంచి 516 పెంచడం జరిగింది. ఆ తరవాత ఈ ట్రిబ్యునల్ ఏర్పాటుకోసం సుప్రీంకోర్టుకు మూడు రాష్ట్రాలూ కలిసి కేంద్ర ప్రభుత్వానికి చెప్పుకుంటే కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్ ఏర్పాటుచేస్తూ మీకు ఏమైనా ఇబ్బందులు ఉంటే ట్రిబ్యునల్ ముందు మీ మీ వాదనలు వినిపించమని చెప్పడంతో 2000వ సంవత్సరం నుంచి 2003వ సంవత్సరం వరకు చర్చలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం 2004లో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కృష్ణా జలాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేసింది. అప్పుడు నేను ఈ సభలో శాసనసభ్యునిగా ఉన్నాను, ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డిగారున్నారు. అప్పుడు నేను ముఖ్యమంత్రి గారూ, మీరు గతంలో కృష్ణా నదీజలాలను రాయలసీమకు తరలించడంకోసం ఉద్యమాలు చేశారు, ఇపుడు మరలా కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటైంది కాబట్టి అఖిలపక్ష సమావేశం పెట్టండి, మా కష్టనష్టాలు చెబుతాం, మేం కూడా మెట్టప్రాంతం నుంచి వచ్చాం, నాగార్జునసాగర్ కాలువ చివరి ఆయకట్టు కింద, ఎత్తిపోతల పథకాల కింద నీరందని పరిస్థితులున్నాయి, మా కష్టాలు, బాధలు వినడానికి అఖిలపక్ష సమావేశం పిలవండి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు నాయుడు గారు కూడా వస్తారు అని నేను ఒక శాసనసభ్యుడిగాచెబితే పో, పోవయ్యా చెప్పవచ్చావు, కూర్చో, నీకేమి తెలుసు, పైన మా ప్రభుత్వం ఉంది, రాష్ట్రంలోనూ మా ప్రభుత్వం ఉంది, ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తాం, మన రాష్ట్ర హక్కులను కాపాడుతాం, రాయలసీమ కష్టాలు, మా కష్టాలు మాకు తెలుసు, మీరు మాట్లాడకండి అంటూ మా నోరు మూయించారు.

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలు వినిపించడానికి ముస్లిం మైనారిటీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లపై హైకోర్టులో ప్రభుత్వం కేసు ఓడిపోవడానికి ప్రధాన కారకులు అప్పటి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి గారు. ఆయనను ఆ పదవి నుంచి తప్పించాలని కొన్ని పార్టీలు అప్పటి ముఖ్యమంత్రి గారి మీద వత్తిడి తీసుకొస్తే ఆయనను అడ్వకేట్ జనరల్ పదవి నుంచి తప్పించి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు మన రాష్ట్రం తరపున వాదనలు వినిపించడానికి నియమించారు. కర్ణాటక ప్రభుత్వం తరపున ప్రముఖ న్యాయవాది శ్రీ నారీమన్ వాదిస్తే మన రాష్ట్రం నుంచి సుదర్శన్ రెడ్డి గారు వినిపించారు. బాధతో సభ నుంచి ఎన్నోసార్లు వాకౌట్ చేశాం, పదే పదే కోరాం, కానీ ఆయన అన్నీ నాకు తెలుసు, మీరు కూర్చోండి, మేం చేస్తాం, చూస్తామని చెప్పారు. మొన్న ఒక సోదరుడు సభలో మాట్లాడుతూ హంద్రీ-నీవాకు, గాలేరు-నగిరికి నికరజలాలేవి అని అడిగారు. నికలజలాలు ఎవరివల్ల రాలేదు? నికరజలాలు ఎవరు ఇవ్వాలంటే కేంద్ర ప్రభుత్వం నియమించిన ట్రిబ్యునల్ ఇవ్వాలి. ట్రిబ్యునల్ ముందు సమర్థవంతంగా మన వాదలు వినిపించాలి. వెనుకబడిన ప్రాంతం, కరవుపీడిత ప్రాంతమైనన రాయలసీమకు నికర జలాలు కావాలి. అప్పటి ప్రభుత్వం ఒక లేఖ కూడా ఇచ్చింది. ఎంత బాధాకరమంటే పైన ఒక రైతు కాలువ తూములు తీస్తుంటే కింద ఉన్న రైతు బతిమాలి చెప్తాడు, భయపెట్టి చెబుతాడు, ప్రాణాలకు తెగించి పైన తూము వేయకుండా

తన పొలానికి వచ్చే నీటిని కాపాడుకుంటాడు. ఆ విధంగా పొలాలలో మనం చూస్తుంటాం. కానీ ఎగువ రాష్ట్రంలో ప్రాజెక్టులు కడుతుంటే నేను ఇక్కడ జలయజ్ఞం చేస్తున్నాను, ప్రాజెక్టులకు నీరు అడగను, పైన ప్రాజెక్టులు కట్టినా ఫర్వాలేదని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంటే ఇపుడు ఏమి జరిగిందంటే వెలుగొండ ప్రాజెక్టుకు, గాలేరు-నగరికి, హంద్రీ-నీవాకు నికరజలాలు రాలేదు. నదిలో నీటి లభ్యత లేదు. డిపెండబిలిటీని 75 శాతం నుంచి 65శాతానికి తగ్గించి మనకు లేని నీటిని క్రియేట్ చేసి పైన కర్ణాటక, మహారాష్ట్రలకు బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నీరు పంచిపెట్టింది. లేని నీటిని లెక్కించి డిపెండబిలిటీని 75శాతం నుంచి 65శాతానికి తగ్గించింది. ఆ విధంగా జరుగుతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రాణాలొడ్డి, అవసరమైతే పెద్ద పెద్ద న్యాయకోవిదులను తీసుకొచ్చి ట్రిబ్యునల్ ముందు మన వాదనలు వినిపించి మన హక్కులను కాపాడుకోవాలి.

ఆల్మట్టి ఎత్తు 5 మీటర్లు మూడు అంగుళాలు పెంచుకొనే విధంగా బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆల్మట్టి ఎత్తు 18 అడుగులు పెరిగితే శ్రీశైలానికి వరద నీరు అక్టోబర్‌లో వస్తుంది. అక్టోబర్, నవంబర్‌లో జలాలు వస్తే రాయలసీమ ఏమి కావాలి? కృష్ణా డెల్టా ఏమి కావాలి? నాగార్జునసాగర్ ఆయకట్టు ఏమి కావాలి? ఆ విధంగా ట్రిబ్యునల్ తీర్పు వస్తే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుంది. అప్పుడు చంద్రబాబు నాయుడు గారిని ప్రకాశం బ్యారేజ్ వద్దకు తీసుకొచ్చి మహా ధర్నా చేసి చెప్పాను. ప్రభుత్వ కళ్లు తెరిపించాలని ఆయన మండుటెండలో ధర్నా చేసి రేపు ప్రకాశం బ్యారేజ్‌కు నీరు రాదు, రాయలసీమకు కరవు వస్తుంది, కృష్ణా డెల్టా ఎండిపోతుందని చెప్పారు. సాగర్ ఆయకట్టు బీడు పడుతుందని చంద్రబాబు నాయుడు గారు మహా ధర్నా చేస్తే మమ్మల్ని ఎగతాళి చేశారు.

...

సంవత్సరం తిరక్కుండానే పాపం చనిపోయి ఎక్కడున్నారో మహానుభావుడు ఎర్రన్నాయుడు గారిని కృష్ణా నది దగ్గర కూర్చోబెట్టి వేలాది మంది రైతులతో మహాధర్నా చేయడం జరిగింది. అప్పుడు మీరు కూడా ఉన్నారు. ఆ రెండు మహా ధర్నాలలో మీరే సాక్ష్యం. "బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పివ్వబోతోంది, మనకు కష్టాలు వస్తున్నాయి, రాబోయే రోజుల్లో ఆల్‌మట్టీ ఎత్తు పెంచే విధంగా నిర్ణయాలు జరుగుతున్నాయి, మనకు అన్యాయం జరుగుతోంది, మీరు వెంటనే ప్రధానమంత్రి గారి దగ్గరకి వెళ్లండి, కేంద్రంలో మీకు 30 మంది ఎంపీలున్నారు, వెంటనే పార్లమెంటులో వత్తిడి తీసుకువస్తే ఆ తీర్పు ఆగుతుంది" అని బతిమాలి చెప్పాము. అడుక్కున్నాము. ఏ మాత్రం పట్టించుకోలేదు. జడ్జిమెంటు వచ్చింది. తాపీగా నిమ్మకు నీరెత్తినట్లుగా కూర్చున్నారు.

ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా ఉన్న తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు గారు శాసన సభ్యుడిగా ఉన్న నన్ను సుప్రీం కోర్టుకి పంపించి స్పెషల్ లీవ్ పిటీషన్

వేయించారు. స్పెషల్ లీవ్ పిటీషన్ వేసి ఆ తీర్పు అమలు చేస్తే గజిట్ అయితే మాకు అన్యాయం జరుగుతుంది, తాగునీరు, సాగునీరు ప్రశ్నార్ధకమవుతుందని నేను వెళ్లి రైతులతో కలిసి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ వేశాను. తరువాత కిరణ్‌కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం కళ్లు తెరచి అన్ని పార్టీలతో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధానమంత్రి గారిని కలవడం జరిగింది. మీరు ప్రధానమంత్రి గారి దగ్గరకి వెళ్లిన వారిలో ఆ డెలిగేషన్‌లో మీరు కూడా ఉన్నారు. అప్పుడు ఆ ఎస్ఎల్‌పీని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో వేశాం. సుప్రీం కోర్టు కూడా ప్రభుత్వాలు ఎస్ఎల్‌పీలో ఉండాలి కాబట్టి అన్యాయం జరిగినప్పుడు రమ్మనమని చెప్పి నాకు సుప్రీం కోర్టు వెసులుబాటు ఇచ్చింది. ఏదేమైనా సరే రాష్ట్ర విభజన జరిగింది కాబట్టి వెంటనే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుని గజిట్ చేయమని సుప్రీం కోర్టులో నారీమణ్ గారు చాలా పెదఎత్తున వాదనలు వినిపించారు. సుప్రీం కోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, తెలంగాణ ప్రభుత్వానికి నాలుగు వారాల సమయమిచ్చింది. ఆ తీర్పు గజిట్ అయితే ఆల్‌మటి ఎత్తు 18 అడుగులు పెరుగుతుంది కాబట్టి ఆ నీళ్లను వాడుకోవచ్చు, ఆ వాటర్ ద్వారా విద్యుత్తు వస్తుంది, సాగునీరు వస్తుంది 20 లక్షల ఎకరాలు అదనంగా సాగుచేసుకోవచ్చని కర్ణాటక ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం భావించాయి. ఆ విధంగా చేస్తే శ్రీశైలం ప్రాజెక్టుకి నీళ్లు రాని పరిస్థితి ఏర్పడుతుంది. అవన్నీ పట్టించుకోకుండా మేము జలయజ్ఞం చేశాం, మేము నడుస్తుంటే నీళ్లొస్తున్నాయని చెబుతుంటే బాధేస్తుంది. ఒకళ్లను తిట్టాలనో, లేనివాళ్ల గురించి మాట్లాడాలనో కాదు. మొన్న రాయలసీమ వెళ్లాను. ఏ ఎంఎల్ఏని కదిలించినా మా కాలువ బాగు చేయి, మా లిఫ్టు బాగు చేయి. మా ప్రాజెక్టుకి నీళ్లివ్వు, మా ప్రాజెక్టుకి డబ్బులివ్వు, మా చెరువులకి మంచినీళ్లివ్వు అని పార్టీలకతీతంగా ప్రతీ శాసన సభ్యుడు కష్టాలు బాధలు చెబుతున్నారు. అందువలన రూ.8486 కోట్లు బడ్జెట్ ఇచ్చారు. ప్లాన్‌లో రూ.3210 కోట్లు ఇస్తే, నాన్‌ప్లాన్‌లో రూ.5275 కోట్లు ఇచ్చారు. ఈ మొత్తం రూ.8486 కోట్లలో రూ.4628 కోట్లు వడ్డీలకి కట్టాలి. ఈపీసీ విధానం ద్వారా కాకుండా నాన్ ఈపీసీలో ఉన్న పనులను ఒక ప్రణాళిక ప్రకారం అంటే ఈ రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తాం, ఈ మూడు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు చేస్తాం అని నిర్ణయించి వుంటే బాగుండేది. అందుకే మేము ఒక నిర్ణయం తీసుకున్నాం. వెనుకబడ్డ ఉత్తరాంధ్రలో వంశధార ప్రాజెక్టు కింద నాగావళి కింద ప్రాజెక్టులు టేకప్ చేయాలని నిర్ణయించాం. తోటపల్లికి రూ.220 కోట్లు ఖర్చువుతుంది కాబట్టి ఆ ప్రాజెక్టు పూర్తి చేయాలి. వెలిగొండ ఫేజ్.1 కి నీళ్లివ్వాలని భావిస్తున్నాం. ఎందుకంటే దాని వలన ప్రకాశం జిల్లాలో తాగునీరు వస్తుంది. కొంత మేర సాగునీరు వస్తుంది. శాసన సభ సమావేశాలైన తరువాత మా అధికారులను తీసుకు వెళ్లి హంద్రీనీవా కాలువ మొత్తం పరిశీలించి ఎక్కడ బాటిల్‌నెక్స్ ఉన్నాయి, ఎక్కడ మోటర్లకు ఇబ్బంది ఉంది, ఎక్కడ కాలువలకు ఇబ్బంది ఉంది, ఎక్కడ నష్టాలు జరిగాయి అదే విధంగా ఏమేరకు వాటిని బాగు చేసుకోగలమని ఒక ప్రణాళిక వేసుకోవడం జరిగింది. ఆ విధంగా ముఖ్యమంత్రి గారు నిన్న స్వయంగా ఒక సంవత్సర కాలంలో ఈ బడ్జెట్‌లో ఇచ్చిన ప్రాజెక్టులు కాకుండా మూడు ప్రాజెక్టులకి కూడా నిధులు కేటాయించాలని, కేంద్రం నుంచి డబ్బులు తేవాలని, రాష్ట్ర విభజన జరిగినప్పుడు ప్రాజెక్టులకి డబ్బులు ఇస్తామని చెప్పారు కాబట్టి వాటికి కూడా డబ్బులు

తేవాలని ప్రయత్నంలో భాగంగా నిన్న స్పష్టంగా ముఖ్యమంత్రి గారే మా శాఖ తరఫున హామీ ఇచ్చినందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. తప్పకుండా ఆ ప్రాజెక్టులని పూర్తి చేయడమే కాకుండా ఏదైతే సభ్యులు తమ నియోజక వర్గాల్లో సమస్యలు చెప్పారో, జిల్లాల్లో సమస్యలు చెప్పారో... పోతిరెడ్డిపాడు గురించి గానీ గాలేరు నగరికి సంబంధించి గానీ ఎక్కడెక్కడైతే లిఫ్టు ఇరిగేషన్‌కి సంబంధించి గానీ, మోహన్ రెడ్డి గారు చెప్పినట్లుగా కర్నూలులో చెక్‌డ్యాము కట్టడం వలన వచ్చే ఇబ్బందులు గానీ ఈ విధంగా సభ్యులు చెప్పిన విషయాల్లో తగు చర్యలు తీసుకుంటాము.

పులిచింతల ప్రాజెక్టుకి 2003వ సంవత్సరంలో రూ.565 కోట్లు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చాము. ఇవాళ పది సంవత్సరాలు పూర్తైంది. గత సంవత్సరం కిరణ్ కుమార్ రెడ్డి గారు విజయవాడ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పులిచింతల సెట్టింగ్ వేసి నీళ్లొదిలేశారు. ఇంత వరకూ ఆ డ్యాముకి గేట్లు ఎత్తడానికి కరెంటు పనులు పూర్తి కాలేదు. ఈ మూడు నెలల్లో గేట్లకు సంబంధించి రబ్బర్ లైనింగ్ పూర్తి చేసి నాలుగు టిఎంసీల నీళ్లు నిలబెట్టాము. రేపు నాగార్జున సాగర్ ఓవర్‌ఫ్లో అయినప్పుడు 11 టిఎంసీల నీళ్లు నిలబెట్టాలనే ప్రయత్నం చేస్తున్నాం. దానితోబాటు కరెంటు పనులు కూడా పూర్తి చేస్తాం. రాబోయే సంవత్సరంలో 22 టిఎంసీలు, ఆ పై సంవత్సరంలో 42 టిఎంసీలు ఆ విధంగా డ్యామ్ సేఫ్టీని దృష్టిలో పెట్టుకుని చేస్తాం. ల్యాండ్ అక్విజిషన్‌కి సంబంధించి ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి కాలేదు. రీహాబిలిటేషన్ పనులు పూర్తి కాలేదు. ఇళ్లు కట్టడం పూర్తి కాలేదు. పులిచింతలని జాతికి అంకితం చేశారు.

పోలవరం ప్రాజెక్టుని కూడా త్వరితగతిన నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ క్రింద కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. ల్యాండ్ ఎక్విజిషన్, ఆర్ అండ్ ఆర్, అన్ని అనుమతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుంది. అది బహుళార్థ జాతీయ ప్రాజెక్టుగా వచ్చినప్పుడు 960 మెగావాట్ల విద్యుత్ వస్తుంది. విశాఖపట్టణానికి, గోదావరి జిల్లాలకు 7,20,000 ఎకరాలకి గ్రావిటీ ద్వారా నీళ్లొస్తాయి. గోదావరికి 10 లక్షల ఎకరాలకు నీళ్లొస్తాయి. కృష్ణా డెల్టా 13 లక్షల ఎకరాలతో స్థిరీకరించబడుతుంది. 25 లక్షల మంది ప్రజలకు మంచి నీళ్లొస్తాయి. ఈవిధంగా ఆ ప్రాజెక్టుని పూర్తి చేసి శ్రీశైలం దగ్గర ఆదా చేసుకునే నీళ్లని రాయలసీమ కరువు పీడిత ప్రాంతాన్ని,వెనుకబడ్డ ప్రాంతాన్ని ఆదుకునే అవకాశం ఉంటుంది. వాళ్లకు నీళ్లిచ్చే అవకాశం ఉంటుంది.

అనంతపురం జిల్లాలో లిఫ్టు ఇరిగేషన్ కింద నీరు–చెట్టు కార్యక్రమం కింద వాటర్ కన్సర్వేషన్ మిషన్ పెట్టి ఏదైతే మైనర్ ఇరిగేషన్‌లో పడిపోయిన ఆయకట్టునంతా కాపాడాల్సిన అవసరం ఉంది. ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంటు, ఫారెస్టు డిపార్ట్‌మెంటు, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు, రూరల్ డిపార్ట్‌మెంటు, ఉపాధి హామీ ద్వారా ఈ డబ్బులన్నీ క్రోడీకరించి రూ.5000 కోట్లు సమీకరిస్తాము. ఒక శాసన సభ్యుడో, ఒక మంత్రో

నిర్ణయం తీసుకుని ఒక చెక్‌డ్యాము పెట్టడం, కాంటూర్ ట్రెంచెస్ తవ్వి ఒక చెట్టు పెట్టడమో కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో శాటిలైట్ ద్వారా మ్యాపింగ్ చేశాం. అనంతపురం జిల్లాలో 3500 పాయింటు వచ్చాయి. ఈ పాయింట్లన్నీ మైనర్ ఇరిగేషన్ ద్వారా, రూరల్ డెవలప్‌మెంటు ద్వారా ఈ శాటిలైటు మ్యాపింగ్‌ని చెక్ చేయిస్తున్నాము. సెప్టెంబరు మూడవ వారంలో 13 జిల్లాల్లోని ఆరు శాఖల అధికారులని, ప్రజా ప్రతినిధులని కూడా ఆహ్వానిస్తున్నాను. శాటిలైటు మ్యాపింగ్ ఎలా వచ్చింది, గ్రౌండ్ రియాలిటీస్ ఇలా ఉన్నాయి, 50 సంవత్సరాల్లో ఈ పనులు చేశాం, రాబోయే రోజుల్లో ఇవి చేసుకోవాలి, జల సంరక్షణ ద్వారా నీళ్లు కాపాడుకోవాలి, పడ్డ వర్షపు చుక్కని ఒడిసిపట్టుకోవాలి, గ్రౌండ్ వాటర్ పెంచుకోవాలి, వెనకబడ్డ ప్రాంతాల్లో మెట్ట ప్రాంతాల్లో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ పెట్టి నీరు–చెట్టు కార్యక్రమం ద్వారా కరువు పీడిత ప్రాంతాలని, వెనుకబడ్డ ప్రాంతాలని ఆదుకోవాలనే ఉద్దేశంతో పెద్దయెత్తున ఈ వాటర్ కన్సర్వేషన్ మిషన్‌కి ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా మా డిపార్ట్‌మెంటు పెద్దన్నగా ఉండి ఆరు శాఖలని సమన్వయం చేసుకుని కరువు ప్రాంతాల్లో వెనుకబడ్డ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతాం.

...

ప్రాధాన్యతా క్రమంలో ఏవైతే ప్రాజెక్టులు ఉన్నాయో వాటికి కేంద్ర నుండి ఏఐబిపి, ట్రిబులార్, జైకా ఈ నదుల గురించి ఉమాభారతి గారిని రెండు సార్లు కలిశాము. మొన్న రాష్ట్ర విభజన తర్వాత కూడా ముఖ్యమంత్రి గారు వెనుకబడ్డ ప్రాంతాల ప్రాజెక్టులకు డబ్బులు ఇవ్వాలని కోరడం జరిగింది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన కాలువల నిమిత్తం గతంలో ఖర్చు పెట్టిన రూ.5000 కోట్లను రియంబర్స్ చేయమని అడుగుతున్నాము, అలాగే రూ.2000 కోట్లను బడ్జెట్లో కేటాయించమని అడిగాము. దాని మీద పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులను త్వరలోనే పంపించబోతున్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం ఇటు పిపిఏ అందరం కలిసి సమన్వయంతో చేసుకొని, పోలవరం ప్రాజెక్టుని త్వరితగతిన పూర్తి చేయాలి. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలి.

ఇవి కాకుండా గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, ఫ్లడ్ బ్యాంక్సు, కరకట్టలు ఇవన్నీ కూడా చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ మెడ్రనైజేషన్ పనులను శాసనసభ సమావేశాల తర్వాత గోదావరి డెల్టా అధికారులను మరియు ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తూ, కృష్ణా డెల్టా మెడ్రనైజేషన్ మీద పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం ఈ నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు మరియు ఎంపీలను ఆహ్వానించి 14వ తారీకున గుంటూరులో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నాం. మా డిపార్ట్‌మెంటులో ప్రస్తుతం ఉన్న అధికారులందరినీ సమన్వయం చేసుకొని, జలయజ్ఞం ధనయజ్ఞంగా కాకుండా, ఈ విధంగా వేల కోట్లను దోచిపెట్టి వ్యవస్థ అంతా ఇన్ని రకాల ఇబ్బందుల్లో పడే విధంగా కాకుండా, ప్రస్తుతం ఉన్న పనులన్నీ క్యాన్సిల్ చేద్దామంటే రూ.20 వేల కోట్లు, ఉన్న రేట్లతో as it isగా వాళ్లు ఒప్పుకున్న

ఒప్పందాల ప్రకారం ముందుకెళ్లదామంటే రూ.8 వేల నుండి రూ.10 వేల కోట్లకు పెరిగే పరిస్థితి ఉంది.

ఇప్పటికిప్పుడు రద్దు చేసి క్రొత్తగా టెండర్లను పిలుద్దామంటే రూ.20 వేల కోట్లకు వెళుతుందో ఎన్ని వేల కోట్లకు వెళుతుందో తెలియని విధంగా ఉంది. ఇపిసి ఒప్పందాలు జరిగి ఉన్నాయి. అందుకే ప్రాజెక్టు వారీగా సమీక్షించుకొని గ్రౌండ్ రియాలిటీస్‌ని అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులను అందరినీ సమన్వయపరచి ప్రాజెక్టులను పూర్తి చేయాలి, ప్రయారిటైజ్ చేసుకోవాలి, ప్రాజెక్టులు మాత్రం పూర్తి కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఉన్నారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలి, రాబోయే 5 సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసి, ఆ ప్రాజెక్టులను పూర్తి చేసే అదృష్టం తెలుగుదేశం పార్టీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఆయన ఆధ్వర్యంలో పని చేసే అదృష్టం మాకు వచ్చింది కాబట్టి, తప్పకుండా ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. శ్రీధర్ రెడ్డి(నెల్లూరు, రూరల్) : అధ్యక్షా, తమరి ద్వారా గౌరవ మంత్రివర్గ సభ్యులందరికీ ఒక చిన్న సూచన చేస్తున్నాను. విమర్శ కాదు. మంత్రులు మాట్లాడేటప్పుడు సంయమనం పాటిస్తే బాగుంటుంది. హుందాగా మాట్లాడితే ఇంకా బాగుంటుంది. మంత్రిగారు అనేక విషయాలను చెప్పారు. తల్లి కాంగ్రెస్ – పిల్ల కాంగ్రెస్ అని లేకపోతే పందికొక్కులు అని మాట్లాడారు. దయచేసి గమనించండి, ఆ విధంగా రెచ్చగొట్టడం మంచిది కాదు. ఇవతల నుంచి మేము లేచి ఎన్‌టి రామారావు గారి గురించో వైస్రాయ్ హోటల్ గురించో మాట్లాడితే చర్చలు ప్రక్కదారి పడతాయి. దయచేసి, ఆ ప్రక్క ఈ ప్రక్క రెండు ప్రక్కల కూడా సమర్థవంతంగా మాట్లాడే వ్యక్తులు ఉన్నారు. చర్చలను నేరుగా ప్రజల్లోకి పంపిద్దాం.

మంత్రి గారు చాలా చక్కగా చాలా విషయాలు చెప్పారు. అదేవిధంగా ఆల్మట్టి గురించి చెప్పారు. ఆంధ్రుల పాలిటి శాపంగా మారిన ఆల్మట్టి ప్రాజెక్టుకు దేవేగౌడ గారు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు మంత్రులు ఆ క్యాబినెట్‌లో ఉండి రూ.300 కోట్లు ఏఐబిపి నిధులు అల్మట్టి ప్రాజెక్టుకు మంజూరు చేసిన మాట వాస్తవమా కాదా? ఆ రూ.300 కోట్లు నిధులతో ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెరిగిన మాట వాస్తవమా కాదా అనేది కూడా చెబితే బాగుంటుంది. చివరిగా మంత్రిగారు చెప్పారు. జరిగే పరిణామాలను చూస్తుంటే నాకు బీపీ షుగర్లు జాస్తవుతున్నాయని చెప్పారు. మనందరం మంత్రి గారు ఆరోగ్యంగా ఉండాలని కోరుకొంటున్నాం. ఒక వేళ బీపీ షుగర్లు పెరిగే అవకాశం ఉంటే వారు రాజీనామా చేసినట్లయితే, ప్రక్కనే సీనియర్ నాయకులు బుచ్చయ్య చౌదరి గారు ఉన్నారు, తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుండి ఆ జండాను మోసిన వ్యక్తి. (మైక్ కట్ అయ్యింది)

శ్రీ పి.శ్రీనివాసులురెడ్డి (కోవూర్)ః అధ్యక్షా, ముందుగా గౌరవనీయులైన ఇరిగేషన్ శాఖామంత్రి శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు గారు అద్భుతంగా, గత 10 సంవత్సరాల కాలంలో ఈ రాష్ట్రంలో ఇరిగేషన్ మీద జరిగిన ప్రతి అంశం గురించి ఎంతో లోతైన విధానంలో వాస్తవాలను చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు నోరెత్తకుండా, నోరు మెతపకుండా ఇటూ అటు చూడకుండా, అద్భుతంగా ఈ సభను రక్తి కట్టించినందుకు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలను తెలుపుతున్నాను.

MR.SPEAKER: Please come to the point.

శ్రీ పి.శ్రీనివాసులురెడ్డి ః గౌరవ సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గారు మాట్లాడారు. నిద్రలేచింది మొదలు, రావడం రావడం ఏ ప్రశ్న అడిగినా ముందు వైఎస్ రాజశేఖరరెడ్డి గారి పేరుతో మొదలు పెట్టి వైఎస్ రాజశేఖరరెడ్డి గారి పేరుతో ముగిస్తున్నారు. దివంగతనేతని ఎన్నికల్లో నిరంతరం వాడుకొని, ఈరోజు మాట్లాడుతున్నారు. మీపార్టీ పేరు మీకు ఈరోజు గుర్తొచ్చింది, చెప్పుకోవడానికైనా సిగ్గుండాలి, సంస్కారం ఉండాలి. (అంతరాయం) ఎన్నికల సందర్భంలో రాజశేఖరరెడ్డి గారి పేరును చెప్పి ముందుకు పోయిన పరిస్థితిని మీరు గుర్తు పెట్టుకోవాలి. తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేసేదేమంటే, అత్యంతబాధాకరమైన విషయం, మంత్రి గారు మా జిల్లాను విస్మరించారు. పెన్నా డెల్టా మోడ్రనైజేషన్ కార్యక్రమం గురించి ప్రస్తావించలేదు. ఆనాడు రాజశేఖరరెడ్డి గారు ఎప్పుడో బ్రిటీష్ వారి హయాంలో కట్టిన సంఘం బ్యారేజీకి 2005-06 ప్రాంతంలో శంఖుస్థాపన చేస్తే ఈరోజు మాట్లాడిన మా జిల్లాకు సంబంధించిన గౌరవ సభ్యుడు, ఏమయ్యా.. నీకు ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి బాధ్యత లేదా? (శ్రీ కె. శ్రీధర్ రెడ్డిని ఉద్దేశించి) జిల్లా రైతంగం పట్ల నీకు చిత్తశుద్ధి లేదా? వేరే విషయాలు మాట్లాడావు, పెన్నా డెల్టా ఆధునికీకరణ కార్యక్రమం గురించి ఎందుకు మాట్లాడటం లేదు.

మిస్టర్ స్పీకర్ ః శ్రీనివాసులు రెడ్డి గారు మీ విషయాల గురించి మీరు మాట్లాడండి. ప్లీజ్..

శ్రీ పి.శ్రీనివాసులురెడ్డి ః అధ్యక్షా, మా బాధను మా ఆక్రందనను మీరు అర్థం చేసుకోండి. నేను గౌరవ మంత్రిగారికి మనవి చేసేదేమంటే, సంఘం బ్యారేజీని నిర్మిస్తామని రూ.25 కోట్లను ఖర్చు పెట్టారు, నెల్లూరు బ్యారేజీని కడతామని రూ.85 కోట్లను ఖర్చు పెట్టి పనులను అర్థాంతరంగా ఆగిపోయాయి. పెన్నా డెల్టా ఆధునికీకరణ కార్యక్రమాలను చేపట్టి ఇపిసి విధానంలో, కొలగొట్టే కాంట్రాక్టర్లు అర్థాంతరంగా పనులను ఆపేశారు. కాబట్టి తమరి ద్వారా మనవి చేసేదేమంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా అంటే పూర్తి డెల్టా ప్రాంతం. నా నియోజకవర్గంలో ఒక్క ఎకరం కూడా నాన్ డెల్టా ప్రాంతం లేదు. పూర్తి డెల్టా ప్రాంతమైన నా

నియోజకవర్గంలో ఈ మూడు ప్రాజెక్టులను పూర్తి చేసి మా రైతాంగాన్ని ఆదుకోవాలని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)ః చాలా సంతోషం అధ్యక్షా. ప్రమాణ స్వీకారం చేసిన మూడు నెలల తర్వాత ప్రాజెక్టులపైన మంచి అవగాహనతో మాట్లాడిన మంత్రి గారిని వ్యక్తిగతంగా అభినందిస్తున్నాను. ముఖ్యంగా, మాట్లాడే ముందు కొన్ని నిజాలను గమనించి ఉంటే బాగుండేది. మంత్రి గారు మాట్లాడుతూ 2004లో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ వచ్చిందని చెప్పారు. 2004లో బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ వస్తుంది నికర జలాల కేటాయింపులు ఉండవు, వాళ్లు ఒక నిర్ణయం తీసుకుంటారనే సదుద్దేశంతోనే రాజశేఖరరెడ్డి గారు జలయజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభించి, వీలైనన్ని ప్రాజెక్టులను పూర్తి చేయాలని తపించిన వ్యక్తి రాజశేఖరరెడ్డి గారు. ఆ విషయాన్ని మర్చిపోయారు.

(అంతరాయం)

సోదరులారా.. ఒక సూచన చేసేటప్పుడు ఓపికగా వినాలి. అంతకు మునుపు 1994 నుంచి 2004 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు గారు, అన్నింటికీ శంఖుస్థాపనలు చేసుకుంటూపోయి ఒక ప్రాజెక్టుకు కూడా ఒక్క రూపాయిని కూడా ఖర్చు పెట్టకపోవడం వలన ఈ దుస్థితి వచ్చింది. 2004 తర్వాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి గారు ఏ విధంగా తపించారో, ఆ విధంగా చంద్రబాబు నాయుడు గారు ఇరిగేషన్ పై ఫోకస్ చేసుంటే మనకు నికర జలాలు కేటాయించబడేవి.

ఆరోజు తెలుగుగంగ ప్రాజెక్టును మహనీయులు ఎన్‌టి రామారావు గారు ప్రారంభించారు. కానీ ఆ ప్రాజెక్టును రాజశేఖరరెడ్డి గారు పూర్తి చేయబట్టే ట్రైబ్యునల్ నుంచి 30 టిఎంసీల అలొకేషన్ జరిగింది. వారు సర్‌క్యాస్టిగా మాట్లాడినా రాయలసీమ కష్టాల గురించి చెప్పినందుకు మా సోదరుడ్ని నేను అభినందిస్తున్నాను. అవును రాయలసీమ కష్టాల గురించి మాకు తెలుసు, ఏ రకంగా మేము నష్టపోతున్నాము, అనునిత్యం ఏ విధంగా అన్ని రకాలుగా మేము వెనుకబడిపోతున్నాం, మా ప్రాజెక్టులన్నీ మాకు రావాల్సిన నీళ్లన్నీ ఎటో వెళ్లిపోతున్నాయనే బాధ ఎప్పటి నుంచో మాకు ఉంది. ఆ కారణంచేతనే పోతిరెడ్డిపాడును ప్రారంభించారు. అయిదు సంవత్సరాల్లో ఆయన చేసిన పనులు, ఎన్‌టి రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పనుల గురించి పదే పదే చెప్పుకున్నారు, కానీ చంద్రబాబు నాయుడు గారి పేరును ఒక్కసారి కూడా చెప్పుకోలేని పరిస్థితుల్లో తాను ఉన్నారంటే దానికి సిగ్గుపడాల్సింది పోయి, ఇంకా ఏదేదో రాజకీయాలు మాట్లాడితే ఎట్లా? మంత్రిగారు ఒక మాట అన్నారు, మూడు నెలల కాలంలో ఈ ప్రాజెక్టుల వద్దకు తిరిగిన కారణాన్ని బట్టి నాకు బీపీ వచ్చిందని అన్నారు. బీపీ వచ్చే ఉంటుంది. కారణం, 2004 నుండి 2009 వరకు రాజశేఖరరెడ్డి

గారి ఆలోచనలతో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రగతిని చూసి ఉమామహేశ్వరావు గారికి ఖచ్చితంగా బీపీ వచ్చి ఉంటుంది. అదే విధంగా తెలుగు గంగ నికర జలాల గురించి మా నాయకులు ఎన్‌టి రామారావు గారి కారుకు అడ్డంగా కూర్చున్నారు. కానీ ఎన్‌టి రామారావు గారి కారు మీద చెప్పులు వేసిన సంస్కృతి మాకు లేదు. ఆ సంస్కృతి ఎవరికి ఉందో ఆలోచన చేసుకోవాలి.

...

ఆనాడు స్వర్గీయ శ్రీ నందమూరి తారకరామారావు గారు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వారు పయనిస్తున్న కారుకు నీళ్లకోసం అడ్డంగా కూర్చోవడం జరిగింది. కానీ ఎన్టీ రామారావు గారి కారుపైన చెప్పులు విసిరేసిన చరిత్ర, సంస్కృతి మాకు లేదు. ఆ సంస్కృతి ఎవరికి ఉందో ఒకసారి ఆలోచన చేసుకోవాల్సిన అవసరముంది. మేం ఇప్పటికి కూడా స్పష్టంగా ఒక విషయం చెబుతున్నాం. దాదాపుగా హంద్రి- నీవా, గాలేరు- నగరి, తోటపల్లి, వెలిగొండ ప్రాజెక్టు గానీ, ఏ ప్రాజెక్టునైతే ప్రయారిటీ పెట్టుకున్నారో 1994వ సంవత్సరం నుంచి 2004వ సంవత్సరం వరకు వీళ్లు కేటాయించిన నిధుల యొక్క చిట్టాను చెప్పమనండి? మాటా మాట్లాడితే జలయజ్ఞం, ధనయజ్ఞం అని అంటారు. ఆనాడు దేనికోసం రాజశేఖరరెడ్డి గారు జలయజ్ఞాన్ని మొదలుపెట్టారు? ఆయన జలయజ్ఞం పేరున వారి హయాంలో ఖర్చు చేసిన మొత్తం రూ. 47 వేల కోట్లు. కానీ లక్ష కోట్ల రూపాయలని వీళ్లు మాట్లాడుతుంటారు. ఆ రూ.47 వేల కోట్ల మొత్తంతో వారి హయాంలో ఎన్ని ప్రాజెక్టులను పూర్తిచేశారనే విషయమై ఒక్కో ప్రాజెక్టు పైన చర్చ జరపడానికి మేం సిద్ధంగా ఉంటాం. ధైర్యం ఉంటే ప్రతి ప్రాజెక్టు దగ్గరకు రమ్మనండి. మేం తీసుకువెళ్తాం. మా ప్రాంతంలో వెలిగల్లు ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పూర్తిచేసింది. ఈరోజున హంద్రి- నీవా ప్రాజెక్టు నిర్మాణాన్ని మరో సంవత్సర కాలంలో పూర్తిచేసుకోగల్గుతున్నామంటే, దాదాపు ఎనభై శాతం పనులను ఆనాడు రాజశేఖరరెడ్డి గారి హయాంలో పూర్తిచేయడం జరిగింది కాబట్టే మీరు ఈనాడు ప్రాజెక్టుల గురించి చెప్పుకునే పరిస్థితి కల్గింది. అదే విధంగా వెలిగొండ, తోటపల్లి, వంశాధార ప్రాజెక్టుల నిర్మాణాల గురించి కూడా చెప్పుకోవాల్సిఉంది.

అధ్యక్షా, గౌరవ మంత్రి గారికి ఒకటే తమరి ద్వారా సూచిస్తున్నాం. రాజకీయకోణంలో మాట్లాడకుండా రాయలసీమ ప్రాంతానికి సంబంధించినటువంటి గాలేరు- నగరి ప్రాజెక్టుకు 40 టి.ఎం.సి.లనీరు, హంద్రి- నీవా ప్రాజెక్టుకు 43 టి.ఎం.సి.ల నికర జలాలను సాధించే దిశగా ఆలోచన చేయండి. ఆనాడు రాజశేఖరరెడ్డి గారు ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేశాడనే విషయాన్ని గౌరవ మంత్రి గారు మరచిపోయి మాట్లాడడం మంచిది కాదు. ఈరోజు ఉదయం గౌరవ మంత్రి గారు మైనర్ ఇరిగేషన్ గురించి చదివారు. 2004వ సంవత్సరం నుంచి లెక్కలను ఈరోజు ఉదయం గౌరవ మంత్రి గారు సభకు చదివి వివరిచారు. 2004వ సంవత్సరంలో ఆరు లక్షల ఎకరాలు ప్రాజెక్టుల నిర్మాణం కారణంగానే సాగులోకి వచ్చింది. అంటే గత ప్రభుత్వ దుష్టపరిపాలన వల్లే ఆ విధంగా జరిగింది. 2009వ సంవత్సరానికి దాదాపుగా 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందటే మైనర్ ఇరిగేషన్ పైన చెరువుల పైన ఆనాడు రాజశేఖరరెడ్డి

గారు దృష్టి పెట్టబట్టే ఆ స్థితికి రావడం జరిగింది. ఇప్పటికైనా గౌరవ మంత్రి గారు ఇటువంటి విమర్శలు మానడం మంచిది. ఎందుకంటే ప్రాజెక్టులపైన వారు సదభిప్రాయంతో మాట్లాడారు కాబట్టి నేను సూచన చేస్తున్నాను. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా సత్వరమే పూర్తిచేయాలని అనునిత్యం రాజశేఖరరెడ్డి గారు పరితపించేవారనే విషయం మీకు తెలుసు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసిన తరువాత ఆ నికర జలాలను రాయలసీమకు రప్పించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయమని గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. దుమ్ముగూడెం టెల్‌పాండ్‌ను నేషనల్ ప్రాజెక్టుగా డిక్లేర్ చేయించి తద్వారా రాయలసీమకు నికర జలాలను తీసుకువచ్చే ప్రయత్నం చేయాల్సిందిగా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. ఎందుకంటే, గౌరవ మంత్రి గారు రాయలసీమ ప్రాంతం గురించి పదే పదే మాట్లాడుతున్నాడు. నిజంగానే నేను సంతోషపడుతున్నాను. రాయలసీమ ప్రాంతానికి ఉపయోగపడే విధంగా దుమ్ముగూడెం టెల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేసి మా ప్రాంతానికి మరో వంద టి.ఎం.సి.ల నీరు వచ్చే విధంగా చేస్తే ఎప్పుడూ మా ప్రాంత ప్రజానీకం మీకు రుణపడి ఉంటుంది. ఎప్పటికి మిమ్మల్ని గుర్తు పెట్టుకునేందుకు మేం ప్రయత్నం చేస్తాం. ఆ రెండు పనులను మొదలుపెట్టే పనిలో మీరు ఉండాలి గానీ, చేసిన వాళ్ల పనులను చెప్పుకుని మీరు ఏదో సాధించామని చెప్పుకోవడంలో అర్థం లేదు.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి): అధ్యక్షా, మీ ద్వారా గౌరవ మంత్రి గారికి ఒక సూచన చేయాలని అనుకుంటున్నాను. కృష్ణా డెల్టా ఆధునీకీకరణ డెల్టా రైతాంగ చిరకాల స్వప్నం. ఆధునీకీకరణ పనులు చాలా చిన్నతనంగా ఉండేలాగ, కంటి క్రింది తుడుపు లాగా జరుగుతున్నాయి. కొన్ని రీచ్‌లకు సంబంధించిన పనులు ఇంకా ప్రారంభానికే నోచుకోలేదు. ఇప్పుడే గౌరవ మంత్రి గారు చెబుతున్నారు. సంవత్సరం సంవత్సరం దాటిపోతే ప్రాజెక్టు పనుల అంచనా వ్యయం మారిపోతోందని, ఎక్స్‌కవేషన్ పేరుతో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని ఎంత పెద్ద కాంట్రాక్టరైనా సరే వాళ్ల మీద చర్యలు తీసుకునే విధంగా ఒక కార్యక్రమాన్ని చేపట్టాలని మంత్రి గారు ఇందాక చెప్పడం జరిగింది. సాగునీటిని పొదుపు చేసుకోవాల్సిన అవసరముంది. అదే విధంగా ఇతర ప్రాంతాలను కాపాడుకోవాల్సిన అవసరం కూడా మనకుంది. ఎందుకంటే మా ప్రాంతమంటే ఇతరులకు అసూయ. మా ప్రాంతం గొర్రె తోక బెత్తెడు లాగే, నీళ్లైతే ఉన్నాయి గానీ పేరుకే డెల్టా ప్రాంతం అని చెప్పుకుంటున్నాం. కానీ రైతుకు దిగుబడి ప్రతి సంవత్సరం తగ్గిపోతోంది. అందుకే డెల్ట ప్రాంతం ఆధునీకీకరణ జరగాలి. డెల్టా ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. డెల్టా ప్రాంతానికి సాగునీరు రావాలంటే డెల్టా ప్రాంతాన్ని ఆధునీకరించాలి. గౌరవ మంత్రి గారు ప్రత్యేక దృష్టి సారించి ఆధునీకీకరణ పనులు వేగవంతంగా పూర్తిచేయుటకు అవసరమైన చర్యలు సత్వరమే తీసుకోవాల్సిందిగా తమరి ద్వారా వారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: ఈ సందర్భంగా రెండు అంశాలను సభ దృష్టికి తీసుకురావల్సివస్తోంది. ఒకటేమిటంటే, 2004వ సంవత్సరం తరువాత రాయలసీమ ప్రాంతంలో శంఖుస్థాపన చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులన్ని కూడా కృష్ణా జలాల్లో సర్ప్లస్ వాటర్ పైన ఆధారపడి చేసినటువంటివే. ఈ సందర్భంగానే ఆనాడు ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు సర్ప్లస్ కృష్ణా జలాల మీద హక్కులు కోరబడడం లేదని ఒక లెటర్ ఇచ్చిన మాట కూడా వాస్తవం.

రెండవ అంశమేమిటంటే, బ్రిజేష్ కుమార్ గారు బెంచ్ పైనే ఉండి వివిధ రాష్ట్రాల యొక్క వాదనలు వినేటప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాదనలు చాలా బలహీనంగా ఉన్నాయి, సరిగా అవగాహనలేకుండా వాదిస్తున్నారని చెప్పిన మాట వాస్తవం. నాకు తెలిసినటువంటి రెండు అంశాలను సభ దృష్టికి తీసుకురావల్సిన అవసరముందనే ఉద్దేశంతో ప్రస్తావించాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, తమరు చెప్పిన అంశాల్లో చిన్న క్లారిఫికేషన్ కూడా ఇవ్వాలి. మీరు చెప్పింది కరెక్ట్ సార్. ఆ లెటర్ ఏ కారణం చేత ఇవ్వాలని చెప్పింది? అప్పుడు టోటల్‌గా ప్రాజెక్టును నిర్మించొద్దని అన్నప్పుడు ఏదో రకంగా ముందైతే ప్రాజెక్టును నిర్మించుకోవాలనే సదుద్దేశంతో ఇచ్చినటువంటి లెటర్ దానితో పాటు అదే ఉద్దేశంతో 1994 నుంచి 2004 వ సంవత్సరం వరకు మంచి ఉద్దేశంతో ప్రాజెక్టుల నిర్మాణం జరిగి ఉండి ఉంటే, ఈనాడు ట్రిబ్యునల్‌కు అడ్డులేకుండా అస్యూర్డ్ వాటర్ వచ్చి ఉండేది. ఆ అంశం గురించి తమరు ఒకసారి ప్రభుత్వానికి గుర్తుచేయాల్సి ఉందనేది మా అభిప్రాయం.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి: అధ్యక్షా...........

మిస్టర్ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారు మీరు కూర్చోండి. మాట్లాడండి కృష్ణమూర్తి గారు......

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి (పత్తికొండ): అధ్యక్షా, శ్రీకాంత్ రెడ్డి గారు ఇందాక కొంచెం పొరపాటుగా మాట్లాడారని అనుకుంటున్నాను. ఆనాడు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి కారు పైన చెప్పులు విసిరారని చెప్పిన మాట వాస్తవం కాదు. శ్రీకాంత్‌రెడ్డి గారు తప్పుగా చెప్పారు. వాస్తవానికి చెప్పులు వేసిందెవరు? రాజశేఖరరెడ్డి గారు ఆనాటి భారత ప్రధానమంత్రి గారైన స్వర్గీయ శ్రీ పి.వి.నరసింహరావు గారి పైన ఆనాటి ముఖ్యమంత్రిగారైన స్వర్గీయ శ్రీ కోట్ల విజయభాస్కరరెడ్డి గారి పైన బహిరంగసభలో కడపలో చెప్పులు వేయించారు.

శ్రీ కాలువ శ్రీనివాసులు: అధ్యక్షా.............

మిస్టర్ స్పీకర్: మాట్లాడండి శ్రీనివాసులు గారు........

శ్రీ కాలువ శ్రీనివాసులు (రాయదుర్గం): అధ్యక్షా, గౌరవ సభ్యులు, శ్రీకాంత్ రెడ్డి గారు ప్రతి ప్రాజెక్టు మీద చర్చిద్దామని చెప్పారు. చాలా సంతోషం. ప్రతి ప్రాజెక్టు మీద చర్చించనక్కర్లేదు. కడప జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన ప్రాజెక్టు గాలేరు - నగరి ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టు పనుల్లో గామన్ ఇండియా కంపెనీ పెద్దలు టెండర్లు దక్కించుకుంటే, గామన్ ఇండియా ఎక్కడ కనిపించదు. గామన్ ఇండియా అంటే రాజు గారి బావమరిదే అందరికి కనిపిస్తాడు. ఈ సందర్భంగా మీ అందరికి చెబుతున్నాను. అట్లాగే ఆ ప్రాజెక్టు నిర్మాణానికి గాను ఇప్పటి వరకు నాలుగు వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు హెడ్ వర్క్స్ పనులు కూడా పూర్తి కాలేదు. ఎక్కడో వత్తులూరు దగ్గర ఒక రిజర్వాయర్ నిర్మించారు. వత్తులూరు రిజర్వాయర్ ఎవరికోసం కట్టారో సభ్యులు శ్రీకాంత్ రెడ్డి గారికి బాగా తెలుసు. ఎర్రచందనం స్మగ్లింగ్‌తో సంబంధం ఉన్న ఒక నాయకుడి గ్రామ పరిసరాల్లో వత్తులూరు రిజర్వాయర్‌ను నిర్మించారు. రేణిగుంట దగ్గర శ్రీనివాస రిజర్వాయర్ ఎవరి కోసం కట్టారో మిత్రులు శ్రీకాంత్ రెడ్డి గారు చెబితే బాగుంటుంది. మీరు ప్రతి ప్రాజెక్టును గురించి చర్చిద్దామంటే చర్చిద్దాం.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, ప్రత్యేకించి నా పేరు ప్రస్తావించారు, మాట్లాడే అవకాశం కల్పించండి.

మిస్టర్ స్పీకర్: ఇరిగేషన్ మినిస్టర్ గారూ..

శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు: అధ్యక్షా, తొమ్మిది సంవత్సరాల తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 1994వ సంవత్సరం నుంచి 2004వ సంవత్సరం వరకు సాగునీటి రంగంలో రూ. 10,394.00 కోట్లు ఖర్చు చేయగా, నారా చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 10,60,000 ఎకరాలకు సాగు నీరు అందించడం జరిగింది.

(ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం)

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారు, ఒక నిమిషం కూర్చోండి. శ్రీకాంత్ రెడ్డి గారు మీరు మాట్లాడండి.............

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, కాలువ శ్రీనివాసులు గారు చెప్పినటువంటి మాటల్లో మొదటిది "మిత్రుడికి తెలుసు" అని చెప్పాడు. కాంట్రాక్ట్ విషయంలో గానీ, నీ తప్పు ఫలానా చోట ఉందని చెప్పినప్పుడు గానీ, తప్పుడు పనులు చేసినట్టుగా ఋజువు చేసిన మరుక్షణమే రాజకీయాల్లోనుంచి తప్పుకునేందుకు సిద్ధమే. ఎర్రచందనం స్మగ్లర్ల గురించి శ్రీనివాసులు గారు ఒక మాట మాట్లాడారు. కానీ, ఎర్రచందనం సబ్జెక్ట్‌ను రేపటి షార్ట్ డిస్కషన్‌లో టేకప్ చేయండి.

ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సూత్రధారులెవరు? ఎక్కడి నుంచి తరలిస్తున్నారు? అన్ని విషయాలను చర్చించడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

అధ్యక్షా, రాజశేఖరరెడ్డి గారు వత్తులూరు వెళ్లిన సందర్భంగా అక్కడి ప్రజానీకం కోరిక మేరకు వత్తులూరు రిజర్వాయర్‌ను నిర్మించారు. అదే విధంగా శ్రీనివాసపురం రిజర్వాయర్ గురించి కూడా కాలువ శ్రీనివాసులు గారు ప్రస్తావించారు. వెనుకబడినటువంటి ఒక నియోజకవర్గంలో ఆ శ్రీనివాసపురం రిజర్వాయర్ అన్నది హంద్రి- నీవా ప్రాజెక్టు అనంతపురం జిల్లా నుంచి కడప జిల్లా మీదుగా చిత్తూరు జిల్లాలో ప్రవేశిస్తుంది. కడప జిల్లాలో స్టోరేజ్ చేసుకోవడానికి ఎక్కడా అవకాశం లేదనే ఉద్దేశంతో రేణిగుంట దగ్గర శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను నిర్మించడం జరిగింది.

...

మీరు రేపు షార్ట్ డిస్కషన్‌కు అనుమతిస్తే ఎర్రచందనం స్మగ్లింగ్ ఎవరు చేస్తున్నారో, ఎట్లా చేస్తున్నారో ప్రతి ఒక్క అంశాన్ని చెప్పడానికి మేము సిద్ధంగా ఉంటాం. వత్తులూరు ప్రాజెక్ట్ అనేది అక్కడి ప్రజలు రాజశేఖర రెడ్డి గారు వెళ్లినప్పుడు ప్రజలు కోరిక మీరకు ఆ ప్రాజెక్టు ఇచ్చారు. శ్రీనివాసపురం ప్రాజెక్టు గురించి మాట్లాడారు. వెనుకబడిన నియోజక వర్గంలో శ్రీనివాసపురం రిజర్వాయర్ అనేది హంద్రీనీవా ప్రాజెక్టు అనంతపురం నుండి కడప జిల్లా మీదుగా చిత్తూరు జిల్లాకు వెళుతుంది. కడప జిల్లాలో స్టోరేజ్ చేసుకోడానికి ఎక్కడా అవకాశం లేదు అని పదే పదే విన్నవించిన తరువాత, ఒక్కచోటన్న స్టోరేజి చేసుకునే అవకాశం ఉండాలని గట్టిగా పట్టుబట్టడంతో ఒక ప్రాజెక్టు ఆరోజు ఇవ్వడం జరిగింది. దానిని కూడా ఎగతాలిగా మాట్లాడితే ఎలాగు అధ్యక్షా.

మిస్టర్ స్పీకర్ : ఓ కే. సూర్యారావు గారు.. బ్రీఫ్ ప్లీజ్.

శ్రీ జి.సూర్యారావు (రాజోల్) : మేము గోదావరి మీద ఆధారపడినటువంటి రైతులు, రైతు కూలీలు ప్రజలందరం. కృష్ణానది దాని పరివాహక ప్రాంతాల ప్రజల ఆందోళన చేసిన తరువాత వచ్చిన బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ కానీ వీటి నేపథ్యం కూడా నాకు తెలుసు అధ్యక్షా. ఎంతో పోరాడితే కానీ ట్రైబ్యునల్ రాలేదు. ఉభయ గోదావరి జిల్లాల్లో, ఈరోజు గోదావరి నది మీద లక్షలాది ఎకరాలు ఆధారపడి ఉన్నాయి. ఇదే పోలవరం ప్రాజెక్టు మీద రోజ 5, 6 జిల్లాలు ఆధారపడి ఉన్నాయి. భవిష్యత్‌లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అవుతుంది అది తరువాత విషయం. ధవళేశ్వరం దగ్గర 150 సంవత్సరాల క్రితం కాటన్ మహాశయులు ఆనకట్ట కాట్టారు. ఆ ఆనకట్ట దిగువున ఉన్న రెండు జిల్లాలు సుమారు 20 ఎకరాల భూమిని సాగు చేస్తాం.

ధవళేశ్వరం ఆనకట్ట ఎగువున ఉన్న స్టోరేజ్ నీరు అది అస్యూర్డ్ వాటర్ కాదు. ఎప్పుడైనా గోదావరి వరదలు వచ్చినప్పుడు వృథాగా 2000 టిఎంసీల నీరు సముద్రంలో పోతూ, కేవలం 4

కానీ, 3 టిఎంసీలు నీరు మాత్రమే నిలువు ఉండే బ్యారేజ్. ఆ బ్యారేజ్ నీరు మా ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 15 లక్షల ఎకరాలుకు సరిపోవడం లేదు. బహుశా మా రైతులు కూడా రేపు డిసెంబరు నుండి ఆందోళనతో ఉంటారు. గతంలో మీరు మేము మనందరం కూడా ఉభయ రాష్ట్రాల్లో ఉన్నాం కనుక తెలంగాణ ప్రాంతంలో ఉన్నటువంటి అధికారులను ఆ ప్రాంత మన శాసనసభ్యులను మంత్రులను ఒప్పించి, కాస్తో కూస్తో, ఒక టిఎంసీనో అర టిఎంసీనో పట్టుకెళ్లే వాళ్లం.

MR.SPEAKER : Please conclude.

శ్రీ జి.సూర్యారావు : ఇవేళ మాకు ఒక అస్యూర్డ్ వాటర్ లేదు. రామచంద్రాపురం కానీ, అనపర్తి కానీ, పాలమూరు, కొత్తపేట, అమలాపురం, ముమ్మిడి వరం, గన్నవరం, రాజోలు కానీ డెల్టా ప్రాంతాలే. మాకు ఒక్క పంటకే ఎష్యూర్డ్ వాటర్ లేదు. ఏదో ఆ భగవంతుడు దయవల్ల వర్షం వస్తే, లేదా వరదలు వస్తే ఆనాడు ఆ కాటన్ మహాశయుడు కట్టినటువంటి బ్యారేజ్‌కి ఎగువన నిల్వ ఉంచుకున్న కొద్ది పాటు నీళ్ల మాత్రమే ఉన్నాయి.

MR.SPEAKER: What do you want?.

శ్రీ జి.సూర్యారావు : గౌరవ మత్రిగారిని కోరేదేమనగా, ఈ బ్యారేజి దిగువున గౌతమీ నది మీద కానీ, వశిష్టా నది మీద కానీ, గోదావరి దిగువున చిన్న, చిన్న ఆనకట్టలు కట్టి మల్టీస్టోరేజ్ పెట్టుకో గలిగితే మంచిది. ఈ రైతాంగం లాగ మేము పోరాడలేము.

MR.SPEAKER:  Yes, Varma garu...

శ్రీ ఎస్‌విఎస్ఎన్.వర్మా (పిఠాపురం): మాట్లాడటానికి అవకాశం ఇచ్చిన స్పీకరు గారికి నమస్కారాలు. మా నియోజకవర్గంలో. సుమారు 30000 ఎకరాలకు గోదావరి కొంత ఉంది. మంత్రి గారిని కోరేదేమంటే ఇయర్లీ మెయింటెనెన్స్ పెట్టాలి. పూడిక పట్టేసి వాటర్ మువ్‌మెంట్ లేదు. ఇప్పుడు చెప్పుకోవలసి వస్తే గత పది సంవత్సరాలు నుంచి కూడా డిస్కో పైప్‌లైన్ వాటర్ లిఫ్ట్ చేయడం లేదు. పంప్స్ పనిచేయడం లేదు. ఈరోజు మా రామకృష్ణుడు గారి ద్వారా మంత్రి గారి దృష్టిలో పెట్టగానే వెంటనే 10 సంవత్సరాలు నుండి పెండింగ్‌లో ఉన్న పంప్స్‌ను ఆన్ చేయించిన ఘనత తెలుగుదేశం పార్టీది, ముఖ్యమంత్రి గారిదని చెప్పడం జరుగుతుంది. రోజుకు 200 క్యూసెక్స్ నీరు పిఠాపురం సివారు ఆయకట్టుకు సేవ్ అవుతుంది.

దానికంటే ముందుగా మాకు ఏలేరు ప్రాజెక్టు ఉంది. ఏలేరు ప్రాజెక్టులో 2004 లో అప్పుడున్న కాంగ్రెస్ రాజశేఖర రెడ్డి గారి పాదయాత్రలో ఏలేరు ఆధునీకరణ చేస్తామని మా దగ్గర ఓట్లు వేయించుకున్నారు. 2004 నుండి 2008 వరకు దాని ఊసే ఎత్త లేదు. ఈ లోపల

మేమే సివారు ఆయకట్టుదారులం లక్ష సంతకాలుతో ఉద్యమం చేశాం. ఏలేరు ఆధనీకరణ చేయండి రైతులు బాధపడుతున్నారు, పొలాలు పోతున్నాయని చెప్పి పోరాటాలు చేస్తుంటే, మళ్లీ 2009 ఎలక్షన్స్‌కు ముందు 2008లో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర రెడ్డి గారు ఏం చేశారంటే, ఒక పౌండేషన్ స్టోన్ పత్తిపాడులో వేశారు. కొన్ని వందల, వేల, లక్షల కోట్లుతో జలయజ్ఞం అన్నారు తప్ప, నాలుగు నియోజక వర్గాలకు చెందిన ఏలేరు ఆధునీకరణ జరుగలేదు. కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చే సరికి..

MR.SPEAKER: Please conclude.

రెండు నిమిషాలు సార్, నా క్వశ్చన్ కూడా పోస్ట్‌పోన్ చేశారు. రెండు నిమిషాలు సార్. కిరణ్ కుమార్ రెడ్డి గారు వచ్చే సరికి మేము వేలాది మంది రైతులతో కలెక్టర్ ఆఫీసు ముట్టడి, పాదయాత్ర చేశాక, టెయిల్ ఎండ్‌కు శాంక్షన్ ఇవ్వకుండా, హెడ్ రెగ్యులేటర్ మోడరనైజేషన్‌కు శాంక్షన్ ఇచ్చారు సార్. హెడ్ రెగ్యులేటర్‌లో పని మొదలు పెడితే, టెయిల్ ఎండ్ మొదలెట్ట కుండా ఉంటే మా నియోజక వర్గం ఫ్లడ్‌లో కొట్టుకు పోయే పరిస్థితి వస్తుంది. అందుచేత 10 సంవత్సరాలుగా లక్షల కోట్ల, ధనయజ్ఞం, జలయజ్ఞం అన్నారు తప్ప, ఒక ఏలేరు ఆధునీకరణకు సంబంధించి ఆరోజుల్లో రూ.140 కోట్లతో పూర్తి కావల్సిన ఏలేరు ఆధునుకీకరణ చేయలేక పోయారు.

(మైక్ కట్ చేయబడింది. )

(ఈ సందర్భంలో సభ్యులు శ్రీ ఎస్‌విఎస్ఎన్.వర్మ మైకు లేకుండా మాట్లాడుతూనే ఉన్నారు)

MR.SPEAKER: Please be seated. Please conclude. Yes, Minister for Irrigation. వర్మ గారు దయచేసి కూర్చోండి. బుచ్చయ్య చౌదరి గారు....

(ఈ సందర్భంలో నీటిపారుదల శాఖా మంత్రి శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు గారు మాట్లాడేందుకు పైకి లేచి, వెంటనే తమ స్థానంలో కూర్చున్నారు.)

శ్రీ జి.బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి రూరల్): రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు నడుస్తున్న విషయం మంత్రిగారికి తెలుసు. అయితే అవి ప్రారంభించిన తరువాత వాటి మెయింటెనెన్స్ కోసం టెక్నికల్ అసిస్టెంట్స్‌ను కానీ, కాలువల వెయింటెనెన్స్ కోసం ఎలాంటి నిధులు కేటాయింపు చేయక పోవడం వలన ఈ టార్గెట్స్ రీచ్ కాని పరిస్థితి మనం చూస్తునారు. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టినప్పటికీ కనీసం 1/4 వంతు భూమి కూడా సాగులోకి రాని పరిస్థితి కనపడుతుంది. ముఖ్యంగా మా జిల్లాలోనే ఉంది. నెహ్రూ గారికి కూడా తెలుసు. చాగల్

నాడు, చాగల్‌నాడు రెండో పథకం, పురుషోత్త పట్నం ఇవన్నీ ఉన్నాయి. కనీసం 60 వేల ఎకరాలకు టార్గెట్ చేస్తే, 30 వేల ఎకరాలకు కూడా సాగులోకి రావడం లేదు.

ఒక ప్రాజెక్టు అయితే ఈ మధ్య కాలంలో దాదాపు 4 సంవత్సరాల కిందట పూర్తి చేశారు. కేవలం 300 ఎకరాలు సాగు అవుతుంది. 38,000 ఎకరాలకు టార్గెట్ చేసి రూ.80.00 వేల కోట్లు ఖర్చు పెట్టారు. కనీసం 300 ఎకరాలు కూడా సాగులోకి రాని పరిస్థితి ఉంది. ఇలాంటివి రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులు ఉన్నాయి. నేను మంత్రిగారిని కోరేది ఒకటి, రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాలు టార్గెటెడ్‌గా నడుస్తున్నాయా లేదా, వాటి ద్వారా సాగ వలసిన విస్తీర్ణాన్ని పూర్తిగా సాగులోకి తేవడం కోసం ఎలాంటి చర్యలు చేపడతారు, టెక్నికల్ పర్సన్స్‌ను కానీ, లైనింగ్‌కు కానీ, కాలువల మెయింటెనెన్స్ కానీ ఎలాంటి చర్యలు చేపడతారో తెలియజేయవలసిందిగా మంత్రి గారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ : మంత్రిగారు..

శ్రీ దేవినేని ఉమా మహేశ్వర రావు : అధ్యక్షా, సోదరులు, గౌరవ సభ్యులు శ్రీకాంత్ రెడ్డి గారు, బుచ్చయ్య చౌదరిగారు, శ్రీధర్ రెడ్డి గారు, వర్మ గారు, సూర్యారావు గారు, ఇంకా పెద్దలు చెప్పినవి అన్నీ కూడా నోట్ చేసుకున్నాను. తప్పకుండా పరిశీలిస్తాను. ఏదైతే, 9 సంవత్సరాలు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉండగా రూ.10,394కోట్లు ఖర్చుపెట్టి 10,60,000 ఎకరాలకు నీరు ఇస్తే, ఎకరానికి అయిన ఖర్చు రూ.98,057. ఈవేళ వీళ్లు రూ.41,654 కోట్లు ఖర్చు పెట్టి 4,06,722 ఎకరాలు ఒక ఎకరానికి ఖర్చు పెట్టారు. అధ్యక్షా, రూ.98057 ప్రజల సొమ్ము ఖర్చు పెట్టిన ముఖ్యమంత్రి సమర్థవంతుడా, రూ.4,06,722 ఖర్చుపెట్టిన రాజశేఖర రెడ్డి కరెక్టా అనేది విజ్ఞులైన ఆంధ్రప్రదేశ్ ప్రజలే దీనిని తెలుసుకుంటారు.

ఎందుకంటే, రూ.98000 ఎక్కడా రూ.4,06,000 ఎక్కడా ఇది అర్థం చేసుకోవాలి. ప్రజలు కట్టిన పన్నులు డబ్బులు అధ్యక్షా, మీ జేబులో డబ్బులో నా జేబులో డబ్బులో కాదు. ప్రజలు కష్టపడి చమటోర్చి కట్టిన పన్నుల డబ్బుల్లో లక్షల, వేల కోట్లు మనం ఖర్చు పెడుతున్నాం. అదేవిధంగా శ్రీధర్ రెడ్డి గారు చెప్పిన దాంట్లో ఆల్మట్టి ప్రాజెక్టు దేవగౌడ గారు ప్రధాన మంత్రిగా ఉండి ప్రాజెక్టు ఎత్తు పెంచుతుంటే, జ్యోతిబసు గారు, లల్లూ ప్రసాద్ యదవ్ గారు, బిజుపట్నాయక్ గారు, ముఖ్యమంత్రులతో కమిటీ వేయటమే కాకుండా సుప్రీం కోర్టుకు వెళ్లి ఆల్మట్టి డ్యాం ఎత్తును నిలువరించాము. అప్పడు సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందంటే శ్రీధర్‌రెడ్డి గారు కొత్తగా వచ్చారు. ఇది మా పంచాయితీ కాదని సోమయాజులు మైసూరారెడ్డి గారిని అడగండి చెబుతారు. మీరు ట్రైబ్యునల్ ముందు చెప్పకోండి మూడు రాష్ట్రాలు కూర్చోమంటే ఆ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ ముందు చర్చలు జరిగాయి. వాదనలు సరిగా వినిపించలేకపోతే, 519 మీటర్లు ఉన్న ఆల్మట్టి ఎత్తు తమ్ముడూ శ్రీధర్ 524.3కు పెరిగింది.

...

MR. SPEAKER: Please Address the Chair.

శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావుః ఆల్మట్టి ఎత్తు 519 మీటర్ల నుంచి 524.3 మీటర్లకు పెరిగింది. 2005వ సంవత్సరంలో తుంగభద్ర మోడరైనేజేషన్ పనులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు. 2007, 2009 సంవత్సరాల్లో రూ.50, 70, 90 కోట్లు అయ్యాయి. ఇవాళ కాంట్రాక్టరు కర్నాటక ప్రభుత్వందగ్గర చేరి, 15 సెంటీమీటర్లు ఎత్తును పెంచుతుంటే, ఈ సిమెంట్ జాకెటింగ్ చేస్తుంటే, రేపు కెసి కెనాల్‌కు 2,00,000 ఎకరాలకు సాగునీరు, తాగునీరుకు ఇబ్బంది వస్తుంది. అప్పటికప్పుడు శ్రీ కె.ఇ.కృష్ణమూర్తిగారూ నేను కలిసి, కర్నూలు కలెక్టరుని ఆ ప్రాంతానికి పంపించి, ఆ పనులన్నీ ఆపించాము. ఆ గుత్తేదారులకు కట్టబెట్టింది రాజశేఖర్‌రెడ్డిగారి ప్రభుత్వంలో జరిగింది కాదా? ఈ వాస్తవాలు ఇలా ఉన్నాయి.

తుంగభద్ర High Level Canal (HLC), Low Level Canal (LLC) లు రాయలసీమకు గుండెలాంటివి. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్, మన రాష్ట్రం సరైన వాదనలు వినిపించలేనందున, మనకు న్యాయం జరగలేదని, వారి తీర్పులోనే చెప్పారు. కెనాల్ పైభాగాన కర్నాటక రాష్ట్ర రైతులు, వాళ్ల ఇష్టా రాజ్యంగా సాగుచేసుకుంటున్నారు. ఇవాళ మనకు రావలసిన నీళ్లు అన్నీ కూడా వాళ్లకి వెళ్తోంటే, వాళ్ల సెక్రటరీస్‌తో మాట్లాడి రోజూ మానిటరింగ్ చేస్తూ, మనకు రావలసిన నీళ్లను తీసుకొస్తున్నాం. కర్నాటక ప్రభుత్వంతో మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు మాట్లాడినా కూడా వాళ్లు ఒప్పుకోవటంలేదు. తుంగభద్ర బోర్డు కూడా Krishna Dispute Water Management Tribunal ముందుకు వస్తుంది. తప్పకుండా మోడరైనేజేషన్ పనులనుగాని, హెచ్ఎల్‌సి, ఎల్ఎల్‌సి మోడరనైజేషన్ పనులను వేగవంతం చేయడంలో జాగ్రత్తలు తీసుకొంటాం.

అధ్యక్షా, చెరుకూరి వీరయ్యగారు, రోశయ్యగారు, సుబ్బారావుగారు వీళ్లతో నిపుణుల కమిటీని నియమించడం జరిగింది. సభ్యులు శ్రీ సూర్యారావుగారు చెప్పినట్టుగా గోదావరి డెల్టా మోడరనైజేషన్‌కు సంబంధించిన పనులతోబాటు, కృష్ణా డెల్టాకు సంబంధించిన పనులను కూడా ఎక్స్‌పర్ట్ కమిటీలో చర్చిస్తాము. ఎక్స్‌పర్ట్ కమిటీ తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా ట్రైబ్యునల్ ముందు ఉంచుతాం.

రాష్ట్రం కలిసి ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగారు నిర్ణయం తీసుకుని రాయలసీమకు, తెలంగాణాకు, ఆంధ్రాకు నీళ్లు ఇచ్చేవాళ్లు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పిట్టపోరు పిట్టపోరు పిల్లి తీర్చిందని, ఈరోజు ఏమైందంటే, కృష్ణా వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు కొత్తగా అమలులోకి వచ్చింది. కేంద్ర మంత్రివర్యులు గౌరవనీయులు ఉమాభారతిగారు ఈబోర్డుకు ఛైర్మన్‌గా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలంగాణ ముఖ్యమంత్రి సభ్యులుగా ఉంటారు. కృష్ణాడెల్టాకు మంచినీళ్లు కావాలంటే రెండు రాష్ట్రాల ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు కూర్చోవాలి.

రెండు రాష్ట్రాల ప్రిన్సిపల్ సెక్రటరీస్ కూర్చోవాలి. మళ్లీ మాకు కుదరకపోతే అపెక్స్ కౌన్సిల్‌వాళ్లు నిర్ణయాలు తీసుకోవాలి. కొత్త ప్రాజెక్టులు కట్టాలన్నా, నీటి నిర్ణయాల్లో తేడా ఉన్నా, మాట్లాడుకోవాలన్నా ఇంత తతంగం జరగాల్సివుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రాష్ట్ర విభజన కుట్రతో ఇవాళ మన నీటిహక్కులమీద కూడ ఈవిధమైే పరిస్థితి వచ్చింది.

పెన్నాడెల్టా ఆధునికీకరణ కూడా చాలా ముఖ్యమైనది. పెన్నాడెల్టాకు నిధులు కేటాయించటంలో, పనులు చేయించటంలో తప్పకుండా కృషిచేస్తాం. సోమశిల, కండలేరు జలాశయాలకు రాబోయే రోజుల్లో గోదావరి జలాలను inland water system లో బకింగ్‌హాం కెనాల్ ద్వారా తరలించే అవకాశాలను పరిశీలిస్తున్నాం. ప్రకాశంబ్యారేజీ-ఏలూరు కాలువను, ధవళేశ్వరం వరకు inland water management ని అభివృద్ధి చేయడం ద్వారా, గోదావరి బేసిన్ నుంచి పెన్నా బేసిన్‌కి నీళ్లు తరలించే విషయమై కూడా సమగ్రమైన ప్రణాళికలను రూపొందించమని చెప్పడంజరిగింది.

అదేవిధంగా, దుమ్ముగూడెం ప్రాజెక్టు గురించి తెలంగాణ రాష్ట్రంతో మాట్లాడి... అధ్యక్షా, ప్రాణహిత-చేవెళ్ల, ఎల్లంపల్లి, ఇచ్చంపల్లిలో గాని.. మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు బాగా తిన్నారు. మన అదృష్టం. ఆ ప్రాజెక్టులన్నీ తెలంగాణకు వెళ్లాయి. లేకపోతే ఇవాళ అవన్నీ చదవాలంటే ఇంకో గంట పట్టేది. మొన్న కూడా వర్మగారు ఏలేరులో నీళ్లు కావాలంటే, వెంటనే గోదావరి నుంచి లిఫ్ట్ చేసి, ఆ ప్రాంత రైతాంగాన్ని కాపాడాం. శాశ్వతంగా పరిష్కారం కావాలని అడుగుతున్నారు. తప్పకుండా ఏలేరు మోడరనైజేషన్ పనులను కూడా వేగవంతం చేస్తాం. కాబట్టి, ఈ పెండింగ్ ప్రాజెక్టులకు సంబంధించి, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్ని సభను ఆమోదించమని చెప్పి కోరుకుంటూ మీద్వారా సెలవు తీసుకొంటున్నాను.

MR. SPEAKER: Minister for Panchayat Raj.

శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం): అధ్యక్షా, పంచాయతీరాజ్ డిమాండ్స్ మీద సభ్యులు శ్రీ జగ్గారెడ్డిగారు, శివరామరాజుగారు, బొండా ఉమామహేశ్వరరావుగారు, ఆనందరావుగారు మాట్లాడుతూ మంచి సూచనలు చేయడం జరిగింది. వాటన్నిటికీ కూడా చివర్లో సమాధానం చెబుతాను. ముందుగా టైం లేదు కాబట్టి, కొన్ని ముఖ్యమైన విషయాలను చెప్పి ముగిస్తాను.

పంచాయతీరాజ్ డిమాండ్ 31ని ఆమోదించవలసిందిగా సభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ పంచాయతీరాజ్ కొరకు 2014-15 సంవత్సరానికి రూ.5,522.32 కోట్లు కేటాయించడం జరిగింది. దీంట్లో మూడు విభాగాలున్నాయి. (1) పంచాయతీరాజ్ విభాగం, (2) గ్రామీణ మంచినీటి సరఫరా మరియు పారిశుధ్యం విభాగం, (3) పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం. ఈ మూడు విభాగాల ద్వారా మొట్టమొదటిది కమీషనరేట్ ఆఫ్

పంచాయతీరాజ్ విభాగం. ఈ విభాగం ద్వారా గ్రామపంచాయతీల అభివృద్ధి, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మంచినీటి సదుపాయం కల్పించడం, పారిశుధ్యం, ఇంటి పన్నులను వసూలు చేయడం, వీధిదీపాల ఏర్పాటు మరియు నిర్వహణ, ప్రతీ ఇంటికి టాయిలెట్‌ను నిర్మించాలనే ఒక సంకల్పం. వీటికోసమని 13వ ఆర్థికసంఘం నిధులు, రాష్ట్ర ఆర్థికసంఘం నిధులను ఉపయోగించి ఈ పంచాయతీలను అభివృద్ధిచేయడం జరుగుతుంది. అదేవిధంగా పై నిధులను జిల్లా పరిషత్, మండల పరిషత్ మరియు గ్రామ పంచాయతీలకు 20 శాతం, 12.5 శాతం, 67.5 శాతం నిష్పత్తిలో కేటాయించడం జరుగుతుంది.

ప్రతీ సంవత్సరం జిల్లాల వారీగా బాగా పనిచేస్తున్న గ్రామపంచాయతీలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా గుర్తించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడంజరిగింది.

రెండవ విభాగం ఏమంటే, గ్రామీణ నీటిసరఫరా మరియు పారిశుధ్యం. ఈ విభాగం కింద ప్రతీ గ్రామానికి కూడా పరిశుద్ధమైన నీటిని అందించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. వీటికోసం ఈ సంవత్సరంలో పూర్తయి, పనిచేయనటువంటి 1300 వాటర్ స్కీమ్‌లు వినియోగంలోకి వచ్చేవిధంగా పనులు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

అదేవిధంగా ప్రతీ గ్రామానికి మంచినీరు ఇవ్వాలనే ఉద్దేశంతో దానికి అవసరమైన పైప్‌లైన్‌ను నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఎక్కడైతే ఫ్లోరైడ్ కింద గ్రామాలున్నాయో, మంచినీటికి అవకాశం లేకుండా ఉన్నాయో, అటువంటి గ్రామాల్లో మొదటి దశగా స్వర్గీయ ఎన్.టి.రామారావుగారి పేరుమీద ఎన్.టి.ఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా పరిశుభ్రమైన నీరు ఇవ్వాలని చెప్పి, నిర్ణయం తీసుకోవడం జరిగింది.

అలాగే రాబోయే 2044 సంవత్సరం నాటి జనాభాను దృష్టిలో పెట్టుకుని, ప్రతీ గ్రామానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వాలనే ఆలోచనతో మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒక వాటర్ గ్రిడ్‌ను ఏర్పాటుచేయాలని చెప్పి నిర్ణయం తీసుకోవడం జరిగిందని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

పై మంచినీటి పథకాలకు, చేతి పంపుల నిర్వహణకు, ఎన్.టి.ఆర్. సుజల స్రవంతి పథకం నిర్వహణకు, నిరుపయోగంగా ఉన్న స్కీమ్‌లను పునరుద్ధరణకు స్టేట్ ప్లాన్, 13వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించడం జరుగుతుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా ఈ సంవత్సరం ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు NRDWP Programme ద్వారా కేంద్రం నుంచి రావలసిన నిధులను అధిక శాతంలో తీసుకొచ్చి, ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందని సవివరంగా మనవి చేస్తున్నాను.

మూడవ విభాగం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం. ఈ విభాగం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, వంతెనలు మరియు స్కూలు భవనాలు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీ భవనాలు మరియు వాటికి కావలసిన సదుపాయాలు కల్పించడంలో ఈ విభాగం పని చేస్తుంది.

...

అధ్యక్షా, మనరాష్ట్రంలో 76,895 కి.మీ. పొడవైన పంచాయితీరాజ్ రోడ్లు ఉన్నాయి. సిమెంట్ మరియు బి.టి.రోడ్లు 23,344 కి.మీ., డబ్ల్యూ.పి.ఎం.రోడ్లు 10,420 కి.మీ., గ్రావెల్ మరియు ఎర్త్ రోడ్లు 43,131 కి.మీ. ఉన్నాయని తమరిద్వారా గౌరవసభ్యులకు తెలియజేస్తున్నాను. రాబోయే ఐదుసంవత్సరాల్లో రూ.1500కోట్లతో 5000 కి.మీ.ల మేర మెటల్‌రోడ్లను బి.టి.రోడ్లుగా మార్చాలని ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేసింది. ప్రస్తుతమున్న బి.టి.రోడ్ల పునరుద్ధరణ కోసం రూ.153.75 కోట్ల నిధులను కేటాయించడం జరిగింది. మండలపరిషత్తుల్లో భవనాలు లేనిచోట్ల, భవననిర్మాణాల కోసం రూ.8.88కోట్లు కేటాయించాం. అవసరమైన చోట్ల బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు రూ.94.12 కోట్లు కేటాయించాం. పాఠశాల భవనాల నిర్వహణ కోసం సుమారు రూ.9కోట్లు కేటాయించాం. అదేవిధంగా నాబార్డ్ నిధులుగానీ, ఆర్.ఐ.డి.ఎఫ్., పి.ఎం.జి.ఎస్.వై. వంటి కేంద్రప్రభుత్వ పథకాలు ఉన్నాయి. మన స్నేహశీలి ప్రభుత్వం కేంద్రంలో ఉంది కాబట్టి, అధిక శాతం నిధులు తీసుకువచ్చి, ఈ పథకాలను అమలు చేయాలని మా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంజరిగింది.

అధ్యక్షా, ఇప్పటి వరకూ నామినేషన్‌పై పనులను లక్షరూపాయల వరకు ఇస్తుంటే, దానిని ఐదు లక్షల రూపాయలకు పెంచాలనే ప్రభుత్వ ప్రతిపాదన విషయమై ఇంతకుమునుపు గౌరవసభ్యులు శ్రీ జగ్గిరెడ్డి గారు ప్రస్తావించారు. నేను వారికి ఒక్కటే మాట చెప్తున్నాను. గతంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కూడా అప్పటి ప్రభుత్వం చాలా విషయాల్లో ఈవిధంగానే ముందుకువెళ్ళడంజరిగింది. ఇటీవల రాష్ట్రపతి పాలన విధించిన సమయంలో, గవర్నరు గారు దానిని లక్ష రూపాయలకు పరిమితం చేశారు. అయితే, మా ప్రభుత్వం వచ్చిన తరువాత, నేను పంచాయితీరాజ్ మంత్రిని ఐన తరువాత, ప్రతీ యాభైవేలకీ, లక్ష రూపాయలకీ టెండర్లు పిలవడం ద్వారా, సమయమంతా వృథా చేసేబదులు, సుమారు ఐదు లక్షల రూపాయల వరకు కూడా నామినేషన్ విధానంపై పనులు ఇవ్వాలని కొత్తగా ఒక ప్రభుత్వ ఉత్తర్వు కూడా ఇవ్వడంజరిగింది.

అదేవిధంగా, సభ్యులు శ్రీ శివరామరాజు గారు మాట్లాడుతూ, ఫ్లోరైడ్ గ్రామాల్లో మంచినీటి సరఫరా అంశం గురించి ప్రస్తావించారు. ఈ విషయమ్మై చంద్రబాబునాయుడు గారు ఒక వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేయడానికై ఇప్పటికే ఒక నిర్ణయాన్ని తీసుకున్నారు. దానిద్వారా ప్రతీ గ్రామానికీ, ప్రతీ పట్టణానికీ, ప్రతీ పరిశ్రమకూ కూడా మంచినీళ్ళు ఇవ్వాలని నిర్ణయం ఇప్పటికే తీసుకోవడం జరిగింది. దానిని అమలు చేయడం కోసం ఒక కమిటీని కూడా వేయడంజరిగింది. అంతేకాకుండా, నందమూరి తారక రామారావు గారి పేరుమీద, 'ఎన్టీఆర్ సుజల స్రవంతి' పథకం ద్వారా, ఫ్లోరైడ్ ఉన్న గ్రామాలన్నింటికీ ఈ పథకాన్ని అమలు చేయాలి, దీనికి ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయం తీసుకోవడంజరిగింది.

అదేవిధంగా, సభ్యులు శ్రీ బోండా ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, పారిశుధ్యం గురించి చర్యలు తీసుకోమని కోరారు. చాలా మంచి విషయం చెప్పారు. దానిగురించి ఒక మంచి ఆలోచన చేయడంజరిగింది. రాష్ట్రంలో చాలా గ్రామాలున్నాయి, చాలా పంచాయితీలున్నాయి. అన్ని పంచాయితీలకు ఆర్థికపరమైన ఇబ్బందులున్నాయి కాబట్టి, ప్రతీ మూడు పంచాయితీలకు మధ్యలో ఒక స్థలం కేటాయింపు చేసి, డంపింగ్ యార్డుగా చేయాలనీ, ఆ డంపింగ్ యార్డుకు అయ్యే ఖర్చు ఉపాధి హామీ పథకం ద్వారా చేయాలని కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందని సభకు తెలియజేస్తున్నాను.

అంతేకాకుండా, త్రాగునీటి పథకాల్లో అవినీతి జరిగిందని అన్నారు. వాస్తవం. ఒప్పుకోక తప్పదు. గత పది సంవత్సరాల్లో అనేకమైన ప్రాజెక్టులు కట్టారు. ఆశ్చర్యమే అధ్యక్షా. ఈ వాస్తవాల్ని అందరూ ఒప్పుకోవాలి. ప్రాజెక్టులు కట్టారు. పైప్‌లైన్‌లు వేశారు. కొన్ని కోట్లు ఖర్చు పెట్టారు. కానీ నీటి వనరులు లేవు. నీటి వనరులు లేకుండా ప్రాజెక్టులు ఎందుకు కట్టారో అర్థంకాని పరిస్థితి ఉంది. అధికారులను అడిగితే, వాళ్ళు ఒక్కటే మాట చెప్తున్నారు. ముఖ్యమంత్రి గారు కట్టమన్నారు, కాబట్టి మేము కట్టామని. పోలవరం ప్రాజెక్టు లేకుండా, కాలువలు ఎందుకు త్రవ్వారో? నీటి వనరులు లేకుండా, పథకాలు ఎందుకు పెట్టారో? ఇలాంటి అవినీతులు జరిగాయి. మేము వాటిని రెక్టిఫై చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

గౌరవ సభ్యులు ఆనందరావు గారు పంచాయితీల గురించి ప్రస్తావించారు. గత ప్రభుత్వం, ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయితీలకు ఆర్థిక సహాయం చేస్తామని ప్రకటించారు. ఇప్పటికి పంచాయితీ ఎన్నికలు అయిపోయి ఒక సంవత్సరంపైగా దాటింది. ఆ ప్రభుత్వం ఈ విషయాన్ని మర్చిపోయింది. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, సంబంధిత ఫైల్స్ అన్నీ బయటకు తీసి, ఏకగ్రీవంగా ఎన్నికయిన పంచాయితీలకు ఆర్థిక సహాయం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. దీనికి సుమారు రూ.144కోట్లు ఖర్చు అవుతుంది. 10వ తారీఖున

జరగబోయే కేబినెట్ సమావేశంలో ఆమోదం తీసుకుని, ఆయా పంచాయితీలకు డబ్బులు కేటాయించాలని నిర్ణయించడం జరిగింది.

ఈవిధంగా 2014-15 సంవత్సరంలో చేయతలపెట్టిన కొన్ని కార్యక్రమాలను, బడ్జెట్ సందర్భంగా ఈ సభలో ప్రవేశపెట్టడం జరిగింది. గౌరవ సభ్యులందరూ వీటిని ఆమోదించవలసిందిగా తమ ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గారు, మినిస్టర్ ఫర్ రెవిన్యూ.

శ్రీ కే.ఈ.కృష్ణమూర్తి (పత్తికొండ): అధ్యక్షా, రెవిన్యూ విషయమై సభ్యులు చాలా తక్కువగా మాట్లాడారు. రెవిన్యూశాఖ, రాష్ట్రప్రభుత్వ నిర్వహణలో అత్యంత కీలకమైన శాఖ, అని అందరూ ఒప్పుకోవలసిందే. భూమి అందరికీ అవసరం. ఇది అందరికీ సంబంధించిన విషయం. ఈ భుమి వివరాలని ఏవిధంగా క్రమబద్దీకరించాలనే విషయమై రెవిన్యూశాఖ అనేక ప్రణాళికలను రూపొందించింది. దానిలో 'మీ సేవ' ప్రప్రథమమైనది. ఈ 'మీసేవ' ద్వారా దాదాపు రెండు కోట్ల ఇరవై ఐదు లక్షల పైచిలుకు ప్రజలకు సంబంధించిన అప్లికేషన్‌లను సేకరించడంజరిగింది.

గ్రామాల్లో ఉన్న భూములకు సంబంధించిన దాదాపు రెండు సంవత్సరాల రెవిన్యూ రికార్డులను, చాలా జాగ్రత్తగా డిజిటలైజేషన్ చేయడంజరిగింది. కంప్యూటరైజేషన్ పద్ధతిలో వాటిని జాగ్రత్త చేయడంజరిగిందని మీకు తెలియజేస్తున్నాను. భూమి కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ చేసుకున్న సమాచారం, రెవిన్యూ శాఖకు చేరకపోవడం వల్ల, గ్రామ లెక్కల్లో తేడాలు వస్తున్నాయి. దానివల్ల పౌరులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం.

కార్డు మరియు వెబ్‌ల్యాండ్ :- వెబ్‌ల్యాండ్‌లో అన్ని భూములకు చెందిన సమాచారాన్ని పొందుపరచడం జరిగింది. ఎవరైనా రైతు, తాను రిజిస్టర్ చేసుకున్న పదినిముషాల్లో ఆ భూమికి సంబంధించిన సమాచారం అతనికి అందుతుంది. ఈ వెబ్‌ల్యాండ్ ఖాతాదారులు ఎక్కడ ఉన్నప్పటికీ, కేవలం పది, పదిహేను నిముషాల్లోనే సమాచారాన్ని పొందేవిధంగా ఏర్పాట్లు చేయడంజరిగింది. ఇంతవరకు, రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే, కేవలం సంబంధిత ఎం.ఆర్.ఓ. కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సివచ్చేది. కానీ, ప్రస్తుతం ఎక్కడినుంచైనా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

గౌరవసభ్యురాలు శ్రీమతి కల్పన గారు మాట్లాడుతూ, భారత ప్రభుత్వం వ్యాట్, డీజిల్, గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచినందువల్లనే, ఫలితం అనుభవించి ఓడిపోవడం జరిగిందని చెప్పారు. వ్యాట్ మేము పెంచలేదు. వ్యాట్‌ను గతప్రభుత్వాలే ఇక్కడ అమలుపరిచారు. ఆ విషయం మన

ఆర్థిక శాఖామాత్యులు చెప్పారు. నేను వారి సలహాను స్వీకరిస్తున్నాను. రెవిన్యూ శాఖ ఎప్పుడూ కూడా, ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉంటుంది.

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, రెవిన్యూ సంపాదించడంలో చాలా కీలకమైన శాఖ అని మీకందరకు తెలియజేస్తున్నాను. ఈ శాఖ ద్వారా ప్రతి సంవత్సరం రూ.2000 కోట్ల నుండి రూ.3000 కోట్ల ఆదాయం వస్తోంది. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించినంత వరకు ఈ శాఖకు నిర్దేశించిన లక్ష్యం రూ.3407 కోట్లు కాగా, అందులో 85 శాతం మేరకు ఆగస్టు మాసాంతానికే రావడం జరిగింది. గౌరవసభ్యురాలు శ్రీమతి కల్పన గారు మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ రేట్లు పెంచుతారేమోనని అనుమానం వెలిబుచ్చారు. మార్కెట్ రేటు ఆధారంగా రిజిస్ట్రేషన్ జరుగుతుందని ఈ సందర్భంలో నేను తమరి ద్వారా సభకు తెలియజేస్తున్నాను.

...

కొత్త రాష్ట్రం ఏర్పడింది కనుక చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. మార్కెట్ రేటును పెంచుతామన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను రెవెన్యూ శాఖకు అనుసంధానం చేసి, రిజిస్ట్రేషన్ ఎక్కువగా చార్జీలు పెంచకుండా మార్కెట్ విలువతో అనుసంధానం చేసే విధానాన్ని అవలంబిస్తామని తెలియజేస్తున్నాను. దీనికి గాను చిత్తూరు జిల్లా కుప్పంలో ఆండ్రాయిడ్ అప్లికేషన్‌ను రూపొందిస్తున్నాం. అందులో విజయం సాధిస్తే అన్ని ప్రాంతాలలో అమలుపరుస్తాం. అలాగే ఎలక్ట్రానిక్ ఈ-పాస్‌బుక్‌ను ట్యాంపర్ ప్రూఫ్‌తో చేస్తున్నాం. ప్రవేశపెట్టిన రెవెన్యూ శాఖ బడ్జెట్‌ను ఆమోదించవలసిందిగా కోరుతున్నాను.

**MR. SPEAKER: Now, I will put the Demands for voting.**

**Now, the question is:**

**"That the Government be granted a sum not exceeding Rs. 7913,94,13,000/- under Demand No. XXXIII (33) - Major and Medium Irrigation."**

**"That the Government be granted a sum not exceeding Rs. 551,48,52,000/- under Demand No. XXXIV (34) - Minor Irrigation."**

**"That the Government be granted a sum not exceeding Rs. 7523,61,91,000/- under Demand No. XXVII (27) - Agriculture."**

**"That the Government be granted a sum not exceeding Rs. 913,94,51,000/- under Demand No. XXVIII (28) - Animal Husbandry and Fisheries."**

**"That the Government be granted a sum not exceeding Rs. 156,87,40,000/- under Demand No. XXX (30) - Co-operation."**

**"That the Government be granted a sum not exceeding Rs. 2342,85,76,000/- under Demand No. XXXVIII (38) - Civil Supplies and Administration."**

**"That the Government be granted a sum not exceeding Rs. 12594,63,55,000/- under Demand No. XII (12) - School Education."**

**"That the Government be granted a sum not exceeding Rs. 2349,69,85,000/- under Demand No. XIII (13) - Higher Education."**

**"That the Government be granted a sum not exceeding Rs. 737,07,09,000/- under Demand No. XIV(14) - Technical Educaiton."**

**"That the Government be granted a sum not exceeding Rs. 126,21,62,000/- under Demand No. XV (15) - Sports and Youth Services."**

**"That the Government be granted a sum not exceeding Rs. 4387,94,44,000/- under Demand No. XVI (16) - Medical and Health. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 3134,42,51,000/- under Demand No. XVII (17) - Municipal Administration and Urban Development."**

**"That the Government be granted a sum not exceeding Rs. 5522,31,91,000/- under Demand No. XXXI (31) - Panchayat Raj."**

**"That the Government be granted a sum not exceeding Rs. 6094,44,34,000/- under Demand No. XXXII (32) - Rural Development. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 1596,45,44,000/- under Demand No. V (5) - Revenue, Registration and Relief. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 262,36,25,000/- under Demand No. VI (6) - Excise Administration."**

**"That the Government be granted a sum not exceeding Rs. 324,02,74,000/- under Demand No. VII (7) - Commercial Taxes Administration."**

**"That the Government be granted a sum not exceeding Rs. 116,85,12,000/- under Demand No. VIII (8) - Transport Administration. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 3738,67,00,000/- under Demand No. X (10) - Home Administration. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 276,02,11,000/- under Demand No. XX (20) - Labour and Employment. "**

**"That the Government be granted a sum not exceeding Rs.44,45,06,000/- under Demand No. XXVI (26) - Administration of Religious Endowments. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 418,47,08,000/- under Demand No. XXIX (29) - Forest, Science, Technology and Environment. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 614,50,83,000/- under Demand No. XXXVI (36) - Industries and Commerce."**

**"That the Government be granted a sum not exceeding Rs. 112,97,54,000/- under Demand No. XXXVII (37) - Tourism, Art and Culture."**

**"That the Government be granted a sum not exceeding Rs. 110,80,87,000/- under Demand No. XXXIX (39) - Information Technology and Communications."**

**"That the Government be granted a sum not exceeding Rs. 1,59,92,000/- under Demand No. XL (40) - Public Enterprises. "**

**"That the Government be granted a sum not exceeding Rs. 65,08,51,000/- under Demand No. I (1) - State Legislature."**

**"That the Government be granted a sum not exceeding Rs. 13,51,15,000/- under Demand No. II (2) - Governor and Council of Ministers."**

**"That the Government be granted a sum not exceeding Rs. 598,38,62,000/- under Demand No. III (3) - Administration of Justice."**

**"That the Government be granted a sum not exceeding Rs. 571,22,15,000/- under Demand No. IV (4) - General Administration and Elections."**

**"That the Government be granted a sum not exceeding Rs. 14153,98,51,000/- under Demand No. IX (9) - Fiscal Administration, Planning, Surveys and Statistics."**

**"That the Government be granted a sum not exceeding Rs. 154,05,74,000/- under Demand No. XIX (19) - Information and Public Relations."**

**(Pause)**

**The Motion was adopted and the Demands were granted**

MR.SPEAKER: Now, the House is adjourned to meet tomorrow at 9.00 AM.

**(The House then adjourned at 06.18 PM to meet again at 9.00 AM, on Saturday, the 6th of September 2014).**